

'ప్రతి రైతూ పట్టణ ప్రాంత వ్యక్తితో సమానంగా ఆదాయం పొందాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10 సంచిక: 316

మంగళవారం 6-2-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఐదో రోజూ నష్టాలే..

ఇంట్రాడేలో సెన్సెక్స్ 546 పాయింట్లు డౌన్

చివరకు 34,757 వద్ద ముగింపు – 15లో



'యాంటీ బయాటిక్' బాంబు!

భారత్‌లో 63% డ్రగ్స్ అమ్మకాలకు

అనుమతి లేదు: లండన్ పరిశోధకులు – 5లో

అన్ని కులాలకూ కార్పొరేషన్లు



- పేదరికానికి కులం, మతం లేదు
- అందరూ బాగు పడాలన్నదే మా ఆకాంక్ష
- కార్పొరేషన్ల ఏర్పాటుతో రెడ్డి, కమ్మ, క్షత్రియ కులాల వారికీ అండగా ఉంటాం

బుచ్చిరెడ్డిపాళెం సభలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ

- బడ్జెట్‌పై చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారు
- ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా అన్ని వర్గాల వారినీ మోసం చేశారు
- ఎలాంటి నాయకుడు కావాలో ఆలోచించండి
- మనందరి ప్రభుత్వం రాగానే పేదలందరినీ ఆదుకుంటామని భరోసా

6 లో



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని (ఇన్‌సెట్‌లో) అభిమానులు ఇచ్చిన నాగలితో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ పోరాటం

- ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చండి
- 184 నిబంధన కింద తీర్మానానికి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నోటీసు
- హామీల అమలుపై సావధాన తీర్మానానికి ఎంపీ విజయసాయిరెడ్డి నోటీసు
- గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులకే పరిమితమైన టీడీపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ, అమరావతి

ప్రత్యేక హోదా, విభజన హామీలపై అధికార టీడీపీ దొంగాట మరోసారి బట్టబయలైంది. రాష్ట్రాన్ని కాపాడాలంటూ టీడీపీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శనకే పరిమితం కాగా.. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎంపీలు మాత్రం విభజన హామీలు, హోదా అమలుపై ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చి తమ చిత్తశుద్ధిని చాటుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రయోజనాల విషయంలో టీడీపీ ఢిల్లీలో వ్యవహరిస్తున్న తీరు తేటతెల్లమైంది.

హోదా కోసం విపక్షం ఆందోళన

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అమలు చేయాలని, విభజన చట్టం హామీలు

మిగతా 3వ పేజీలో ▶

8న వామపక్షాల బంద్‌కు వైఎస్సార్‌సీపీ మద్దతు 3 లో

పేదల చదువుకు నాదీ భరోసా

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- అమ్మ ఒడి పథకంతో ప్రతి తల్లికి ఏడాదికి రూ.15 వేలు
- హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఏడాదికి రూ.20 వేలు
- నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు
- 'జగన్ స్పీక్స్' విడుదల

JAGAN SPEAKS

2 లో

ఆరోగ్యశాఖలో ఖాళీలు 25,000

ఎంబీబీఎస్ వైద్యులకూ దక్కని సర్కారు ఉద్యోగం

ప్రత్యేక కోర్సులు చేసిన నిరుద్యోగుల సంఖ్య 10 లక్షలు పైమాటే

- నర్సులు, పారామెడికల్ అభ్యర్థులకు తీవ్ర నిరాశ
- నాలుగేళ్లలో ఒక్క నియామక ఉత్తర్వూ ఇవ్వలేదు
- కేంద్ర సాయంతో అమలయ్యే పథకాల్లోనూ ఇదే దుస్థితి



విజయవాడకు కూతవేటు దూరంలోని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం 150 మందికి పైగా ఔట్‌పేషెంట్లు వస్తారు. ఇంతమందిని పరీక్షించేందుకు అక్కడ ఒకే ఒక కాంట్రాక్ట్ ఎంబీబీఎస్ వైద్యుడున్నారు.

3 లో

ఇటీవల పొలం పనులు చేస్తూ గాయపడ్డ ఓ వ్యక్తి వైఎస్సార్ జిల్లా కమలాపురం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే కట్టు కట్టడానికి వైద్యుడు లేరు. ఇకఎవరైనా విష సర్పాల బారినపడితే వారిని ఆ భగవంతుడే కాపాడాలి.



మత్స్యకారుల కన్నీటి వెతలు

మసకబారుతున్న మత్స్యకార జీవితాలు

- 45 ఏళ్లకే కంటి చూపు కోల్పోతున్న వైనం
- సముద్రపు నీటిపై పడే సూర్య కిరణాలే కారణం
- వేటకు వెళ్తే దెబ్బతింటున్న రెటీనా
- అమలుకాని 50 ఏళ్లకే పింఛన్ విధానం

16 లో



తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు 50 ఏళ్లు దాటితే పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి గాలికి వదిలేసింది. ఇప్పుడు పింఛన్లకు అర్హులున్నప్పటికీ తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు.

– చోడిపల్లి ఎర్రయ్య, బాధిత మత్స్యకారుడు, పతివాడబర్రిపేట, విజయనగరం జిల్లా

రాజధాని డీపీఆర్‌పై టీడీపీ, బీజేపీ వార్

సవివర నివేదిక ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం!

- అందుకే కేంద్రం నిధులివ్వలేదంటున్న బీజేపీ
- రెండు లక్షల కోట్లకు డీపీఆర్ ఇచ్చామని చెబుతున్న మంత్రి నారాయణ
- ఇచ్చిన నిధులకూ యూసీ సర్టిఫికెట్లు ఇవ్వలేదని కేంద్రం నుంచి అభ్యంతరాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాజధాని డీపీఆర్ (సవివర నివేదిక)ను కేంద్రానికి ఇవ్వలేదనే అంశం వివాదాస్పదంగా మారింది. డీపీఆర్ ఇవ్వకపోవడం వల్లే కేంద్రం నుంచి రాజధానికి నిధులు రావడంలేదని, ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లోనూ కేటాయింపులు లేకపోవడానికి ఇదే కారణమని వెల్లడవడంతో ప్రభుత్వ పెద్దలు దాన్ని ఎలా సమర్థించుకోవాలో అర్థంకాక తలలు

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ వరస



కొంపదీసి ఆ ప్రశ్నకు సమాధానం చెబితేనే పొత్తు కొనసాగిస్తామని అనరు కదా సార్!

ప్రలోభాలకు లొంగొద్దు



ఓటర్ల జాబితా సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

- యువ ఓటర్లను చైతన్య పరచాలి
- ప్రతి అర్జీ రెండు దశల్లో వడపోత
- అర్హుల్లో ప్రతి ఒక్కరికీ ఓటు ఉండేలా జాగ్రత్తలు
- రెండు చోట్ల పేర్లు లేకుండా సాఫ్ట్‌వేర్
- అధికారులకు సూచనలు

సాక్షి, అమరావతి

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్యపరచాలని అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులకు (సీఈవో)లకు సూచించింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. కొత్తగా ఓటర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను రెండు దశల్లో వడపోసి తప్పులకు అవకాశం లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని స్పష్టం చేసింది. తాజాగా అన్ని అసెంబ్లీ

మిగతా 3వ పేజీలో ▶

పేదల చదువుకు నాదీ భరోసా

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- చదువుల విప్లవంతో వ్యవస్థను మార్చేస్తాం
- అమ్మఒడి పథకంతో ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు
- హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఏటా రూ.20 వేలు
- నూరు శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు
- పేదలపై రూపాయి భారం కూడా ఉండదు
- డబ్బుల్లేక చదువులు మానేయాల్సిన దుస్థితి రాదు
- 'జగన్ స్పీక్స్' విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చదువుల విప్లవాన్ని సృష్టించాలన్నదే తమ ధ్యేయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థను సమూలంగా మార్చేయాలన్న కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవని, కళాశాలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదని.. ఇలాంటి పరిస్థితుల్లో పేదలు పెద్ద చదువులు చదవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పేదలు ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే చదువులు మానేయాల్సిన దుస్థితి మనం అధికారంలోకి వచ్చాక ఉండదని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన ప్రతి విద్యార్థిని తాను చదివిస్తానని హామీ ఇచ్చారు. వారి కోసం ఎంత ఖర్చయినా భరిస్తామన్నారు. తాజాగా వైఎస్ జగన్ మాట్లాడిన 'జగన్ స్పీక్స్' వీడియోను వైఎస్సార్‌సీపీ సోమవారం విడుదల చేసింది. ఇందులో జగన్ ఇంకా ఏం చెప్పారంటే..

రాష్ట్రంలో నిరక్షరాస్యత ఆందోళన కలిగిస్తోంది..

''చదువులు, ఉద్యోగాలపై పాలకులు సరైన రీతిలో దృష్టి పెడితే సమాజంలో పేదరికం క్రమంగా తగ్గిపోతుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం చూస్తే ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 32 శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారు. ఇది నిజంగా చాలా భయానకమైన పరిస్థితి. 2016–17 సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం.. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుల కోసం 68.47 లక్షల మంది పాఠశాలల్లో చేరితే వీరిలో మధ్యలో మానేసిన వారు(డ్రాపౌట్స్) 8.68 లక్షల మంది ఉన్నారు. దీన్నిబట్టి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు చదువులపై ఏ మేరకు శ్రద్ధ పెడుతున్నారో తెలుస్తోంది. కేజీ నుంచి పీజీ వరకూ ఉచితంగా విద్య అందిస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. హామీలు ఇచ్చారు. తీరా ఎన్నికలయ్యాక అవన్నీ విస్మరించారు. సర్కారు స్కూళ్లను ఒక పద్ధతి ప్రకారం నీరు గార్చేస్తున్నారు. కావాలనే మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో బాత్రూమ్‌లకు వెళ్లాలంటే పిల్లలు భయపడే దుస్థితి ఏర్పడింది. ఉద్దేశపూర్వకంగానే ఎక్కడా సరైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చదువుకున్న శేషాపురం పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియదు. ఈ పాఠశాల గురించి నేను ప్రస్తావించాకే ముఖ్యమంత్రి స్పందించారని వార్తలొచ్చాయి. సీఎం చదువుకున్న స్కూల్ దుస్థితే అలా ఉంటే ఇక రాష్ట్రంలో మిగిలిన స్కూళ్ల గురించి చెప్పాల్సిన పనిలేదు.

చదవాలంటే అప్పులు చేయాలా?

ఆదర్శంగా నిలవాల్సిన మోడల్ స్కూళ్లు సైతం నీరుగారిపోతున్నాయి. మోడల్ స్కూళ్లలో టీచర్లకు ప్రభుత్వం ఆరు నెలలుగా జీతాలే ఇవ్వడం లేదు. నేను గట్టిగా ప్రశ్నిస్తేనే చంద్రబాబులో కదలిక వస్తోంది. మూడు నెలల జీతాలు ఇచ్చారట, ఇంకా మూడు నెలల జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయట. శ్రీచైతన్య, నారాయణ వంటి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు మేలు చేయడం కోసమే ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం సర్కార్ స్కూళ్లను నాశనం చేస్తోంది. నారాయణ స్కూల్.. సీఎం చంద్రబాబు బినామీది అనే పేరుంది. దీంతో హాస్టళ్లను మూసి వేయిస్తున్నారు. ఉన్న స్కూళ్లను బాగోలేకుండా చేస్తున్నారు. మరో గత్యంతరం లేక విద్యార్థులంతా బలవంతంగానైనా ప్రైవేట్ స్కూళ్లలో చేరాల్సిన పరిస్థితులను సృష్టిస్తున్నారు. ప్రాథమిక విద్య దశలోనే ఇలా ఉంటే ఇంజినీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సులను చదివే పరిస్థితి ఉందా? ఈ రోజు ఇంజినీరింగ్ చదవాలంటే సంవత్సరానికి రూ.లక్షకు పైగా చెల్లించాల్సి వస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం ముష్టి వేసినట్లు కేవలం రూ.30 వేల నుంచి రూ.35 వేలు మాత్రమే ఇస్తోంది. ఏడాదిన్నర నుంచి ఆ రూ.35 వేలు కూడా ఇవ్వడం లేదని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. పిల్లలకు ఆ అర్హతలు లేవు.. ఈ అర్హతలు లేవు అంటూ సాకులు చూపి రూ.35 వేలు సైతం ఇవ్వకుండా ప్రభుత్వం ఎగ్గొడుతోంది. ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.లక్ష కాగా, ప్రభుత్వం రూ.35 వేలే ఇస్తే విద్యార్థుల తల్లిదండ్రులు మిగిలిన సొమ్మును ఎక్కడి నుంచి తేవాలి? ఏడాదికి రూ.65 వేల చొప్పున నాలుగేళ్లలో ఇంజినీరింగ్ పూర్తయ్యే సరికి రూ.2.60 లక్షలు కావాలంటే ఇంట్లో ఉన్న వస్తువులైనా అమ్ముకోవాలి.. లేదంటే అప్పులైనా చేయాలి. ఇలాంటి ప్రతికూల పరిస్థితులను పూర్తిగా మార్చేయడానికి చదువుల విప్లవాన్ని తీసుకురావాలని నిర్ణయించాం.

రెండు అడుగులు ముందుకేస్తా..

నాన్నగారి హయాంలో ప్రజల్లో ఒక నమ్మకం ఉండేది. మమ్మల్ని ఎంత పెద్ద చదువులైనా చదివించడానికి పెద్దాయన ఉన్నారనే ధీమా కనిపించేది. అది ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. నాన్నగారిని స్ఫూర్తిగా తీసుకుని చదువుల విషయంలో రెండు అడుగులు ముందుకు వేయాలని నిర్ణయించాం. మన ప్రభుత్వం వచ్చాక విప్లవాత్మకమైన మార్పులు ఏమిటంటే.. అమ్మ ఒడి అనే పథకాన్ని తీసుకొస్తాం. ప్రతి తల్లి చేయాల్సి పని ఏమిటంటే తమ పిల్లలను బడికి పంపించాలి. ఏ బడికి పంపించినా ఫర్వాలేదు. అందుకు ప్రతి తల్లికి సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తాం. ఎందుకో తెలుసా? ఆ చిన్నారుల్లో నుంచి డాక్టర్లు, ఇంజినీర్లు రావాలి. పునాదులు గట్టిగా ఉంటేనే పిల్లలు పైకి ఎదగగలుగుతారు. అప్పుడే ఆ కుటుంబాల తలరాతలు మారుతాయి. రాష్ట్రంలో 32 శాతంగా ఉన్న నిరక్షరాస్యుల సంఖ్యను పూర్తిగా సున్నాకు తీసుకురావాలన్నదే మా ప్రధానమైన ధ్యేయం. ఒకటి నుంచి 12వ తరగతి వరకు అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తాం. దీంతో ప్రతి తల్లికి భరోసా లభిస్తుంది. మెడిసిన్, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులపైనా దృష్టి పెడతాం. ఇప్పుడున్న అస్తవ్యస్తమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా మారుస్తాం. పేద కుటుంబంపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా చేస్తాం. అంతేకాదు హాస్టళ్లలో ఉండే వారికి ఏడాదికి రూ.20 వేల చొప్పున ఇస్తాం. నేను గట్టిగా నమ్మేది ఏమిటంటే.. పేదరికం పోవాలంటే కుటుంబంలో ఒక్కరైనా పెద్ద చదువులు చదవాలి. అప్పుడు వారికి పెద్ద జీతాలు వస్తాయి.. ఆలోచనా విధానాలు మారుతాయి. కుటుంబాల జీవన ప్రమాణాలు కచ్చితంగా మెరుగవుతాయి.''



సాక్షి ఇండియా స్పెల్‌బీ-2 విజేతలతో సాక్షి అడ్మిన్ అండ్ ఫైనాన్స్ డైరెక్టర్ వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి

సాక్షి ఇండియా స్పెల్‌బీ, మ్యాథ్‌బీ
కేటగిరీ-2 విజేతలు వీరే

SAKSHI INDIA SPELL Bee | MATH BEE | Waffy presents SAKSHI arena one School fest | DELHI PUBLIC SCHOOL

హైదరాబాద్: 'సాక్షి' మీడియా గ్రూప్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి ఇండియా స్పెల్‌బీ, మ్యాథ్‌బీ–2017 (కేటగిరీ–2, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం) విజేతలను ప్రకటించారు. వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలు ఎంతో ఉత్కంఠగా కొనసాగాయి. చివరగా నిర్వహించిన ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విజేతలు, వారి తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషపై, మ్యాథ్స్ విషయంలో అంతర్గతంగా ఉన్న భయాలు పోగొట్టి, వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడంతో పాటు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఈ పోటీలు కలిగించాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాక్షి యజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

స్పెల్‌బీ విజేతలు వీరే: సాక్షి స్పెల్‌బీ పోటీల్లో ప్రథమ బహుమతిని అనంతపూర్‌లోని విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న కె.జయసూర్యరెడ్డి కైవసం చేసుకున్నారు. విజేతకు బంగారు పతకంతో పాటు రూ. 15వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ విజేతలు వీరే: సాక్షి మ్యాథ్‌బీ పోటీల్లో ప్రథమ బహుమతిని విజయవాడలోని వీపీఎస్ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఎస్.జాగృత్ కైవసం చేసుకున్నారు. విజేతకు బంగారు పతకంతో పాటు రూ. 15వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

స్పెల్‌బీ ద్వితీయ బహుమతి: శ్రీకాకుళంలోని ట్వింకిల్ కిడ్స్ స్కూల్‌లో చదువుతున్న ఆర్.కీర్తన్ కైవసం చేసుకున్నారు. విజేతకు రజత పతకంతో పాటు రూ. 10వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ ద్వితీయ బహుమతి: రాజమండ్రిలోని ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న రోహన్ కారమూడి కైవసం చేసుకున్నారు. విజేతకు రజత పతకంతో పాటు రూ. 10వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

స్పెల్‌బీ తృతీయ బహుమతి: విశాఖపట్నంలోని లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో చదువుతున్న శ్రీకర్ కైవసం చేసుకున్నారు. విజేతకు కాంస్య పతకంతో పాటు రూ. 5,000, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ తృతీయ బహుమతి: అనంతపూర్‌లోని విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న కె.జయసూర్యరెడ్డి కైవసం చేసుకున్నారు. విజేతకు కాంస్య పతకంతో పాటు రూ. 5,000, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.



సాక్షి మ్యాథ్‌బీ విజేతలు

మరో కంపెనీ నిజమే!

ప్రైవేటు రాజధాని కథనంపై సీఆర్‌డీఏ వివరణ

సాక్షి, అమరావతి: రాయితీ అభివృద్ధి, షేర్ హోల్డింగ్ ఒప్పందాలపై సంతకాలు చేసేందుకు సింగపూర్ అమరావతి ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నియామకం నిజమేనని సీఆర్‌డీఏ తెలిపింది. 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'ప్రైవేటు రాజధాని' శీర్షికతో ఒప్పందాలపై సంతకాల కోసం కొత్త సంస్థను సృష్టించడంపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం సీఆర్‌డీఏ కమిషనర్ వివరణ ఇచ్చారు. సింగపూర్ కన్సార్టియం తన జాయింట్ వెంచర్‌గా ఈ కంపెనీని అథరైజ్ చేసిందని తెలిపారు. అయితే ఒరిజినల్ ప్రాజెక్ట్ ప్రొపొనెంట్‌తో కాకుండా అది సూచించిన మరో కంపెనీతో ఒప్పందంపై సంతకాలు చేయడానికి అనుమతించడం గతంలో జారీ చేసిన జీఓ–179కి వ్యతిరేకమనే విషయం గురించి వివరణలో పేర్కొనకపోవడం పరిశీలనాంశం.

8న లారీల బంద్

సాక్షి, అమరావతి: రవాణా రంగంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా ఈ నెల 8వ తేదీన రాష్ట్రంలో లారీల బంద్ నిర్వహించనున్నట్టు ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైవీ ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లారీ యజమానులందరూ బంద్‌లో పాల్గొనాలని, ఆ రోజు రాష్ట్రంలో ఎగుమతులు, దిగుమతులు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.

రాజధాని డీపీఆర్‌పై టీడీపీ, బీజేపీ వార్

▶ మొదటి పేజీ తరువాయి

పట్టుకుంటున్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, రాజధానికి కూడా నిధులివ్వడంలేదని టీడీపీ ఎంపీలు విమర్శించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన బీజేపీకి చెందిన రాష్ట్ర మంత్రి పైడికొండల మాణిక్యాలరావు డీపీఆర్ అంశాన్ని లేవనెత్తారు. డీపీఆర్ ఇవ్వకపోవడం వల్లే రాజధానికి నిధులు రాలేదని తేల్చి చెప్పారు. డీపీఆర్ ఇచ్చి ఉంటే కేంద్రం కచ్చితంగా నిధులు ఇచ్చేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న ఒక మంత్రి బహిరంగంగా ఇలా చెప్పడంతో టీడీపీ ఇరకాటంలో పడింది. రాజధాని వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న మంత్రి నారాయణ దీనిపై స్పందించారు. రూ.రెండు లక్షల కోట్లకు డీపీఆర్ ఎప్పుడో ఇచ్చామని తెలిపారు. కానీ బీజేపీ నాయకులు మాత్రం ఇది తప్పని వాదిస్తున్నారు. గతంలో బీజేపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి పురంధేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు రాజధాని లెక్కలు సరిగా చెప్పకపోవడం వల్లే కేంద్రం నిధులివ్వలేదని తేల్చి చెప్పారు.

వినియోగ పత్రాలపైనా వివాదమే

రాజధాని నిర్మాణానికి కేంద్రం విడుదల చేసిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం వినియోగ పత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్) ఇవ్వలేదని గతంలో బీజేపీ నేతలు విమర్శించారు. అప్పట్లోనూ టీడీపీ ఈ వాదనను ఖండించి తాము యూసీలు సమర్పించామని తెలిపింది. అయితే చేపడతామని చెప్పిన వాటికి కాకుండా తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ నిర్మాణాలకు ఈ నిధులు వినియోగించడంతో కేంద్రం నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కేంద్రం ఇప్పటివరకూ రాజధాని నిర్మాణానికి రూ.1,500 కోట్లు విడుదల చేసింది. వీటిని రాజ్‌భవన్, హైకోర్టు తదితర భవనాలకు వినియోగిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ రాజధానిలో అటువంటి నిర్మాణాలేవీ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన యూసీలపై కేంద్రం నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత కూడా రాజధాని నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు కేంద్రానికి ఇవ్వలేదని బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఈ ఆరోపణల తర్వాతే పరిపాలనా నగర నిర్మాణం కోసం రూపొందించిన నివేదికను ప్రభుత్వం కేంద్రానికి పంపినట్లు చెబుతున్నారు. పరిపాలనా నగర నిర్మాణానికి రూ.6,705 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కానీ రాజధాని నిర్మాణానికి రూ.58 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం నివేదిక రూపొందించింది. రాబోయే మూడేళ్లలోనే రూ.29,676 కోట్లు అవసరమని అంచనా వేసింది. ఈ నివేదికను కేంద్రానికి పంపకుండా కేవలం పరిపాలనా నగర ప్రణాళికనే పంపడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడాలేని విధంగా అంచనాలు పొందించడం, అవకతవకలు, భారీ స్థాయిలోఅవినీతి ఆరోపణలతోపాటు ఆకాశానికి నిచ్చెనలు వేసే రీతిలో ఈ ప్రణాళికలు ఉండడంతో వాటిపై గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ నివేదికలను యథాతథంగా కేంద్రానికి పంపే సాహసం చేయని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలు తెలపకపోవడంతో బీజేపీ నాయకులు ఆ విషయాన్నే తరచూ లేవనెత్తుతున్నారు. అయితే కేంద్రానికి పూర్తి సమాచారం ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తాను రూపొందించిన నివేదికను భిన్నంగా రూ.రెండు లక్షల కోట్లకు డీపీఆర్ ఇచ్చామని చెబుతుండడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

మార్చి 15కు జీఎస్ఎల్‌వీ ఎఫ్-08 వాయిదా

అదే నెలలో రెండు ప్రయోగాలు • ఏప్రిల్ రెండో వారంలో చంద్రయాన్–2?

శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ 'షార్' నుంచి ఈ నెల 26న ప్రయోగించ తలపెట్టిన జీఎస్ఎల్‌వీ ఎఫ్–08 ప్రయోగం మార్చి 15వ తేదీకి వాయిదా పడింది. మార్చి 15న జీఎస్ఎల్‌వీ ఎఫ్–08, 22న పీఎస్ఎల్‌వీ సీ41 ప్రయోగాలు చేసేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్–08 రాకెట్ ద్వారా జీశాట్–6ఏ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. అయితే, ఉపగ్రహం రావడం ఆలస్యం కావడంతో ఈ నెల 26న చేయాలనుకున్న ప్రయోగం మార్చికి వాయిదా పడింది. ఈ నెల 12న మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ41 రాకెట్ క్యాంపెయిన్ పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్–1ఐ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఇదిలా ఉండగా మార్చి 10న వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్) నుంచి జీఎస్ఎల్‌వీ ఎఫ్–08 రాకెట్‌ను ఊంబ్లికల్ టవర్ మీదకు తరలించిన వెంటనే వ్యాబ్‌లో జీఎస్ఎల్‌వీ ఎఫ్10 రాకెట్ అనుసంధానం పనులు ప్రారంభించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి సోమవారం బెంగళూరులోని అంతరిక్ష ప్రధాన కార్యాలయం నుంచి చైర్మన్ డాక్టర్ శివన్ అన్ని సెంటర్ల శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ రాకెట్ ద్వారానే చంద్రయాన్–2 ఉపగ్రహాన్ని పంపేందుకు సిద్ధం చేస్తున్నారు. అన్నీ సక్రమంగా జరిగితే ఏప్రిల్ రెండో వారంలో జీఎస్ఎల్‌వీ ఎఫ్10 ద్వారా చంద్రయాన్–2 ప్రయోగాన్ని చేసేందుకు సమాయత్తమవుతున్నారు.



జీఎస్ఎల్‌వీ మార్క్2 రాకెట్ రెండో దశను అనుసంధానం చేస్తున్న దృశ్యం (ఫైల్)

మోదీ అభివృద్ధిని దుష్టశక్తులు అడ్డుకుంటున్నాయి

- బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజం
- నన్ను ఇబ్బంది పెట్టేందుకు కొన్ని దుష్ట శక్తులు పని చేస్తున్నాయి
- నిధులన్నీ కేంద్రానివే.. పథకాల్లో మోదీ ఫొటో పెట్టాలని కోరాం



రాజమహేంద్రవరం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి రాష్ట్రంలో కనపడనీయకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డుకుంటున్నాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజమెత్తారు. తనను ఇబ్బంది పెట్టేందుకు కొంత మంది శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అలాంటి వాటికి తాను భయపడబోనన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సోమవారం సోము వీర్రాజు విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో శ్మశాన వాటికలు, అంగన్‌వాడీ భవనాలు, చంద్రన్న బాట పేరుతో వేసే సీసీ రోడ్లు, స్వచ్ఛభారత్ తదితర పథకాలకు ఖర్చు పెట్టే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చినవేనని సోము వీర్రాజు పేర్కొన్నారు. కేంద్రం ఇన్ని చేస్తున్నా ఏమీ చేయలేదన్న ప్రచారం చేస్తున్నందునే పథకాల్లో మోదీ ఫొటో పెట్టాలని కోరామని తెలిపారు. ఇక టీడీపీతో పొత్తు కేంద్ర నాయకత్వం తేలుస్తుందని వీర్రాజు చెప్పారు. కేంద్రం ఇచ్చే నిధులు రాష్ట్రం నుంచి పన్నులు రూపంలో వచ్చినవే కదా అని టీడీపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారని విలేకరులు చెప్పగా.. నిధులెవరూ జేబుల్లోవి ఇవ్వరని, ప్రజల డబ్బుతో ప్రభుత్వాలు పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. మోదీ అమ్మ సొమ్మో లేక ఇంకో ఆయన అమ్మ సొమ్మో ఇవ్వడంలేదన్నారు.

వీర్రాజు కార్యాలయం ముట్టడి

సోము వీర్రాజు కార్యాలయం వద్ద సోమవారం తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘ జాతీయ అధ్యక్షుడు మరుకుర్తి దుర్గా యాదవ్ ఆధ్వర్యంలో సోము వీర్రాజు కార్యాలయం ముట్టడికి బీసీ విద్యార్థులు ప్రయత్నించారు. ఈ విషయం ముందుగానే తెలియడంతో బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో అరుపులు, కేకలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఈలోగా బీజేపీ నేతల వైపు నుంచి విద్యార్థులపై రాళ్లు పడడంతో అలజడి ప్రారంభమైంది. వెంటనే స్పందించిన పోలీసులు ఇరు వర్గాలను శాంతింపజేశారు. అనంతరం విద్యార్థులు లాలాచెరువు ప్రాంతం వద్ద కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉద్రిక్త వాతావరణం తగ్గిన తర్వాత సోము వీర్రాజు కార్యాలయానికి చేరుకొని విలేకర్లతో మాట్లాడారు. ఈ నిరసన కొంతమంది చేయించిన కార్యక్రమంగా సోము వీర్రాజు పేర్కొన్నారు.

ఎన్ఐటీల్లో బాలికలకు 14% సీట్లు!

సాక్షి, హైదరాబాద్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)ల్లోనూ బాలికలకు 14 శాతం సీట్లు కేటాయించాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్ఆర్‌డీ) నిర్ణయించింది. 20 శాతం కంటే తక్కువ మంది బాలికలు ఉన్న ఎన్ఐటీల్లో ఈ సీట్లు సృష్టించి భర్తీ చేయాలని స్పష్టం చేసింది. బాలుర కోటాకు ఎలాంటి భంగం వాటిల్లకుండా బాలికల కోసం సూపర్ న్యూమరరీ కింద సీట్లు సృష్టించి భర్తీ చేయాలని సూచించింది. బాలికల నమోదును పెంచేందుకు ఇప్పటికే ఐఐటీల్లో చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఎన్ఐటీల్లోనూ సీట్లు పెంచేలా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని ఎన్ఐటీలకు లేఖలు కూడా రాసినట్లు తెలిసింది. 2018–19 విద్యా సంవత్సరంలో 14 శాతం, 2019–20లో 17 శాతం, 2020–21లో 20 శాతం సీట్లు కేటాయించాలని, తద్వారా బాలికల నమోదును 20 శాతానికి పెంచాలని నిర్ణయించింది. దీంతో ఐఐటీలతోపాటు ఎన్ఐటీల్లోనూ సీట్లు పెరగనున్నాయి.

చేసిన పనులకు లెక్కలు చూపకపోతే ఎలా?



సాక్షి, అమరావతి: ఖర్చు చేసిన పనులకు లెక్కలు చూపకపోతే ఎలా అంటూ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సోమవారం చైర్మన్ అధ్యక్షతన పీఏసీ సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణం, శానిటేషన్, గ్రామీణ తాగునీటి పథకాల కోసం రుణం తీసుకొని ఖర్చు చేసిన రూ.13,441 కోట్లు ఇప్పటివరకు ఎందుకు వసూలు చేయలేదని అధికారులను నిలదీశారు. అంతేకాకుండా రూ. 2,655 కోట్ల పనులకు సంబంధించి వినియోగపు సర్టిఫికేట్ ఎందుకు తెప్పించుకోలేదని ప్రశ్నించారు. కొన్ని పనులకు బడ్జెట్ రివైజ్డ్ అప్రూవల్ తీసుకోకుండానే వేల కోట్లు ఖర్చు చేశారని, వాటన్నింటికీ వచ్చే బడ్జెట్‌లో అనుమతి పొందాలని అధికారులకు సూచించారు. సమావేశానికి ఎమ్మెల్యేలు ఎ.సురేష్, పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు హాజరయ్యారు.

ఆరోగ్యశాఖలో 25 వేల ఖాళీలు

ఎంబీబీఎస్ వైద్యులకూ దక్కని సర్కారు ఉద్యోగం ● నర్సులు, పారామెడికల్ అభ్యర్థులకు తీవ్ర నిరాశ



సాక్షి, అమరావతి: అక్కడ.. ఓవైపు ఆరోగ్య సేవలు అందించేందుకు డాక్టర్లు లేరు. మరోవైపు పెద్దపెద్ద చదువులు చదివి డాక్టర్లు ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దుస్థితి ఇదీ. విద్యాశాఖ తర్వాత అతి పెద్దదైన వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకపోవటంతో లక్షల మంది నిరుద్యోగులుగా మారుతున్నారు. పెద్ద చదువులు చదువుకుని ఆరోగ్యశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నోటిఫికేషన్లు ఎప్పుడిస్తారనే కనీస సమాచారం ఇవ్వటం లేదు.

మూడుసార్లు ఫైల్ వెనక్కి...

వైద్య విధానపరిషత్, వైద్యవిద్యా సంచాలకుల పరిధిలోని జిల్లా ఆస్పత్రులు, బోధనాసుపత్రుల్లో కాంట్రాక్ట్ ఉద్యోగ నోటిఫికేషన్లకు స్పందన లేకపోవటంతో శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని అధికారులు ముఖ్యమంత్రికి మూడు దఫాలు ఫైల్ పంపినా అంగీకరించలేదు. కచ్చితంగా కాంట్రాక్ట్ విధానంలోనూ భర్తీ చేయాలని ఆదేశించటంతో నియామకాలు మరుగునపడ్డాయి. స్వయానా సీఎం కాన్వాయ్ అంబులెన్సుల్లో పనిచేసేందుకు 36 మందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని నోటిఫికేషన్ ఇస్తే కేవలం ఇద్దరే దరఖాస్తు చేసుకోవటం గమనార్హం.

25,000కుపైగా ఖాళీలు..

ఆరోగ్యశాఖ పరిధిలోని వైద్యవిద్య, ప్రజారోగ్యం, వైద్య విధాన పరిషత్, కుటుంబ సంక్షేమం, ఔషధ నియంత్రణ విభాగాల్లో 25 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత నాలుగేళ్లుగా ఒక్క నియామకం కూడా చేపట్టకపోవటంతో నిరుద్యోగులు ఉసూరుమంటున్నారు. ట్రామాకేర్, కుష్టు నివారణ, జాతీయ ఆరోగ్య మిషన్ లాంటి కేంద్ర పరిధిలోని పథకాలలో కూడా నియామకాలు చేపట్టలేదు. దీంతో ప్రత్యేక కోర్సులు పూర్తి చేసిన మంది వారు నిరుద్యోగులుగా మిగిలిపోయారు. వైద్య విద్య చదివిన డాక్టర్లు సైతం నిరుద్యోగులుగా ఉండటం గమనార్హం.

వైద్య సేవలన్నీ ప్రైవేట్‌పరం....

రాష్ట్ర విభజన అనంతరం బోధనాసుపత్రుల్లో 300 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మినహా ఒక్క నియామకం జరపలేదు. ఉద్యోగులను నియమించకుండా వైద్య సేవలను ప్రైవేట్‌పరం చేసేందుకే మొగ్గు చూపారు. రక్త పరీక్షలు, రేడియాలజీ ఇలా సుమారు 22 సేవలను పీపీపీ కింద ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పారు. రక్త పరీక్షల నిర్వహణ మెడాల్‌కు అప్పగించటంతో ల్యాబ్ టెక్నీషియన్ చదివిన లక్షన్నరమంది అభ్యర్థులకు నిరాశే ఎదురైంది. దీంతో స్పెషలైజ్డ్ కోర్సులు చేసిన వారు ప్రభుత్వ పరిధిలో, అటు ప్రైవేట్‌లోనూ ఉద్యోగాలు దొరక్క సతమతమవుతున్నారు.

విభాగాల వారీగా ఖాళీలు

కేటగిరీ	శాఖ	ఖాళీలు	నిరుద్యోగులు
ఎంబీబీఎస్ వైద్యులు	ప్రజారోగ్యశాఖ	800	8,000
డిప్లొమా వైద్యులు	వైద్యవిధానపరిషత్	500	4,000
పీజీ వైద్యులు	వైద్యవిద్యాశాఖ	550	5,000
సూపర్ స్పెషాలిటీ	వైద్యవిద్యాశాఖ	200	1,000
డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు	ఔషధ నియంత్రణ	400	30,000
ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు	కుటుంబ సంక్షేమం	620	40,000
బీఎస్సీ నర్సింగ్	వైద్యవిద్యా శాఖ	6,000	2,00,000
పారామెడికల్	ప్రజారోగ్య/వైద్యవిద్య	5,000	3,50,000
ఫార్మా డీ	వైద్యవిద్యాశాఖ	600	5,000
ఏఎన్ఎం/జీఎన్ఎం	ప్రజారోగ్య/ఏపీవీవీపీ	5,500	2,50,000
ఎంపీహెచ్ఏ	ప్రజారోగ్యశాఖ	2,500	2,00,000
సపోర్టింగ్ స్టాఫ్	అన్ని శాఖలు	2,000	---

క్యాంపస్ నియామకాలు చేపట్టాలి

ఏటా 4 వేల మంది వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్, 3 వేల మంది పీజీ పూర్తి చేసి బయటకు వస్తున్నారు. వీరిలో 50 % మంది నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నియామకాలు లేవు. మాకు కూడా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తే గ్రామాల్లో పనిచేసేందుకూ సిద్ధం. కానీ ప్రభుత్వం అలా చేయడం లేదు.

–డాక్టర్ వెంకటరమణ (జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు)

హెచ్‌ఎంను కత్తితో పొడిచిన విద్యార్థి

వేలూరు (తమిళనాడు): పాఠశాల జరుగుతున్న సమయంలో విద్యార్థులు ఇతర తరగతి గదులకు వెళ్లకూడదన్నందుకు ఓ విద్యార్థి ప్రధానోపాధ్యాయుడిని కత్తితో పొడిచిన ఘటన తమిళనాడులోని తిరుపత్తూరు సమీపంలో జరిగింది. వేలూరు జిల్లా తిరుపత్తూరు రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న రామకృష్ణ ప్రభుత్వ పాఠశాలకు బాబు (56) హెడ్‌మాస్టర్. ఇదే పాఠశాలలో తిరుపత్తూరు హౌసింగ్ బోర్డుకు చెందిన హరిహరన్ అనే విద్యార్థి (16) ప్లస్ వన్ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు సోమవారం రౌండ్స్‌లో ఉండగా.. హరిహరన్ మరో క్లాస్‌రూమ్‌లో కనిపించడంతో హెచ్‌ఎం మందలించారు. దీంతో హరిహరన్ తన వద్దనున్న కత్తితో హెచ్‌ఎంను కడుపులో పొడిచాడు. రక్తపు మడుగులో పడి కేకలు వేయడంతో స్కూల్ టీచర్లు, విద్యార్థులు హెచ్‌ఎంను తిరుపత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న విద్యార్థి కోసం గాలిస్తున్నారు.

శ్రీవారి సేవలో సీబీఐ జేడీ నాగేశ్వరరావు

తిరుపతి అలిపిరి: సీబీఐ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం కల్యాణోత్సవ విరామ సమయంలో ఆయన కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి మొక్కుకుని, శ్రీవారిని, వకుళమాతను దర్శించుకున్నారు. అనంతరం హుండీలో కానుకలు సమర్పించారు. నాగేశ్వరరావుకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ, ప్రసాదాలు అందజేశారు.

పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ పోరాటం

▶ మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలని కోరుతూ నిబంధన 184 కింద తీర్మానం ప్రవేశపెట్టేందుకు వీలుగా వైఎస్సార్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సోమవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసివ్వగా హామీల అమలుపై చర్చకు వీలుగా సావధాన తీర్మానం కోసం పార్టీకి చెందిన ఎంపీ వి.విజయసాయిరెడ్డి రాజ్యసభలో నోటీసిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని, విభజన హామీలన్నింటినీ అమలు చేయాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలినుంచి పట్టుపడుతున్న సంగతి తెలిసిందే. అటు ఢిల్లీలోనూ ఇటు రాష్ట్రంలోనూ పలుసార్లు ఆందోళనలు నిర్వహించారు.

184 నిబంధన కింద తీర్మానానికి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నోటీసులు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అమలు చేయాలని, విభజన చట్టం హామీలు అమలు చేయాలని 184 నిబంధన కింద తీర్మానం ప్రవేశపెట్టేందుకు వీలుగా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు ఇచ్చారు. '2014 ఫిబ్రవరి 20న నాటి ప్రధాని ఇచ్చిన హామీ మేరకు నూతన ఏపీకి ప్రత్యేక హోదా అమలు చేయాలని ఈ సభ తీర్మానించింది. అలాగే ప్రత్యేక హోదాను 15 ఏళ్లకు పొడిగిస్తూ ఈ సభ తీర్మానించింది. ఈ తీర్మానం స్వీకరించిన మీదట మూడు నెలల్లోగా ఇది అమలులోకి వస్తుంది. ప్రధాని ఇచ్చిన హామీ మేరకు ప్రకాశం జిల్లా సహా ఉత్తరాంధ్ర, రాయలసీమకు కోరాపుట్–బొలంగిర్–కలహండి ప్రత్యేక ప్యాకేజీ, బుందేల్‌ఖండ్ ప్రత్యేక ప్యాకేజీ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ మంజూరు చేయాలని సభ తీర్మానించింది. తదుపరి సాధారణ ఎన్నికలకు ముందుగా లేదా ఏడాదిలోగా ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని ప్రతి నిబంధనను ప్రభుత్వం అమలు చేసేందుకు సభ తీర్మానించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మే 2019లోగా పూర్తి చేసేందుకు సభ తీర్మానించింది. దుగరాజపట్నం పోర్టుకు సాంకేతికంగా, ఆర్థికంగా యోగ్యత లేనందున రామాయపట్నం పోర్టును నిర్దిష్ట కాల వ్యవధిలోగా పూర్తిచేసేందుకు ఈ సభ తీర్మానించింది' అని ఆ నోటీసులో పేర్కొన్నారు.

ఏపీకి హామీల అమలుపై చర్చిద్దాం: ఎంపీ విజయసాయిరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై చర్చకు వీలుగా సావధాన తీర్మానం ప్రవేశపెట్టేందుకుగాను ఎంపీ వి.విజయసాయిరెడ్డి సోమవారం రాజ్యసభలో నోటీసు ఇచ్చారు. ప్రత్యేక హోదా అమలు, రాజ్యసభలో నాటి ప్రధాని ఇచ్చిన హామీల అమలు, విభజన చట్టంలోని షెడ్యూలు 13లో పొందుపరిచిన హామీల అమలుపై ఈ తీర్మానం ద్వారా చర్చించాలని ప్రతిపాదించారు.

పార్లమెంటు భవనాలు కూలిపోతాయేమో: ఎంపీ కేవీపీ

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకపోవడంతో కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని ఇస్తున్న లీకులను చూస్తుంటే పార్లమెంటు భవనాలు సైతం కూలిపోతాయన్న భయం కలుగుతోందని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన హామీల అమలుపై చర్చించాలని కోరుతూ కేవీపీ సోమవారం రాజ్యసభలో నోటీసులు ఇచ్చారు. ఉదయం సభ ప్రారంభం కాగానే ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

రాజ్‌నాథ్‌తో టీడీపీ ఎంపీల భేటీ

నిధులు కేటాయించి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడాలంటూ టీడీపీ ఎంపీలు సోమవారం ఉదయం సభ ప్రారంభం కావటానికి పావు గంట ముందు పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. మరోవైపు కేంద్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి ఆధ్వర్యంలో పార్టీ ఎంపీలు తోట నరసింహం, నిమ్మల కిష్టప్ప, రామ్మోహన్‌నాయుడు సోమవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. ఆయన్ను కలిసేందుకు గంటకుపైగా నిరీక్షించిన టీడీపీ ఎంపీలు 15 నిమిషాల్లోనే బయటకు వచ్చారు.

8న వామపక్షాల బంద్‌కు వైఎస్సార్ సీపీ మద్దతు

రాష్ట్ర విభజన చట్టంలోని హామీల అమలు కోసం వామపక్షాలు ఈనెల 8న నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు వైఎస్సార్ సీపీ పూర్తి మద్దతు ప్రకటించింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, దుగరాజపట్నం పోర్టు, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటుతోపాటు విభజన చట్టం ప్రకారం రావాల్సిన అన్ని అంశాలపై వైఎస్సార్ సీపీ నాలుగేళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తోందని, వీటికి మద్దతుగా ఏ పార్టీ అయినా, ఎలాంటి ఆందోళనకు పిలుపునిచ్చినా మద్దతు ఇవ్వనున్నట్లు పార్టీ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ బంద్‌కు కేంద్ర కార్మిక సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి. సోమవారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఇతర కార్మిక సంఘాల నేతలు జి.ఓబులేసు, వి.ఉమామహేశ్వరరావు, కె.రామారావు మాట్లాడారు. బంద్‌కు కార్మిక, ఉద్యోగ, వర్తక, వాణిజ్య సంఘాలు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మద్దతు తెలపాలన్నారు. విద్యా, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసివేయాలని కోరారు.

కార్మిక సంఘాల చార్టర్‌పై వైఖరేమిటి?

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంపీ వైవీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర కార్మిక సంఘాలు సమర్పించిన 12 అంశాల చార్టర్‌పై ప్రభుత్వం వైఖరి ఏమిటని వైఎస్సార్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సోమవారం లోక్‌సభలో కేంద్రాన్ని రాతపూర్వకంగా ప్రశ్నించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నిర్మాణ రంగ కార్మికులు, తేయాకు తోటల ఉద్యోగులు తదితరుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల స్థితిగతులపై వివరాలు కోరారు. దీనిపై కేంద్ర మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ సమాధానం ఇస్తూ.. 'వేతనాలు, సామాజిక భద్రత తదితర అంశాలపై కేంద్ర కార్మిక సంఘాలు ఈ చార్టర్‌ను సమర్పించాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగులు, కార్యకర్తలకు నెలకు రూ. 15 వేలకు తక్కువ కాకుండా వేతనాలు, రూ. 3 వేలకు తక్కువ కాకుండా పెన్షన్ ఇవ్వాలన్నది చార్టర్ కోరింది. ఈ దిశగా కేంద్రం పలు చర్యలు తీసుకుంది. 2017 జనవరి 19న కనీస వేతనాలను పెంచింది. అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన తదితర పథకాలు అమలుచేస్తున్నాం. ఏపీలో అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు రూ.7 వేల గౌరవ వేతనం, అంగన్‌వాడీ హెల్పర్లకు నెలకు రూ.4,500 చొప్పున గౌరవ వేతనం అందుతోంది. తెలంగాణలో అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.10,500, అంగన్‌వాడీ హెల్పర్లకు నెలకు రూ.6 వేలు అందుతోంది' అని కేంద్రమంత్రి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ చేనేత విభాగంలో నియామకాలు

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గిరిరాజు నగేశ్ (అనంతపురం జిల్లా), రాష్ట్ర కార్యదర్శిగా బీరక సురేంద్ర (ప్రకాశం జిల్లా) నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

నీటి శుద్ధి ప్లాంట్లకు 21 కోట్లిస్తే 40 లక్షలే ఖర్చు

- పోలవరానికి ఇంజనీర్ల కొరత లేదు
- రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రశ్నలకు కేంద్రం సమాధానం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాల్లో నీటి శుద్ధి ప్లాంట్‌లను నెలకొల్పడానికి నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు రూ. 21.26 కోట్ల కేటాయిస్తే అందులో ఇప్పటివరకు కేవలం రూ.40.04 లక్షలు మాత్రమే రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేసినట్లు కేంద్రం తెలిపింది. 2016లో ఈ నిధులను విడుదల చేశామని, విశాఖ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో 15 సామాజిక నీటి శుద్ధి ప్లాంట్‌లను రాష్ట్రప్రభుత్వం నెలకొల్పినట్లు కేంద్ర సహాయ మంత్రి ఎస్.ఎస్.అహ్లూవాలియా సోమవారం రాజ్యసభలో తెలిపారు. వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన పలు ప్రశ్నలకు ఆయా శాఖల మంత్రులు జవాబులిచ్చారు. విశాఖ జిల్లాలోని 13 మండలాల్లో 47 గ్రామాలు ఫ్లోరైడ్ పీడిత గ్రామాలుగా గుర్తించినట్లు రాష్ట్ర ప్రభుత్వ సమాచారమని అహ్లూవాలియా తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఇంజనీర్ల కొరత లేదని జలవనరుల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్‌రామ్‌మెఘవాల్ స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం తెలిపిన సమాచారం ప్రకారం ఇంజనీరింగ్ విభాగంలోని దాదాపు అన్ని కేడర్‌లలో ఖాళీలు భర్తీ అయినట్లు తెలిపారు. అలాగే ప్రాజెక్ట్ నిర్మాణంలో అనవసర జాప్యాన్ని నివారించేందుకు సాంకేతికపరమైన సలహాలు ఇవ్వడానికి కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ డ్యామ్‌డిజైన్ రివ్యూ కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. దాని అమలు తీరును పర్యవేక్షించడానికి మరో నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విజయవాడ గుండుగొలను మధ్య జాతీయ రహదారి–6ను ఆరు వరుసలతో నిర్మించడంతోపాటు, 4 వరుసలతో విజయవాడ బైపాస్ రహదారి నిర్మాణానికి రంగం సిద్ధం అవుతున్నట్లు కేంద్ర సహాయ మంత్రి మన్సుఖ్ మాందవీయ రాతపూర్వకంగా వెల్లడించారు. ఈ ఆరు వరుసల రహదారి, బైపాస్‌రోడ్డు నిర్మాణ పనులను 4 ప్యాకేజీల కింద విడగొట్టి ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్యాకేజీ 1, 2కు సంబంధించి డీపీఆర్ రూపకల్పన మొదలైందని, ప్యాకేజీ 3, 4 ప్యాకేజీ సాధ్యాసాధ్యాల అధ్యయనం చేసే ప్రక్రియ బిడ్డింగ్‌దశలో ఉన్నట్లు చెప్పారు. గతంలో ఈ మొత్తం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ ఎన్ని గడువులు పొడిగించినా నిర్మాణం చేపట్టకపోవడంతో ఆగస్టు 2016లో ప్రాజెక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు.

ప్రలోభాలకు లొంగొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు (ఈఆర్‌వో)లకు, జాయింట్ కలెక్టర్లకు కేంద్ర ఎన్నికల సంఘం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ కూడా ఇచ్చింది. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలస వెళ్లినవారు కొత్తగా వచ్చిన ప్రాంతంలో ఓటర్‌గా నమోదు కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఇలాంటి సమయంలో ముందుగా ఉన్న ప్రాంతంలో ఓటును తొలగించేలా సంబంధిత అధికారులకు సమాచారం పంపాలని ఆదేశాలు ఇచ్చారు.

క్షుణ్నంగా పరిశీలించి, తనిఖీ చేసి..

గత నెల ఒకటి నాటికి 18 ఏళ్లు నిండినవారంతా ఓటర్ నమోదుకు అర్హులే. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో ఉన్నవారు ఎవరైనా మరణించి ఉంటే వారి పేర్లను తొలగిస్తారు. ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం వచ్చే ప్రతి దరఖాస్తు (ఫామ్–6)ను క్షుణ్నంగా పరిశీలించి తనిఖీ చేసిన తర్వాతే నమోదు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం తన మార్గదర్శకాల్లో పేర్కొంది. ఓటర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు అర్హమైనవా? కాదా? అని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించడం కోసం సిబ్బందికి మొబైల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం రూపొందించింది. ఓటర్ జాబితాలో పేరు నమోదు కోసం దరఖాస్తు రాగానే గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) పరిశీలించి అర్హమైనదైతే ఆమోదిస్తారు. తర్వాత ఫీల్డ్ సూపర్‌వైజర్ చెక్ చేస్తారు. ఇలా వడపోత ఉంటుంది. తప్పుల సవరణ, ఒకరికి ఒకటికి మించి ఓట్లు లేకుండా ఉండటం కోసం ఈ జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.

ఓటును మార్చడం కోసం..

ఒక నియోజకవర్గంలో ఉన్న ఓటును మరో నియోజకవర్గంలోకి మార్చడం కోసం దరఖాస్తు వస్తే ఈఆర్‌వో ఈ అప్లికేషన్‌ను జిల్లా ఎలక్టోరల్ అధికారికి పంపుతారు. అనుమతి వస్తే కోరిన చోట పేరు నమోదు చేసి ఉన్న చోట తొలగిస్తారు. ఒకే పేరు రెండు చోట్ల లేకుండా చేయడం కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఎన్నికల సంఘం వినియోగిస్తోంది. పేరును పోలిన పేరు వస్తే కంప్యూటర్ వెంటనే ఇంటి పేరు, తండ్రి పేరును చెక్ చేస్తుంది. అన్నీ ఒకే విధంగా ఉంటే ఫొటోలను కూడా చెక్ చేసి తేడా ఉందో, లేదో తేల్చుతుంది. 22 ఏళ్లు దాటినవారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేస్తే ఇంతకాలం ఎందుకు ఓటర్ల జాబితాలో చేరలేదో సంబంధిత అధికారులు తెలుసుకుంటారు. వేరే చోట ఓటు ఉండి మళ్లీ మరో చోట ఓటర్ నమోదు కోసం ప్రయత్నిస్తున్నారేమో తెలుసుకోవడం కోసం ఈ విధంగా చేయాలని అధికారులు సూచించారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల సంఘం వద్ద శిక్షణ పొందిన ఈఆర్‌వోలు జిల్లాల్లోని ఇతర అధికారులు, ఉద్యోగులకు శిక్షణ ఇస్తారు. ఓటర్ల జాబితా పక్కాగా రూపొందించడం కోసం మరోసారి రాష్ట్రస్థాయిలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు.

హంద్రీ-నీవా పనుల్లో హైకోర్టు తీర్పుపై స్టే

రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: అనంతపురం జిల్లా పుట్టపర్తి మండలం కమ్మవారిపల్లి గ్రామంలో జరుగుతున్న హంద్రీ–నీవా సుజల స్రవంతి పనుల్లో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఈ ప్రాజెక్టు కోసం తమ స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కింద నోటిఫికేషన్ జారీచేసిందని, ఇది 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధమని ముమ్మనేని వెంకటరాముడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సామాజిక ప్రభావ అధ్యయనం లేకుండానే ఈ ప్రాజెక్టు కింద తమ భూములను సేకరించడం అన్యాయమని పిటిషన్‌లో పేర్కొన్నారు. తొలుత ఏకసభ్య ధర్మాసనం పిటిషనర్‌కు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేయగా ప్రభుత్వం రిట్ అప్లికేషన్ దాఖలు చేసింది. భూసేకరణ సబబేనని, పిటిషనర్‌కు నష్టపరిహారం చెల్లించి భూసేకరణ జరపవచ్చని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆయన తరపున న్యాయవాది డి.అభినవ్ రావు పిటిషన్ ఫైల్ చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం విచారించింది. సీనియర్ న్యాయవాది వి.గిరి పిటిషనర్ తరపున వాదనలు వినిపించారు. సామాజిక ప్రభావ అధ్యయనం లేకుండానే భూసేకరణ జరపడం చట్టవిరుద్ధమని, ఈ అంశంపై భూసేకరణ చట్టంలో ప్రత్యేక అధ్యాయం ఉందని, దీని కింద ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరపాల్సి ఉంటుందని వాదించారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధిస్తూ, పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

కూడేరు: అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు దుర్మరణం చెందారు. కూడేరు మండలం అరవకూరుకు చెందిన కిరణ్, కుళ్లాయప్ప, చిరంజీవి, మరొకరు ఉదయం బొమ్మనహాళ్ మండలం దర్గా హొన్నూరులో జరుగుతున్న సర్మస్ ఉసేని ఉరుసుకు ద్విచక్రవాహనంలో వెళ్లారు. స్వామిని దర్శించుకున్న అనంతరం ద్విచక్రవాహనంలో తిరుగుపయనమయ్యారు. కూడేరు మండలం ముద్దలాపురం సమీపంలోకి రాగానే అదుపుతప్పి తిరుపతి నుంచి బళ్లారి వైపు వెళుతున్న కారును ఢీకొట్టగా, నలుగురూ దుర్మరణం చెందారు.

సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 6

అధీనరేఖ రక్తసిక్తం

భారత్‌–పాకిస్తాన్‌ సరిహద్దుల్లో, ముఖ్యంగా అధీనరేఖ వద్ద కొన్నాళ్లుగా మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అధీన రేఖ నిశ్శబ్ద రేఖగా ఎప్పుడూ లేదు. కానీ రెండు నెలలుగా అక్కడ చోటు చేసుకున్న ఉదంతాలు గమనిస్తే గత పదిహేనేళ్లలో ఇంత చేటు ఘర్షణలు ఎప్పుడూ లేవని అర్థమవుతుంది. ఆదివారం పాకిస్తాన్‌ సైన్యం జరిపిన కాల్పుల్లో భారత కెప్టెన్‌తోసహా నలుగురు జవాన్లు కన్నుమూశారు. ఆయిదురోజుల్లో ఇలా చనిపోయిన జవాన్ల సంఖ్య 8కి చేరుకుంది. ఇరువైపులా సైనికులతోపాటు సాధారణ పౌరులు కూడా ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఎందరో క్షతగాత్రులవుతున్నారు. అధీనరేఖకు, అంతర్జాతీయ సరిహద్దుకు చేర్చి ఉన్న గ్రామాల్లోని ఇళ్లు నిలువునా తూట్లు పడి కనబడుతున్నాయి. సాధారణ పౌరులు ఇళ్లూ వాకిళ్లూ వదిలి సురక్షిత ప్రాంతాలకు వలసపోతున్నారు. పాకిస్తాన్‌ సైన్యం జరుపుతున్న కాల్పుల కారణంగా అటు అధీన రేఖ వద్ద, ఇటు అంతర్జాతీయ సరిహద్దు వద్ద గత నవంబర్‌ నుంచి 500 పాఠశాలలు మూసేయవలసి వచ్చింది. గత సంవత్సరం అధీన రేఖ వద్ద పాకిస్తాన్‌ వైపు నుంచి 881 కాల్పుల విరమణ ఉల్లంఘనలు చోటుచేసుకోగా ఒక్క డిసెంబర్‌లోనే అవి 147 ఉన్నాయి. మొన్న జనవరి 1 నుంచి ఇంతవరకూ దాదాపు 240 సార్లు కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. గత నెలలో ఈ ఉదంతాల్లో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య గత ఏడాది ఉదంతాలన్నిటా మరణించినవారి సంఖ్యతో సమానంగా ఉన్నదంటున్నారు. చాలా సందర్భాల్లో మన సైన్యం గట్టి జవాబిచ్చింది. పర్యవసానంగా అటువైపు కూడా ప్రాణ నష్టం ఉంటున్నది. తొలుత మీరు కాల్పులు జరిపారంటే మీరు జరిపారని పరస్పరం ఆరోపణలు చేసుకోవడం కూడా సర్వసాధారణమైంది.

ఇలాంటి ఉల్లంఘనలు జరిగినప్పుడు ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చర్యలు తీసుకోవడానికి ఇరు దేశాల సైనిక డైరెక్టర్‌ జనరల్స్‌(డీజీఎంఓ) మధ్యా హాట్‌లైన్‌ సదుపాయం ఉంది. ఈమధ్య కాలంలో ఒకటి రెండుసార్లు అలా మాట్లాడుకున్నారని అంటున్నారు. కానీ ఫలితం లేదు. 2016 సెప్టెంబర్‌లో మన సైన్యం పాకిస్తాన్‌ భూభాగంలోకి చొచ్చుకెళ్లి అక్కడ చొరబాటుదార్ల కోసం నిర్మించిన శిబిరాలను ధ్వంసం చేసింది. అంతక్రితం ఉడీ సెక్టార్‌లో లష్కరే తొయిబా ఉగ్రవాదులు సైనిక స్థావరంపై దాడిచేసి బిహార్‌ బెటాలియన్‌కు చెందిన 19మంది జవాన్ల ప్రాణాలు తీసినందుకు ప్రతీకారంగా ఈ సర్జికల్‌ దాడులు జరిగాయి. అయితే అవి సైతం పాకిస్తాన్‌ను కట్టడి చేయలేకపోయాయని ఆ తర్వాత సాగుతున్న ఘర్షణల పరంపరను గమనిస్తే అర్థమవుతుంది. 2003లో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక అధీనరేఖ, అంతర్జాతీయ సరిహద్దు ప్రశాంతంగా ఉన్నాయని చెప్పడం అతిశయోక్తి అవుతుంది. అయితే ఉల్లంఘనల సంఖ్య మొదట్లో చాలా స్వల్పంగా ఉండేది. కానీ 2013 దాటాక ఈ ఉదంతాలు క్రమేపీ పెరుగుతూ 2015 నాటికి మితిమీరాయి. వాటితోపాటే మరణాల సంఖ్య పెరుగుతోంది. ఇదంతా చొరబాటుదార్ల సమస్యతో మొదలవుతున్నదని మన నిపుణులు చెబుతున్నారు. లష్కరే తొయిబా, ఇతర సంస్థలకు చెందిన మిలిటెంట్లకు పాక్‌ సైన్యం మారణాయుధాలిచ్చి భారత్‌ గడ్డపై ప్రవేశపెట్టడంకోసం ప్రయత్నిస్తున్నదని అందులో భాగంగానే కాల్పులు జరుపుతున్నదని వారి విశ్లేషిస్తున్నారు. ఉడీ సెక్టార్‌లో మన సైన్యానికి భారీ నష్టం కలగజేసిన లష్కరే మిలిటెంట్లు అలా ప్రవేశించినవారే. ఇరు దేశాల మధ్యా రెండుసార్లు పూర్తి స్థాయి యుద్ధాలు చోటు చేసుకున్నాయి. 1999లో కార్గిల్‌లో చొరబడేందుకు పాక్‌ సైన్యం చేసిన ప్రయత్నాన్ని మన జవాన్లు తిప్పికొట్టారు. ఆ సందర్భంగా దాదాపు మూడు నెలలు చిన్నపాటి యుద్ధం జరిగింది.

యుద్ధ సమయాల్లో ప్రభుత్వం ముందుగానే సరిహద్దు గ్రామాల ప్రజలను ఖాళీ చేయిస్తుంది. అక్కడ జవాన్ల కదలికలు ముమ్మరమవుతాయి. యుద్ధం ముగిసిందన్న ప్రకటన వచ్చేవరకూ ఊరు వెళ్లడం క్షేమం కాదని అందరికీ తెలుస్తుంది. కానీ అధీనరేఖ, అంతర్జాతీయ సరిహద్దుల్లోని గ్రామాల ప్రజలది ఏదాది పొడవునా అయోమయ స్థితి. ఈ క్షణం అంతా సవ్యంగానే ఉన్నదని పిస్తుంది. మరుక్షణంలో సరిహద్దు ఆవలి నుంచి శతఘ్నులు, మోర్టార్లు గర్జిస్తాయి. అవి ఎప్పుడు శాంతిస్తాయో తెలియదు. పొలం పనికెళ్లినవారో, బడి నుంచి తిరిగొస్తున్న పిల్లలో, ఇంట్లో పనిచేసుకుంటున్న మహిళో వాటి బారిన పడతారు. ప్రాణాలైనా పోవచ్చు. తీవ్రంగా గాయపడి శాశ్వత వైకల్యమైనా రావొచ్చు. పావు బతుకుల మధ్య ఉండే సన్నటి సరిహద్దు రేఖ అక్కడ చెదిరిపోతుంది. చిత్రమేమంటే ఈ కాల్పుల విరమణ ఉల్లంఘనలూ, వాటినుసరించి ఉండే పరస్పర హెచ్చరికలు, వాటికి కొనసాగింపుగా ఆరోపణల యుద్ధం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉన్నా రెండు దేశాల మధ్యా వాణిజ్య లావాదేవీలు ఆగవు. అలా ఆపి రోజూ కోట్లాది రూపాయల వ్యాపారాన్ని నష్టపోవడానికి రెండు దేశాలూ సిద్ధంగా ఉండవు. అయితే ఇరు దేశాల మధ్యా సామరస్య వాతావరణం ఏర్పడితే ఈ వాణిజ్యం మరిన్ని వందల రెట్లు పెరుగుతుందని, అది రెండు ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుందని పాకిస్తాన్‌ సైన్యం గుర్తించదు.

రెండు దేశాల డీజీఎంఓల మధ్యా హాట్‌లైన్‌ సదుపాయం ఉన్నమాట నిజమే అయినా ఆచరణలో అది పెద్దగా ఉపయోగపడటం లేదు. సమస్యకు మూలంగాని, దానికి పరిష్కారంగాని అక్కడ లేకపోవడమే ఇందుకు కారణం. ఇరు దేశాల మధ్యా ఉన్నత స్థాయి చర్చలు జరగడం, అంతర్జాతీయ వేదికల ద్వారా పాకిస్తాన్‌పై ఒత్తిళ్లు తీసుకురావడం ముఖ్యం. అలాగే కశ్మీర్‌లో ప్రశాంతత నెలకొనడానికి అవసరమైన చర్యలు కూడా ప్రారంభించాలి. అక్కడ ప్రశాంతత నెలకొంటే సరిహద్దుల్లో పాక్‌ ఆటలు సాగవు. ఇప్పుడు అధీనరేఖ వద్ద దాదాపు యుద్ధ వాతావరణం నెలకొంది. దీన్ని సాధారణ స్థితికి తీసుకురావడమన్నది తన చేతుల్లోనే ఉన్నదని పాక్‌ నాయకత్వం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.




సరిహద్దుల మధ్య ఉద్రిక్తతలకు పరిష్కారం చర్చల బల్ల వద్దే కానీ తుపాకుల మధ్య కాదు.

– మోహన్‌ గురుస్వామి
దేశీయ విధాన వ్యవహారాల నిపుణులు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.షష్ఠి ప.12.14 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం చిత్ర ప.3.01 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం రా.8.50 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.8.49 నుంచి 9.34 వరకు, తదుపరి రా.10.56 నుంచి 11.47 వరకు, అమృతఘడియలు రా.8.30 నుంచి 10.33 వరకు.


సూర్యోదయం	: 6.35	4.30 వరకు	
సూర్యాస్తమయం	: 5.52	యమగండం :	
రాహుకాలం :		ఉ.9.00 నుంచి	
ప.3.00 నుంచి		10.30 వరకు	



నమాజ్‌ వేళలు

ఫజర్‌	: 5.33	మగ్రీబ్‌	: 6.14
జొహర్‌	: 12.30	ఇషా	: 7.28
అసర్‌	: 4.38		


పార్టీలకు ఓట్లు, ప్రజలకు పాట్లు



ఏబీకే ప్రసాద్‌
సీనియర్‌ సంపాదకులు

బడ్జెట్‌కు ముందు రైతాంగం చేతిలో డబ్బులు ఆడకుండా నోట్ల రద్దు కత్తెర వేసిన బీజేపీయే, కొత్త బడ్జెట్‌లో పంటకు మద్దతు ధర పెంచనున్నట్టు, స్వామినాథన్‌ కమిషన్‌ సిఫారసులు అమలు చేస్తున్నట్టు భ్రమలు కల్పిస్తున్నది. కానీ జరగబోయేదేమిటి? మద్దతు ధర పెంచే ప్రతిపాదనను పరిశీలించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడమే. ఈలోగా 2019లో జరగవలసిన ఎన్నికలను ముందస్తుగా జరపబోతున్నట్టు వాయిదాల పద్ధతిలో ప్రకటిస్తున్నారు. అందుకే మద్దతు ధర అంశం అటకెక్కకుండా ఆగుతుందంటే నమ్మలేం.

రెండో మాట



'చరిత్రలో దేశదేశాల సకలైశ్వర్యాల పరిరక్షణ కోసమే అన్న సాకుతో ఏర్పడిన పౌర ప్రభుత్వాలు వాస్తవానికి, పేద ప్రజలకు వ్యతిరేకంగా సంపన్న వర్గాల రక్షణ కోసం ఏర్పడినవే. లేదా ఎలాంటి ఆస్తిపాస్తులూ లేని వారికి వ్యతిరేకంగా ఆస్తులున్నవారి రక్షణ కోసం వెలిసినవే.'

– ఆడమ్‌ స్మిత్‌ ('వెల్త్‌ ఆఫ్‌ నేషన్స్‌' 1776 నుంచి)

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నాలుగేళ్లుగా చేస్తున్నవి ఒకే రకం హామీలు. పంటలకు సరసమైన ధరలు నిర్ణయిస్తామంటూ నాలుగేళ్ల క్రితం హామీ పడింది. నాలుగేళ్లూ గడిచాయి. ఆ హామీ నెరవేరలేదు. ఇంకా, యువతకు ఉద్యోగాలు లేవు. ఇప్పుడు బడ్జెట్‌ ప్రవేశపెట్టిన మరుక్షణమే షేర్‌ మార్కెట్‌ (సెన్సెక్స్‌) 800 పాయింట్లు కుప్ప కూలి, ఆ మేరకు అదేస్థాయిలో ప్రభుత్వం మీద ప్రజలకున్న అవిశ్వాసం వెల్లడయింది.'

– రాహుల్‌గాంధీ (కాంగ్రెస్‌ అధ్యక్షుడు)

'రైతాంగం, కార్మిక వర్గాల ప్రయోజనాలకు విరుద్ధంగా బడ్జెట్‌ నిర్ణయాలు ఉన్నందువల్ల సర్వత్రా నిరసన వెల్లువెత్తుతోంది. ఖాయిలా పడిన ప్రభుత్వ రంగ సంస్థలను అవకాశమున్న మేరకు పునరుద్ధరించే ప్రయత్నం చేయక పోగా, వాటి షేర్లను తెగనమ్మడానికి పథకం వేయడంతో పాటు, కీలకమైన 24 ప్రభుత్వం రంగ సంస్థల వాటాలను అమ్మకానికి పెట్టారు.'

– ఆరెస్సెస్‌/భారత మజ్దూర్‌ సంఘ్‌ (2–2– 2018)

ప్రధాని ఆర్థిక వ్యవహారాల సలహాదారు అరవింద సుబ్రహ్మణ్యం 2018–19 బడ్జెట్‌ సందర్భంగా విడుదల చేసిన ప్రకటన అన్నింటికంటే విచిత్రమైనది. త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, 'పంచదార పూత తో'ప్రజలను మోసగించేందుకు సిద్ధం చేసిన బడ్జెట్‌ అని ప్రతిపక్షాలు ఆరోపించడానికి ముందే అరవింద సుబ్రహ్మణ్యం ప్రకటన వెలువడింది. కాబట్టి ఆయన ప్రకటన కొట్టిపారేయలేనిది.

ఇది ఎన్నికల బడ్జెట్‌ అనే చెప్పాలి

బీజేపీ–హిందుత్వ పరివార్‌ పాలనలో సామాజిక శాంతి ప్రయోజనాల రక్షణ కంటే, సెక్యులర్‌ భావాలకు ప్రతికూలమైన పోకడలే ఎక్కువ. ఈ ధోరణులను ఇంతకుముందే పసిగట్టిన ఆర్‌బీఐ మాజీ గవర్నర్‌ రాజన్‌, ఆ తరువాత పన్‌గారియా, నీతి ఆయోగ్‌కే చెందిన మరొక ప్రముఖుడు పదవీకాలాలు ముగియకుండానే వైదొలిగారు. ఇక ఆర్‌బీఐ గవర్నర్‌ ఉర్జిత్‌ పటేల్‌కు ఎంత స్వేచ్ఛ ఉన్నదో తెలుస్తూనే ఉంది. ఇప్పటికిప్పుడు ఇలాంటి నిర్ణయానికి రాకున్నా అరవింద సుబ్రహ్మణ్యం తాపీగా ఒక విషయాన్ని సూచించారు: 'ఎన్నికల సంవత్సరంలో ప్రభుత్వం చేసే రుణాలకూ, ఆర్థిక వ్యవస్థలో ఎదురుకాబోయే ద్రవ్యలోటుకూ మధ్య సమతౌల్యాన్ని బలవంతంగా లేదా శుద్ధ ఆర్థిక సిద్ధాంతం ద్వారా సాధించలేం. ఎందుకంటే కళ్లముందున్న (ఎన్నికలు) రాజకీయ వాస్తవాన్ని చూడకుండా కళ్లు మూసుకోలేం!' అన్నారు (31.1. 2018) అరవింద సుబ్రహ్మణ్యం. కనుకనే పరివార్‌ అనుయాయి శివసేన కూడా 'కొత్తసీసాలో పాతసారా'గానే ఈ బడ్జెట్‌ను పరిగణించింది. గుజరాత్‌ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి తగిలిన దెబ్బ 'గ్రామీణ ప్రజలు ఆ పార్టీ పట్టు నుంచి దూరమైపోతున్నారని చెప్పడానికి నిదర్శనం' అని కూడా శివసేన వ్యాఖ్యానించింది.

నిజానికి ఈ నాలుగేళ్ల బీజేపీ పాలనలో వివాదాస్పద ఘటనలే ఎక్కువ. పెద్ద నోట్ల రద్దు చాలా కృత్రిమమైన పద్ధతి. మరింత కృతకంగా దేశ విదేశీ కార్పొరేట్ల పెట్టుబడుల విస్తృతికి అనుకూలంగా ప్రత్యక్ష పన్నులకు కోత పెట్టి మధ్య తరగతి, చిన్న వ్యాపారులు, చేతి వృత్తుల వారిపైన పరోక్ష పన్నులను పెంచింది. ప్రజల జీవనాన్ని తారుమారు చేసింది. బడ్జెట్‌కు ముందు రైతాంగం చేతిలో డబ్బులు ఆడకుండా నోట్ల రద్దు కత్తెర వేసిన బీజేపీయే, కొత్త బడ్జెట్‌లో పంటకు మద్దతు ధర పెంచనున్నట్టు, స్వామినాథన్‌ కమిషన్‌ సిఫారసులు అమలు చేస్తున్నట్టు భ్రమలు కల్పిస్తున్నది. కానీ జరగబోయేదేమిటి? మద్దతు ధర పెంచే ప్రతిపాదనను పరిశీలించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడమే. ఈలోగా 2019లో జరగవలసిన ఎన్నికలను ముందస్తుగా జరపబోతున్నట్టు వాయిదాల పద్ధతిలో ప్రకటనలు విడుదల చేస్తున్నారు. ఈ తరుణంలో రైతు మద్దతు ధర అంశం అటకెక్కకుండా ఆగుతుందంటే నమ్మలేం.

ఒక చేత్తో ఇస్తారు, మరో చేత్తో లాగేస్తారు

ఒకవేళ మద్దతు ధర పెంచే యోచన అమలులోకి వస్తే, ఆ ధరను కూడా మింగేసే ప్రయత్నాలు మరో పక్క జరుగుతున్నాయనిపిస్తుంది. లబ్ధి చేకూర్చే మద్దతు ధరను సాధించడానికి అవసరమైన మెరుగైన రాలుబడికి కావలసిన పనిముట్లు, ఎరువులు, రసాయనాల ధరలను సగటున రూ. 150 నుంచి రూ. 200 వరకు పెంచాలని నిర్ణయించడమంటే రైతాంగం పట్ల పాలకులకు ఉన్న చిత్తశుద్ధి వెల్లడవుతుంది. రైతు ఆదాయం రెట్టింపు చేయాలని ప్రభుత్వం ప్రకటన ఒకవైపు, ఎరువుల కంపెనీలు ధరలు పెంచేయడం మళ్లీ పెంచాలని భావిస్తున్నట్టు (వచ్చే జూన్‌కు) ఏం రుజువు చేస్తుంది? ఇది ఆడమ్‌ స్మిత్‌ సూత్రాన్ని మరోసారి రుజువు చేస్తోంది.

ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్‌ అధికారం కోసం దేనిమీద ఆధారపడుతున్నట్టు? అవినీతి ఊబిలోకి పాలకులు దించిన భారతంలో భాగస్వాములవుతున్న కార్పొరేట్ల చేతుల్లో పెరుగుతున్న కొన్ని దేశవాళీ రేటింగ్‌ సంస్థలూ, విదేశీ రేటింగ్‌ సంస్థలూ దేశీయోత్పత్తుల సగటు విలువను (జీడీపీ) నిర్ణయిస్తున్నాయి, లేదా తారుమారు చేసి చూపుతున్నాయి. పాలకులు విదేశీ పెట్టుబడుల రాకను యథేచ్ఛగా ఆమోదించినప్పుడు జీడీపీ విలువ తగ్గుదలలో ఉన్నా, దానిని ఎక్కువ చేసి చూపుతున్నాయి. లేదా విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి పాలకులు ప్రజల ఒత్తిడివల్ల ఏ మాత్రం అభ్యంతరం కనబరచినా పెట్టుబడులను నిలిపివేయడం కూడా ఈ విదేశీ రేటింగ్‌ ఏజెన్సీల ఎత్తుగడ. మన అభివృద్ధి రేటు గత 30 ఏళ్ల నాటికన్నా ఇప్పుడు కుదించుకుపోయిందని భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు కౌశిక్‌ బసుయే ప్రకటించారు (24.1.18). ఈ పెనుగులాటలోనే ప్రజల్ని నమ్మింపజేసేందుకు 6.2 శాతంగా ఉన్న దేశాభివృద్ధి అకస్మాత్తుగా 7.5 శాతానికి లేదా క్షణాలలో 8 శాతానికి పైనా పెరుగుతున్నట్లు కృత్రిమంగా చూపడానికి ఈ సంస్థల ద్వారా మోదీ ప్రభృతులు ప్రయత్నిస్తున్నారు. ఇండియా 'సంపన్న దేశాలలో ఆరవ స్థానంలో ఉందంటే హర్షించాల్సిందే. కానీ చైనా కన్నా మనం రెండేళ్ల ముందు స్వాతంత్ర్యం పొందాం. కానీ చైనా మనకన్నా శరవేగాన ముందుకు దూసుకుపోవడమేగాక, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా తరువాత మూడవ స్థానంలో ఉన్న జపాన్‌ను అధిగమించింది. అమెరికాను కూడా రేపో మాపో అధిగమించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రథమ స్థానాన్ని ఆక్రమించనున్నదని అమెరికా అధికార ప్రకటనలే వెల్లడిస్తున్నాయి. మనకన్నా రెండేళ్ల తర్వాత విమోచన పొందిన చైనా, 250 ఏళ్లలో ప్రపంచ సామ్రాజ్య శక్తిగా అవతరించిన అమెరికాను ప్రపంచ శక్తిగా తోసిరాజనగలగడం ఏమిటి?

ప్రజా ప్రయోజనాలకు రక్షణేది?

ఇంతకూ తేలవలసిన అసలు విషయం– 'అభివృద్ధి' దండకంలో ఉన్న బీజేపీ, దేశంలో వస్తు తయారీ (మాన్యుఫ్యాక్చరింగ్‌) పరిశ్రమల్ని స్వయంగా దేశవాళీ పరిశ్రమలుగా తీర్చిదిద్దవలసిన తరుణంలో 'మేక్‌ ఇన్‌ ఇండియా' ముద్ర చాటున అమెరికా కంపెనీల ప్రవేశానికి అవకాశాలు, వెసులుబాట్లు కల్పించడం దాదాభాయి నౌరోజీ, ఆర్‌సీ దత్‌, గాంధీజీ ఆశించిన 'స్వదేశీ భావన'కు పూర్తి విరుద్ధం కాదా? విద్య, ఆరోగ్యం, రోజువారీ వ్యవసాయ, కార్మిక, పార్ట్‌ టైం ఉపాధిలో ఉన్న పారిశ్రామిక వ్యవసాయ కార్మికుల కనీస వేతనాల పరిరక్షణకు, ఉద్యోగావకాశాల కల్పనకు కొత్త బడ్జెట్‌లో తగిన భరోసా లేదు. ఈ విషయాన్ని కూడా ప్రస్తావించిన వివిధ సర్వేక్షణ నివేదికల అంచనా ప్రకారం– ఒక ప్రసిద్ధ భారత వస్త్ర పరిశ్రమలో పనిచేసే ఉన్నతాధికారి పొందే వేతనం పొందగల స్థాయికి గ్రామీణ భారతంలో కనీస వేతనం పొందే కూలీ నాలీ/జీతగాళ్లు చేరుకోవాలంటే కనీసం 900 సంవత్సరాలు పడుతుందని తేలింది.

అందువల్ల దేశ నాయకత్వం చేయవలసిన పని– దేశ ఆర్థిక వ్యవస్థ అందరికీ సమానావకాశాలు, సమాన న్యాయం, వివక్షలేని స్వేచ్ఛ కల్పించాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని పాటించడమేగానీ కృత్రిమ సంపాదనల ద్వారా 'అదృష్టరేఖలు' చూసుకుంటున్న వారికి అండదండలుగా నిలవడం కాదు. కావలసింది ప్రజా ప్రయోజనాలను కాపాడగల నిర్దిష్ట విధానాల ఆచరణ. 'నయా ఉదారవాద రాజకీయాలు' ఫాసిజానికి దారులు వేయకూడదు. అమలు జరపని ఆకర్షిత నినాదాల ద్వారానే నాజీ హిట్లర్‌ చాపకింద నీరులా ఫాసిజానికి దారులు పరిచాడు.

బహుశా ఇది దృష్టిలో పెట్టుకునే ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త, రాజకీయ సిద్ధాంతకర్త రాజీవ్‌ భార్గవ (వర్ధమాన సమాజాల అధ్యయన కేంద్రం, ఢిల్లీ) అయిదు అంశాలపై తన నిరసన గళాన్ని విప్పాడు: ''1. ఈ రోజున మన దేశంలో ఉదారవాద గళాలకు ఎప్పటికన్నా ఎక్కువగా సవాలు ఎదురైంది. ఇటీవల కాలంలో మితవాద శక్తులు అదుపులేని అధికారం చెలాయిస్తున్నాయి. 2. ఈ స్థితిలో ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించలేకపోతున్నారు. ప్రజలపై బెదిరింపులు, దాడులు పెరిగాయి. ఫలితంగా పౌరులు ప్రజా జీవనంతో సంబంధం లేకుండా వేరుపడి పోతున్నారు. 3. బడా కార్పొరేషన్‌లు, ప్రభుత్వమూ పౌరుల గురించిన వివరాల మీద దృష్టి కేంద్రీకరించి కూపీలు లాగుతూ, కానరాని నిఘా పెడుతున్నాయి. 4. న్యాయ వ్యవస్థ నియమాలలో విశ్వాసం సడలింప చేస్తున్నారు. 5. ఇలాగే అణచివేతలు, హింసాత్మకమైన బెదిరింపులు కొనసాగే పక్షంలో ప్రస్తుత వ్యవస్థపై ప్రజలలో అసహనం పెరిగిపోతుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని యువత, స్త్రీలు, దళిత, బహుజన, పేద ముస్లిములు, చిన్న పట్టణాలలోని, గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు భావప్రకటనా స్వాతంత్ర్యం కోసం మరింతగా డిమాండ్‌ చేస్తారు'' (హిందూ: 4.2.18).


ఈ వాతావరణంలో దేశంలోని బ్యాంకులకు బడా కంపెనీలు మొండి చేయి చూపిన సుమారు 9 లక్షల కోట్ల బకాయిలను వసూలు చేయలేని పాలకులు స్విస్‌ బ్యాంకులలో, పనామా పేపర్స్‌లో తలదాచుకున్న భారత బడా సంపన్నుల రూ. 24 లక్షల కోట్ల నల్లధనాన్ని ఎలా లాక్కురాగలరో చెప్పండి. అందులోనూ తాజాగా భారత ఎన్నికల సంఘమే పాలక పక్షాల లెజిస్లేటర్ల అవినీతిని లెక్కకట్టి, ప్రజలకు చూపుతున్నప్పుడు ఇది సాధ్యమా?!

abkprasad2006@yahoo.co.in

'ఆరోగ్య సంరక్షణ' కలేనా?

2016లోనే ఆర్థికమంత్రి జైట్లీ తన బడ్జెట్‌ ప్రసంగంలో జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం గురించి ప్రకటించారు. కానీ అది అమలులోకి రాలేదు. 2017 బడ్జెట్‌ ప్రసంగంలో దీన్ని ప్రస్తావించలేదు. మళ్లీ కొత్త పథకం తేవడంలో అర్థం ఏమిటి?

విశ్లేషణ



మహేశ్‌ విజాపుర్కర్‌



జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకంలో 'ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం' అనే అస్పష్టమైన పదాలున్నాయి. ఇది ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన కేంద్ర బడ్జెట్‌ స్వయంగా చాటుకున్న పదబంధం. ఈ కార్యక్రమం పరిధిలోకి 10 కోట్ల కుటుంబాలు రానున్నాయి. కుటుంబానికి సగటున 5గురు సభ్యులని భావిస్తే మొత్తం 50 కోట్లమంది భారతీయులు అంటే జనాభాలో మూడోవంతు మంది ఈ పథకం కిందికి వస్తారు.

ఏడాదికి 5 లక్షల రూపాయలు ఆరోగ్య బీమాగా పొందటం అంటే భారతీయ కుటుంబాలకు నిజంగానే అదొక వరం. దేశంలో చాలామంది అతి స్వల్పమాత్రపు వైద్య ఖర్చులను కూడా భరించలేని స్థితిలో ఉంటున్నారు. మంచి ఆరోగ్య సేవలందించే ఆసుపత్రి వద్దకు ప్రయాణ ఖర్చులు భరించడం కూడా చాలామందికి కష్టమవుతోంది. తమ వేతనాలు కోల్పోవలసిరావడం, కుటుంబాలు ఎదుర్కొనే విషాద పరిస్థితుల గురించి చెప్ప పనిలేదు. కుటుంబంలో సంపాదనపరుడికి వైద్య ఖర్చుల భారం మరణంతో సమానమే. దురాశాపరులైన వడ్డీ వ్యాపారుల నుంచి, ఇతరత్రా వైద్య ఖర్చులకోసం తీసుకునే రుణాలను కుటుంబాలు తట్టుకోలేవు.

ఈ నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన జాతీయ ఆరోగ్య బీమా ఎప్పుడు, ఎలా అమలు చేస్తారన్నది మనకు తెలీదు. ఈ భారీ పథకానికి అయ్యే వ్యయం గురించి.. ప్రభుత్వం మనకు తెలియపర్చడం లేదు. ఎంత వ్యయం అవుతుందనే అంశాన్ని స్పష్టం చేయకుంటే ఏ ప్రకటనైనా సరే పురుడు పోసుకోవడం కష్టం. పైగా రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయో తెలీదు. ఎందుకంటే 40 శాతం ఖర్చును అవే భరించాలి.

అయితే ఏ రాష్ట్రం కూడా దీన్ని దాటవేయాలని భావించదు. కానీ ఇందుకోసం ప్రభుత్వాలు తమ ఆర్థిక వనరులను పునర్నిర్మించుకోవలసి ఉంటుంది. ఇది అంత సులభం కాదు. ఒక బ్లాగులో ప్రచురించిన పరిశోధనా పత్రం ఈ పథకం అమలు గురించి తీవ్ర సందేహాలను వ్యక్తపరిచింది.

ఈ పరిశోధనా పత్ర రచయిత్రి మీటా చౌదరి ఒక ఫ్యాకల్టీ మెంబర్‌. ఆమె అభిప్రాయం ప్రకారం, '2016 లోనే ఆర్థికమంత్రి జైట్లీ తన బడ్జెట్‌ ప్రసంగంలో జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం గురించి ప్రకటించారు. ప్రతి బీపీఎల్‌ కుటుంబానికి ఏటా రూ. 1 లక్ష వరకు ఆసుపత్రి ఖర్చులను ఈ పథకం కింద అందించడమవుతుంది. కానీ ఆ పథకం అమలులోకి రాలేదు. పైగా 2017 బడ్జెట్‌ ప్రసంగంలో దీని ప్రస్తావన కూడా చేయలేదు. ఆనాటి పాత భావనను నేడు కొత్త భావనలో కలిపేశారని మనం భావించినప్పటికీ, అది ఇప్పటికీ కాగితంమీది భావనగానే ఎందుకు మిగిలి ఉందనే ప్రశ్నకు సమాధానాలు లేవు. పైగా ఈ పథకాన్ని ప్రారంభించడానికి అవసరమైన నిధుల పరిమాణం, ఈ పథకాన్ని ఎవరు అమలు చేస్తారు, దాన్ని అమలు చేయడానికి ఎంత సమయం పడుతుంది అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇప్పటికైతే ఆరునెలల్లోపు ఈ పథకాన్ని అమలు చేస్తారన్న అంచనా ఉంటోంది.

ఈ అంశంలో అర్థం చేసుకోవలసిన మరొక విషయం కూడా ఉంది. ప్రైవేట్‌ రంగంలోని ఆసుపత్రులన్నీ ఖర్చుల విషయంలో, అనవసరమైన ప్రక్రియల నిర్వహణలో పేరుమోసి ఉన్నాయి. బీమా సంస్థలు వాటిలో కొన్నింటిని అనుమతించనప్పటికీ ప్రైవేట్‌ ఆసుపత్రులు ఉద్దేశపూర్వకంగా పెంచే ఇతర ఖర్చులు కూడా రోగులపై పడే అవకాశముంది. దాదాపు 50 కోట్ల మంది ప్రజలకు ఏటా రూ. 5 లక్షలను ఆరోగ్య సంరక్షణ కింద అందించడం నిజంగా వరంలాంటిది. అయితే ప్రైవేట్‌ ఆరోగ్య సంరక్షణ రంగమే దీనిద్వారా లబ్ధి పొందుతుంది. ఇప్పటికే వీటి సామర్థ్యం అవసరానికి మించి పెరిగిపోయి ఉన్నప్పటికీ ఈ కొత్త మార్కెట్‌ను వేగంగా వినియోగించుకునే అవకాశం వీటికే ఉంది.

విరాళాల ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ దేశీయంగా ఎంతో బలహీనంగా ఉంది. కొనసాగుతున్న కొద్ది సంస్థలను పాలనాపరంగా, వైద్యపరంగా కూడా పేలవంగా నిర్వహిస్తున్నారు. వైద్యుల కొరత, మందుల కొరత, డిమాండ్‌తో పోలిస్తే ఎప్పటికీ సరిపోలని అతి తక్కువ నిష్పత్తితో ఉండటం వంటివి ప్రభుత్వ వైద్య వ్యవస్థలకు వినాశ హేతువులుగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు ఆరోగ్య పథకాలను, వ్యవస్థలను ఎలా నడుపుతున్నాయనేది తెలిసిన విషయమే. కాబట్టి ప్రభుత్వ వైద్య వ్యవస్థలో మార్పులకు సంబంధించిన ప్రకటనలు అమలులో మాత్రం నత్తనడక సాగిస్తాయి. దీంతో అధిక బిల్లులతో ప్రజల ఊపిరి తీసే ప్రైవేట్‌ రంగం మరింత పెరుగుతూనే ఉంటుంది.

జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకాలకు ప్రభుత్వం కేటాయించేది పెద్దగా ఉండకపోవడం, ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెరుగుదలకు రాష్ట్రాలు ఆసక్తి చూపకపోవడం వంటి వాటి నేపథ్యంలో కనీసం రూ. 1.5 లక్షల ఆరోగ్య పథకానికి రూ. 1,200 కోట్లు కేటాయించడం కూడా చాలా పెద్ద లక్ష్యమే అవుతుంది. ప్రైవేట్‌ రంగం, వితరణశీలురు ఆరోగ్య సంరక్షణకు ఇస్తున్న తోడ్పాటు నిధుల కేటాయింపులో ప్రభుత్వ నిబద్ధతను సందిగ్ధావస్థలోకి నెడుతున్నాయి.

వ్యాసకర్త సీనియర్‌ పాత్రికేయులు
ఈ–మెయిల్‌ : mvijapurkar@gmail.com

ఆ విషయంలో సిగ్గెందుకు!

ప్రభుత్వం బొట్టు, గాజులు, పారాణి వంటి సౌభాగ్య చిహ్నాలను అడగకుండానే ట్యాక్స్‌ ఫ్రీ చేసింది కానీ, స్త్రీలు నోరు తెరిచి అడిగినా ప్యాడ్‌లను ట్యాక్స్‌ ఫ్రీ చేయకుండా భీష్మించుకుంది. పాలకుల పురుషస్వామ్య దృక్పథానికిది నిదర్శన.



సామాన్య

ఆలోచనం



''అవును నా చేతిలో ఉన్నది ప్యాడ్‌ – నేను సిగ్గుపడాల్సింది ఏమీ లేదు... అది చాలా సహజమైనది! పీరియడ్‌' అని ట్వీట్‌ చేశారు దీపికా పదుకొనె, ప్యాడ్‌ మ్యాన్‌ చాలెంజ్‌ తీసుకుంటూ. 'ప్యాడ్‌ మ్యాన్‌' ఈ నెల 9వ తేదీ విడుదలవుతున్న అక్షయ్‌ కుమార్‌ సినిమా. అరుణాచలం మురుగనంతం జీవితాన్ని ఇది మనకు చూపిస్తుంది. అరుణాచలం తమిళనాడుకి చెందిన వ్యక్తి. తన భార్య నెలసరి రోజులలో పాత గుడ్డముక్కలు, కాగితాలు వాడటం చూసి కలత చెంది, దానికో పరిష్కార మార్గం చూపించాలని భావించాడట. ఈ పరిశోధనలో ఆయన అనేక కష్టాలను ఎదుర్కొన్నాడు. విదేశాలనుంచి దిగుమతి అయ్యే శానిటరీ నాప్కిన్‌ తయారీ మెషీన్‌ విలువ మూడున్నరకోట్లు. ఇంత ఖరీదైన మెషీన్‌తో ప్యాడ్‌లు తయారు చేయడం వలన మార్కెట్‌కు చేరేప్పటికీ ప్యాడ్‌ ఖరీదు పెరిగి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతుందని గ్రహించాడు. చివరికి అన్ని అడ్డంకులనూ అధిగమించి రూ. 65 వేలకే వచ్చే ప్యాడ్‌ ఉత్పత్తి మెషీన్‌ను ఆయన కనుగొన్నాడు. పైగా ఆ మెషీన్‌ను సెల్ఫ్‌ హెల్ప్‌ గ్రూప్‌లకు మాత్రమే అమ్ముతానని భీష్మించుకున్నాడు. ఈయన ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న 100 మంది వ్యక్తులలో ఒకరని టైం మేగజైన్‌ ప్రకటిం చింది. భారత ప్రభుత్వం పద్మశ్రీతో సన్మానించింది.

ఇండియాలో అధిక శాతం ప్రజలు అల్పాదాయ వర్గాల వారే. వారికి మార్కెట్‌లో దొరికే ప్యాడ్లను కొనగలిగే స్థోమత ఉండదు. 2016లో చేసిన ఒక పరిశోధన ప్రకారం దేశంలో 84% అమ్మాయిలూ, 92.2% శాతం తల్లులూ ఇప్పటికీ నెలసరి సమయంలో గుడ్డని వాడుతున్నారు. వారిలో కొందరే ఆ గుడ్డని ఎండలో ఆరబెడుతున్నారు. ప్రభుత్వ సర్వే ప్రకారం మనదేశంలో కేవలం 12% మంది మాత్రమే ప్యాడ్‌లు వాడగలిగే స్థితిలో ఉండటం వలన 37.8% పెళ్లి కాని పిల్లలు యోని దగ్గర దురదతో, దుర్వాసనతో బాధపడుతున్నారు. స్త్రీలను అమితంగా బాధించే రీప్రొడక్టివ్‌ ట్రాక్ట్‌ ఇన్‌ఫెక్షన్‌ (ఆర్‌టీఐ)కి, సర్వైకల్‌ కేన్సర్‌కు 70% కారణం నెలసరి సమయంలో శుభ్రమైన ప్యాడ్‌లు వాడకపోవడమేనని 97% మంది గైనకాలజిస్టులు AC నీల్సన్‌ సర్వేలో చెప్పారు.

మహిళలకు ఏమీ చేయడంలేదనిపించుకోకుండా ప్రభుత్వం 2011లో రుతు సంబంధమైన శుభ్రతా పథకం (ఎమ్‌హెచ్‌ఎస్‌)ని ప్రారంభించి, 100 కోట్లను కేటాయించింది. అయితే ఈ కార్యక్రమం గురించి నెల్లూరు జిల్లాలో ఒక ఆశా వర్కర్‌ని అడిగినపుడు ఆమె తన అనుభవాలను పంచుకున్నది. రెండేళ్ల క్రితం ఒకే ఒకసారి రాష్ట్రీయ కిశోర్‌ స్వాస్థ్య కార్యక్రమం క్రింద (ఆర్‌కెఎస్‌కె) గ్రామాలలో ప్యాడ్‌లు పంచడం జరిగిందట. ప్యాకెట్టు విలువ రూ. 6లు. అందులో ఆశా వర్కర్‌కి రూపాయి. మరి గ్రామాలలో స్పందన ఎలా ఉండింది అంటే ''చాలా బాగుండిందమ్మా. రేటు తక్కువ కాబట్టి 'కౌమార బాలికలు' ఉత్సాహంగా కొన్నారు'' అన్నది. 'కానీ అంత రేటు పెట్టి కొనగలిగే స్థోమత తమకు లేద'ని 83% మంది దిగువ తరగతి వారు తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు.

ఆడవారి రుతుస్రావం చుట్టూ నొప్పుల బాధలు ప్రకృతి ఎలాగూ పెట్టింది. అది కాక రోగాలు రాకుండా శుభ్రతను పాటించాలంటే నెలనెలా ఖర్చు పెట్టాల్సి రావడం చాలామందికి స్థోమతకు మించిన బాధ. అలాంటిది ప్రభుత్వం సానిటరీ ప్యాడ్‌లను 12% జీఎస్టీలోకి నెట్టడం ఇంకా బాధాకరం. ఢిల్లీ జేఎన్‌యూ విద్యార్థిని జర్మినా ఇస్రార్‌ ఖాన్‌ గత ఏడాది ఈ 12% ట్యాక్స్‌ రాజ్యాంగ విరుద్ధమూ, అన్యాయమూ అని ఢిల్లీ కోర్టులో కేసు వేసినా ప్రభుత్వం చలించలేదు. ప్యాడ్‌లను ట్యాక్స్‌ ఫ్రీ చేయాలనే డిమాండ్‌కి స్పందిస్తూ అరుణ్‌జైట్లీ '12 శాతాన్ని తగ్గించినట్లయితే... భారతీయ ఉత్పత్తిదారులు ఎవరూ మిగలరు' అని వ్యాపార సూత్రాన్ని చెప్పారు. ఈ జనవరి 22న సుప్రీం కోర్టు ముంబై ఢిల్లీ కోర్టులలో ఉన్న ఈ కేసు ప్రొసీడింగ్స్‌పై స్టే విధించి, దీన్ని తన పరిధిలోకి తీసుకోవడంపై పరిశీలిస్తానని పేర్కొన్నది.

'తాగునీరు, పారిశుధ్య మంత్రిత్వ శాఖ' వారు 2015లో విడుదల చేసిన 'రుతుసంబంధమైన ఆరోగ్య నిర్వహణ మార్గదర్శకాలు' చదువుతూ, నేను నా కూతుర్ని 'మీ స్కూల్‌ లో ప్యాడ్స్‌ ఎలా వాడాలో ఎప్పుడన్నా చెప్పారమ్మా' అని అడిగాను. నా కూతురు 'అవంతా చెప్పలేదమ్మా, ఎక్కడ పడేయాలో మాత్రం చెప్పారు అంటూనే, ఆ.. ఇంకా మేల్‌ స్టాఫ్‌తో మాట్లాడొద్దని కూడా చెప్పారమ్మా' అన్నది. ఆడపిల్లల్ని మగవాళ్ళకి దూరంగా ఉంచి పద్ధతిగా పెంచడంలో ఉండేంత శ్రద్ధ.. వాళ్ల బడి వాళ్లకు ఆ పిల్లల శుభ్రత మీద లేదు. దీని వెనుకనున్న భావజాలం పేరు పితృస్వామ్యం. ప్రభుత్వం బొట్టు, గాజులు, పారాణి వంటి సౌభాగ్య చిహ్నాలను అడగకుండానే ట్యాక్స్‌ ఫ్రీ చేసింది కానీ, స్త్రీలు నోరు తెరిచి అడిగినా ప్యాడ్‌లను ట్యాక్స్‌ ఫ్రీ చేయకుండా భీష్మించుకున్నది. పాలకుల పురుషస్వామ్య దృక్పథానికి ఇది నిదర్శన. దీపికా వంటి సెలెబ్రిటీలు ప్యాడ్‌ మ్యాన్‌ చాలెంజ్‌ తీసుకోవాల్సింది, ప్యాడ్‌ని ప్రదర్శించడానికి కాదు, వీటన్నిటి గురించీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి తీసుకోవాలి, అప్పుడే అరుణాచలంపై సినిమాకి ఒక అర్థం ఉంటుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి । 80196 00900

ప్రేమతో మీ.. ఎవా!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిని ఓ చిన్నారి రాసిన లేఖ కదిలించింది. విద్యార్థుల ప్రాణాలు తీస్తున్న గన్ కల్చర్‌పై ఆందోళన వ్యక్తం చేస్తూ ఏడేళ్ల చిన్నారి రాసిన ఓ ఉత్తరం దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులను స్పందింపజేసింది. తన క్లాస్‌మేట్, పెద్దయ్యాక తాను పెళ్లి చేసుకోవాలనుకున్న ఆప్త మిత్రుడు.. స్కూల్ వద్ద ఓ ఉన్మాది కాల్పుల్లో చనిపోవడంతో.. తట్టుకోలేని బాధతో అధ్యక్షుడికి లేఖ రాసింది. అందులో విద్యార్థుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలనూ వివరించింది. అయితే, అనూహ్యంగా ట్రంప్ నుంచి 'నీ బాధను నేనూ పంచుకుంటున్నానం'టూ సమాధానం రావడంతో.. సంభ్రమాశ్చర్యాలకు లోనైంది. ఆ వివరాలు..

ఒకడు నా జీవితాన్ని నాశనం చేశాడు. నా ప్రియమిత్రుడిని చంపేశాడు • అమెరికా అధ్యక్షుడికి ఓ చిన్నారి లేఖ

సెప్టెంబర్ 28, 2016.. దక్షిణ కరోలినాలోని టౌన్‌విల్లేలోని ఎలిమెంటరీ స్కూలు విద్యార్థిని ఎవా ఓల్సెన్ (అప్పుడు ఆరేళ్లు) ఇంటికెళ్లేందుకు స్కూలు బయట నిలబడింది. అంతలోనే అదే పాఠశాల విద్యార్థి.. స్కూల్ గ్రౌండ్‌లోకి కార్లో వచ్చి.. తుపాకీతో విచ్చలవిడిగా కాల్పులు జరిపాడు. ఇందులో ఎవా ప్రాణమిత్రుడు జాకబ్ హాల్ చనిపోయాడు. దీంతో ఎవా తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. తరగతి గదుల్లో, క్యాంటీన్‌లలో, మైదానాల్లో ఉండే విద్యార్థుల గురించే ఆమె ఎప్పుడూ ఆందోళన చెందేది. ఓ రోజు నోట్‌బుక్కు, పెన్సిల్ తీసుకుని రాయటం మొదలుపెట్టింది.

మిస్టర్ ప్రెసిడెంట్

'డియర్ మిస్టర్ ప్రెసిడెంట్' అని రాయటం మొదలుపెట్టింది. పాఠశాల కాల్పుల ఘటనను కళ్లకు కట్టినట్లు వివరించింది. 'నాకు చాలా భయమేసింది. నా ఆప్తమిత్రుడు జాకబ్ కూడా కాల్పులకు బలయ్యాడు. జాకబ్ అంటే నాకు చాలా ఇష్టం. పెద్దయ్యాక అతన్నే పెళ్లి చేసుకోవాలనుకున్నా. నాకు తుపాకులంటే అసహ్యం. ఎవడో ఒకడు నా జీవితాన్ని నాశనం చేశాడు. నా ప్రియమిత్రుడిని చంపేశాడు' అని లేఖలో పేర్కొంది. పాఠశాలల్లో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా మీరెలా చిన్నారులను కాపాడతారని ప్రశ్నించింది. 'ప్లీజ్.. చిన్నారులను తుపాకుల నుంచి కాపాడండి' అని రాసి ఉత్తరాన్ని ముగించింది.



జవాబొచ్చింది: 2017 క్రిస్మస్ తర్వాతి రోజు.. ఎవా ఇంటికి ఓ లేఖ వచ్చింది. ఆ లేఖ కుడివైపు పైన 'ద వైట్ హౌజ్' అని రాసి ఉండటం చూసి ఎవా తల్లి మేరీ ఓల్సెన్ ఆశ్చర్యానికి గురయ్యారు. 'ప్రియమైన ఎవా.. మీ లేఖకు కృతజ్ఞతలు. మీ బాధను మాతో ధైర్యంగా పంచుకున్నందుకు అభినందిస్తున్నా. ఈ పీడకలలో మీ ప్రియమిత్రుడిని కోల్పోవటం మాకూ బాధ కలిగించింది. ఆందోళన చెందవద్దు. మెలానియా ట్రంప్, నేను.. నీతో, నీ తల్లిదండ్రులతో, నీ తోటివిద్యార్థుల వెంటే ఉంటాం' అని లేఖలో ఉంది. 'పిల్లలు తమ స్నేహితుల నుంచి నేర్చుకుని జీవితంలో పైకి ఎదిగేందుకు పాఠశాలలు సరైన వేదిక. అమెరికాలో విద్యార్థులు భద్రమైన వాతావరణంలో పెరిగేలా చూడటం అధ్యక్షుడిగా నా బాధ్యత. నిన్ను ప్రేమించేవారు, నీ కలలను సాకారం చేసుకోవటంలో ప్రోత్సహించేవారు జీవితంలో చాలా మంది ఉన్నారు. వారిని గుర్తుతెచ్చుకో' అని లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. ఈ లేఖ చూసి ఎవా హర్షం వ్యక్తం చేసింది. సమాధానం ఇచ్చినందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు చెబుతూనే మరో లేఖ రాసింది. 'మీరు సమయమిస్తే.. పిల్లలు, పాఠశాలలను భద్రంగా ఎలా ఉంచవచ్చనే ఐడియాలు నాదగ్గరున్నాయి. పాఠశాలలను భద్రమైన ప్రాంతాలకు తరలించాలి. అనుకోని ఘటనలు జరిగినపుడు తప్పించుకునేందుకు వీలుగా ఏర్పాట్లుండాలి. మైదానం మధ్యలో ఉండి చుట్టూ పాఠశాల నిర్మించాలి' అని లేఖలో పేర్కొంది.



సోమవారం ఢిల్లీలోని తమ నివాసంలో ప్రపంచ సుందరి మానుషి ఛిల్లర్‌ను సత్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య దంపతులు

ముస్లింలపై కోర్టు పక్షపాతంతో వ్యవహరిస్తోంది

పారిస్ ఉగ్రదాడి నిందితుడి ఆరోపణ

బ్రస్సెల్స్: బెల్జియన్ కోర్టు ముస్లింపై పక్షపాతంతో వ్యవహరిస్తోందని 2015 పారిస్ ఉగ్రదాడికి కారకులైనవారిలో ప్రాణాలతో ఉన్న ఏకైన నిందితుడు సలాహ్ అబ్దెస్లామ్(28) సోమవారం ఆరోపించాడు. తాను అల్లాపై మాత్రమే నమ్మకం ఉంచినట్లు వెల్లడించాడు. విచారణ సందర్భంగా న్యాయమూర్తికి జవాబివ్వడానికి కోర్టులో నిల్చునేందుకు కూడా అతను నిరాకరించాడు. 2016లో అదుపులోకి తీసుకున్న తర్వాత సలాహ్‌ను ఫ్రాన్స్ నుంచి బ్రస్సెల్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే. విచారణ సదర్భంగా నిందితుడు మాట్లాడుతూ.. 'నేను మౌనంగా ఉన్నది నేరం చేసినందుకు కాదు. ఇది నాకున్న రక్షణ మాత్రమే. ముస్లింలతో చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. నేను మీకూ, మీ మిత్రులకు భయపడటం లేదు' అని కోర్టుకు తెలిపాడు.

ప్రవాస భారతీయుడికి రూ.17.5 కోట్ల లాటరీ



దుబాయ్: అబుదాబిలో నివసిస్తున్న ప్రవాస భారతీయుడికి జాక్‌పాట్ తగిలింది. అతని లాటరీ టికెట్‌కు సుమారు రూ.17.5 కోట్లు వచ్చాయి. కేరళకు చెందిన సునీల్ మప్పట్టా కృష్ణన్ కుట్టి నాయర్ లాటరీలో 10 మిలియన్ల దిర్హామ్‌లు గెలుచుకున్నాడని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ నగదు మొత్తాన్ని నాయర్ తన ముగ్గురు స్నేహితులతో పంచుకోనున్నారని టికెట్ ధరలో కొంత మొత్తం ఇచ్చిన అతని కొలీగ్ తెలిపాడు.

బ్రిటన్ వర్సిటీలకు భారీగా దరఖాస్తులు

లండన్: బ్రిటన్‌లోని విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించేందుకు ఈ ఏడాది పెద్దమొత్తంలో భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి భారతీయ విద్యార్థుల దరఖాస్తులు 36శాతం పెరిగినట్లు సోమవారం వెల్లడైన గణాంకాల్లో తేలింది. ఈ ఏడాది యురోపియన్ యూనియన్(ఈయూ), ఇతర దేశాల నుంచి ఏకంగా లక్షకుపైగా దరఖాస్తులు వచ్చాయని యూనివర్సిటీస్ అండ్ కాలేజీస్ అడ్మిషన్స్ సర్వీస్(యూసీఏఎస్) ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ డైరెక్టర్ హెలెన్ థోర్న్ చెప్పారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి ఈయూ విద్యార్థుల దరఖాస్తులు 3.4 శాతం పెరగ్గా, ఇతర దేశస్తుల దరఖాస్తులు 11శాతం ఎక్కువయ్యాయి. అందరికంటే ఎక్కువగా చైనా నుంచి 11,920 దరఖాస్తులు వచ్చాయి.

ఆ ఈవీఎంలను ఎవరికీ అమ్మొద్దు..!




న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల అమ్మకానికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్(బీఈఎల్), ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)లకు జారీ చేసిన ఆదేశాలు వివాదాస్పదమయ్యాయి. తమ కోసం రూపొందించిన ఈవీఎంలను రాష్ట్రాల ఎన్నికల సంఘాలకు (ఎస్ఈసీ) కానీ, విదేశీ ఎన్నికల నిర్వహణ సంస్థలకు కానీ తమ అనుమతి లేకుండా అమ్మకూడదని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆ రెండు సంస్థలకు 2017, మే 27న ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. 'మా సాంకేతిక నిపుణుల కమిటీ ఆమోదించిన ఈవీఎంలను మా అనుమతి లేకుండా వేరే ఎవరికీ అమ్మకూడదం'టూ ఆ సర్క్యులర్‌లో స్పష్టంగా పేర్కొంది. రాష్ట్రాల ఎన్నికల సంఘాలు, విదేశీ సంస్థల కోసం అవసరమైతే వేరే డిజైన్ ఈవీఎంలను రూపొందించాలంది. అయితే, ఈ ఆదేశాలపై గత నవంబర్‌లో జరిగిన స్టేట్ ఎలక్షన్ కమిషనర్ల జాతీయ సదస్సులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనట్లు ఒక సమాచార హక్కు విజ్ఞాపన ద్వారా వెల్లడైంది. ఈ విషయాన్ని ఈసీతో చర్చించాలని చివరకు నిర్ణయించారు. ఈసీఐ, ఎస్ఈసీ.. రెండూ కూడా ఈసీఐఎల్, బీఈఎల్ సంస్థల నుంచే ఈవీఎంలను కొనుగోలు చేస్తాయి.

మాల్దీవుల్లో అత్యవసర స్థితి

మాలే: రాజకీయ సంక్షోభం నెలకొన్న మాల్దీవుల్లో అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ సోమవారం అత్యవసర స్థితి విధించారు. దీంతో భద్రతా దళాలకు విశేషాధికారాలు సంక్రమిస్తాయి. అనుమానితులను వారు అరెస్ట్ చేయొచ్చు. నిర్బంధించొచ్చు. 15 రోజులపాటు అత్యవసర స్థితి అమలులో ఉంటుందని యమీన్ వ్యక్తిగత కార్యదర్శి అజిమా ప్రభుత్వ టీవీ చానల్ ద్వారా ప్రకటించారు. 9 మంది అసమ్మతి నేతలను జైలు నుంచి విడుదల చేయాలని మాల్దీవుల సుప్రీంకోర్టు గత గురువారం ఆదేశించడం, ఇందుకు యమీన్ నిరాకరిస్తున్న నేపథ్యంలో దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొంది. తీర్పును వెనక్కు తీసుకోవాలంటూ యమీన్ తాజాగా న్యాయమూర్తులకు లేఖ రాశారు. అత్యవసరమైతే తప్ప భారతీయులు కొన్నిరోజులు మాల్దీవులకు వెళ్లకూడదని భారత విదేశాంగ శాఖ సూచించింది.

నీతి ఆయోగ్ సీఈవో పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమితాబ్ కాంత్ పదవీకాలాన్ని వచ్చే ఏడాది జూన్ 30 వరకు పొడిగించారు. కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించడంతో అమితాబ్ పదవీకాలాన్ని పొడిగిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. కాలపరిమితి రెండేళ్లు ఉండే నీతి ఆయోగ్ సీఈవో పదవిని అమితాబ్ 2016 ఫిబ్రవరి 17న చేపట్టారు. నీతి ఆయోగ్‌లో పదవిచేపట్టకముందు ఆయన పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక విభాగం కార్యదర్శిగా పనిచేశారు. అమితాబ్ కేరళ కేడర్‌కు చెందిన 1980 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.

తొలిసారిగా మావో నేత ఆస్తుల అటాచ్‌మెంట్

న్యూఢిల్లీ: బిహార్‌లోఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఓ మావోయిస్టు కమాండర్‌కు చెందిన రూ.86 లక్షల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. మావోయిస్టు ఆస్తులను ఈడీ వంటి దర్యాప్తుసంస్థ అటాచ్ చేయడం దేశంలో ఇదే తొలిసారి. అవినీతి నిరోధక చట్టం కింద సందీప్ యాదవ్ అలియాస్ బడ్కా భయ్యా, అతని కుటుంబీకుల స్థిర, చరాస్తులను అటాచ్‌చేస్తూ ఈడీ ఆదేశాలిచ్చింది. యాదవ్ ప్రస్తుతం మావోయిస్టు బిహార్–జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ 'మధ్య జోన్' ఇన్‌చార్జిగా ఉన్నాడు. బిహార్‌లోని 5 ప్లాట్లను, ఢిల్లీలో ప్లాటు కొనుగోలుకు సంబంధించిన రూ.10.43 లక్షల నగదు, కొన్ని వాహనాలు, బ్యాంకు డిపాజిట్లను ఈడీ అటాచ్ చేసింది.

కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

- జీఎస్టీ కౌన్సిల్‌లో ఒకమాట.. పార్లమెంటులో మరోమాట
- నిరుద్యోగులుగా ఉండటం కంటే పకోడీలు అమ్ముకోవడం మంచిదే
- రాజ్యసభలో అమిత్ షా తొలి ప్రసంగం
- దేశంలో భయానక వాతావరణం నెలకొంది: ఆజాద్

న్యూఢిల్లీ: జీఎస్టీపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని.. జీఎస్టీ కౌన్సిల్‌లో ఒకలా.. పార్లమెంటులో మరోలా మాట్లాడుతోందని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆరోపించారు. నిరుద్యోగం, ఇతర సమస్యల పరిష్కారంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. రాజ్యసభలో తొలిసారి ఆయన ప్రసంగిస్తూ.. జీఎస్టీ అంటే 'గబ్బర్‌సింగ్ ట్యాక్స్' కాదని, వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకం, పేదల సంక్షేమ పథకాలకు ఆ పన్ను ద్వారానే నిధులు వస్తున్నాయని షా పేర్కొన్నారు. కాంగ్రెస్ వల్లే నిరుద్యోగ సమస్య తీవ్రమైందని, నిరుద్యోగిగా ఉండటం కంటే పకోడీలు అమ్ముకోవడం మంచిదేనన్నారు. దాదాపు 90 నిమిషాలు సాగిన ప్రసంగంలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాల్ని ఏకరువు పెట్టారు.

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై షా చర్చను ప్రారంభిస్తూ.. జీఎస్టీతో దేశమంతా ఒకే పన్ను కల నిజమైందన్నారు. రాహుల్ గాంధీ చేసిన గబ్బర్ సింగ్ ట్యాక్స్ వ్యాఖ్యల్ని తప్పుపడుతూ 'షోలే సినిమాలో గబ్బర్ సింగ్ ఒక బందిపోటు. దేశంలో ఇప్పుడు దోపిడీ జరుగుతోందా..? చట్టబద్ధంగా ప్రజలు చెల్లించే పన్నులు దోపిడీ కింద లెక్కా? ఈ గబ్బర్ సింగ్ ట్యాక్స్ ఎక్కడికి పోతోంది. 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' కోసం జవాన్ల ఖాతాల్లోకి, అమరవీరుల భార్యల బ్యాంకు ఖాతాల్లోకి వెళ్తోంది. పేద మహిళలకు వంట గ్యాస్ ఇచ్చేందుకు ఉజ్వల యోజన కోసం ఖర్చవుతోంది' అని చెప్పారు. కొన్ని అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని షా సూచించారు. 'కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు జీఎస్టీని వ్యతిరేకించాయని చెపుతున్నారు. అది నిజం కాదు.



రాజ్యసభలో మాట్లాడుతున్న బీజేపీ నేత అమిత్. చిత్రంలో ప్రధాని మోదీ

బీజేపీ ఎప్పుడూ జీఎస్టీని వ్యతిరేకించలేదు. కేవలం కొన్ని అంశాల్ని మాత్రమే వ్యతిరేకించింది. కాంగ్రెస్ మాత్రం జీఎస్టీ మండలి సమావేశాల్లో ఒకవిధంగా.. పార్లమెంటులో మరో విధంగా మాట్లాడుతోంది. జీఎస్టీ మండలి సమావేశాల వివరాల్ని బహిర్గతం చేయమంటారా?' అని ప్రశ్నించారు.

8 ఏళ్లు సరిపోదు..

నిరుద్యోగులుగా ఉండే కంటే బతకడం కోసం యువత పకోడాలు అమ్ముకోవడం మంచిదేనని షా పేర్కొన్నారు. 'పకోడాలు చేయడం సిగ్గుచేటేమీ కాదు. అలాంటి వ్యక్తిని బిక్షగాడితో పోల్చడమే సిగ్గుపడాల్సిన విషయం' అని చెప్పారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడుతూ.. పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగ కల్పనేనని చెప్పిన సంగతి తెలిసిందే. '55 ఏళ్ల కాంగ్రెస్ పాలన అనంతరం నిరుద్యోగ సమస్య కొనసాగడంతో పాటు మరింత తీవ్రమైంది. దీని పరిష్కారానికి 8 ఏళ్ల (ఎన్డీఏ పాలన) సమయం సరిపోదు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి స్కిల్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ముద్రా పథకాల్ని ప్రవేశపెట్టాం' అని షా వెల్లడించారు. బడ్జెట్‌లో ప్రకటించిన ఆయుష్మాన్ భారత్ పథకం(మోదీ కేర్) గురించి మాట్లాడుతూ.. ఇంత భారీ స్థాయిలో పథకాన్ని ప్రవేశపెట్టేందుకు ఏ ప్రభుత్వమూ సాహసించలేదని అన్నారు. ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదానికి సహకరించాలని కాంగ్రెస్‌ను కోరారు.

విపక్షాల ఫోన్లు ట్యాపింగ్: ఆజాద్

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల్లోనే కాకుండా అధికారులు, ప్రతిపక్ష నేతల్లో భయానక వాతావరణ సృష్టిస్తోందని ఆరోపించారు. 'దేశంలో భయానక వాతావరణం ఉంది. ప్రతిపక్షంతో మాట్లాడటానికి, సంప్రదింపులకు ఎవరైనా భయపడుతుంటే అది ప్రజాస్వామ్యానికి, వాక్ స్వాతంత్ర్యానికి మంచిది కాదు. ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారు' అని పేర్కొన్నారు. దేశాన్ని రెండు వర్గాలుగా విడగొట్టడమే కాకుండా.. ప్రతిపక్షాల్ని వేరు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, సీబీఐ, ఈడీల్ని ఉపయోగించి ప్రతిపక్షాల్ని భయపెడుతోందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ, ఎన్సీపీ, లెఫ్ట్ పార్టీలు 324 సవరణల్ని సూచించాయి.

'యాంటీ బయాటిక్' బాంబు!

భారత్‌లో 63% డ్రగ్స్ అమ్మకాలకు అనుమతి లేదు: లండన్ పరిశోధకులు



లండన్: బహుళజాతి ఫార్మాసూటికల్ సంస్థలు ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే మిలియన్లకొద్దీ యాంటీ బయాటిక్స్‌ను భారత్‌లో అమ్ముతున్నాయని ఓ అధ్యయనంలో తేలింది. వీటిని విచ్చలవిడిగా వాడటం ద్వారా వ్యాధికారక సూక్ష్మజీవులు యాంటి బయాటిక్స్‌ను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయని బ్రిటన్‌లోని క్వీన్ మేరీ వర్సిటీ ఆఫ్ లండన్ పరిశోధకులు తెలిపారు. బహుళజాతి ఫార్మా కంపెనీలు భారత్‌లో ఇష్టానుసారంగా యాంటీ బయాటిక్స్‌ను ఉత్పత్తి చేయకుండా నిలువరించడంలో ఔషధ నియంత్రణ సంస్థలు విఫలమయ్యాయన్నారు. ఈ అధ్యయనంలో భాగంగా 2007 నుంచి 2012 వరకూ భారత ఔషధ నియంత్రణ సంస్థ రికార్డులతో పాటు దేశవ్యాప్తంగా యాంటీ బయాటిక్స్ అమ్మకాల వివరాలను సేకరించినట్లు పరిశోధనలో పాల్గొన్న మెక్‌గెట్టిగన్ తెలిపారు. భారత్‌లో 118 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్స్ (ఎఫ్‌డీసీ)ను అమ్ముతున్నట్లు వెల్లడించారు. ఈ సంఖ్య అమెరికా, బ్రిటన్‌లలో కేవలం ఐదుగానే ఉందన్నారు. మొత్తం 118 రకాల ఎఫ్‌డీసీల్లో 63 శాతం డ్రగ్స్‌ను ఎలాంటి అనుమతులు లేకుండానే భారత్‌లో అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఇందుకు విరుద్ధంగా మొత్తం 86 సింగిల్ డ్రగ్ ఫార్ములేషన్(ఎస్‌డీఎఫ్)ల్లో 93 శాతం మందులకు ఔషధ నియంత్రణ సంస్థ అనుమతి ఉందన్నారు.

ప్రతీకారం తీర్చుకుంటాం

నలుగురు జవాన్ల మృతిపై ఆర్మీ

న్యూఢిల్లీ/చండీగఢ్: పూంచ్, రాజౌరీ జిల్లాల్లో ఆదివారం నాటి పాక్ కాల్పుల్లో నలుగురు సైనికులు చనిపోయినందుకు ప్రతీకారం తీర్చుకుంటామని ఆర్మీ సోమవారం స్పష్టమైన సంకేతాలిచ్చింది. ఆర్మీ వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ శరత్ చంద్ మాట్లాడుతూ 'పాక్ కాల్పులకు సైన్యం తగిన రీతిన సమాధానమిస్తూ వస్తోంది. ఇది ఇకపై కూడా కొనసాగుతుంది. అది నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చేసి చూపిస్తాం' అని అన్నారు. పాక్ కాల్పుల్లో కెప్టెన్ కపిల్ కుందు (22)తోపాటు మరో ముగ్గురు జవాన్లు మరణించడం తెలిసిందే. పాక్ మూర్ఖపు చర్యకు భారత్ తిరిగి సమాధానమిస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ కూడా అన్నారు.



ఢిల్లీలో కెప్టెన్ కపిల్ మృతదేహం వద్ద రోదిస్తున్న ఆయన సోదరి

సాహసాలంటే ఇష్టం: పాక్ కాల్పుల్లో ఆదివారం అమరుడైన కెప్టెన్ కపిల్ కుందు (22) భౌతిక కాయానికి ఢిల్లీలోని పాలం వైమానిక స్థావరంలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ నివాళులర్పించారు. అనంతరం భౌతిక కాయాన్ని కుందు స్వగ్రామమైన గుర్గావ్ సమీపంలోని పటౌడీకి తరలించారు. కుందు మృతితో ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఫిబ్రవరి 10న పుట్టినరోజు సందర్భంగా ఇంటికి వస్తానని కుందు తమకు చెప్పాడనీ, ఇంతలోనే ఘోరం జరిగిందని ఆయన తల్లి సునీత, సోదరిలు విలపిస్తున్నారు. కుందు స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి భారత దళాలు ప్రతీకారం తీర్చుకోవాలంటూ స్థానికులు నినాదాలు చేశారు. కుందుకు సాహసాలతో కూడిన జీవితమంటే ఇష్టమనీ, అందుకే ఆర్మీలో చేరాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తనకు మరో కొడుకు ఉంటే అతణ్నీ ఆర్మీకి పంపి ఉండేదాన్ననీ, కుందు సైన్యంలో చేరిన తర్వాత చాలా సంతోషంగా ఉండేవాడని సునీత చెప్పారు. తన కొడుకు ఎప్పుడూ దేశం కోసమే బతికాడన్నారు.

ఆ హక్కు మీకు లేదు!

- సామాజిక నైతికత కాపాడే బాధ్యత మీది కాదు
- ఖాప్ పంచాయతీలపై మండిపడ్డ సుప్రీం



న్యూఢిల్లీ: సమాజంలో నైతికతను కాపాడటమే తమ బాధ్యతనే విధంగా ఖాప్ పంచాయతీలు వ్యవహరించ కూడదని సుప్రీం కోర్టు మండిపడింది. ఇద్దరు మేజర్ల వివాహాన్ని చట్టమే నిర్ధారిస్తుందని పేర్కొంది. వివాహాల విషయంలో ఖాప్ పంచాయతీల జోక్యంపై విచారించేందుకు సీనియర్ పోలీసు అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేయనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది. 'ఓ పెళ్లి సరైనదా? కాదా? అనే అంశాన్ని చట్టమే నిర్ణయిస్తుంది. తదనుగుణంగా చర్యలు తీసుకుంటుంది. కానీ మీరు (ఖాప్ పంచాయతీలు) సమాజంలో నైతికతను కాపాడాల్సిన పని లేదు' అని ధర్మాసనం పేర్కొంది. పరువు హత్యలపై 'శక్తి వాహిని' అనే ఎన్జీవో వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది. 'ఖాప్‌లు కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నాయి. అయితే.. హిందూ వివాహ చట్టం ప్రకారం ఒకే కుటుంబానికి (సపిండ) చెందిన వారు పెళ్లిచేసుకోకూడదు. సమాజంలో నైతిక విలువలను కాపాడేలా ఖాప్ పంచాయతీలు పనిచేస్తున్నాయి' అని ఖాప్ పంచాయతీ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు: దీనిపై సుప్రీం స్పందిస్తూ.. 'ఇద్దరు యువతీ యువకుల మధ్య పెళ్లి వారి వ్యక్తిగతం. దీనిపై చట్టాన్ని మీరు చేతుల్లోకి తీసుకోకూడదు. ఈ విషయాలపై ఖాప్‌కు ఎలాంటి సంబంధం ఉండదు' అని పేర్కొంది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

796 శాతం పెరిగిన పరువు హత్యలు!

2014–15లో పరువు హత్యలు దేశవ్యాప్తంగా 796 శాతం పెరిగాయి. 2014లో 28 పరువు హత్యల ఘటనలు చోటుచేసుకోగా.. 2015లో ఈ సంఖ్య 251కి పెరిగింది. ఈ జాబితాలో గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు నాలుగైదు స్థానాల్లో ఉన్నాయని జాతీయ నేర గణాంక సంస్థ వెల్లడించింది. పది పదిహేను మంది సభ్యులుండే ఖాప్ పంచాయతీలు కోర్టులకు చేరని తమ సామాజికవర్గానికి చెందిన గొడవలను విచారణ ద్వారా పరిష్కరిస్తాయి.

పశ్చిమాసియాతో బంధం కోసం..

9 నుంచి పాలస్తీనా, యూఏఈ, ఒమన్‌లలో మోదీ పర్యటన



న్యూఢిల్లీ, దుబాయ్: రక్షణ, అంతర్గత భద్రత, ఉగ్రవాద నిరోధం తదితర అంశాల్లో సహకారాన్ని మరింత పెంచుకునే దిశగా ప్రధాని మోదీ పశ్చిమాసియా పర్యటన ఉంటుందని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నెల 9 నుంచి 12 వరకూ పాలస్తీనా, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ), ఒమన్‌లో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. దుబాయ్‌లో జరిగే ఆరో వరల్డ్ గవర్న్‌మెంట్ సదస్సులో ప్రసంగించడంతో పాటు ఒపేరా హౌస్‌లో జరిగే కార్యక్రమంలో అక్కడి భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడతారు. అలాగే అబుదాబి, దుబాయ్ నగరాల మధ్య హిందూ దేవాలయం నిర్మాణానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోదీ శంకుస్థాపన చేస్తారు. ఒమన్ పర్యటనలో భాగంగా మస్కట్‌లోని 200 ఏళ్ల శివాలయాన్ని, సుల్తాన్ ఖబూస్ గ్రాండ్ మసీదును సందర్శిస్తారని విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి (గల్ఫ్) మృదుల్ కుమార్ చెప్పారు. మూడు దేశాలతో సాగే చర్చల్లో ఉగ్రవాద నిరోధం చాలా కీలక అంశంగా ఉంటుందని పేర్కొన్నారు. యూఏఈతో చర్చల సందర్భంగా భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీంకు చెక్ పెట్టే అంశాన్ని ప్రస్తావిస్తారా? అని ప్రశ్నించగా.. ఉగ్రవాద నిరోధంపై చర్చలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. భౌగోళికంగా ఒమన్‌తో సత్సంబంధాలు భారత్‌కు చాలా ముఖ్యమన్నారు. ఉగ్రపోరులో పాలస్తీనా కీలక భాగస్వామని మరో సంయుక్త కార్యదర్శి బాల భాస్కర్ చెప్పారు.



1,142 ఎన్‌కౌంటర్లు

- నేరస్తులపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉక్కుపాదం
- పోలీస్ కాల్పుల్లో 34 మంది క్రిమినల్స్ హతం
- ఇద్దరు పౌరుల ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న నేరస్తులపై యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. గత మార్చిలో యోగి సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 2018, జనవరి 31 వరకూ యూపీలో 1,142 ఎన్‌కౌంటర్లు జరిగినట్లు పోలీసులు ఓ నివేదిక విడుదల చేశారు. ఈ కాల్పుల్లో 34 మంది నేరస్తులు ప్రాణాలు కోల్పోగా, 265 మంది గాయపడ్డారు. గత 10 నెలల్లో 2,744 మంది హిస్టరీ షీటర్ల(నేర చరిత్ర ఉన్నవారు)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్లలో నలుగురు పోలీస్ సిబ్బంది చనిపోగా, 247 మంది గాయపడ్డారు. రాష్ట్రంలో నేరస్తులను ఏరివేయడానికి పోలీసులకు సీఎం యోగి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో 'ఆపరేషన్ క్లీన్' పేరిట పరారీలో ఉన్న నేరస్తుల కోసం వేట మొదలైందన్నారు. 'లొంగిపోండి లేదా రాష్ట్రం విడిచివెళ్లిపోండి' అని నేరస్తులకు ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. మీరట్ జోన్‌లో పోలీసులు అత్యధికంగా 449 ఎన్‌కౌంటర్లు చేయగా, ఆ తర్వాతి స్థానాల్లో ఆగ్రా(210), బరేలీ(196), కాన్పూర్(91) జోన్లు నిలిచాయన్నారు. సీఎం యోగి నియోజకవర్గమైన గోరఖ్‌పూర్ జోన్‌లో(31) అతితక్కువ ఎన్‌కౌంటర్లు జరిగినట్లు వెల్లడించారు. దీంతోపాటు రాష్ట్రంలో నేరాలను అరికట్టడానికి 167 మంది క్రిమినల్స్‌పై జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద కేసు నమోదు చేయడంతో పాటు రూ.150 కోట్ల విలువైన ఆస్తుల్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఎన్‌కౌంటర్ ముసుగులో సామాన్య పౌరుల్ని పోలీసులు కాల్చిచంపడంపై యూపీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నోయిడాలోని ఓ జిమ్ యాజమానితో పాటు మరో వ్యక్తిని పోలీసులు కాల్చిచంపడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) యూపీ ప్రభుత్వానికి ఇప్పటికే నోటీసులు సైతం జారీ చేసింది. ఈ ఎన్‌కౌంటర్లపై సరైన ప్రభుత్వ పర్యవేక్షణ లేకుంటే 1991 నాటి పిలిభిత్ నకిలీ ఎన్‌కౌంటర్ లాంటి ఘటనలు పునరావృతమవుతాయని పలువురు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. 1991లో ప్రైవేటు బస్సులో ఓ పుణ్యక్షేత్రానికి వెళ్లివస్తున్న 10 మంది సిక్కుల్ని యూపీ పోలీసులు నకిలీ ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. వీరిందరూ పాకిస్తాన్ ప్రోద్బలం ఉన్న ఖలిస్తానీ తీవ్రవాదులని బుకాయించారు. ఈ కేసును విచారించిన ప్రత్యేక సీబీఐ కోర్టు 2016లో 47 మంది పోలీస్ అధికారుల్ని దోషులుగా తేల్చింది. ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి రాజేంద్ర చౌధరీ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం నేరాలను తగ్గించడంలో విఫలమై ఎన్‌కౌంటర్ల ముసుగులో తన అసమర్థతను కప్పిపుచ్చుకుంటోంది' అని అన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర



బుచ్చిరెడ్డిపాళెంలో అశేష జనవాహిని మధ్య అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న జగన్



జొన్నవాడలో పెన్నావంతెనపై జగన్‌తోపాటు పాదయాత్రలో నడుస్తున్న అశేష జనవాహిని

అన్ని కులాలకూ కార్పొరేషన్లు

బుచ్చిరెడ్డిపాళెం సభలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'సమాజంలోని ప్రతి కులంలోనూ పేదరికం ఉంది. పేదరికానికి కులం, మతం లేదు. మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికీ తోడుగా ఉండేందుకు వీలైనంత వరకూ ప్రతి కులానికీ ఒక కార్పొరేషన్‌ను తీసుకు వస్తాం. కమ్మ, రెడ్డి, క్షత్రియ కులాల వారికి కూడా ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తాం' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కులాల్లోనూ పేదరికంలో ఉంటూ చదువుకుంటున్న పిల్లలు ఉన్నారని, వారికి తక్కువ వడ్డీకో.. వడ్డీ లేకుండానో రుణాలు వస్తే బాగు పడతారన్నారు. తద్వారా ఆర్థిక వ్యవస్థ కూడా బాగు పడుతుందని చెప్పారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 80వ రోజు సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు శాసనసభ నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'ఆదివారం జరిగిన ఆర్య వైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని బయటకు వచ్చి కొద్ది సేపు నడవగా ఓ చిన్నపాప నా దగ్గరకు వచ్చింది. అన్నా.. మేం ఓసీలమన్నా.. అందరికీ కార్పొరేషన్లు పెడతామని మీరు చెబుతున్నారన్నా.. ఇక మిగిలిపోయిందల్లా రెడ్లు, కమ్మ, క్షత్రియులు మాత్రమేనన్నా.. మాలో కూడా చాలా మంది పేదవాళ్లు ఉన్నారన్నా.. మా కోసం కూడా ఒక కార్పొరేషన్ పెడితే మాకు కూడా రుణాలు వచ్చే అవకాశం ఉంటుంది కదన్నా.. అని అడిగింది. అంతకు ముందు నేను అక్కడ మాట్లాడినదంతా ఆ చిట్టి తల్లి జాగ్రత్తగా విన్న తర్వాత నాకు సూచనలు ఇచ్చేందుకు నా వద్దకు వచ్చి ఈ మాటలంది. ఆమె మాటలు నిజంగా నన్ను నిన్నటి (ఆదివారం) నుంచి కదిలించేస్తున్నాయి. ఒక కులం కోసం కార్పొరేషన్లు అనేవి ఎందుకు ఏర్పాటు చేస్తారంటే.. ఆ కులంలోని పేదలకు పావలా వడ్డీకో లేదా వడ్డీ లేకుండానో రుణాలు ఇవ్వడం కోసం.. ఆ రుణాలతో వారు కాస్తో కూస్తో బాగు పడతారనే ఉద్దేశంతో. ప్రతికులంలోనూ పేదరికం ఉంది. ఆ చిట్టి తల్లి నాకు చెప్పాక ఆమె కోసం చెబుతున్నాను.. వీలైనంత వరకు ప్రతి కులానికి ఒక కార్పొరేషన్‌ను తీసుకు వస్తామని మనవి చేస్తున్నాను' అన్నారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

కేంద్ర బడ్జెట్ చూసి చంద్రబాబు విలవిల్లాడాడట

''2014 నుంచి ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ.. తన ఎంపీలను కేంద్ర మంత్రివర్గంలో కొనసాగిస్తున్న చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఐదవ బడ్జెట్ చూశాక విలవిల్లాడాడట. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు కేంద్ర కేబినెట్ అంతా కూర్చుని దానిని ఆమోదిస్తుంది. వాస్తవం ఇలా ఉన్నప్పుడు చంద్రబాబు ఎందుకు గింజుకుంటున్నారు? అన్యాయం జరిగిందంటున్న ఆయన మాటలు వింటుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది. అన్యాయం జరిగిందని అంటున్నప్పుడు కేబినెట్‌లో నీ పార్టీ మంత్రులు ఎందుకు ఆమోదం తెలిపారు? నాలుగేళ్ల నిర్లక్ష్యంలా.. వినసొంపుగా ఇదే చంద్రబాబు విలపిస్తాడు. వినసొంపుగా! నాలుగేళ్లుగా బడ్జెట్ ప్రవేశపెట్టింది నీ మంత్రులు ఆమోదం తెలిపాకే కదా? మరో ఏడాదిలో ఎన్నికలు జరుగబోతున్నాయని ఈ పెద్ద మనిషికి ప్రజలు గుర్తుకొస్తారు. ప్రజలకు అన్యాయం జరిగిందని, ఈ అన్యాయం చేసింది ఆయనే అన్న సంగతి అప్పుడే గుర్తుకొస్తుంది. చంద్రబాబు మొసలి కన్నీరు చూశాక నాకో కథ గుర్తుకొస్తోంది.

అనగనగా ఓ ముద్దాయి..

కోర్టు బోనులో ఓ ముద్దాయిని నిలబెట్టారట. జడ్జి వచ్చాక 'అయ్యా.. తల్లీ దండ్రీ లేని వాణ్ని.. నాకు దిక్కెవరూ లేరు సార్. నన్ను విడిచిపెట్టండి సార్' అంటూ ఆ ముద్దాయి బిగ్గరగా ఏడుపు మొదలు పెట్టాడట. అది చూసిన జడ్జి అతన్ని ఎందుకు తెచ్చారు? ఏం తప్పు చేశాడని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అడిగాడట. అప్పుడాయన 'సార్.. ఇతనివన్నీ దొంగ ఏడుపులు. తల్లిదండ్రుల్ని అతడే చంపాడు. అందువల్లే బోనులో నిలబడ్డాడు' అని చెప్పాడట. సరిగ్గా చంద్రబాబు వైఖరి కూడా అదే విధంగా ఉంది. రాష్ట్రం విడిపోవడానికి చంద్రబాబే కారణం. ఆయనే లేకుంటే రాష్ట్రం కలిసికట్టుగానే ఉండేది. ప్రత్యేక హోదా రాకపోవడానికీ ఆయనే కారణం. ఆ రోజేమో ప్రత్యేక హోదా సంజీవని అన్నాడు. ఈ రోజేమో అదేమైనా సంజీవనా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. దుగరాజపట్నం పోర్టు కట్టాలని చట్టంలో ఉంటే, ఇవ్వకపోయినా ఫర్వాలేదని చెప్పాడు. ఆంధ్రుల ఆశాజ్యోతి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చంద్రబాబు తీసుకుంటున్న లంచాల పుణ్యాన అధ్వానంగా అఘోరించింది. ఇన్ని పాపాలు, నేరాలు చేసిన చంద్రబాబుకు.. కోర్టులో నిలబడి దొంగ ఏడుపులు ఏడుస్తున్న ముద్దాయికీ ఏమైనా తేడా ఉందా? దారుణంగా ప్రజలను మోసం చేయడం, అబద్ధాలాడటం, అబద్ధాలను నిజమని నమ్మించేలా చేయడం, దాని కోసం అనుకూలమైన మీడియా వ్యవస్థను వాడుకోవడం చూస్తే దేశ చరిత్రలో ఇంతకన్నా అన్యాయమైన రాజకీయాలు చేయడం కేవలం చంద్రబాబు ఒక్కడికే సొంతమనేది అర్థం అవుతోంది.

కోవూరు చక్కెర ఫ్యాక్టరీ ఇప్పటికీ మూత పడే ఉంది..

కోవూరులో 1978 నుంచి నడుస్తున్న చక్కెర ఫ్యాక్టరీని 2002లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూసేసే పరిస్థితుల్లోకి తీసుకు వెళ్లారని పాదయాత్రలో రైతులు నాతో వాపోయారు. రాష్ట్రంలోని సహకార, ప్రభుత్వ రంగంలో ఉన్న ఫ్యాక్టరీలన్నీ కూడా మూసేయించారన్నారు. మూసేసిన వాటిని వేరుశనగలకూ.. బెల్లానికీ అతి చౌకగా తన బినామీలకు అమ్మేసే కార్యక్రమం చేశారని చెప్పారు. 2002లో నెల్లూరు స్పిన్నింగ్ మిల్లును కూడా చంద్రబాబు మూసేయించి తన బినామీ అయిన సీఎం రమేష్‌కు (ఇప్పటి టీడీపీ రాజ్యసభ సభ్యుడు) వేరుశనగలకు, బెల్లానికి అమ్మేశాడని రైతులు చెప్పారు. అప్పట్లో కోవూరు చక్కెర ఫ్యాక్టరీని కూడా అమ్మేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తే తాము కోర్టు దాకా వెళ్లి ఆపుకొన్నామని చెప్పారు. మూతపడే పరిస్థితుల్లో ఉన్న ఆ ఫ్యాక్టరీని ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన వైఎస్ రాజశేఖరరెడ్డి దగ్గరుండి తెరిపించారని, ఆయనకు తామంతా రుణ పడి ఉన్నామని అన్నప్పుడు నిజంగా నాకు చాలా ఆనందం వేసింది. 2013 జూలైలో ఫ్యాక్టరీ మళ్లీ మూత పడింది. అప్పుడు చంద్రబాబు కోవూరు పర్యటనకు వచ్చినపుడు.. అధికారంలోకి రాగానే ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పారు. ఈవాళ్టికీ ఆ ఫ్యాక్టరీ మూతపడే ఉంది. అక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు రూ.22 కోట్లు బకాయిలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ ప్రాంతంలోని 14 మండలాల్లో 5 వేల మంది రైతులకు ఈ ఫ్యాక్టరీ తోడుగా ఉండేది. ఇలాంటి ముఖ్యమంత్రి ఉన్నందుకు సిగ్గు పడాల్సి వస్తోంది.

రైతు వ్యతిరేక ప్రభుత్వమిది..

కొడవలూరు మండలంలో ఇఫ్కో సంస్థ ఎరువుల ఫ్యాక్టరీ పెట్టాలని పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నపుడు ప్రయత్నించింది. ఆ తర్వాత దాన్నెవరూ పట్టించుకోలేదు. వైఎస్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ఇఫ్కోతో మాట్లాడి కిసాన్ సెజ్ గా మార్చడానికి అన్ని అనుమతులూ తీసుకు వచ్చారు. ప్రతిపాదనలు కూడా సిద్ధమయ్యాయి. ఆయన మరణం తర్వాత అవి ఆగిపోయాయి. రబీలో ఉభయ గోదావరి జిల్లాల కన్నా ఎక్కువగా వరి పండించేది నెల్లూరు జిల్లాలోనే. ఇలా రైతులకు మంచి జరిగే పనులను ఈ ముఖ్యమంత్రి పట్టించుకోరు. చంద్రబాబు ఇవాళ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. లంచాలు తీసుకుని కోకాకోలా ఫ్యాక్టరీకి, గమేషా ఫ్యాక్టరీకి భూమిని ఇప్పించారు. కోకాకోలా ఫ్యాక్టరీ పెట్టాక రైతుల నీటిని దోచేసి వారికి అన్యాయం చేస్తున్నారు. ఒక రైతు వ్యతిరేకి ముఖ్యమంత్రి అయితే పరిపాలన ఎలా ఉంటుందో అని చెప్పడానికి ఈ ఇఫ్కో పరిశ్రమే నిదర్శనం. పక్కనే ఉన్న సంగం బ్యారేజి, నెల్లూరు బ్యారేజీలకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరో జుల్లోనే దాదాపు రూ.1,100 కోట్లు ఖర్చు చేసి 80 శాతం ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. ఈ నాలుగేళ్లలో మిగిలిన 20 శాతం పనులు పూర్తి కాలేదు. ముదివర్తిపాళెం మధ్యలో పెన్నా నదిపై సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే నిర్మిస్తే 45 గ్రామాలకు మేలు జరుగుతుందని వైఎస్ ఉన్నప్పుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయన వద్దకు వెళ్లి అడిగితే రూ. 250 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నేడు ఆ కాజ్‌వే గురించి పట్టించుకునే నాథుడే కరవయ్యారు. లక్షా డెబ్బై తొమ్మిది వేల హెక్టార్లలో రొయ్యల సాగు చేస్తున్నామని, విద్యుత్ శాఖ వారు ఏసీడీ అని పెట్టి తమను కరెంటు చార్జీలతో బాదుతున్నారని ఆ రైతులు వాపోతున్నారు. మునుపటి నెలకంటే కొద్దిగా విద్యుత్ వినియోగం పెరిగితే లక్షలాది డిపాజిట్లు తమతో కట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి బాధలు వింటుంటే ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం అనిపిస్తోంది.

మన ప్రభుత్వంలో ఇలా చేస్తాం..

- ఇవాళ పేద విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత విద్య చదువుకునే పరిస్థితి లేదు. ఇంజినీరింగ్ చదవడానికి ఏడాదికి ప్రతి పిల్లవానికి రూ.లక్షకు పైగా ఫీజు అవుతుంది. చంద్రబాబు మాత్రం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం కింద రూ.30 వేలు లేదా రూ.35 వేలు మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన రూ.65 వేలు, రూ.70 వేలు పేద పిల్లల తల్లిదండ్రులు ఎక్కడి నుంచి తేవాలి? అందుకే పేదల చదువు కోసం నాన్నగారు ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన కుమారుడుగా నేను రెండడుగులు వేస్తాను. మీ పిల్లలను ఇంజినీరింగ్, డాక్టర్ ఏ చదువులు చదువుతారో చదివించుకోండి.. ఎన్ని లక్షలు ఖర్చయినా నేను చదివిస్తాను. ఏటా హాస్టల్, మెస్ చార్జీల కోసం రూ.20 వేలు ఇస్తాను.
- చిన్న పిల్లలను బడికి పంపించే తల్లులకు ఏటా రూ.15 వేలు ఇస్తాను.
- అవ్వా తాతలకు రూ.2 వేలు పింఛను ఇస్తాం. పింఛన్ తీసుకునే వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తాం.
- ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారు. వారందరికీ 45 ఏళ్లకే రూ.2 వేలు పింఛను ఇస్తాం.
- డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఎన్నికల నాటికి బ్యాంకుల్లో ఎంతైతే రుణాలు ఉంటాయో ఆ మొత్తాన్ని నాలుగు దఫాలుగా నేరుగా వారి చేతికే ఇస్తాం. సున్నా వడ్డీకి రుణాలు వచ్చే విధంగా వడ్డీ మొత్తాన్ని మన ప్రభుత్వం బ్యాంకులకు కట్టేలా చర్యలు తీసుకుంటాం.
- ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తాం. ఆ ఇంటిని అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్టర్ చేసిస్తాం. డబ్బు అవసరం పడినపుడు వారు ఆ ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టి పావలా వడ్డీకే రుణాలు వచ్చే విధంగా చేస్తాం.

మీ ఆశీస్సులు కావాలి

ఇలాంటి అన్యాయమైన, మోసం చేసే పాలనను మీరు క్షమిస్తే రేపు భారీ మోసం చేయడానికి మరో నాలుగు అడుగులు ముందుకేస్తాడు. రైతు, పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానంటే మీరు నమ్మరని ప్రతి ఇంటికీ కేజీ బంగారం ఇస్తానంటాడు. నమ్ముతారా? (నమ్మం అని జనం కేకలు) దానికి బోనస్‌గా ప్రతి ఇంటికీ ఓ బెంజికారు ఇస్తానంటాడు. ఇదీ నమ్మరని ప్రతీ ఇంటికీ వచ్చి తాను సంపాదించిన అవినీతి డబ్బుల్లోంచి ఓటుకు రూ.3 వేలు చేతిలో పెడతాడు. ఆ డబ్బు తీసుకోండి. ఆ డబ్బు మనది. మనల్ని దోచేసి సంపాదించిన డబ్బు. ఆ తర్వాత ఆ మనిషికి ఎలా బుద్ధి చెప్పాలో అలా బుద్ధి చెప్పండి. రాజకీయాల్లో నిజాయితీ, విశ్వసనీయత తీసుకురావడానికి మీ అందరి మద్దతు, ఆశీస్సులు కావాలి'' అని వైఎస్ జగన్ కోరారు. నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడు చంద్రబాబు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగించి గద్దెనెక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోవూరు నియోజకవర్గం సమన్వయకర్త నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారని దుయ్యబట్టారు.







జొన్నవాడలో ఓ అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్

జొన్నవాడలో దివ్యాంగురాలి సమస్యను వింటున్న జగన్




బుచ్చిరెడ్డిపాళెంలో అక్కచెల్లెమ్మల కోరిక మేరకు వారితో కలసి జగన్ సెల్ఫీ..

పెనుబల్లిలో అవ్వను ఆప్యాయంగా పలకరించి సమస్యను తెలుసుకుంటున్న జగన్

80వ రోజు

05-02-2018, సోమవారం
అన్నారెడ్డిపాళెం క్రాస్,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా



ఇలాంటి వాళ్లను పట్టించుకోకపోతే ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్టా?

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం జొన్నవాడ కామాక్షి ఆలయం వద్ద అర్చకులు, ఆలయ సిబ్బంది నన్ను కలుసుకున్నారు. 'మీరు అధికారంలోకి రావాలి' అంటూ మనసారా ఆశీర్వదించారు. ఆ క్షణంలోనే వారి కష్టాలు, కన్నీళ్లు నా ముందుంచారు. 'మీ నాన్నగారి పాలనలో మాకో గౌరవం ఉండేది. ఆనందంగా బతికేవాళ్లం. ఆలయాల్లో వంశపారంపర్య హక్కులు కల్పించి ప్రోత్సహించారు' అని గర్వంగా చెప్పారు. ఆయన తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్లే పేద బ్రాహ్మణుల పిల్లలకు ఉన్నత విద్య అబ్బిందన్నారు. చంద్రబాబు పాలనలో ఎన్నో అగచాట్లు పడుతున్నట్టు తెలిపారు. ధూప దీప నైవేద్య ఆలయాలను 13 వేల నుంచి 3 వేలకు కుదించారని, బతుకే భారమన్నట్టు బతుకులీడుస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని, వంశపారంపర్య హక్కును పునరుద్ధరించాలని ఈ ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా కనికరించడం లేదని వాపోయారు. ఆశీర్వదించే ఆ వేద పండితులకే.. చేయి చాచే దయనీయ పరిస్థితి రావడం దారుణం. గుడి భూములే మింగేసే చంద్రబాబు సర్కారులో.. ఇక అర్చకులకు, సిబ్బందికి న్యాయం జరుగుతుందా?

పెనుబోలులో 70 ఏళ్ల గీత కార్మికుడు సుబ్బరామయ్యని చూస్తే జాలేసింది. ఈ వయసులో తాడేసుకుని చెట్టెక్కుతాడట. ఇద్దరు ఆడపిల్లలను బతికించుకోడానికి కాయకష్టం తప్పడం లేదన్నాడు. ఇంతా చేస్తే.. రోజుకు గిట్టుబాటయ్యేది రెండొందల రూపాయలేనట. నాన్నగారి హయాంలో గీత కార్మికులను ఆదరించారని, ఇళ్లు ఇచ్చారని, పిల్లల చదువులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశారని, ఆరోగ్యశ్రీ లబ్ధి కలిగించారని, సైకిళ్లు, పనిముట్లు అందించారని గుర్తుచేశాడు. ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడని, గీత సొసైటీకి చెల్లించే పన్ను ఈ ప్రభుత్వ హయాంలో రూ.5 వేల నుంచి 35 వేలకు పెరిగిందని చెమ్మగిల్లిన కళ్లతో ఏకరవుపెట్టాడు. కనీసం పింఛన్ ఇచ్చినా కాస్తో కూస్తో ఊరటగా ఉంటుందని, ఆ పింఛన్ కోసం ప్రయత్నిస్తుంటే జన్మభూమి కమిటీలు మోకాళ్లడ్డుతున్నాయని బాధపడ్డాడు. ఈ వయసులోనూ ఇన్ని బాధలు పడుతున్న ఇలాంటి వాళ్లను పట్టించుకోకపోతే ప్రభుత్వం ఉన్నట్టా? లేనట్టా?

పురిటిబిడ్డను, ప్రాణం పోసిన తల్లిని కాపాడే ఏఎన్ఎంల సేవలు ఏ పల్లే మరిచిపోదు. నవ్వుతూ కన్పించే వాళ్ల గుండెల్లో ఎంత బాధ ఉందో! జొన్నవాడలో నన్ను కలిసిన ఆ ఏఎన్ఎంలు వాళ్ల బతుకు కష్టాలను చెబుతుంటే.. గుండె తరుక్కుపోయింది. రూ.4,000 జీతాన్ని నాన్నగారి హయాంలో రూ.10,000 చేశారట. ఆ తర్వాత వారిని పట్టించుకున్న పాలకుడే లేడట. 24 గంటలూ మాతాశిశు సంరక్షణలోనే ఉన్నా.. వాళ్లకు మాత్రం మాతృత్వపు సెలవులు (మెటర్నిటీ లీవ్స్) ఇవ్వరట. రెగ్యులర్ ఏఎన్ఎంలకు రూ.40,000 జీతాలు ఇస్తున్నారని, తామూ అంతేపని చేస్తున్నా అందులో నాలుగో వంతే ఇస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదని బాధపడ్డారు. వారి సేవలను కూడా కార్పొరేట్ సంస్థలకు కాంట్రాక్టుగా ఇచ్చి.. వారి ఉద్యోగాలను ఊడబెరికే ప్రయత్నాలు జరుగుతున్నాయట. వాళ్లందరినీ క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబే చెప్పారట. ఇంతవరకూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎంత దుర్మార్గం? ఎంత అన్యాయం?

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మీ పాలనలో గుడి భూములనే గుటకాయ స్వాహా చేస్తుంటే.. ఇక దేవాలయాలకు ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది? ఒకవైపు దేవాలయాలకు ఆదాయమూ రాక.. మరోవైపు ప్రభుత్వమూ పట్టించుకోకపోతే.. అర్చకులు, ఆలయ సిబ్బంది ఎలా బతకాలి? మీ మేనిఫెస్టోలో గీత కార్మికులకు తాటిచెట్ల పెంపకానికి భూములు కేటాయించడం.. రైతులకు చెల్లించాల్సిన చెట్టు పన్నును ప్రభుత్వమే చెల్లించడం.. తదితర ఏడు హామీలిచ్చారు. ఒక్కటైనా నెరవేర్చారా?

వైఎస్. జగన్.

ప్రజాసంకల్ప యాత్ర 80వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం
1,079.9 కి.మీ

80వ రోజు నడిచిన దూరం
13.5 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని దేవరపాళెం

ముగింపు: సా. 6.40 గంటలకు ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్నారెడ్డిపాళెం క్రాస్

ముఖ్యాంశాలు

- దేవరపాలెం, కోవూరు నియోజకవర్గంలోని పెనుబల్లి, సల్మానుపురం, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండలంలోని అన్నారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద ప్రజలతో మమేకం.
- జొన్నవాడలో పార్టీ పతకావిష్కరణ.
- బుచ్చిరెడ్డిపాళెంలో బహిరంగ సభ.

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు అన్నారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు

ముఖ్యాంశాలు

- సంగం మండలం అన్నారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు, దువ్వూరు, సిద్ధిపురం, వెంగారెడ్డిపాళెం క్రాస్, గాంధీజన సంఘం, పల్లెపాళెం క్రాస్, పల్లెపాళెంలో జనంతో మమేకం
- సంగంలో పార్టీ పతాకావిష్కరణ, బహిరంగ సభ

అన్నా.. నాలుగేళ్లుగా అన్నీ కష్టాలే

వైఎస్ జగన్‌కు కష్టాలు చెప్పుకొన్న వివిధ వర్గాల ప్రజలు

'నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో నరకం చూస్తున్నామన్నా..' – ఆక్వా రైతులు

'రాష్ట్రంలో అధర్మ పాలన నడుస్తోంది.' – కామాక్షి అమ్మవారి ఆలయ పూజారులు

'పింఛన్‌లకు లంచం.. రేషన్ కార్డుకు లంచం.. జన్మభూమి కమిటీలు మా రక్తం పిండుతున్నాయయ్యా..' – జొన్నవాడ ప్రజలు.

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: వైఎస్సార్ సీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర సోమవారం నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో కొనసాగింది. నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో తాము పడుతున్న కష్టాలను ప్రజలు జననేత ఎదుట ఏకరువుపెట్టారు. అభిమాన నేతకు ఊరూరా ఘన స్వాగతం లభించింది. వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. జొన్నవాడ మొదలుకుని.. పెనుబల్లి, సాల్మానాపురం, బుచ్చిరెడ్డిపాళెం, అన్నారెడ్డిపాలెం వరకూ జనమే జనం. పాదయాత్రలో వేలాది మంది జగన్‌తో కలిసి నడిచారు. కామాక్షి ఆలయం వద్ద పూజారులు, ఆలయ సిబ్బంది జగన్‌కు మంత్రోచ్ఛరణలతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. తమ కష్టాలు చెప్పుకొన్నారు. ఆక్వా రైతులు దాదాపు అరగంట పాటు జగన్‌తో ముఖాముఖి జరిపారు. రొయ్యలు, చేపలను తీసుకొచ్చిమరీ తమ గోడు వెళ్లబోసుకున్నారు. దళారులు మోసం చేస్తున్నారని, అధికంగా వస్తున్న కరెంటుబిల్లులు ఆర్థికంగా కుంగదీస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మన ప్రభుత్వం వచ్చాక అంతా మంచే జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో చంద్రబాబు మోసగించారని నిరుద్యోగులు జగన్ ఎదుట వాపోయారు. పింఛన్ ఇవ్వడం లేదంటూ 70 ఏళ్ల పోలయ్య, ఇల్లు కోసం మూడేళ్లుగా జన్మభూమి కమిటీ చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని కుసుమ, తనకు రేషన్ ఆపేశారని వసంతమ్మ.. ఇలా వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలను ప్రతిపక్ష నేతకు చెప్పుకొన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలో వైఎస్ జగన్ బహిరంగ సభకు జనం పోటెత్తారు.





రైతన్నల అభిమానం

బుచ్చిరెడ్డిపాళెంలో జగన్‌కు వరికంకుల దండ వేస్తున్న అభిమానులు

సల్మానుపురంలో ఆక్వారైతులు సాగుచేస్తున్న రొయ్యలను పరిశీలిస్తున్న జగన్

ప్రజా సంకల్ప యాత్ర – మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం, 6-2-2018



నాన్న కాఫీతోటలు పెంచారు. ఆయన చనిపోయిన తర్వాత ఆ చేదును వద్దనుకున్నారు ఛాయా నంజప్ప. కూర్గ్ కాఫీ గింజల వైపు చూడకుండా, ఆ ప్రాంతంలోని చెట్లకు కనిపించే తేనెతుట్టెల్ని ఉపాధిగా చేసుకున్నారు. ఆ తియ్యదనాన్ని ఆ ప్రాంతంలోని మహిళలకూ పంచుతున్నారు.



"యాభై మిల్లీగ్రాముల మకరందాన్ని సేకరించడానికి ఒక తేనెటీగ ఇరవై లక్షల పూల మీద వాలుతుంది. వాటి శ్రమతో పోలిస్తే మనం పడే శ్రమ అసలు శ్రమే కాదు. సంతోషంగా ఉండండి, ఆ స్ఫూర్తితో పనిచేయండి
- 'నెక్టార్ ఫ్రెష్' స్లోగన్

ఛాయా నంజప్ప

- 'నెక్టార్ ఫ్రెష్' అధినేత, మహిళా పారిశ్రామిక వేత్తల సమాఖ్య సభ్యురాలు.
- 2014 నేషనల్ బెస్ట్ ఆంట్రప్రెన్యూర్ అవార్డు గ్రహీత.
- కర్ణాటక, కూర్గ్ పర్వత ప్రాంతంలోని అల్పాదాయ వర్గాల మహిళలకు ఉపాధి కల్పించారు.

క్వీన్ బీ

క్వీన్ బీ అంటే.. తేనెటీగల్లో రాణి. ఆ రాణిగారు పని చేయరని అంటారు! కానీ.. ఛాయా నంజప్ప అనే ఈ క్వీన్ బీ... తను కష్టపడి, కష్ట జీవులకు మకరందాన్ని పంచుతున్నారు.

''ఎప్పుడూ పనిలో నిమగ్నమై ఉండే తేనెటీగలే మాకు స్ఫూర్తి. మేమంతా ఎంత శ్రమ పడినప్పటికీ ఆ శ్రమ.. ఐదు మిల్లీగ్రాముల మకరందాన్ని సేకరించడానికి ఒక తేనెటీగ పడే శ్రమకంటే తక్కువే'' అంటారు ఛాయా నంజప్ప. ఆ స్ఫూర్తితోనే పని చేశారు కాబట్టే ఈ రోజు ఏడాదికి పది కోట్ల రూపాయల టర్నోవర్‌తో 'నెక్టార్ ఫ్రెష్' కంపెనీని నిర్వహిస్తున్నారామె. 'నెక్టార్‌ఫ్రెష్'.. స్వచ్ఛమైన తేనె, జామ్‌లను దేశంలోని పెద్ద పెద్ద హోటళ్లకు సరఫరా చేస్తుంటుంది. ఛాయానంజప్ప గత పదేళ్ల శ్రమకు ఫలితమిది.

ఎత్తుపల్లాల ప్రయాణం

ఛాయాకు పారిశ్రామిక రంగంతో ఎటువంటి పరిచయమూ లేదు. ఇంట్లో కూడా ఎవరూ ఆ రంగంలో లేరు. వారి కుటుంబంలో తొలి తరం వ్యాపారి ఆమే. అవాంతరాలు అనుభవంలోకి వచ్చాక వాటి నుంచి పాఠాలు నేర్చుకోవడమే ఆమె చేసింది. దాంతో కంపెనీ 'బ్రేక్ ఈవెన్' కి రావడానికి చాలా టైమ్ పట్టింది. ఈ లోపు వచ్చిన ఆర్థిక నష్టం చాలా పెద్దదే. అయితే ఆ పాఠాలేవీ వృథాగా పోలేదంటారామె.

కాలం కదులుతోంది

కర్ణాటక రాష్ట్రం, కొడగు దగ్గర నల్‌కెరీ.. ఛాయా సొంతూరు. కాఫీ తోటల పెంపకంలో తండ్రి సంపాదన కుటుంబాన్ని నడిపిస్తోంది. హెడ్మాస్టర్‌గా తల్లి జీతం సౌకర్యవంతమైన జీవితాన్నిస్తోంది. ఇది ఆమె స్కూల్ ఫైనల్ వరకు సాగిన జీవితం. తర్వాత రెండేళ్లలో కుటుంబ చిత్రం పూర్తిగా మారిపోయింది. తండ్రి పోవడంతో ఆమె చదువు పన్నెండవ తరగతితో ఆగిపోయింది. కొన్నేళ్లు ఇంటి దగ్గరే ఉండిపోయిన ఛాయాకు కాలంతోపాటు మనిషి ఏదో ఒక వైపు సాగిపోతుండాలనీ, స్తబ్దుగా అయిపోకూడదనీ అనిపించింది. వెంటనే బెంగళూరు ప్రయాణమైంది. మొదట ఒక చిన్న ఆఫీస్‌లో రిసెప్షన్ ఉద్యోగం, తర్వాతి ఏడాదికి పెద్ద ఫైవ్‌స్టార్ హోటల్లో ఉద్యోగం. నెల తిరిగేసరికి జీతం వస్తోంది. అయితే సొంతంగా ఏదైనా చేయాలని నిశ్చయించుకున్నారు ఛాయ.

కూర్గ్ కొండలు కనిపించాయి

పరిశ్రమకు అవసరమైన శ్రమతత్వం తనలో ఉంది. మరి తాను నడిపించగలిగిన పరిశ్రమ ఏది? సొంతూరు కనిపించింది. కూర్గ్ కొండల్లో కాఫీ తోటలు, దట్టమైన చెట్లకు పెట్టిన తేనెపట్టులు కనిపించాయి. కాఫీ గింజలు తండ్రిని తీసుకెళ్లి చేదుని మిగిల్చాయి, అందుకేనేమో తన జీవితాన్ని తేనె తియ్యదనంతో నింపుకోవాలనుకున్నారు. ప్రాక్టికల్‌గా కూడా తేనె పరిశ్రమ అయితేనే తనకు మంచిదనిపించిందామెకు. తేనె ప్రాసెసింగ్ స్కిల్స్ కోసం పుణె వెళ్లి సెంట్రల్ బీ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ లో శిక్షణ కోర్సు చేశారు. అంతా ఓకే... కానీ పెట్టుబడి?

పది లక్షలు బ్యాంకు నుంచి లోన్ వస్తుంది, పది లక్షల మార్జిన్ మనీ తన వైపు నుంచి పెట్టాలి. తల్లి సేవింగ్స్, తన బంగారం అమ్మేసి పది లక్షలు జమ చేసింది. అలా ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు సహకారంతో బొమ్మనహళ్లిలో 'నెక్టార్ ఫ్రెష్' యూనిట్ మొదలైంది.

వయసును మించి పోటీ!

''అప్పట్లో నాకు పోటీగా ఉన్న కంపెనీలన్నీ ఇంటర్నేషనల్ బ్రాండ్‌లే. వాటికంటే మెరుగ్గా ఇవ్వగలిగినప్పుడే నేను మార్కెట్‌లో నిలువగలుగుతాను. బీ రెన్‌బెర్గ్, దార్బో, బోన్నె మామన్ వంటి కంపెనీలు నేను పుట్టక ముందు నుంచి మార్కెట్‌ను ఏలుతున్నాయి. నేను కొత్త మార్కెట్ ఎక్కడ ఉందో వెతికి పట్టుకోవాలి అనుకున్నాను'' అని చెప్తారు ఛాయానంజప్ప. అప్పుడు స్టార్ హోటల్‌లో ఉద్యోగానుభవం పని చేసింది. ఆతిథ్య పరిశ్రమల్లో ఆహార ఉత్పత్తుల వినియోగం రోజూ ఉంటుంది. తన ఉత్పత్తికి అదే అసలైన కేంద్రం అవుతుందనే అంచనాకు వచ్చారు ఛాయా నంజప్ప. ఆ ప్రయత్నం విజయవంతం అయింది. ఐటీసీ, లే మెరీడియన్ వంటి పెద్దపెద్ద హోటళ్లు 'నెక్టార్ ఫ్రెష్'కు ఖాతాదారులయ్యారు.

తప్పని అడ్డంకులు!

వ్యాపారం సాగుతోంది, అవాంతరాలు వస్తూనే ఉన్నాయి. ఫ్యాక్టరీని మూడేళ్లలోనే మూడు చోట్లకు మార్చాల్సి వచ్చింది. బొమ్మన హళ్లి నుంచి మైసూరు దగ్గరలోనే నంజన్‌గాడ్‌కు, అక్కడి నుంచి శ్రీరంగపట్నం తాలూకా బ్రహ్మపురాకి. మార్చిన ప్రతిసారీ లక్షల్లో నష్టం! యంత్ర పరికరాలు పాడయ్యేవి. వెళ్లిన చోట కొత్తగా ఉద్యోగులను చేర్చుకుని వాళ్లకు శిక్షణ ఇవ్వాలి. 'ఇన్ని చోట్లకు మార్చడం వల్ల ఇప్పుడు వందకు పైగా కుటుంబాలు మా కంపెనీతో కలిసి పని చేస్తున్నాయి' అని సానుకూల దృక్పథంతో అంటారు ఛాయా.

ఆహారమూ చేరింది!

నెక్టార్ ఫ్రెష్ వ్యాపారం ఇప్పుడు ఫుడ్ ప్రొడక్ట్స్‌లోకి కూడా అడుగుపెట్టింది. మొదట్లో వద్దనుకున్న కాఫీని కూడా చేర్చుకుంది. ఇప్పుడు టమాటా కెచప్ తయారీకి సిద్ధమవుతోంది. దేశమంతటా విస్తరించడంతోనే ఛాయా సంతృప్తి చెందలేదు, ఏ వ్యాపారానికైనా తీరని దాహం ఉండాలి. ఆ దాహంతోనే ఇప్పుడు ఛాయా నంజప్ప కంపెనీ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తోంది.

– మంజీర

రకరకాల తేనెలు!

ఛాయా సరఫరా చేస్తున్న తేనెకు డిమాండ్ పెరిగింది. అడవుల్లో సేకరించే తేనెతోపాటు హనీ కల్చర్ కూడా ప్రారంభించింది నెక్టార్ ఫ్రెష్. రైతుల దగ్గర పంటకు అనువుగా లేని నేలను అద్దెకు తీసుకుని తేనెటీగల సేద్యాన్ని రకరకాలుగా అభివృద్ధి చేసింది. వీటితోపాటు మరో ఇరవై మొబైల్ అపియరీలు (తేనెటీగలను పెంచే స్థలం) కూడా ఉన్నాయి. అలా కూర్గ్ హనీతో మొదలైన ఛాయా వ్యాపారం హిమాచల్ హనీ వరకు విస్తరించింది. మొదట్లో నెలకు ఒక టన్ను తేనె ప్రాసెస్ చేసేవారు, ఇప్పుడది రెండు వందల టన్నులకు చేరింది.

అంచెల ఉపాధి!

తేనె సేకరణలో గ్రామీణ మహిళల సహకారం తీసుకున్నాను. ఆదివాసీ మహిళలకు అదొక మంచి అవకాశమైంది. తమంతట తాము తేనె సేకరించి సంతకు తీసుకెళ్లి అమ్మడంలో ఎదురయ్యే ఇబ్బందులు వారికి తొలగిపోయాయి. తమ గూడేలకే వచ్చి చేతిలో డబ్బు పెట్టి తేనె పట్టుకెళ్లే అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఒక నెట్‌వర్క్‌గా కూడా ఏర్పాటయ్యారు! మొత్తం రెండువేల మంది మహిళల్ని కలిసి మాట్లాడాను. తేనె సేకరించడంలో పట్టు వచ్చింది. ప్రాసెస్ చేయడంలో మెళకువ తెలిసింది.

- ఛాయా నంజప్ప



యూనిట్ సభ్యులతో

ఎన్నారై టార్చర్



ప్రతీకాత్మక చిత్రం

రోజుకు మూడు కాల్స్

మీ అమ్మాయిని ఎన్నారైకి ఇచ్చి చేస్తున్నారా? అయితే ఆలోచించండి. ఢిల్లీలోని మన 'విదేశీ వ్యవహారాల మంత్రిత్వ' శాఖకు (ఎంఈఏ) ప్రతి 8 గంటలకు ఒకసారి వినిపిస్తున్న 'ఆక్రందన'ల్లో మీ అమ్మాయిదీ ఒకటి కాకుండా జాగ్రత్త పడండి.

నా భర్త నన్నొదిలేశాడు. నా భర్త నా పాస్‌పోర్ట్ దాచేశాడు. నా భర్త నన్ను హింసిస్తున్నాడు. నా భర్త డబ్బు తెమ్మంటున్నాడు. నా భర్త నా బిడ్డను తీసేసుకున్నాడు. నా భర్త నన్ను వెళ్లగొట్టాడు.

ఇవన్నీ.. సహాయం కోసం ఎన్నారై భార్యల నుంచి ఎంఈఏ కి అందిన, నేటికీ అందుతున్న ఫిర్యాదులు! 2015 జనవరి 1 నుంచి 2017 నవంబర్ 30 వరకు.. 1,064 రోజులలో ఇలా ఆ శాఖకు 3,328 ఫిర్యాదుల కాల్స్ అందాయి. అంటే రోజుకు సగటున మూడు కన్నా ఎక్కువ కాల్స్. ప్రతి ఎనిమిది గంటలకు ఒక కాల్!

ఇదికాదు అసలు విషయం. కాల్ చేసినవాళ్లలో ఎక్కువమంది ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ఎన్నారైల భార్యలేనట. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కోఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ' ఈ వివరాలను వెల్లడించింది. వాషింగ్టన్‌లో భారతీయ రాయబారిగా వివిధ హోదాలలో 16 ఏళ్లు పనిచేసిన ఆర్తీరావ్ కూడా.. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో వరకట్న దురాచారం బలంగా ఉండటం ఇందుకు ప్రధాన కారణం అని అభిప్రాయపడుతున్నారు.

అబ్బాయి విదేశాలనుంచి వస్తాడు. అక్కడేదో మంచి ఉద్యోగం చేస్తున్నాడంటాడు. తల్లిదండ్రుల్ని వెంటేసుకుని వెళ్లి అమ్మాయిని సెలక్ట్ చేసుకుంటాడు. అమ్మాయి తల్లిదండ్రులకు ఆశ చూపి పెళ్లి చేసుకుంటాడు. తనతో పాటు విదేశానికి తీసుకెళతాడు. అక్కడ టార్చర్ మొదలుపెడతాడు. ఇదండీ.. ట్రెండ్! అందరూ అలా ఉంటారా? ఉండకపోవచ్చు. మన కర్మకాలితే అలాంటి వాడు మనమ్మాయినే వెతుక్కుంటూ రావచ్చు. సందేహించడం తప్పుకాదు. ఏదో ఒక ఉద్యోగంలే, ఎవరో ఒకరులే అని సర్దుకుపోవడం తప్పు.

అధ్యయనం

డ్యాన్స్ చేస్తే తెలివి పెరుగుతుంది



తెలివితేటలు పెరగాలంటే ఉల్లాసంగా, ఉత్సాహంగా కాసేపే డ్యాన్స్ చేస్తే చాలంటున్నారు శాస్త్రవేత్తలు. డ్యాన్స్ చేస్తే మెదడు చురుకుగా మారి, తెలివితేటలు పెరుగుతాయని బ్రిటన్‌లోని కొవెంట్రీ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొందరు విద్యార్థులపై నిర్వహించిన పరిశోధనల్లో ఈ శాస్త్రవేత్తలు పలు ఆసక్తికరమైన విశేషాలను కనుగొన్నారు. వారానికి ఒక సల్సా డ్యాన్స్ క్లాస్‌కు హాజరైన వారిలో విషయాలను ఆకళింపు చేసుకునే శక్తి 8 శాతం, ఏకాగ్రత 13 శాతం, జ్ఞాపకశక్తి 18 శాతం పెరిగినట్లు తమ పరిశోధనలో తేలిందని కొవెంట్రీ వర్సిటీ శాస్త్రవేత్త మైకేల్ డంకన్ చెబుతున్నారు. కేవలం సల్సా అనే కాదని, ఎలాంటి నాట్యమైనా ఏకాగ్రతను గణనీయం పెంచుతుందని ఆయన అంటున్నారు. ఇక ఆలస్యమెందుకు... మెదడు మందకొడిగా మారిందనిపిస్తే మరింకేమీ ఆలోచించకుండా మంచి మ్యూజిక్ పెట్టుకుని కాసేపు ఒళ్లు అలసిపోయేలా స్టెప్పులెయ్యండి చాలు.

ఛాలెంజ్

రియల్ లైఫ్ ట్రైలర్

అన్ని థియేటర్‌లలో 'ప్యాడ్‌మ్యాన్' ట్రైలర్ చూపిస్తున్నారు. ఈ ట్రైలర్‌ను చూస్తూ మహిళా ప్రేక్షకులు బిడియపడుతున్నారు. వాస్తవానికది ఒక మహోన్నతమైన సందేశాన్నిచ్చే చిత్రం. 'మగవాళ్లకేం తెలుసు ఆడవాళ్ల ఇబ్బందులు. వాళ్లకేమైనా నెలసరి పాట్లు ఉంటే కదా' అని హీరో అక్షయ్‌కుమార్ ట్రైలర్‌లో అంటాడు. ఎంత ఉన్నతమైన సందేశం అయినా, బహిరంగంగా వినడానికి, చూడ్డానికీ, మాట్లాడుకోడానికి మొహమాట పడే సబ్జెక్ట్ ఇది. పిక్చర్ ఈ నెల 9న రిలీజ్ అవుతోంది. ఆ లోగా సొసైటీని ఈ థీమ్‌కి, ఈ పిక్చర్‌కి మెల్లిమెల్లిగా రెడీ చేయడానికేనేమో బాలీవుడ్ హీరోలు, హీరోయిన్‌లు సోషల్ మీడియాలో 'ప్యాడ్‌మ్యాన్ ఛాలెంజ్' ప్రారంభించారు. శానిటరీ ప్యాడ్‌ని చేత్తో పట్టుకుని ఫొటో తీయించుకుని దానిని అప్‌లోడ్ చేస్తున్నారు.



● సోనమ్ కపూర్

ఇంతవరకు ఆమిర్‌ఖాన్, దీపికా పదుకోన్, అక్షయ్‌కుమార్, సోనమ్ కపూర్, అతిథి రావ్ హైదరీ, రాధికా ఆప్టే, ఆలియా భట్, దియా మీర్జా, ట్వింకిల్ ఖన్నా, స్వరా భాస్కర్, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా, షబానా అజ్మీ.. ఈ ఛాలెంజ్‌ని స్వీకరించారు. నేప్‌కిన్ ప్యాడ్స్‌ని కొని తేవడానికే తటపటాయించే మగధీరులు బహుశా ఈ సినిమా చూశాక కొద్దిగా ధైర్యాన్ని కూడా కొని తెచ్చుకోవచ్చు.

చెట్టు నీడ

పట్టు ఉండాలి

పిల్లలకు పూర్తిగా స్వేచ్ఛను ఇవ్వడం అంటే వారి కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకునే బాధ్యతను నుంచి మనం తప్పించుకోవడమే.

మనిషికి దేవుడు ఏదైనా కఠిన పరీక్ష పెట్టాడూ అంటే, అది పిల్లల విషయంలోనే అయి ఉంటుంది. ఈ ఉద్యోగాలు, లోకంతో నెగ్గుకు రావడం.. ఇవన్నీ కూడా పిల్లలను తీర్చిదిద్దే ప్రయత్నాలతో పోల్చి చూస్తే చాలా చిన్నవిగా అనిపిస్తాయి. పిల్లల ఆరోగ్యం, చదువులు, వారి అభివృద్ధి, భవిష్యత్తు.. ఈ ఆలోచనలతోనే మనిషి జీవితం గడిచిపోతుంది. అరిజోనాలోని ఆర్మే స్కూల్ నుంచి ఒక రోజు రొనాల్డ్ రీగన్‌కు కంప్లైంట్ వచ్చింది. మీ అమ్మాయి స్మోక్ చేస్తోందనీ, స్కూల్ రూల్స్ ఫాలో అవడం లేదనీ! అలాంటి ఫిర్యాదే పిల్లల్లో ఆఖరివాడి గురించి కూడా ఆ తర్వాత కొన్నేళ్లకు వచ్చింది. 'మీ అబ్బాయికి ఫ్రెంచిలో సి గ్రేడ్, ఆల్‌జీబ్రాలో డి గ్రేడు వచ్చింది. మాతో పాటు మీరు కూడా కేర్ తీసుకోవాలి' అని. రీగన్ కన్‌ఫ్యూజన్‌లో పడిపోయాడు. అప్పటికింకా ఆయన పూర్తిగా రాజకీయాల్లోకి రాలేదు. రెండు సందర్భాల్లోనూ పిల్లల్ని దగ్గర కూర్చొబెట్టుకుని మాట్లాడాడు. కానీ అతడికి అపనమ్మకం.. తన మాట వింటారా అని. అలాగే చాలాసార్లు ఆయన డైలమాలో పడేవారు.

''పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులకు తెలిసిన పద్ధతులు... చెయ్యి పట్టి నడిపించడం లేదా నీ దారి నువ్వు వెతుక్కొమ్మని చెయ్యి వదిలేయడం! చెయ్యిపట్టి ఎక్కడికి నడిపిస్తాం? మనం వచ్చిన దారిలో, మనకు తెలిసిన దారిలోనే కదా. ఈ 'స్టేజ్ డైరెక్షన్'లో పిల్లలకు కనీసం ఉండవలసిన స్వేచ్ఛ ఎక్కడో జారిపోతుంది. ఇక.. పిల్లలకు పూర్తిగా స్వేచ్ఛను ఇవ్వడం అంటే వారి కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకునే బాధ్యత నుంచి మనం తప్పించుకోవడమే. జారిపోయిన పిల్లల స్వేచ్ఛకు, తప్పించుకున్న పెద్దల బాధ్యతకు జీవితం ఎక్కడో ఒక చోట నిలబెట్టి మరీ మూల్యం అడుగుతుంది. నిర్లక్ష్యం, మూల్యం అన్నవి పిల్లల వయసుకు అర్థం కానివి! అర్థమయ్యేలా చెప్పకపోతే వారిని జీవితాంతం బాధపెట్టేవి!! మరెలా?'' అని రీగన్ తన భార్యతో దీర్ఘ సంభాషణ చేసేవారు. ఆయన భార్య నాన్సీ మాత్రం.. పిల్లల్ని పట్టుకునే నడిపించాలి అనేవారు. ఆమె మాటే నిజం అనిపిస్తుంటుంది.

(నేడు రొనాల్డ్ రీగన్ జయంతి)

గుడ్ ఫుడ్

తరగని యౌవనం కోసం

చిలగడదుంపకు ప్రాంతాలను బట్టి గెణుసుగడ్డ, మోరంగడ్డ అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇందులో 77 శాతం నీరు, 20.1శాతం కార్బోహైడ్రేట్లు, 1.6 శాతం ప్రొటీన్లు, 3 శాతం పీచుపదార్థాలు ఉంటాయి. దీంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఒనగూరుతాయి.

- చిలగడదుంపలో కార్బోహైడ్రేట్ల పాళ్లు ఎక్కువ. అందుకే దీన్ని తక్షణ శక్తి వనరుగా ఉపయోగించుకోవచ్చు
- బీటా–కెరొటిన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అవి శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తాయి. చర్మంలోని కణాలను గట్టిగా దగ్గరగా పట్టి ఉంచే కొలాజెన్ ఉత్పత్తికి విటమిన్–సి దోహదపడుతుంది. అందుకే విటమిన్–సి పోషకాలను పుష్కలంగా తీసుకునేవారి చర్మం చాలా కాలం యౌవనంగా ఉంటుంది. అలాగే విటమిన్–ఏ మేనికి ఒక మెరుపు, నిగారింపు ఇస్తుంది. అందుకే చిలగడదుంపల్ని తినేవారి చర్మం ఏజింగ్ దుష్ప్రభావాలకు అంత తొందరగా గురికాదు. ఈ కారణంగానే దీన్ని తినేవారిలో ఏజింగ్ ప్రక్రియ చాలా ఆలస్యంగా జరగడం, తద్వారా దీర్ఘకాలం యౌవనంగా ఉండటం సాధ్యపడుతుంది
- చిలగడదుంపలో పొటాషియమ్ పాళ్లు ఎక్కువ. పొటాషియమ్ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అందుకే రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలనుకునే వారు దీన్ని తింటే... బీపీ అదుపులో పాటు గుండె ఆరోగ్యమూ పదిలంగా ఉంటుంది
- చిలగడదుంప వల్ల అనేక గుండెజబ్బులు నివారితమవుతాయని పరిశోధనల్లో తేలింది.



పెళ్లి

గడువు కావాలి




● కంగనా రనౌత్

''పెళ్లి ఎప్పుడు? పెళ్లి ఎప్పుడు?'' సినిమా హీరోయిన్స్‌కి ఏదో ఒక సందర్భంగా ఎదురయ్యే మోస్ట్ బోరింగ్ క్వశ్చన్. దానికి హీరోయిన్స్ కూడా మోస్ట్ బోరింగ్ స్టైల్‌తో.. త్వరలో అనో లేదా ఓ స్మైల్‌తోనో సమాధానం దాట వేస్తుంటారు. కానీ కంగనా రనౌత్ మాత్రం ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చారీ క్వశ్చన్‌కి. పెళ్లెప్పుడు అనే ప్రశ్నను కంగనా ముందు ఉంచితే '' వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు నాకు గడువు ఇవ్వండి'' అన్నారు!

దీంట్లో ఇంత ఇంట్రెస్టింగ్ న్యూస్ ఏంటీ అంటే.. ఇది వరకు కంగనకు ప్రేమ విషయాల్లో ఎదురైన చేదు అనుభవాలే. హృతిక్ రోషన్‌తో కంగనా ప్రేమ వ్యవహారంపై పై జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. కానీ హృతిక్ రోషన్ మాత్రం 'మా ఇద్దరి మధ్య ఎటువంటి ప్రేమాలేదు. ప్రొఫెషనల్‌గా.. జస్ట్ ఫ్రెండ్‌షిప్ మాత్రమే' అని కొట్టి పారేశారు. దానికి ముందు కూడా.. ''కంగనా నా మీద క్షుద్రపూజలు చేయించింది, ఫిజికల్‌గా వయిలెంట్‌గా బిహేవ్ చేసేది'' అంటూ ఆమె ఫస్ట్ బాయ్‌ఫ్రెండ్ అధ్యాయన్ సుమన్, కంగనా మీద ఆరోపణలు చేశాడు.

ఇలా ప్రేమలో రెండు సార్లూ అనుభవాలే ఎదుర్కొన్న కంగనా... ప్రేమ గుడ్డిది అన్నట్లు మరో సారి ప్రేమలో పడిందా? లేక ఈసారి పెద్దలు కుదిర్చిన వివాహమే చేసుకుంటుందా? అనే ప్రశ్నకు నెక్స్ట్ ఫిబ్రవరి అని కంగన పెట్టిన డెడ్ లైనే సమాధానం అనుకోవాలి.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నా..! నేను బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నా. నేను ఒకరోజు కాలేజ్‌కి వెళ్తూ... వేరే కాలేజ్ అమ్మాయిని చూశాను. బాగా నచ్చింది. దాంతో తన పూర్తి వివరాలు తెలుసుకున్నా. వన్ మంత్ తనని చూడ్డానికి వాళ్ల బస్టాప్‌కి వెళ్లే వాడిని. ఆ తరువాత ఎఫ్‌బి ఐడీ తీసుకుని కొద్ది రోజులు చాట్ చేశా. తను ఒప్పుకోవడంతో రెండు సార్లు కలిసి మాట్లాడాను కూడా. అయితే రెండోసారి కలిసినప్పుడు తనకి తెలీకుండా తన బ్యాగ్‌లో చాక్లెట్ వేశాను. ఇక అంతే.. ఆ రోజు నుంచి నాతో సరిగా చాట్ చెయ్యడం మానేసింది. మెసేజ్‌లకు రిప్లై ఇవ్వడం మానేసింది. నన్ను బ్లాక్ చేసింది. తనని నేను మరిచిపోలేక పోతున్నాను. పైగా తను నాకంటే వన్ ఇయర్ పెద్దది. ఆ విషయం కూడా నేనే తనకి చెప్పాను. ఎందుకు తను మాట్లాడటం మానేసిందో అర్థం కావడంలేదు. ప్లీజ్ నాకో మంచి సలహా ఇవ్వండి అన్నా.

- శాండి

సరైన చాక్లెట్ ఇవ్వకపోతే అలాగే అవుతుంది.

'ఏంటి సార్ అయ్యేది!?!'

యా!

'ఎలాంటి చాక్లెట్ ఇస్తే లవ్ వర్కౌట్ అవుతుంది సార్??'

అది అమ్మాయిని బట్టి ఉంటుంది.

'రామచంద్ర.. శాండీ నెత్తి కొట్టుకుంటాడు సార్!'

అవును నీలాంబరీ... అమ్మాయికి చాక్లెట్ సూట్ అయితే...

'లవ్ సూట్ అవుద్దా సార్? టు మచ్ సార్. శాండీ ఏదో కష్టాల్లో ఉండి సాయం అడిగితే ఆదుకుంటున్నారు కదా సార్? మీరూ, మీ సిస్టర్.. ప్రేమికులంటే మీకు అంత చీపా సార్??? మీకు బ్యాడ్ డేస్ వస్తాయి సార్, అప్పుడు రాయండి శాండీకి... ఉతికి ఆరేస్తాడు..!'

ఎందుకు నీలాంబరీ అంత కోపం...? తప్పు కాదా నీలూ అమ్మాయి బ్యాగ్‌లో దొంగతనంగా చాక్లెట్ వెయ్యడం??

'సార్ చాక్లెట్ వేశాడు. తీసుకోలేదు. తీసుకుంటే దొంగ సార్!'

మనస్సు దొంగలించాలన్న వాడు దొరలా అడగాలి కానీ.. తుంటరి పనులు చేస్తే...

'చేస్తే ఏంటి సార్.. చేస్తే...???'

అలా చాక్లెట్ వేస్తే... అమ్మాయి బిస్కెట్ వేస్తుంది నీలాంబరీ...!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాస్కో సుడోకు

4				1				
7	2	6		8	3		4	1
	3					9		2
6						1	8	
8	1	3				4	9	5
	5	4						7
5		9					1	
2	8		7	4		3	6	9
				6				8

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	6	9	1	7	8	4	5	3
8	5	3	4	2	6	7	1	9
7	4	1	5	3	9	8	2	6
6	1	4	8	5	2	9	3	7
5	7	8	9	1	3	6	4	2
3	9	2	6	4	7	1	8	5
4	3	6	7	8	5	2	9	1
1	2	7	3	9	4	5	6	8
9	8	5	2	6	1	3	7	4

ఆ ఇద్దరు మోసగాళ్లను ఒకేలా చూడాలి


ఫొటో: శివ మల్లాల
విష్ణు

జీవితం... కష్టసుఖాల మిశ్రమం. నటన... జయాపజయాల కలబోత. ఎంతో పరిణతి ఉన్నవాళ్లే ఈ రెంటినీ ఒకేలా చూడగలుగుతారు. మంచు విష్ణుకి ఆ పరిణతి ఉంది. 'ఆనందం వచ్చిందా.. తీసుకుందాం.. బాధ వచ్చిందా.. తీసుకుందాం' అనేంత పరిణతి. 'సాక్షి'తో ఎక్స్‌క్లూజివ్‌లో విష్ణు పంచుకున్న విషయాలు.

■ **గాయత్రి, ఆచారి అమెరికా యాత్ర, ఓటర్.. మూడు సినిమాల గురించి?**

'గాయత్రి' నాకో డిఫరెంట్ మూవీ. 'ఆచారి అమెరికా యాత్ర' ఫన్నీగా ఉంటుంది. కరెక్ట్ టైమ్‌లో రిలీజ్ అయితే మంచి సినిమా అవుతుంది. నన్ను ఓ సూపర్‌స్టార్ రేంజ్‌కి తీసుకెళ్లే మూవీ 'ఓటర్'. తగిలిందంటే ఆ సినిమా నాకు 'అసెంబ్లీ రౌడీ' అవ్వొచ్చు.

■ **'గాయత్రి'లో మీకు, శ్రియకు మధ్య ఉన్న 'ఒక నువ్వు.. ఒక నేను.. ఒక్కటయ్యాం మనం' పాట చాలా బాగుంది..**

ఈ ఏడాదిలో వన్నాఫ్ ది బెస్ట్ సాంగ్ ఇది. మా ఇద్దరి మధ్య బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ ఉంది. ఒక నటుడిగా 'గాయత్రి' నాకు అగ్నిపరీక్ష. నా హిట్ సినిమాలన్నీ కామెడీ బేస్డ్. 'గాయత్రి'లో శివాజీలాంటి క్యారెక్టర్‌ని నేనింతవరకూ చేయలేదు. కథ విన్న వెంటనే జస్ట్ పదిహేను ఇరవై నిమిషాలు వచ్చే నా క్యారెక్టర్‌తో ఆడియన్స్ లాక్ అయ్యారంటే ఫెంటాస్టిక్‌గా ఉంటుందనిపించి చేశా.

■ **పాటలో శ్రియకు జడ వేశారు. మీ భార్య విన్నీగారికి ఎప్పుడైనా జడలు వేశారా?**

లేదు. జడలు వేయడం తెలియదు. ఇప్పుడిప్పుడే అరీ, వివీకి వేస్తున్నా. అది కూడా కష్టపడి. జడలు విప్పడం వచ్చు. అరీ అడుగుతుంది 'డాడీ.. నువ్వెందుకు చేయవు ఇవన్నీ. మమ్మీయే ఎందుకు జడ వేయాలి' అని. నాన్నకి ప్రాక్టీస్ లేదు అంటే 'ఎప్పుడు నేర్చుకుంటారు' అని అడుగుతుంది.

■ **ఒకవైపు హీరోగా, నిర్మాతగా.. మరోవైపు స్కూల్స్ చేసుకోవడం.. మల్టీ టాస్కింగ్‌ని ఎలా హ్యాండిల్ చేస్తున్నారు?**

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా లైఫ్ అంతే కదా. నాన్నగారు చేసేది చూశాను. మెల్లగా అలవాటయ్యాను. అదీ చూసుకోవాలి ఇదీ చేయాలి అంతే. ఈ వాతావరణంలో పెరిగాను కాబట్టి నాకు సులభమైంది. వన్స్ షూటింగ్ లొకేషన్‌కి వెలితే అన్నీ స్విచాఫ్ చేసేస్తాను. ఎవరూ నన్ను కలవడానికి.. ఫోన్‌లో మాట్లాడ్డానికి వీల్లేదు. మోస్ట్ ఆఫ్ ది టైమ్ సెట్‌లో నా వద్ద ఫోన్ ఉండదు. స్కూల్స్ పనులు చూసుకునేటప్పుడు కూడా అంతే. వేరే విషయాల గురించి ఆలోచించను.

■ **మీరు తీయాలనుకున్న ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'భక్త కన్నప్ప' గురించి ?**

'భక్తకన్నప్ప' డ్రాఫ్ట్ స్క్రిప్ట్ రెడీ అయింది. తనికెళ్ల భరణిగారి వెర్షన్ తీసుకుని నేను, ఓ హాలీవుడ్ రైటర్ కూర్చుని ఓ వెర్షన్ తయారు చేశాం. బుర్రా సాయిమాధవ్‌గారు డైలాగులు రాస్తున్నారు. ఆయన వెర్షన్ అంతా ఓకే అయిన తర్వాత భరణిగారు దానికి ఓకే చెప్పాలి. ఎందుకంటే.. ఆయన కథని మేం తీసుకుని చేస్తున్నాం కాబట్టి. ఆ సినిమాకి 70 నుంచి 80కోట్లు ఖర్చవుతుంది. ఈ రోజు నా మార్కెట్ అంత లేదు. ఈ మూడు సినిమాల తర్వాత పెరుగుతుంది. జరిగేది జరుగుతుందిలే అని ఈశ్వరుడిపై భారం వేసి ముందుకెళుతున్నాం. ఈ ఏడాది ఎండింగ్‌కి ప్రొడక్షన్‌కి వెళ్లిపోతాం. ఈ మూవీని హాలీవుడ్ డైరెక్టర్ తీస్తారు.

■ **హాలీవుడ్ మూవీస్ ప్రొడ్యూస్ చేయాలనుకుంటున్నారని విన్నాం..**

యస్. త్వరలో హాలీవుడ్ ఫిల్మ్ ప్రొడ్యూస్ చేస్తున్నాం. అమేజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ ఇవన్నీ సినిమా పరిస్థితిని మార్చేయబోతున్నాయి. యాపిల్ కూడా వస్తుంది. లాస్ ఏంజల్స్‌లో చదువుకొని వచ్చాక నేను నటించిన 'విష్ణు' సినిమాని అన్ని థియేటర్స్‌లో రిలీజ్ చేసేయండి. 3 వీక్స్‌లో రిటర్న్స్ వచ్చేస్తాయి అంటే చాలా మంది నిర్మాతలు నవ్వారు. వీడేదో అమెరికా నుంచి దిగాడు అని కామెడీ చేశారు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. ఎక్కువ థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నారు. పదేళ్ల క్రితమే నేను ఈ మాట అన్నాను.

■ **టూ క్యూట్ డాటర్స్, వన్ క్యూట్ సన్... ఎలా ఉంది లైఫ్?**

ఫాదర్‌హుడ్ ఈజ్ నాట్ ఈజీ జాబ్. కూతుళ్లు ఎంత అల్లరి చేసినా భరించాల్సిందే. అందుకే విన్నీతో అవ్రామ్ దగ్గర నో కాంప్రమైజ్. అల్లరి చేస్తే వీపు వాయించేస్తా అంటా.

■ **ఇద్దరు కూతుళ్లు పుట్టాక వారసుడు కావాలనే ఆలోచన ఉండేదా?**

నాకెవరైనా ఒకటే. ఒకవేళ మూడో సంతానం ఆడపిల్ల పుట్టినా సంతోషమే. జనరల్‌గా ఆడపిల్లల్ని వారసులుగా ప్రకటించరేమో. కానీ నేనలా కాదు అవ్రామ్ కన్నా ఆరి, వివి (ఆరియానా, వివియానా) పెద్దవాళ్లు. పెద్దవాళ్లకు బాధ్యతలు అప్పగించాలన్నది నా ఒపీనియన్. మగాడికి ఎక్కువ బాధ్యతలు ఇచ్చి, ఆడవాళ్లకు తక్కువ బాధ్యతలు ఇవ్వడం అనేది బుల్‌షిట్ అండి. ఇంతకు ముందు ఆర్థిక ఇబ్బందుల వల్ల, ఇతర కారణాల వల్ల ఆడవాళ్లను బయటకు రానివ్వలేదు. ఒక్కసారి మన పురణాల్లోకి వెళ్లండి. చరిత్ర చూస్తే ఆడవాళ్లు చాలా పవర్‌ఫుల్‌గా ఉండేవారు. శక్తి అని అంటాం. ఎక్కడా మగాడ్ని రిఫర్ చేయలేదు. శక్తి అంటే అది ఫీమేల్ పవర్. స్త్రీ లేకపోతే లైఫ్ లేదు.

■ **పుస్తకాలు బాగా చదువుతారా?**

బాగా. జర్నీస్ అప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో ఏదైనా నవల కొనుక్కుని, ఫ్లైట్ ఎక్కగానే చదవడం మొదలుపెడతా.

■ **జయాపజయాలకు అతీతంగా స్పందించే సహనం బుక్ రీడింగ్ ద్వారానూ వస్తుందా?**

అవును. యాక్చువల్లీ నా ప్రతి సినిమా రిలీజ్ ముందు రుడియార్డ్ కిప్లింగ్ రాసిన 'ఇఫ్' అనే పోఎమ్ చదువుతూ ఉంటాను. ఆ పోఎమ్‌ని నా 12 క్లాస్‌లో ఉన్నప్పుడు చదివాను. ఒక ఫాదర్ వాళ్ల కొడుక్కి రాసిన లెటర్ అది. అందులో 'నువ్వు రాజుని, మామూలు వాళ్లని ఒకేలా చూడగలిగితే, ఇలా ఇలా ఉండగలిగితే..' అంటూ లాస్ట్‌లో ఓ మాట చెబుతాడు. అదేంటంటే.. 'నువ్వు సక్సెస్, ఫెయిల్యూర్ అనే ఇద్దరు మోసగాళ్లను ఒకేలా చూడగలిగితే నువ్వు గెలిచినట్టు' అని. చాలా బ్యూటిఫుల్ పోఎమ్. వెరీ ఇన్‌స్పిరేషనల్.

■ **ఈ మధ్య థియేటర్స్ కొరతతో సినిమాలు వాయిదా పడుతున్నాయి. ఏమంటారు?**

ఇకనుంచి సోలో రిలీజ్‌లు ఉండవు. రెండు మూడు సినిమాలు మినిమమ్ ఉంటాయి. 2 సినిమాలు రిలీజ్ అయినప్పుడు ఒక సినిమాకు 60 శాతం ఇచ్చి ఇంకొకరికి 40 ఇస్తే ఓకే. అలా కాకుండా 85 శాతం ఒక సినిమాకి 25 ఇంకో సినిమాకి అంటే చాలా తప్పు. 25 శాతం మాత్రమే థియేటర్లు దక్కే నిర్మాతకు ఎంత నష్టం? ఇలా జరగకుండా ఉండాలంటే ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ డిస్కస్ చేయాలి.

- డి.జి. భవాని

హాథీ కే సాథ్...


రానా

అంటే ఏనుగు దగ్గర అని అర్థం. అవును... రానా దాదాపు 20 రోజుల పాటు ఏనుగులకు దగ్గరగా ఉండబోతున్నారు. వాటితో ఫ్రెండ్‌షిప్ చేయనున్నారు. ఇదంతా ఎందుకు? అంటే.. తెలుగు, తమిళ. హిందీ భాషల్లో రూపొందనున్న 'హాథీ మేరే సాథీ' చిత్రం కోసం. ఇంకా తెలుగు, తమిళ వెర్షన్స్‌కి టైటిల్ కన్ఫార్మ్ చేయలేదు. తెలుగులో 'అడవి రాముడు' అని పెట్టాలనుకుంటున్నారట. త్వరలో ఈ చిత్రం షూటింగ్‌ని ప్రారంభించాలని చిత్రదర్శకుడు ప్రభు సాల్మన్ అనుకుంటున్నారు. ఏనుగులతో షూటింగ్ చేయాలి కాబట్టి, రానా ఇప్పటినుంచే వాటితో స్నేహం మొదలు పెట్టాలనుకున్నారట. దాదాపు 20 రోజుల పాటు ఎలిఫెంట్స్ యాక్టివిటీస్ తెలుసుకోవాలనుకుంటున్నారని సమాచారం. సినిమా ప్రారంభించేలోపు వాటితో స్నేహం కుదిరితే షూటింగ్ సజావుగా జరుగుతుంది కదా.


సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి

ఆ అన్నదమ్ములిద్దరూ కలిస్తే తేజ్

- వినాయక్

''**తే**జూతో 'చమకు చమకు..' సాంగ్ చేసేటప్పుడు చిరంజీవిగారే గుర్తుకొచ్చారు. రెండు మూడు సీన్స్‌లో పవన్‌కల్యాణ్‌లా తేజు కనపడేలా తీశాం. ఎందుకంటే చిరంజీవిగారు, పవన్‌కల్యాణ్‌గారు కలిస్తే ఎలా ఉంటుందో తేజు స్టైల్ అలా ఉంటుంది'' అన్నారు వీవీ వినాయక్. సాయి ధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వినాయక్ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' ఈ నెల 9న విడుదలవుతోంది. రాజమండ్రిలో జరిగిన ప్రీ-రిలీజ్ వేడుకలో వినాయక్ మాట్లాడుతూ– ''మెగా ఫ్యామిలీలోని కష్టపడే తత్వం తేజులోనూ ఉంది. తేజు కూడా చిరంజీవిగారు, పవన్ కల్యాణ్ అంత పెద్ద స్టార్ కావాలి. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పట్నుంచి పెద్ద డైరెక్టర్‌ని అవుతానని నమ్మిన వారిలో సి.కల్యాణ్ అన్నయ్య ఒకరు. ఆయన రామానాయుడిగారిలా వంద సినిమాలు తీస్తారు. ఆ జర్నీలో నేనూ ఉంటాను. మాతోపాటు విడుదలవుతున్న 'తొలి ప్రేమ', 'గాయత్రి' సినిమాలు పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నా'' అన్నారు. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ– ''అత్తకి యముడు అమ్మాయికి మొగుడు' సినిమా వంద రోజుల ఫంక్షన్ తర్వాత ఆ రేంజ్‌లో గ్రాండ్‌గా జరుగుతున్న ఫంక్షన్ 'ఇంటిలిజెంట్'. నాకెంతో ఇష్టమైన డైరెక్టర్ వినాయక్‌గారు. ఇంత మంచి సినిమా చేసే చాన్స్ ఇచ్చారు. ప్రేక్షకులకు, మెగా ఫ్యాన్స్‌కు ఈ సినిమా గుర్తుండిపోయేలా ఉంటుంది. మెగాస్టార్, పవర్‌స్టార్, మెగాపవర్‌స్టార్, స్టైలిష్ స్టార్, వరుణ్.. నాకు పంచభూతాలు. చిరంజీవిగారు, పవన్‌కల్యాణ్‌గారు, నాగబాబుగారు నాకు గురువులు. వారు లేకుండా ఈ స్టేజ్‌పై నేను లేను'' అన్నారు. ''ఇప్పటివరకు తేజ్ చేసిన సినిమాలు వేరు. ఈ సినిమా వేరు. వినాయక్ సినిమాను ఇరగదీశారు. పాటలు చూస్తుంటే చిరంజీవిగారి సాంగ్స్ చూస్తున్నట్లుంటుంది. ఓ దర్శకుడు కారు దిగగానే సింహం, పులి, ఏనుగులా గంభీరంగా అనిపించేవారిలో దాసరిగారు ఒకరు. ఆయన తర్వాత అలా అనిపించే దర్శకుడు వినాయక్ మాత్రమే'' అన్నారు సి.కల్యాణ్.

చిట్టిబాబుతో చిందులు


పూజా హెగ్డే

ఆ రోజు చిట్టిబాబు ఫుల్ ఖుషీగా ఉన్నాడు. ఓ పాట పాడాలనుకున్నాడు. రెచ్చిపోయి స్టెప్పులు వేయాలనుకున్నాడు. చిట్టిబాబుకి 'సై' చెప్పింది అందాల భామ. ఈ ఇద్దరూ చిందులేస్తుంటే ఊరుకోలేక మరికొంతమంది కాలు కదిపారు. 'రంగస్థలం' సినిమాకి ఈ సాంగ్ స్పెషల్ ఎట్రాక్షన్. ఇంతకీ చిట్టిబాబు ఎవరో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ సినిమాలో రామ్‌చరణ్ క్యారెక్టర్ పేరిది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, చెరుకూరి మోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్, పూజా హెగ్డే పాల్గొనగా ఓ ప్రత్యేక పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ స్పెషల్ సాంగ్ కోసం భారీ సెట్ వేశారు. సోమవారం మొదలైన ఈ పాట చిత్రీకరణకు మొత్తం ఐదు రోజులు పడుతుంది. రామ్‌చరణ్, పూజా హెగ్డేలతో పాటు 200 మంది డ్యాన్సర్లు ఈ పాటకు స్టెప్స్ వేస్తున్నారు. డ్యాన్స్ మాస్టర్ జానీ స్టెప్స్ సమకూరుస్తున్నారు. ఇటీవల ఈ సినిమా కోసం రాజమండ్రిలో రెండు పాటలు చిత్రీకరించారు. ఒక్కో పాటకు దాదాపు 2 కోట్ల రూపాయలు ఖర్చు అయిందట. ఇప్పుడు తీస్తున్న స్పెషల్ సాంగ్‌కి కూడా అంతే అవుతుందని యూనిట్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ పాటతో సినిమా ఆల్మోస్ట్ కంప్లీట్ అవుతుంది. 1985 నేపథ్యంలో సాగే ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. రామ్‌చరణ్ లుక్, టీజర్‌కి మంచి స్పందన లభించింది. మార్చిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.

మంచి ఫీల్‌తో...


తరుణ్

'**ను**వ్వే కావాలి, నువ్వు లేక నేను లేను, నువ్వే నువ్వే' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించడంతో పాటు లవర్ బాయ్ ఇమేజ్ సొంతం చేసుకున్నారు తరుణ్. ఆయన హీరోగా నటించిన తాజా సినిమా 'ఇది నా లవ్ స్టోరీ'. రమేష్ గోపి దర్శకత్వంలో అభిరామ్ సమర్పణలో ఎస్.వి.ప్రకాష్ నిర్మించారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 14న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. తరుణ్ మాట్లాడుతూ– ''ఫీల్ గుడ్ ఫిల్మ్ ఇది. ట్రైలర్, సాంగ్ టీజర్‌కి సోషల్ మీడియాలో విశేషమైన స్పందన వచ్చింది. యూత్‌తో పాటు అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు. ''కుటుంబమంతా కలిసి చూడదగ్గ క్లీన్ లవ్ స్టోరీగా తెరకెక్కిన చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా ఉంటుంది. కోలీవుడ్ క్రేజీ హీరోయిన్ ఓవియా మా సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమవుతున్నారు'' అన్నారు రమేష్ గోపి. ''2018 ది బెస్ట్ మూవీస్‌లో 'ఇది నా లవ్ స్టోరీ' ఒకటిగా నిలుస్తుంది. ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు ఎస్.వి.ప్రకాష్.

ప్రేమికుల రోజున శాంపిల్


నితిన్

'రౌడీ ఫెలో' సినిమాతో సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు కృష్ణచైతన్య. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న కొత్త చిత్రం ఒక్క పాట మినహా పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ – ''అమెరికా, హైదరాబాద్, ఊటీలో షూటింగ్ జరిపాం. మోషన్ పోస్టర్‌ను ఈ నెల 12న, టీజర్‌ను వేలెంటేన్స్ డే సందర్భంగా 14న, సినిమాను ఏప్రిల్ 5న రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అని అన్నారు. ''ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రం ఇది. ప్రేమతో పాటు వినోదం కూడా అదే స్థాయిలో ఉంటుంది'' అన్నారు దర్శకుడు. ఇది నితిన్‌కి 25వ సినిమా కావడం, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కథ అందించడం విశేషం. ఈ సినిమాకు సంగీతం: తమన్, కెమెరా: ఎం.నటరాజ సుబ్రమణియన్, నిర్మాత: సుధాకర్ రెడ్డి, స్క్రీన్ ప్లే–మాటలు–దర్శకత్వం: కృష్ణ చైతన్య.

అనాథలు లేని సమాజం కోసం


అక్షిత, ఈశ్వర్

సాత్విక ఈశ్వర్‌ని హీరోగా పరిచయం చేస్తూ ప్రభాస్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సత్య గ్యాంగ్'. అక్షిత కథానాయిక. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై మహేష్ ఖన్నా నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ జరుగుతోంది. ఈ చిత్రం నిర్మించడంతో పాటు దర్శకత్వ పర్యవేక్షణ చేస్తున్న మహేష్ ఖన్నా మాట్లాడుతూ– ''సమాజంలో అనాథలనేవారు ఉండకూడదనే కథాంశంతో రూపొందుతోన్న చిత్రమిది. సందేశానికి వినోదాన్ని మేళవించి తీస్తున్నాం. సుమన్, సుహాసినిలపై ప్రస్తుతం కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. సాత్విక ఈశ్వర్‌కి చాలా మంచి భవిష్యత్ ఉంది. మరో వారం పాటు జరిగే షూటింగ్‌తో పాటలు సహా సినిమా పూర్తవుతుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులూ జరుగుతున్నాయి. త్వరలో పాటలు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ప్రత్యూష్, హర్షిత, ప్రభాకర్, షఫీ, జీవా, వినోద్, మహేష్ ఖన్నా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అడుసుమిల్లి విజయ్ కుమార్, సంగీతం–దర్శకత్వం: ప్రభాస్.

వ్యవసాయం తీరు మారితే.. భూతాపోన్నతి తగ్గుతుంది!

భూతాపోన్నతి పుణ్యమా అని భూగోళం భగ్గుమంటోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంకొన్నేళ్లలోనే జీవరాశులేవీ బతికే పరిస్థితి ఉండదు. ఈ విపత్తును తప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా ఏఆర్‌సీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ శాస్త్రవేత్తలు ఓ వినూత్న ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. పంటభూముల వినియోగంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా భూమి సగటు ఉష్ణోగ్రతలను రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ వరకూ తగ్గించవచ్చునని వీరు అంటున్నారు. దీంతోపాటు అధిక జనాభా గల నగరాల్లో భవనాలు,



రోడ్లు అన్నింటికీ తెల్లరంగు వేయడం... దుక్కుల్లేకుండా వ్యవసాయం చేయడం ద్వారా భూమి నుంచి విడుదలయ్యే రేడియోధార్మికత గణనీయంగా తగ్గుతుందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన శాస్త్రవేత్త యాండీ పిట్‌మన్ అంటున్నారు. ఈ చర్యల వల్ల ఇబ్బందులేవీ ఎదురుకావని, ఎక్కడికక్కడ ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల వ్యయప్రయాసలు తక్కువగానే ఉంటాయని యాండీ వివరించారు. కంప్యూటర్ మోడలింగ్ ద్వారా, వ్యవసాయం ద్వారా వెలువడుతున్న రేడియోధార్మికతలో మార్పులు చేసి తాము విశ్లేషించామని చెప్పారు. తాము సూచించిన చర్యలు చేపడితే సగటు ఉష్ణోగ్రతలతోపాటు విపరీత వాతావరణ పరిస్థితులు కూడా తగ్గుతాయని చెప్పారు. అధ్యయన వివరాలు నేచర్ జియోసైన్సెస్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

పట్టుదారం గుట్టు తెలిసింది..

పట్టు వస్త్రాలు కట్టుకుంటే వచ్చే లాభమేమిటి? అందంగా కనిపించడం కాసేపు పక్కనబెడితే.. పట్టు వస్త్రాలు శరీరాన్ని చలికాలంలో వెచ్చగా.. ఎండాకాలంలో చల్లగానూ ఉంచుతాయి. అయితే ఏంటి? అనొద్దు.. ఇలాంటివే అనేక మంచి లక్షణాలున్న పట్టు సూపర్ మెటా మెటీరియల్ అంటున్నారు పర్‌డ్యూ శాస్త్రవేత్తలు. పది నుంచి 20 మైక్రాన్ల మందం ఉండే పట్టుపోగుల్లో అతిసూక్ష్మమైన పోగులు మరిన్ని ఉంటాయని.. నానో స్థాయిలో ఉండే నిర్మాణాల కారణంగా దీనికి అనేక అద్భుత లక్షణాలు చేకూరుతున్నాయని యంగ్ కిమ్ అనే శాస్త్రవేత్త



ప్రయోగపూర్వకంగా తెలుసుకున్నారు. ఈ లక్షణాలను పూర్తిగా అర్థం చేసుకుని అచ్చం ఇలాంటి నిర్మాణాలతో కృత్రిమ పదార్థాలను తయారు చేయవచ్చునని కిమ్ తెలిపారు. వైద్యరంగంతోపాటు బయోసెన్సింగ్‌లోనూ ఈ మెటా మెటీరియల్స్ ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కాంతి కణాలను దాదాపుగా నిలువరించగల మెటామెటీరియల్స్‌ను ఇప్పటికే కృత్రిమంగా తయారు చేసినప్పటికీ వాణిజ్యస్థాయిలో.. చౌకగా ఉత్పత్తి చేయడం మాత్రం సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో పట్టు వంటి సాధారణ పదార్థం ద్వారా మెటా మెటీరియల్ లక్షణాలను సాధించగలిగితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అంచనా. అంతే కాకుండా పట్టు దారాలు ఒకచోట ఉండే వేడిని ఇంకోచోటికి తరలించేందుకు, అది కూడా అతితక్కువ నష్టంతో జరిగేందుకు ఉపయోగపడతాయని కిమ్ చెబుతున్నారు.

ఈలాన్ మస్క్ ప్లాన్... ఇల్లిల్లూ ఓ జనరేటర్

సౌరశక్తిని వాడుకునే విషయంలో ఉన్న ప్రధాన అడ్డంకి... ప్యానెల్స్ కోసం పెట్టే పెట్టుబడి. వేలల్లో పెట్టుబడి పెడితే వందల్లో కరెంటు బిల్లు ఆదా అవుతుంది కాదా అని చాలామంది సౌరశక్తి వాడకం విషయంలో వెనుకంజ వేస్తుంటారు. ఈ సమస్యను తీర్చేందుకు టెస్లా కార్ల కంపెనీ వ్యవస్థాపకుడు ఈలాన్ మస్క్ ఓ వినూత్నమైన ప్రణాళిక సిద్ధం చేశాడు. తన కంపెనీ ఉత్పత్తి చేస్తున్న సోలార్ పెంకులు, బ్యాటరీలను



50 వేల ఇళ్లకు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించారు. దక్షిణ ఆస్ట్రేలియాలో ఈ ప్రయోగం జరగబోతోంది. పైకప్పులకు వాడే పెంకుల మాదిరిగానే మస్క్ కంపెనీ సోలార్ ప్యానెల్స్ తయారు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రయోగంలో భాగంగా ముందు వెయ్యి ఇళ్లల్లో ఈ ప్యానెల్స్, బ్యాటరీలను ఏర్పాటు చేస్తారు. వీటిద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ముందుగా ఆ వెయ్యి కుటుంబాల వారు ఉచితంగా వాడుకుంటారు. వాడుకోగా మిగిలిన విద్యుత్తును బ్యాటరీలలో నిల్వ చేస్తారు. అవసరమైనప్పుడు గ్రిడ్‌కు పంపుతారు. ఇలా సంపాదించే డబ్బుతోనే ప్యానెల్స్, బ్యాటరీల ఏర్పాటుకు పెట్టిన ఖర్చును రాబట్టుకునేందుకు మస్క్ ప్రణాళిక సిద్ధం చేశాడు. ఐడియా భలే ఉంది కదూ...

విజయవాడ
మంగళవారం
6-2-2018
సాక్షి ఫ్యామిలీ

కోడలు ఇంటికొచ్చేది ఇంటి దీపం వెలిగించడానికి... కోడలు కళను తెస్తుందని, సిరిని తెస్తుందని భావిస్తారు. కోడలు కాలు పెట్టిన వేళా విశేషం అని ఏదైనా మంచి జరిగితే చెప్పకుంటారు. భర్తకు భార్యగా పిల్లలకు తల్లిగా ఉండే కోడలు అత్తామామలకు తల కొరివి పెట్టాల్సి వస్తే? ఇలాంటి ఆచారం ఎక్కడా లేదు. కాని ఆ ఊరిలో ఆ ఇంట్లో ఉంది. గత ఏడెనిమిది తరాలుగా అలాగే జరుగుతోంది.

● ఆ ఇంట్లో

కోడలే కొరివి పెట్టాలి

● అంతిమసంస్కారాలన్నీ కోడలి చేతుల మీదుగానే
● మామ చనిపోతే పెద్దకోడలు, అత్త చనిపోతే చిన్న కోడలు
● 'ఆకుల'వారి కుటుంబంలో తరతరాల ఆచారం



ప్రతీకాత్మక చిత్రం

హిందూ సంప్రదాయం ప్రకారం తండ్రి చనిపోతే పెద్ద కొడుకు, తల్లి చనిపోతే చిన్న కొడుకు తలకొరివి పెడతారు. కొడుకులు లేని చోట అన్నదమ్ముల కొడుకులు కొరివి పెడుతుంటారు. కాని 'ఆకుల' వారి కుటుంబంలో మాత్రం 'కోడళ్లే' అత్తామామలకు తలకొరివి పెడుతారు. ఇది ఏడెనిమిది తరాలుగా వస్తున్న సంప్రదాయం. కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి గ్రామంలో గౌడ కులానికి చెందిన 'ఆకుల' వారి వంశవృక్షంలో 24 కుటుంబాలు ఉన్నాయి. వారి ఇళ్లలో తండ్రి చనిపోతే పెద్ద కొడుకుకు బదులు పెద్ద కోడలు, తల్లి చనిపోతే చిన్న కొడుక్కు బదులు చిన్న కోడలు తలకొరివి పెడతారు. అంతిమసంస్కారాలతో పాటు శ్రాద్ధకర్మలు కూడా కోడళ్లే చేయాల్సి ఉంటుంది. ఆ కార్యక్రమాలు చేసే చోటుకి కొడుకులను అనుమతించరు. తండ్రి చనిపోయాడని బాధపడే కొడుకులు తండ్రి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అందరిలాగే కార్యక్రమంలో పాల్గొంటారు తప్ప అంతిమ సంస్కారాలు మాత్రం చేసే అవకాశం ఉండదు.

ఈ ఆచారం ఎక్కడిది?

ఆకుల వారి వంశంలో ఏడెనిమిది తరాల క్రితం తండ్రి చనిపోయినపుడు కొడుకు కొరివి పెట్టాడు. అనుకోకుండా కొడుకు చనిపోయాడు. వయసులో ఉన్న కొడుకు చనిపోవడంతో ఆ కుటుంబం ఆందోళనకు గురైంది. తండ్రికి కొరివి పెట్టిన కొంతకాలానికే కొడుకు చనిపోవడాన్ని ఏదో కీడుగా భావించిన కుటుంబ సభ్యులు తరువాత ఎవరు చనిపోయినా కొడుకులతో అంతిమ సంస్కారం, శ్రాద్ధకర్మలు చేయించకూడదని నిర్ణయించుకున్నారట. అప్పటినుంచి వారి ఇళ్లలో ఎవరు చనిపోయినా కోడళ్లే కొరివి పెట్టే పద్ధతి కొనసాగుతోంది.

అదృష్టంగా భావిస్తారు...

ఇల్లన్నాక అత్తాకోడళ్ల మధ్య ఏవో చిన్న చిన్న పేచీలు ఉండనే ఉంటాయి. కాని ఆకుల వారి కుటుంబంలో అత్తలు కోడళ్లని బాగా చూసుకుంటారనే పేరు ఉంది. కోడళ్లకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఎందుకంటే అత్తామామలు చనిపోతే అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సింది వారే కదా. అలా అని కోడళ్లు అత్తామామలను చిన్నచూపు చూడరు. ఎంతో అభిమానంగా చూసుకుంటారు. వారికి చివరి కర్మలు నిర్వహించాల్సి రావడం తమ అదృష్టంగా భావిస్తారు. ఒకవేళ పురుష సంతానం లేక కూతుళ్లే ఉన్నట్టయితే ఆకుల వారి కుటుంబంలో అన్నదమ్ముల కోడళ్లు అంతిమ సంస్కారం నిర్వహిస్తారు.

ఎక్కడా కనిపించని కోడలు కొరివి పెట్టే సంప్రదాయం ఆ కుటుంబంలో నిరంతరంగా కొనసాగుతోంది. వారి ఇళ్లలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల యాత్ర వెళుతుంటే గ్రామస్తులంతా ఇప్పటికీ ఎంతో ఆసక్తిగా చూస్తుంటారు.

– సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి,
ఫోటోలు: అరుణ్

మా అత్త చితికి నేనే అగ్గిపెట్టిన...



నాకు ఇప్పుడు తొంబై ఏండ్లు ఉన్నయి. యాబై ఏండ్ల కిందట మా అత్త సచ్చిపోయింది. అప్పుడు నేను మా అత్తకు అగ్గిపెట్టిన. మా ఇండ్లళ్ల ఏడెనిమిది తరాల సంది గిట్లనే నడుస్తుంది. కోడండ్లే కొడుకుల లెక్క అన్ని చేస్తరు. అత్త, మామలకు అగ్గిపెట్టుడు అదృష్టమే. ఎవల ఇండ్లల్ల అయినా కొడుకులు పెడుతరు. మా ఇండ్లల్ల మాత్రమే కోడండ్లు అగ్గి పెడుతరు.

– ఆకుల లింగవ్వ

మా మామ చనిపోతే నేనే చేసిన...



మా మామ చనిపోయినపుడు అన్నీ నా చేతుల మీదుగానే చేయించిండ్రు. ఎనకట అగ్గివట్టిన కొడుకు చనిపోయిండ్రని కోడండ్లతోని చేయించుడు మొదలుపెట్టిండ్రు. అప్పటి నుంచి అదే సంప్రదాయం నడుస్తుంది. మేం అట్లనే నడుసుకుంటున్నం. ముందు ముందు గూడ మా పిల్లలు అట్లనే నడుసుకుంటరు. చావు దగ్గరి నుంచి దినాలు, మాసికాలు, యాడాది దినం కూడా కోడండ్ల చేతుల మీదుగనే నడుస్తయి.

– ఆకుల దేవేంద్రవ్వ

అత్త, మామ ఇద్దరికీ నేనే అగ్గివట్టిన...



మా అత్త సచ్చిపోయినపుడు, మా మామ సచ్చిపోయినపుడు నేనే అగ్గివట్టిన. కోడలు సేవ చేసుడే కాదు. అగ్గివట్టుడు, కర్మ చేసుడు అదృష్టం అనుకుంటం. కొడుకులు ఏ పని ముట్టద్దు. అన్ని పనులు కోడండ్ల చేతులతోనే చేయిస్తం. మా ఇండ్లల్ల కోడండ్లకు మంచి గౌరవం ఉంటది. చాన మంది మేనళ్లను చేసుకున్నం. మా ఇంట్ల మూడు తరాలు మేనోళ్లే ఉన్నరు.

– ఆకుల పెద్ద గంగవ్వ

మా మామకు నేనే చేసిన...



నాకు పెళ్లయిన కొత్తల కోడండ్లు అగ్గిపెడుతరని చూసి ఆశ్చర్యమనిపించింది. ఎక్కడా లేని సంప్రదాయం ఈడనే చూసిన. మొదట్ల ఇదేం సంప్రదాయమో అనుకున్న. కొడుకుతో కోడలు సమానం అన్న భావన నాకు అర్థమైంది.

– ఆకుల అనసూయ

సూర్యనమస్కారాలతో శారీరక, మానసిక ఆరోగ్యం

ఎముకలు ఆరోగ్యంగా పెరగాలంటే మన శరీరానికి డి విటమిన్ ఎంతో అవసరం. ఇది సూర్యరశ్మి నుంచి సమృద్ధిగా లభిస్తుంది. అందుకే కాబోలు, పూర్వం మన పెద్దవాళ్లు సూర్యనమస్కారాలు చేసేవారు. ఇప్పుడు కొందరు వైద్యులు కూడా సూర్యనమస్కారాలు చేయమని చెబుతుంటారు. సూర్యనమస్కారాల ప్రయోజనమేమిటో చూద్దాం. సూర్య నమస్కారం అనేది పేరు ఒక్కటే అయినా, అందులో 12 రకాల ఆసనాలు ఉంటాయి. ఈ పన్నెండు చేస్తే ఒక వృత్తం పూర్తయినట్లు! వీటిలో ఒకటి నుంచి ఐదు; ఎనిమిది నుంచి పన్నెండు ఆసనాలు ఒకేలా ఉంటాయి. కుడి, ఎడమల తేడా మాత్రమే ఉంటుంది. సూర్య నమస్కారాలతో ఎముకలు, కండరాలు బలోపేతమై ఆరోగ్యంగా ఉండటమే కాదు; మధుమేహం, బీపీ, గుండె జబ్బుల నుంచి కూడా



ఉపశమనం లభిస్తుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. సూర్య నమస్కారాలలో 12 రకాల భంగిమలు ఉంటాయి. వీటిలో కొన్నింటిని నెమ్మదిగా చేయాలి. మరి కొన్నింటిని వేగంగా చేయాలి. వేగంగా చేసే భంగిమల్లో కండరాలకు మేలు జరుగుతుంది. ఏరోబిక్స్‌తో సమానమైన ఫలితాలు సాధించవచ్చు. నెమ్మదిగా చేసే సూర్య నమస్కారాలు శ్వాస నియంత్రణకు ఉపయోగపడతాయి. ఎక్కువ గాలిని పీల్చి, వదలడం ద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుందని సైన్సు చెబుతోంది. సూర్య నమస్కారాల వల్ల మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. సూర్య నమస్కారాలు శరీర భాగాలపైనే కాకుండా వివిధ రకాల గ్రంథులపైనా పని చేస్తాయి. థైరాయిడ్, పార్థరాయిడ్, పిట్యూటరీ వంటి గ్రంథులు సాధారణ స్థాయిలో పని చేయడానికి ఇవి ఎంతో ఉపకరిస్తాయి.

బాబుకు ఛాతీలో నెమ్ము, ఏం చేయాలి?

మా బాబు వయసు 14 నెలలు. ఛాతీలో నెమ్ము ఉందని డాక్టర్లు చెప్పారు. యాంటీబయాటిక్ ఇంజెక్షన్స్ చేశారు. మాకు చాలా ఆందోళనగా ఉంది. ఇలా నెమ్ము ఎందుకు వస్తుంది? దాని విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా చెప్పండి.

– ఎమ్. సుప్రియ, రాజమండ్రి

మీ బాబుకు ఉన్న కండిషన్‌ను వైద్య పరిభాషలో నిమోనియా అంటారు. పిల్లల్లో ప్రమాదకరంగా మారేందుకు కారణమయ్యే వ్యాధుల్లో నిమోనియా ఒకటి. డయేరియా తర్వాత పిల్లల్లో ప్రమాదకరంగా పరిణమించే వ్యాధుల్లో ఇది రెండోదని చెప్పవచ్చు. వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు నిమోనియాకు అత్యంత ప్రధాన కారణాలు.



కొన్ని సందర్భాల్లో కొన్ని శరీర నిర్మాణపరమైన లోపాల (అనటామికల్ ప్రాబ్లమ్స్) వల్ల, రోగనిరోధక శక్తి లోపాల (ఇమ్యునిటీ ప్రాబ్లమ్స్) వల్ల కూడా పదే పదే నిమోనియా కనిపించవచ్చు. ఒక ఏడాదిలో వ్యవధిలోనే రెండు మూడు సార్లు నిమోనియా వస్తే అలాంటి పిల్లల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. అలాగని మొదటిసారి వచ్చినప్పుడు నిర్లక్ష్యం వహించడం సరికాదు. నిమోనియా వచ్చినప్పుడు వారం నుంచి పది రోజుల పాటు యాంటీబయాటిక్స్‌తో పిల్లలకు సరైన వైద్య చికిత్స అందించడం ఎంతైనా ముఖ్యం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

● ఇలాంటి పిల్లలను మిగతా సాధారణ పిల్లల్లాగానే పరిగణించవచ్చు. అయితే సమూహాలుగా జనం ఉన్న ప్రాంతాలకు పిల్లలను పంపకూడదు. చాలా తీవ్రమైన ఇన్ఫెక్షన్లతో బాధపడేవారి నుంచి పిల్లలను దూరంగా ఉంచాలి.

● పిల్లలందరికీ టీకాలు వేయించడం (ఇమ్యూనైజేషన్) చాలా ప్రధానం. హెచ్‌ఐబీ, నిమోకోకల్ వ్యాక్సిన్లు, ఫ్లూ వైరస్ వ్యాక్సిన్‌లతో నిమోనియాను చాలా వరకు నివారించవచ్చు. మీ బాబుకు ఈ వ్యాక్సిన్లు వేయించడం తప్పనిసరి. నిమోనియా వచ్చిన పిల్లలకు యాంటీబయాటిక్స్‌తో పాటు వాళ్లలో కనిపించే లక్షణాలకూ చికిత్స చేయడం (సపోర్టివ్ కేర్) అవసరం.

పాపకు మళ్లీ చెవి నొప్పి... తగ్గేదెలా?

మా పాప వయస్సు ఆరేళ్లు. రెండు నెలల క్రితం మా పాపకు జలుబు వస్తే ఈఎన్‌టీ స్పెషలిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాం. ఆయన ముక్కు నుంచి చెవికి ఉండే ఎడినాయిడ్ గ్రంథి బ్లాక్ అయిందన్నారు. తగ్గిపోయాక ఇప్పుడు మళ్లీ మరో పక్క చెవి నొప్పిగా ఉందని అంటోంది. మళ్లీ ఇలా వచ్చే అవకాశం ఉందా?

– శాంతిశ్రీ, మధిర

మీరు చెబుతున్న అంశాలను బట్టి మీ పాపకు ఉన్న కండిషన్‌ను 'అడినాయిడైటిస్ విత్ యూస్టేషియన్ కెటార్' అని చెప్పవచ్చు. ఎడినాయిడ్స్ అనే గ్రంథులు ముక్కు వెనకాల, టాన్సిల్ పైన ఉంటాయి. ఈ గ్రంథులకు టాన్సిల్స్ తరహాలో ఇన్ఫెక్షన్ రావచ్చు. ఇది కొన్ని వారాలు, నెలలు ఉండవచ్చు. చిన్న పిల్లల్లో ఈ కండిషన్‌ను తరచూ చూస్తుంటాం. ఇలాంటిది జరిగినప్పుడు మధ్య చెవి నుంచి ముక్కు వెనుక భాగంలో ఉండే యూస్టేషియన్ ట్యూబులో కొన్ని మార్పులు జరగవచ్చు. ఎడినాయిడ్ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు సైనుసైటిస్,



ముక్కు రంధ్రాలు మూసుకుపోవడం (బ్లాక్ కావడం), నోటితో గాలి పీల్చడం, నిద్రపట్టడంలో ఇబ్బంది (రెస్ట్‌లెస్ స్లీప్) వంటి ఇతర లక్షణాలూ కనిపించవచ్చు. ఇలాంటి పిల్లలకు యాంటీహిస్టమిన్, యాంటీబయాటిక్ కోర్సులతో చికిత్స చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో నొప్పి ఉంటే పెయిన్ మెడికేషన్ కూడా అవసరం కావచ్చు. ఇలాంటి లక్షణాలు చాలా దీర్ఘకాలం కొనసాగితూ ఉంటే కొందరిలో చాలా అరుదుగా ఎడినాయిడ్స్‌ను తొలగించాల్సి రావచ్చు. మీరు మీ పీడియాట్రీషియన్ లేదా ఈఎన్‌టీ సర్జన్‌ను కలిసి తగిన చికిత్స తీసుకోండి.

ఈ వయసులోనే పాపాయికి కాళ్లనొప్పులా... ఎందుకిలా?

మా పాపకు ఏడేళ్లు. తరచూ కాళ్లనొప్పులంటూ ఏడుస్తోంది. ఇటీవల మరీ ఎక్కువగా ఉన్నట్లు గమనించాం. కొన్నిసార్లు నిద్రనుంచి లేవడం, కాసేపు కాళ్లు నొక్కాక అవి తగ్గడం, ఆ తర్వాత పడుకోవడం చేస్తోంది. మా డాక్టర్‌గారిని సంప్రదిస్తే ఆందోళన అక్కర్లేదని చెప్పారు. మా దగ్గరి బంధువుల్లో ఒక పెద్దావిడకు కూడా ఇలాగే కాళ్లనొప్పులు వస్తుంటే వారు డాక్టర్‌ను సంప్రదించారు. ఆమెకు రుమటాయిడ్ సమస్య అని చెప్పారు. మా పాపకు కూడా రుమటాయిడ్ సమస్య వచ్చి ఉంటుందంటారా? ఇవి దాని తాలూకు లక్షణాలా? మాకు తగిన సలహా ఇవ్వండి.

– నీరజ, నెల్లూరు

పిల్లల్లో కండరాల నొప్పులు కనిపిస్తున్నాయనేది చాలా సాధారణంగా వినిపించే ఫిర్యాదు. దాదాపు 10 శాతం నుంచి 30 శాతం మంది పిల్లల్లో రకరకాల స్థాయుల్లో కండరాల నొప్పులు (మస్క్యులో స్కెలెటల్ పెయిన్స్) కనిపిస్తుంటాయి. అయితే వీటిల్లో ఎక్కువగా కనిపించేవన్నీ చాలావరకు హానికరం కాని బినైన్ తరహావే. పిల్లల్లో ఇలా నొప్పి అని చెప్పేవాటిల్లో చాలావరకు ప్రమాదవశాత్తు దెబ్బతగలడం (ట్రామా), ఎక్కువగా ఆడటం (ఓవర్ యూజ్), పెరుగుదల సమయంలో మన ఎముకల్లో (స్కెలెటల్ గ్రోత్) కనిపించే హెచ్చుతగ్గుల వంటి చాలా సాధారణ సమస్యల వల్లనే కనిపిస్తుంటాయి.

ఇక పిల్లల్లో కనిపించే నొప్పుల్లో ఏది ఏది ప్రమాదకరం కానిది లేదా ప్రమాదకరమైనది అని నిర్ణయించేందుకు ఈ సూచనలను గమనించండి.

ప్రమాదకరం కానివి

1. ఏదైనా పనిచేయగానే పెరిగేవి, విశ్రాంతి తీసుకున్న తర్వాత తగ్గేవి
2. సాయంత్రంపూట, రాత్రి పూట కనిపించేవి
3. కీళ్ల దగ్గర వాపు లేకపోవడం, ముట్టుకుంటే నొప్పి/మంట (టెండర్‌నెస్) లేకపోవడం.
4. పిల్లల్లో పెరుగుదల మామూలుగానే ఉండటం
5. ల్యాబ్ పరీక్షలు / ఎక్స్-రే పరీక్షలు నార్మల్‌గా ఉండటం.
6. జ్వరం వంటి లక్షణాలేమీ లేకుండా ఉండటం.

ప్రమాదకరమైనవి

1. ఏదైనా పనిచేయగానే కాస్తంత ఉపశమనం అనిపించేవి, విశ్రాంతి తీసుకున్నా తగ్గనివి
2. ఉదయం వేళల్లోనూ, చాలా రాత్రి గడిచాక కనిపించేవి
3. కీళ్ల దగ్గర వాపు కనిపించేవి, ముట్టుకుంటే నొప్పి/మంట (టెండర్‌నెస్) ఉండటం. కీళ్లు బిగుసుకుపోయి, కదలికలు తక్కువగా ఉండటం.
4. పిల్లల్లో పెరుగుదల తక్కువగా ఉండటం.
5. ల్యాబ్ పరీక్షలు / ఎక్స్-రేలో మార్పులు ఉండటం.
6. జ్వరం వంటి లక్షణాలు కనిపించడం.

మీరు మీ లేఖలో మీ పాపకు పైన పేర్కొన్న తీవ్రమైన / ప్రమాదకరమైన లక్షణాలేమీ ఉన్నట్లు చెప్పలేదు. కాబట్టి అవి అంత తీవ్రమైనవి కావనీ, హానికరం కానివేనని భావించవచ్చు. పిల్లలు పెరిగే సమయంలో కనిపించే సాధారణమైన నొప్పులుగా (అంటే నాక్చర్నల్ పెయిన్స్ ఆఫ్ చైల్డ్‌హుడ్‌గా) వీటిని పరిగణించవచ్చు. పెరుగుతున్నప్పుడు 20 శాతం మంది పిల్లల్లో ఇలా నొప్పులు కనిపించడం చూస్తుంటాం. పెరిగే పిల్లల్లో కీళ్ల నొప్పులు, తొడ, పిక్కల్లో ఇవి కనిపిస్తూ తరచూ వచ్చిపోతుంటాయి. మసాజ్ చేయగానే లేదా కొద్దిపాటి పెయిన్‌కిల్లర్స్‌తో ఇవి తగ్గిపోతుంటాయి. మర్నాడు ఉదయానికి ఈ నొప్పులు ఉండవు. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ నొప్పులు క్రమేపీ తగ్గిపోతాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే



కొందరిలో నొప్పి భరించే శక్తి (పెయిన్ థ్రెషోల్డ్) తక్కువగా ఉంటుంది. ఇలాంటి పిల్లల్లో ఈ కండరాల నొప్పులతో పాటు పొట్టనొప్పి, తలనొప్పి వంటివి కూడా కనిపిస్తూ ఉండటం చూడవచ్చు.

ఇక మీ పాప విషయానికి వస్తే మీరు ఎలాంటి ఆందోళన చెందకుండా ఆమెకు అవసరమైనప్పుడు కొద్దిపాటి నొప్పి నివారణ మందుతో పాటు ధైర్యం చెప్పడం, ఆరోగ్యకరంగా నిద్రపుచ్చడం వంటివి చేస్తూ ఉంటే ఇవి క్రమేపీ తగ్గిపోతాయి.

ఇక మీరు మీ బంధువుల్లో పెద్దలెవరికో రుమాటాయిడ్ సమస్యను ప్రస్తావిస్తూ ఒక ప్రశ్న అడిగారు. మీ సందేహానికి జవాబు ఏమిటంటే... పిల్లల్లోనూ రుమటాయిడ్ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. దీన్నే జువెనైల్ రుమటాయిడ్ ఆర్థరైటిస్ అంటారు. కానీ మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీ పాపకు రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఉన్నట్లుగా ఏమాత్రమూ అనిపించడం లేదు. కాబట్టి మీరు ఆందోళన చెందకండి. పైన పేర్కొన్న విషయాలను ఒకసారి మీ పీడియాట్రీషియన్ లేదా రుమటాలజిస్ట్‌తో చర్చించి, వారు పాపకు ఏవైనా పరీక్షలు సూచిస్తే వాటిని చేయించి, నిశ్చింతగా ఉండండి.



డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్, రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

ఆకలి తీర్చేందుకు పంటలు పండించడం మాత్రమే కాదు..
మంచి మనసున్న సమాజానికి రూపుదిద్దడమే వ్యవసాయం పరమ లక్ష్యం!
- మసనోబు ఫుకుఓకా, జపాన్ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు

సాక్షి

సాగుబడి

'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 6 నుంచి...




రూగోస్ తెల్లదోమ


తెల్లదోమను అదుపు చేస్తున్న ఈగ(బదనిక)


శిలీంధ్రాన్ని తినే టెంకరెక్క పురుగు

విదేశాల నుంచి దిగుమతయ్యే వ్యవసాయోత్పత్తులు,మొక్కలు, పండ్లు, కాయలపై సరైన నిఘాలేకపోవడం వల్ల కొత్త రకం చీడపీడలు మన దేశంలోకి ప్రవేశించి రైతులకు తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. 'రూగోస్ వలయాకారపు తెల్లదోమ' తాజాగా ఈ జాబితాలోకి చేరింది. ఫ్లోరిడా నుంచి ఏడాదిన్నర క్రితం కేరళకు దిగుమతైన రూగోస్ తెల్లదోమ అక్కడి కొబ్బరి తోటలను చావుదెబ్బ తీసింది. తమిళనాడు, కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్, గోవాలకు పాకింది. ఉభయ గోదావరి జిల్లాల్లో నర్సరీలకు, కొబ్బరి, పామాయిల్ తోటలకు సోకింది. ఈ తోటలను కేరళకు చెందిన కేంద్రీయ వన్యతోట పంటల పరిశోధనా కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త డా. జోసెఫ్ రాజ్‌కుమార్ ఇటీవల పరిశీలించారు. రసాయనిక పురుగుమందులు చల్లకుండా ఉండటమే పరిష్కారమని 'సాగుబడి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.. ముఖ్యాంశాలు..

అల్లాడిస్తున్న తెల్లదోమ!

● కొబ్బరి, పామాయిల్ తోటలకు తీరని నష్టం ● రసాయనిక పురుగుమందులు వాడొద్దు.. సహజ పద్ధతుల్లోనే అదుపు చేయాలి ● 'సాగుబడి' ఇంటర్వ్యూలో కేరళ శాస్త్రవేత్త డా. జోసెఫ్ రాజ్‌కుమార్

● **ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి తోటలను తీవ్రంగా నష్టపరుస్తున్న కొత్త రకం తెల్లదోమ గురించి రైతాంగంలో ఇటీవల ఆందోళన నెలకొంది. ఈ తెల్లదోమ కేరళ మీదుగా ఇతర రాష్ట్రాలకు వ్యాపించిందని చెబుతున్నారు. ఇది కేరళకు ఎక్కడి నుంచి ఎప్పుడు వచ్చింది?**

2016 జూలైలో కేరళలో కొబ్బరి తోటలపై 'రూగోస్ వలయాకారపు తెల్లదోమ'(అల్యూరోడికస్ రుగియో పెర్యులేటస్) కనిపించింది. అమెరికాలోని ఫ్లోరిడా ప్రాంతం నుంచి తెచ్చిన పూల మొక్కల ద్వారా ఇది మన దేశంలోకి వచ్చింది. కేరళలోని అనేక జిల్లాల్లో కొబ్బరి తోటలను ఇది తీవ్రంగా నష్టపరిచింది. ఇక్కడి నుంచి తమిళనాడు, ఆంధ్రపదేశ్, కర్ణాటక, గోవాలకు పాకింది.

● **రూగోస్ తెల్లదోమను గుర్తించడమెలా?**

రూగోస్ తెల్లదోమ.. దక్షిణ భారత రాష్ట్రాల్లో విరివిగా జామ, కొబ్బరి తోటల్లో కనిపించే వలయాకార తెల్లదోమ(స్పైరలింగ్ వైట్‌ఫ్లై)ని పోలి ఉంటుంది. ఈ దోమ రెక్కల మీద గోధుమ రంగు పట్టీలను బట్టి రూగోస్ తెల్లదోమను గుర్తించవచ్చు. దీన్ని 2009లో ఫ్లోరిడా(అమెరికా)లో కొన్ని పూల మొక్కలపై తొలుత గుర్తించారు. మెక్సికో, గౌటెమాలాకు కూడా పాకింది. మన దేశంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కేరళలోని అన్ని జిల్లాలకు, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గోవాలకు వ్యాప్తిచెందింది. కోస్తా తీర ప్రాంతాల్లోని కొబ్బరి తోటలను ఆశిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో పొట్టి, హైబ్రిడ్ రకాల కొబ్బరి తోటలు, కొబ్బరి మొక్కలకు సోకింది. అయితే, కేరళలో ఎత్తయిన కొబ్బరి తోటలకు కూడా సోకినా, నష్టం తక్కువగా ఉంది.

● **రూగోస్ తెల్లదోమ ఆశించే ఇతర పంటలేవి?**

ఇది ప్రపంచవ్యాప్తంగా 43 కుటుంబాలకు చెందిన 118 పంటలకు, మొక్కలకు ఆశిస్తుంది. దక్షిణ భారతదేశంలో కొబ్బరితోపాటు మామిడి, జామ, అరటి, రామాఫలం, పనస చెట్లతోపాటు, కరివేపాకుపైన, హెలికోనియా అనే పూల జాతి మొక్కలపైన రూగోస్ తెల్లదోమ కనిపించింది. అయితే, వీటిలో ఒక్క అరటి మొక్కల మీద మాత్రమే ఇది తన పూర్తి జీవిత చక్రాన్ని పూర్తి చేయగలదు.

● **రూగోస్ తెల్లదోమ పంటలను ఎలా నష్టపరుస్తుంది?**

రూగోస్ తెల్లదోమ ఒక రకమైన రసంపీల్చే తరగతికి చెందిన రెక్కల పురుగు. ఇది సుమారు 2.5 మి.మీ. పొడవుతో మిగతా తెల్లదోమల కంటే పెద్దదిగా ఉంటుంది. ఆకుల అడుగు భాగంలో చేరి రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల చెట్లు ఒత్తిడికి గురవుతాయి. ఆకుల మీద అర్ధవృత్తాకారంలో వలయాలు వలయాలుగా గుడ్లు పెడుతుంది. ఈ వలయాలు తెల్లని దూదిలాంటి పదార్థాన్ని కలిగి ఉంటాయి... అంతేకాక, రెక్కల పురుగులు తేనె వంటి జిగురును విసర్జిస్తాయి. ఈ జిగురుకు నల్లరంగులో ఉండే ఒక శిలీంధ్రం(సూటి మౌల్డ్) ఆకర్షితమై.. ఆకులపై నల్లగా పరుచుకుంటుంది. దాని వల్ల కిరణజన్య సంయోజక క్రియ తగ్గి, చెట్టు బలహీన పడుతుంది. తెల్లదోమ తాకిడి తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు ఆకులేకాక, రెమ్మ మొదళ్లు, లేత కొబ్బరికాయలు సైతం తెల్లని దూదిలాంటి పదార్థంతో నిండిపోయి ఉంటాయి.

● **తెల్లదోమ తీవ్రత ఎలా ఉంది?**

దీన్ని ప్రకృతిసిద్ధమైన జీవనియంత్రణతోనే అదుపు చేయగలం. రసాయనిక పురుగుమందుల ద్వారా నియంత్రించలేం. రసాయనిక పురుగుమందుల వాడకం తక్కువ కాబట్టి కేరళలో 3–5 నెలల్లో రూగోస్ తెల్లదోమ తీవ్రత తగ్గింది. అయితే, తమిళనాడులో రసాయనిక పురుగుమందుల వాడకం ఎక్కువ కాబట్టి అక్కడ అదుపులోకి రాలేదు.

● **సహజ పద్ధతుల్లో తెల్లదోమను అదుపు చేసేదెలా?**

కందిరీగ జాతికి చెందిన చిన్న దోమ పరిమాణంలో ఉండే ఒక పరాన్నజీవి రూగోస్ తెల్లదోమ వృద్ధిని అదుపులో పెడుతుండటం గమనించాం. దీన్ని ఎన్‌కార్సియ గోడెలోపి అంటారు. వీటితోపాటు కొన్ని టెంకరెక్క పురుగులు (బీటిల్స్), సాలెపురుగులు కూడా ఈ తెల్లదోమ నియంత్రణలో తోడ్పడతాయి. రసాయనిక పురుగుమందులు ఎక్కువగా వాడిన తోటల్లో ఈ సహజ శత్రువులు తక్కువ సంఖ్యలో ఉంటున్నట్లు గమనించాం.

● **ఎటువంటి యాజమాన్య చర్యలు తీసుకోవాలి?**

తెల్లదోమ మరీ తీవ్రస్థాయిలో ఉంటే 0.5 శాతం వేపనూనె(లీటరు నీటికి 5 గ్రాముల వేపనూనె)ను పిచికారీ చేయాలి. నల్లని శిలీంధ్రం ఉధృతంగా పరచుకున్న ఆకుల మీద 1% మైదా పిండి (లీటరు నీటికి 10 గ్రాముల మైదా పిండి) ద్రావణాన్ని పిచికారీ చెయ్యాలి. తెల్లదోమ సహజ శత్రువులను బాగా వృద్ధి అయిన తోటల్లో నుంచి ఆకు ముక్కలను తీసుకెళ్లి.. ఉధృతంగా ఉన్న తోటల్లో చెట్లపైన ఉంచాలి. జిగురుతో కూడిన పసుపు అట్టలను చెట్ల మొదళ్లకు చుట్టాలి. తద్వారా కొంతవరకు ఈ దోమలను దిగ్బంధించవచ్చు. నల్ల శిలీంధ్రాన్ని తినే టెంకరెక్క పురుగులను గుర్తించి, పరిరక్షించాలి.

● **ఇంకా పాటించాల్సిన నియమాలేమైనా ఉన్నాయా?**

తెల్లదోమ తాకిడి గల ప్రాంతం నుంచి కొబ్బరి మొక్కలుగానీ, ఆకులు గానీ, కాయలుగానీ లేదా పామ్ సంతతికి చెందిన అలంకారపు మొక్కలు గాని వేరే ప్రాంతాలకు తరలించకూడదు. దోమ తాకిడి గల ప్రదేశాల నుంచి తాకిడి లేని ప్రదేశాలకు వెళ్లే రవాణా వాహనాలను పూర్తిగా శుద్ధి చేయాలి. విమానాశ్రయాలలో/నౌకాశ్రయాలలో మొక్కలు, కాయల తరలింపుపై కఠిన నియమాలను అమలు చేయడం ద్వారా హానికర చీడపీడల వ్యాప్తిని అరికట్టాలి.


డా. జోసెఫ్ రాజ్‌కుమార్

● **నర్సరీల నుంచి కొబ్బరి మొక్కల అమ్మకాలను ఆపెయ్యాల్సిన అవసరం ఉందా?**

పూర్తిగా ఆపెయ్యనక్కరలేదు. అయితే, రూగోస్ తెల్లదోమ లేదని నిర్ధారణ జరిగిన తర్వాతే నర్సరీ నుంచి కొబ్బరి మొక్కలను బయటకు పంపాలి. తెల్లదోమ ఆశించిన మొక్కలను ఇవ్వకూడదు.

● **ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఎలా ఉంది?**

పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో రూగోస్ తెల్లదోమ సోకిన కొబ్బరి తోటలను ఇటీవల పరిశీలించాను. రూగోస్ తెల్లదోమలు సోకిన చెట్ల మీద వీటిని సహజంగా అదుపు చేసే ఎన్‌కార్సియా గౌడలోపే రకం కందిరీగల్లాంటి పురుగులు కూడా కనిపించాయి. కాబట్టి, మరీ భయపడనక్కరలేదు. తెల్లదోమ తోటలను చంపెయ్యదు. రసాయనిక పురుగుమందులు అసలు వాడకుండా జాగ్రత్తలు పాటిస్తే కొన్నాళ్లలో తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది. రసాయనిక పురుగుమందులను చల్లితే మిత్రపురుగులూ చనిపోయి.. తెల్లదోమ ఉధృతి పెరుగుతుంది.

● **రసాయనిక పురుగుమందులను నిషేధించాలా?**

పశ్చిమ గోదావరి జిల్లాలో తెల్లదోమ ఉధృతంగా ఉన్న కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో, ఆ పరిసరాల్లో కనీసం 4–5 నెలల పాటు రసాయనిక పురుగు మందుల వాడకాన్ని కచ్చితంగా ఆపెయ్యాలి. ప్రభుత్వ పర్యవేక్షణలో రైతులు స్వచ్ఛందంగా ఈ జాగ్రత్త పాటించాలి. ఇలా జాగ్రత్తపడిన రైతుల తోటల్లో తెల్లదోమ అదుపులోకి వచ్చింది.

- ఇంటర్వ్యూ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

బదనికలు వదిలిన తర్వాత తెల్లదోమ తగ్గింది..



మా కొబ్బరి తోటకు సోకిన రూగోస్ తెల్లదోమ వలన దిగుబడి తగ్గుతుందని ఆందోళనగా ఉంది. ఆరు ఎకరాల్లో గోదావర గంగా టీఅండ్‌డీ రకం కొబ్బరిని సాగు చేస్తున్నాను. మొదటిసారిగా 2017 అక్టోబర్ నెలాఖర్లో కొబ్బరి తోటను తెల్లదోమ ఆశించింది. కొవ్వూరు, అంబాజీ పేట కొబ్బరి పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించి, తెల్లదోమ నివారణకు వేపనూనెను పిచికారీ చేయమని సూచించారు. మళ్లీ డిసెంబర్‌లో మరోసారి తెల్లదోమ విజృంభించింది. నిడదవోలు, చాగల్లు మండలాల్లో సుమారు 12 వందల హెక్టార్లో కొబ్బరికి, ఆరు వందల హెక్టారుల్లో పామాయిల్ తోటలకు తెల్లదోమ ఆశించింది. శాస్త్రవేత్తలు కేరళ నుంచి బదనికలు తీసుకువచ్చి జనవరి మొదటి వారంలో నా వ్యవసాయక్షేత్రంలో వదిలారు. బదనికలు వదిలాక తెల్లదోమ తీవ్రత తగ్గింది. తెల్లదోమను పూర్తి స్థాయిలో అరికట్టకపోతే పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయే అవకాశాలున్నాయి.

- ముళ్లపూడి మురళీకృష్ణ (94405 83725), కొబ్బరి రైతు, కలవలపల్లి, చాగల్లు మండలం, పశ్చిమగోదావరి జిల్లా

● నివాళి

శ్రీధర్ కుటుంబాన్ని ఆదుకునేదెన్నడు?



కర్నాల శ్రీధర్(27) యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన చిన్నకారు రైతు. ఒక ఎకరా 20 గుంటల భూమి. అందులో రెండు బోర్లు వేశాడు. ఒకటి ఫెయిల్ అయ్యింది. మరొకదానిలో కొద్దిగా నీళ్లు వచ్చాయి. మోటారు బిగించుకున్నాడు. కరెంట్ కనెక్షన్ తీసుకున్నాడు. వరి పంట వేశాడు. వరుసగా 3 సంవత్సరాలు వరి పంట నష్టపోయాడు. భార్య మంజుల ఒంటిమీద బంగారం అమ్మి వ్యవసాయంలో పెట్టుబడి పెట్టాడు. మళ్లీ పంట పోయింది. ఇక పంటలు సరిగా పండటం లేదని ఒక లక్షా 50 వేల పెట్టుబడితో రెండు ఆవులు, ఒక గేదెను తీసుకున్నాడు. ఒక ఆవు ప్రమాదవశాత్తూ బావిలో పడి చనిపోయింది. రెండో ఆవు అనారోగ్యంతో చనిపోయింది. సోదరుడితో కలసి కొంత బ్యాంకు రుణం, మిగిలినది ప్రైవేటు వ్యాపారి వద్ద వడ్డీకి తీసుకొని ట్రాక్టర్ తెచ్చుకున్నాడు. ట్రాక్టర్ మీద వచ్చే కొంత ఆదాయం అప్పు మీద వడ్డీలకే సరిపోయింది. కంతులు కట్టలేకపోవడంతో ఫైనాన్స్ వాళ్లు ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. అప్పుల బాధ భరించలేక శ్రీధర్ 2015 గణతంత్ర దినోత్సవం నాడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు రైతు ఆత్మహత్యగానే నమోదు చేసినా కుటుంబానికి ఎటువంటి పరిహారమూ అందలేదు. అతని భార్య మంజుల కుట్టుమిషన్ పెట్టుకొని ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఆమె ఎదురుచూపులు ఇంకెన్నేళ్లో?

● శిక్షణ

వ్యవసాయ యంత్రాలపై ఉచిత శిక్షణ

ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు తదితర వ్యవసాయ యంత్రాలను వాడే పద్ధతులు, వాటి నిర్వహణపై రైతులు, మహిళా రైతులు, గ్రామీణ యువతీ యువకుల్లో నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఏర్పాటైన 'దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ–పరీక్షణ సంస్థ (కేంద్ర వ్యవసాయ శాఖ అనుబంధ సంస్థ) నాలుగైదు వారాల పాటు ఉచిత శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నది. కనీస విద్యార్హత 8వ తరగతి కలిగి, 18 – 40 సంవత్సరాల లోపు ఉన్న రైతులు, మహిళా రైతులు, గ్రామీణ యువత, టెక్నీషియన్లు, డ్రాపౌట్ విద్యార్థులు మొదలైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సంస్థ డైరెక్టర్ డా. పీ పీ రావు తెలిపారు. అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతితో కూడిన శిక్షణతోపాటు, రోజుకు రూ.175ల శిక్షణ భృతిని చెల్లిస్తారు. ట్రాక్టర్ ఆపరేటర్, ట్రాక్టర్ మెకానిక్, పంట కోత యంత్రం ఆపరేటర్, వ్యవసాయ యంత్రాల ఆపరేటర్, ఇరిగేషన్ సర్వీస్ టెక్నీషియన్, అగ్రికల్చరల్ మెషినరీ రిపేర్ అండ్ మెయింటెనెన్స్ సర్వీస్ ప్రొవైడర్ వంటి 11 కోర్సులలో 4 లేక 5 వారాల శిక్షణ ఇస్తారు. 20–25 మంది కోరితే వారికి అనుగుణమైన తేదీల్లో శిక్షణ ఇస్తారు. మరిన్ని వివరాలకు..
Mail: fmti-sr@nic.in, web:srfmtti.dacnet.nic.in, Tele./Fax:08551 286441

11న సికింద్రాబాద్‌లో ఇంటిపంటల సాగుపై సదస్సు

సేంద్రియ పద్ధతుల్లో మేడలు, మిద్దెలపై కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఔషధమొక్కల సాగుపై సికింద్రాబాద్ వాయుపురి కాలనీ (నేరేడ్‌మెట్ దగ్గర)లోని వాయుపురి రిక్రియేషన్ సెంటర్‌లో ఈ నెల 11న ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు అవగాహన సదస్సు జరగనుంది. తెలంగాణ ఉద్యాన శాఖ, రైతునేస్తం ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. వివరాలకు.. 94920 75944, 94929 64797

ఈ టెర్రస్.. ఇంటిపంటల శిక్షణా కేంద్రం!



● మేడపైన 160 కుండీల్లో ఆకుకూరలు, ఔషధ మొక్కలు, పూల పెంపకం
● ఇంటిచుట్టూ కూరగాయలు, పండ్ల సాగు
● ఫేస్‌బుక్‌లో 'రైతుమిత్ర' బృందం ఏర్పాటు
● విశాఖవాసులకు అవగాహన కల్పిస్తున్న వర్మ, శ్రీదేవి దంపతులు

సింహాచలం అప్పన్న గోశాలకు కూత వేటు దూరంలో విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలోని దారపాలెంలో సొంత ఇల్లు నిర్మించుకున్న దాట్ల వర్మ, శ్రీదేవి దంపతులు సేంద్రియ ఇంటిపంటల సాగులో ఆదర్శవంతమైన కృషి చేస్తున్నారు.

వర్మ ప్రస్తుతం విజయనగరం ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్‌లో టెక్నికల్ అధికారిగా పనిచేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం సొంతిల్లు నిర్మించుకొని టెర్రస్ కిచెన్/మెడిసినల్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. 150కి పైగా ఖాళీ రంగు డబ్బాలలో మొక్కలు పెంచుతున్నారు.

ఇంటిపంటల జీవవైవిధ్యానికి నిదర్శనం: ఆకుకూరలు, కూరగాయలు, ఔషధ మొక్కలు, పూలమొక్కలతో పచ్చగా కళకళలాడే వారి టెర్రస్ గార్డెన్ జీవవైవిధ్యంతో సుసంపన్నంగా ఉంటుంది. ఘనజీవామృతం, జీవామృతం, పశువుల ఎరువు(గెత్తం), వర్మీకంపోస్టు, అవసరం మేరకు కషాయాలను వాడుతూ వర్మ దంపతులు మక్కువతో ఇంటిపంటలు సాగు చేస్తున్నారు. ఇంటి చుట్టూ నేలపైన, దగ్గర్లో తెలిసిన వారి ఖాళీ ఇంటి స్థలాల్లో కూరగాయలు, కందులు, పండ్ల మొక్కలను సాగు చేస్తూ.. పూర్తిగా ఇంటిపంటల ఆహారాన్నే తింటున్నారు. మేడపైన పుదీన, కొత్తిమీర, తోటకూర, పాలకూర తదితర ఆకుకూరలతోపాటు బీర, ఆనపకాయ, చిక్కుళ్లు, కంది,అరటి, వంకాయలు, బెండకాయలు, క్యాబేజి, టమోటా సాగు చేస్తున్నారు. ఇంటి చుట్టూ పెరట్లో పది రకాల పండ్ల చెట్లను పెంచుతున్నారు. హైదరాబాద్‌లోని ఇంటిపంట సాగుదారులు ఏర్పాటు చేసుకున్న ఫేస్‌బుక్ బృందం స్ఫూర్తితో ప్రధానంగా విశాఖ ప్రాంత ఇంటిపంట సాగుదారులకు సహాయ పడటానికి కొత్తవలసకి చెందిన కర్రి రాంబాబుతో కలిసి ఫేస్‌బుక్‌లో రైతుమిత్ర పేరిట బృందాన్ని ప్రారంభించారు.

ఇంటిపంటలపై అవగాహన: సేంద్రియ ఇంటిపంటల పెంపకంపై ఆసక్తి ఉన్న విశాఖనగరవాసులు సెలవు రోజుల్లో మా ఇంటిని సందర్శిస్తూ ఉంటారు. వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చి అవగాహన కల్పించడంతోపాటు కొన్ని మొక్కలు, విత్తనాలను కూడా ఇస్తున్నామని వర్మ, శ్రీదేవి(98661 38129) తెలిపారు. సింహాచలం అప్పన్న ఆలయ గోశాలలో జీవామృతాన్ని తయారు చేయించి, మనిషికి 5 లీటర్ల చొప్పున ఉచితంగా పంపిణీ చేయిస్తున్నారు. మరింత మందికి ఈ విధానాన్ని తెలియజేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెబుతున్నారు.

- అవసరాల గోపాలరావు, సాక్షి, సింహాచలం, విశాఖ జిల్లా

ఆదర్శప్రాయం ఆమె సేద్యం!



వ్యవసాయంపై మక్కువ ఆమెను వృద్ధాప్యంలోనూ విశ్రాంతి తీసుకోనివ్వటంలేదు. బీఏ బీఈడీ చదివి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు పల్లె రమాదేవి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నక్కపల్లి పంచాయతీలోని ఎత్‌బార్‌పల్లి ఆమె స్వస్థలం. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రమాదేవి 2002లో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత 38 ఎకరాలలో వ్యవసాయం చేపట్టారు. ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని నిరూపిస్తున్నారు. శ్రీ వరి సాగు విధానంలో వరి సాగు చేసి ఎకరాకు 50 బస్తాల దిగుబడి సాధించి ప్రశంసలు పొందారు. అధిక శాతం సేంద్రియ ఎరువులతోనే పంటలను సాగు చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలను సాగు చేస్తున్నారు. తోటి రైతులకు సైతం సేంద్రియ ఎరువుల తయారీ పద్ధతులను నేర్పిస్తున్నారు. గ్రామంలోని రైతులను కూడగట్టి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతు పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసి పొదుపును ప్రోత్సహించారు. ఆంజనేయస్వామి దేవాలయాన్ని నిర్మించారు. కష్టపడి పనిచేసుకుంటే లాభాలు వస్తాయని, పంటల సాగుతో పాటు పాడి పశువులను పెంచుకుంటే పాల ఉత్పత్తితో పాటు సేంద్రియ ఎరువులకూ కొరత ఉండదంటున్నారు ఆదర్శ మహిళా రైతు రమాదేవి(90003 02289). ఉత్తమ రైతుగా 5 పురస్కారాలు పొందడం విశేషం.

- వడ్ల విశ్వనాథాచారి, మొయినాబాద్ రూరల్(చేవెళ్ల), రంగారెడ్డి జిల్లా

వేస్ట్ డీ కంపోజర్ ద్రావణం పిచికారీతో తెల్లదోమను అరికట్టవచ్చు



కొబ్బరి, పామాయిల్ తోటలను ఆశిస్తున్న వలయాకారపు తెల్లదోమను వేస్ట్ డీ కంపోజర్(డబ్ల్యు.డి.సి.) ద్రావణం పిచికారీతో అరికట్టవచ్చు. 200 లీటర్ల నీటిలో డబ్ల్యు.డి.సి. బాటిల్‌లోని 30 గ్రాముల పొడితోపాటు 2 కిలోల బెల్లం కలిపి.. రోజూ ఉదయం, సాయంత్రం ఒక నిమిషం కలియదిప్పాలి. ఈ ద్రావణం ఐదారు రోజులకు వాడకానికి సిద్ధమవుతుంది. అదనంగా నీటిని కలపకుండా ఈ ద్రావణాన్ని కొబ్బరి/పామాయిల్ తోటలపై పిచికారీ చేయాలి. 3 రోజుల విరామంతో కనీసం 5 విడతలు పిచికారీ చేయాలి. చెట్టు తడిచేలా పిచికారీ చేయాలి. మునగ తదితర కూరగాయ తోటల్లో తెల్లదోమను డబ్ల్యు.డి.సి. సమర్థవంతంగా అరికట్టింది. వలయాకారపు తెల్లదోమను సైతం అరికడుతుంది.

- డా. వి. ప్రవీణ్‌కుమార్ (92478 09764), శాస్త్రవేత్త, జాతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం(ఎన్.సి.ఓ.ఎఫ్.), కేంద్ర వ్యవసాయ శాఖ, ఘజియాబాద్, ఉత్తరప్రదేశ్



వేస్ట్ డీ కంపోజర్' సీసాలు ఎక్కడ దొరుకుతాయి?

వేస్ట్ డీ కంపోజర్ సీసాలను హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని మార్క్ అగ్రి జెనెటిక్స్ ప్రై. లిమిటెడ్ కార్యాలయం నుంచి పొందవచ్చు. కేంద్ర వ్యవసాయ శాఖ నుంచి ప్రాంతీయ మండలిగా గుర్తింపు పొందిన సంస్థ ఇది. ఈ కార్యాలయం నుంచి (ఉదయం 10 గం. నుంచి 5 గం. వరకు) రూ. 20లకు వేస్ట్ డీ కంపోజర్ సీసాలను రైతులు స్వయంగా వచ్చి కొనుగోలు చేయవచ్చు. రైతులు ఆధార్ కార్డు నకలు, పట్టాదారు పాస్‌బుక్ నకలును వెంటతీసుకెళ్లాలి. వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా: సేంద్రియ రైతుల సేవా కేంద్రం, మార్క్ ప్రోగ్రీన్ జెనెటిక్స్ ప్రై.లిమిటెడ్, 416/ఎ, బాబూఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్. 040– 23235858, 91009 80757

వేస్ట్ డీ కంపోజర్ సీసాను ఒకసారి కొనుక్కుంటే చాలు. ద్రావణాన్ని 5 లీటర్లు పక్కన పెట్టుకుంటే.. మళ్లీ అవసరమైనప్పుడు 200 లీటర్ల నీటిలో 2 కిలోల బెల్లం కలిపి ఈ ద్రావణాన్ని పాలలో తోడు మాదిరిగా డ్రమ్ములో కలిపితే చాలు.. నాలుగైదు రోజుల్లో డ్రమ్ము ద్రావణం వాడకానికి సిద్ధమవుతుంది.

సేంద్రియ ఆక్వా సాగుకు ఎంపెడా సమాయత్తం!



చేపలు, రొయ్యల సాగులో సేంద్రియ పద్ధతులను ప్రోత్సహించడానికి సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ(ఎంపెడా) సమాయత్తమవుతున్నది. సేంద్రియ ఆక్వా సాగులో ఖర్చు పెరుగుతుంది కాబట్టి సాధారణంగా ఆక్వా రైతులు వెనుకడుగు వేస్తుంటారు. అయితే, సేంద్రియ ఆక్వా ఉత్పత్తులకు 15 శాతం అధిక ధర చెల్లించి కొనుగోలు చేయడానికి విదేశీ సంస్థలు ముందుకొస్తున్నందున ఇక మీదట ఆ ఇబ్బంది ఉండబోదని ఎంపెడా చైర్మన్ ఎ.జయతిలక్ అంటున్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన అతిపెద్ద వినియోగదారుల సహకార సంస్థ 'కూప్ కో–ఆపరేటివ్'కు అత్యంత నాణ్యమైన సేంద్రియ ఆక్వా సాగు, అంతర్జాతీయ సేంద్రియ ఆక్వా సర్టిఫికేషన్ పద్ధతులు తదితర అంశాల్లో పాతికేళ్ల అనుభవం ఉంది. గోవాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సీఫుడ్ షో–2018లో కూప్ కోఆపరేటివ్‌తో 'ఎంపెడా' అవగాహన కుదుర్చుకుంది. దేశీయంగా ఆక్వా సంస్థలు, రైతులతో సేంద్రియ ఆక్వా సాగు చేయించడంతోపాటు 15% అదనపు ధరకు కొనుగోలు చేయడానికి కూప్ కో–ఆపరేటివ్ అంగీకరించిందని ఎంపెడా చైర్మన్ తెలిపారు. సేంద్రియ సాగుకు సీడ్‌ను అందించేందుకు హేచరీ, మేత తయారీ కర్మాగారం, సేంద్రియ సాగు పద్ధతులపై సాంకేతిక సహకారం, శిక్షణ, దేశ,విదేశీ మార్కెట్ల కోసం సర్టిఫికేషన్, ఒప్పంద కొనుగోళ్లు.. వీటన్నిటిలోనూ ఆ సంస్థ తోడ్పాటును అందించనుంది. వియత్నాంలో సేంద్రియ ఆక్వా సాగును ప్రోత్సహిస్తున్న కూప్ కో–ఆపరేటివ్.. దిగుమతి చేసుకున్న ఆక్వా ఉత్పత్తులను స్విట్జర్లాండ్‌లో తన 2,200 అవుట్‌లెట్ల ద్వారా విక్రయిస్తోంది.



నేనొక్కదాన్నే..



ఇది మహేష్‌బాబు సినిమా కథ కాదు..
అమెరికాలోని మోనోవై అనే ఊరు కథ..
మరీ ముఖ్యంగా ఆ ఊర్లో ఉండే ఎల్సీ ఐలర్ అనే బామ్మ కథ..

అంత స్పెషల్ ఏంటట..

నెబ్రాస్కా రాష్ట్రంలోని మోనోవై.. ఈ ఊరికి మేయర్ ఉన్నారు.. క్లర్క్, సెక్రటరీ, కోశాధికారి, లైబ్రేరియన్, బార్ టెండర్ ఇలా అందరూ ఉన్నారు.. కానీ ఊర్లో ఉన్నది మాత్రం ఒక్కరే.. అవును.. 2010 అమెరికా జనాభా లెక్కల ప్రకారం ఈ ఊరి జనాభా 1. ఆ ఒక్కరు ఎల్సీ ఐలర్.. వయసు 84. ఇక మేయర్, క్లర్క్, సెక్రటరీ, కోశాధికారి, లైబ్రేరియన్, బార్ టెండర్ గురించి అంటారా.. అవన్నీ కూడా ఎల్సీ ఐలరే!!

ఎందుకలా?

1930ల్లో ఇక్కడ 150 మంది దాకా ఉండేవారు. రెస్టారెంట్లు, షాపులు చివరికి ఓ జైలు కూడా ఉండేది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికాలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడంతో జనం వలస బాటన పడ్డారు. ఎల్సీ ఆమె భర్త రూడీ మాత్రం ఇక్కడే ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత వీరి పిల్లలు కూడా ఉద్యోగాల నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. 2004లో రూడీ చనిపోయారు. అయినా.. ఎల్సీ ఊరిని విడిచిపోలేదు.. ఊరి మీద ఆమెకున్న మమకారం అలాంటిది. అంతేకాదు.. ఈ ఊరికి ఇన్‌కార్పొరేటెడ్ టౌన్ స్టేటస్ కోసం ఆమె పన్నులు కడతారు. దీనికి కావాల్సిన మున్సిపల్ రోడ్ ప్లాన్‌ను ఏటా సమర్పిస్తారు. ఇన్‌కార్పొరేటెడ్ టౌన్ అంటే ఇక్కడ ప్రభుత్వపరంగా నియమించే అధికారులు ఉంటారు. మేయర్ ఎన్నికలు జరుగుతాయి. ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది.

ఎన్నికల్లో ఓటేసేదెవరు?

ఇంకెవరు ఎల్సీనే.. ఊర్లో ఎవరూ లేరు.. దీంతో ఏటా మేయర్ ఎన్నికల్లో నిల్చొని.. తనకు తానే ఓటు వేసుకుంటారు. ఇంకా చిత్రమైన విషయం ఏమిటంటే.. ఏటా బార్, టొబాకో షాపు లైసెన్సు కోసం ఓ బార్ యజమానిగా రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుంటారు.. ఓసారి దీన్ని పరిశీలించండి అంటూ ఆ అప్లికేషన్ ఊరి సెక్రటరీ దగ్గరకు వస్తుంది.. సెక్రటరీ దరఖాస్తును పరిశీలించి.. అంతా ఓకే అని క్లర్క్ వద్దకు పంపిస్తారు.. క్లర్క్ కూడా ఓకే చేసేసి.. అనుమతి మంజూరు చేస్తూ బార్ యజమానికి ఉత్తర్వుల కాపీ ఇస్తారు.. ఇక్కడ సెక్రటరీ, క్లర్క్, బార్ యజమాని ముగ్గురూ ఎల్సీనే.. అంటే.. తనే దరఖాస్తు పెట్టి.. తనే ఓకే చేసి.. తనే తీసుకుంటారన్నమాట!

మరి.. ఒక్కరే బోర్ కొట్టదా..

కొట్టదు మరీ.. ఎందుకంటే.. ఆమె నడుపుతున్న బార్, లైబ్రరీలకు పర్యాటకుల తాకిడి ఉంటుంది. గతంలో ఆ ఊరి నుంచి వెళ్లిపోయిన వాళ్లు తమ రెండో, మూడో తరాన్ని ఇక్కడికి తీసుకొచ్చి.. ఎల్సీని చూపిస్తుంటారు. అమెరికాలో ఒక్కరే ఉంటున్న ఇన్‌కార్పొరేటెడ్ టౌన్‌గా పేరు రావడంతో దీన్ని చూడ్డానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. పలు చానళ్లు డాక్యుమెంటరీలు కూడా ఇక్కడ తీశాయి. ఎల్సీ మనవలు అక్కడికి 90 మైళ్ల దూరంలోని పోన్కా పట్టణంలో ఉంటారు. వాళ్లు అక్కడికి సమీపంలోనే ఉన్నా.. ఊరిని విడిచి వెళ్లడానికి ఆమె ఇష్టపడటం లేదు.

> నేను ఇక్కడే పుట్టాను.. ఇక్కడే పెరిగాను..
> ప్రాణం పోయినా ఇక్కడే పోవాలి..
> అంతే తప్ప.. ఈ మట్టిని..ఊరిని మాత్రం విడిచిపోను..
> – ఎల్సీ ఐలర్

– సాక్షి, హైదరాబాద్

మా గురించి మాట్లాడే అర్హత ఆ మంత్రులకు లేదు

కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు, చినరాజప్ప, నారాయణలకు కాపుల గురించి మాట్లాడే అర్హత లేదని కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపులమని చెప్పుకుంటున్న మంత్రులు ఏనాడూ కాపు కులానికి ఏమీ చేయలేదని చెప్పారు. ప్రభుత్వం కాపులను విభజించే కుట్ర చేస్తోందని విమర్శించారు. కాపునాడు ఉద్యమానికి 30 ఏళ్లు నిండిన సందర్భంగా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కాపునాడు నేతలు వై. శ్రీనివాసరావు, నెరుసు సీతారామయ్య, కె.రమేష్, పోరుమామిళ్ల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల సాధనకు పోరాడాలి

గిరిజన హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గురునాథం



గురునాథంను అభినందిస్తున్న నాయకులు

పూర్ణానందంపేట (విజయవాడ పశ్చిమ): గిరిజనుల న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముదిగాని గురునాథం పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ.. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఇతర కులాలను గిరిజన జాతిలో చేరిస్తే సహించేది లేదని, దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కాగా, సమితి గౌరవాధ్యక్షుడిగా మాజీ ఎంపీ మిడియం బాబూరావును ఎన్నుకున్నట్టు తెలిపారు. గిరిజనుల సమస్యలపై త్వరలోనే 13 జిల్లాల్లో బస్సు యాత్ర చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మేడా రమేశ్, ఆదివాసీ గిరిజన సంఘాల జాయింట్ వర్కింగ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జగాని రామస్వామి పాల్గొన్నారు.

7 నుంచి పెంపుడు కుక్కల యాజమాన్యంపై సదస్సు




సదస్సు బ్రోచర్ విడుదల చేస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు

గన్నవరం: పెంపుడు కుక్కల ఆరోగ్యం–వ్యాధి నిర్ధారణ, నివారణ అంశాలపై ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఇక్కడ కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన సదస్సు వివరాలను వెల్లడించారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల పశు చికిత్స విభాగం ఆధ్వర్యంలో మొదటిసారిగా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు పది దేశాల నుంచి 300 మంది శాస్త్రవేత్తలు, ఉపకులపతులు హాజరవుతారని తెలిపారు.

విశాఖ జిల్లాలో 2 వర్గాల ఘర్షణ.. ఒకరి మృతి

తుమ్మపాల (అనకాపల్లి): విశాఖ జిల్లా అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీ ఘర్షణకు దారితీసింది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు..మామిడిపాలెం గ్రామానికి చెందిన బందం కొండయ్యకు చెందిన 50 మేకలు 2 నెలల క్రితం కాలిపోయి మరణించాయి. మొదట్లో దీన్ని ప్రమాదంగా భావించినప్పటికీ ఆ తర్వాత బాధితుడు కొండయ్య.. అదే గ్రామానికి చెందిన నంబారు కోటి కుటుంబీకులే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన పెద్ద మనుషులు సోమవారం రాత్రి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణకు దారితీశాయి. కర్రలతో కొట్టుకున్నారు. ఈ గొడవలో నంబారు కోటి (55) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.



‘రైతు బంధు’కు ప్రతిబంధకాలు

- రైతుకు రుణం ఇవ్వడంలో మార్కెటింగ్ శాఖ అలసత్వం
- సిబ్బంది నిర్లక్ష్యంతో ఆమడదూరంలో లక్ష్యం
- గతంలో వ్యాపారులతో కుమ్మక్కైన సిబ్బంది

సాక్షి, అమరావతి: రైతుబంధు పథకం రైతుల దరికి చేరడం లేదు. ప్రభుత్వ నిబంధనలు, సరైన ప్రచారం లేకపోవడం, మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల వైఖరి పథకానికి ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేని సమయంలో రైతును ఆదుకునేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. గడిచిన మూడేళ్లలో వరి, అపరాలు, మిర్చి వంటి పంటలకు మార్కెట్‌లో మంచి రేటు లేకపోయినా రైతు బంధు ద్వారా రైతులు పెద్దగా లబ్ధి పొందలేకపోతున్నారు. రాష్ట్రంలో 191 వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో 324 మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ కమిటీలకు ఏటా రూ. 500 కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది. రైతు బంధు పథకంలో రైతులు గోదాముల్లో నిల్వ చేసుకునే పంట విలువపై 75% వరకు రుణం పొందవచ్చు. కానీ నష్టానికైనా మార్కెట్‌లో పంటను అమ్ముకునేందుకు రైతులు సిద్ధపడుతున్నారు కానీ గోదాముల్లో పంటను నిల్వ చేసుకునేందుకు ఆసక్తి చూపడట్లేదు. మార్కెటింగ్ శాఖ సిబ్బంది వైఖరి ఇందుకు ప్రధాన కారణంగా రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. రైతు బంధు పథకం ద్వారా పంటను గోదాముల్లో నిల్వచేయడానికి అనేక నియమనిబంధనలు ఉన్నాయి. పంటకు నష్టం జరిగితే బీమా కంపెనీల నుంచి రైతులకు నష్టపరిహారం ఇప్పించాలి. ఈ పనిపై మార్కెటింగ్ శాఖ సిబ్బంది అంత ఆసక్తి చూపడం లేదు.

రైతుబంధు పథకం వివరాలు

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	ఇచ్చిన రుణం (కోట్లలో)
2013-14	2194	15.33
2014-15	3145	26.01
2015-16	34.14	33.42
2016-17	2585	32.45

వాణిజ్య పంటలకు రుణం లేదు..

ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు వంటి జిల్లాల్లో వరి పంట ఎక్కువగా సాగులో ఉంటుంది. ఈ ప్రాంతాల రైతులు గోదాముల్లో ధాన్యం నిల్వ చేసి రుణం తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని అధికారులు చెబుతున్నారు. శ్రీకాకుళం, విశాఖ, తూ.గో., గుంటూరు జిల్లాలోని పల్నాడు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లోని రైతులు ధాన్యం నిల్వ చేసినా.. రుణాలు తీసుకోకపోవడంతో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇక పథకానికి ప్రభుత్వ పరంగా ఎటువంటి ప్రచారం లేదు. దీనిపై అవగాహన లేదని రైతులు పేర్కొంటున్నారు.

చంద్రబాబు అవినీతిపై నిజం నిగ్గు తేలింది

- సోము వీర్రాజు వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలి
- లేదంటే సీబీఐతో విచారణకు సిద్ధం కావాలి
- హోదా, ప్యాకేజీ వద్దట.. నియోజకవర్గాల విభజన చాలట
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్



విజయవాడ సిటీ: మిత్రపక్షం బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నలకు సీఎం చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్ డిమాండ్ చేశారు. వియజవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోము వీర్రాజు ప్రశ్నలకు డకౌట్ అయిన కెప్టెన్ చంద్రబాబు అదనపు ఆటగాళ్లు బుద్దా వెంకన్న, కాల్వ శ్రీనివాసులు, అయ్యన్నపాత్రుడులను రంగంలోకి దించారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా గెలవక ముందు రెండు ఎకరాలు ఉన్న చంద్రబాబు రూ.2లక్షల కోట్లు ఏవిధంగా సంపాదించారని సోము వీర్రాజు నేరుగా ప్రశ్నించారన్నారు. ఆయన మాటలు అక్షర సత్యమని, చంద్రబాబు విచ్చలవిడి అవినీతిపై నిజం నిగ్గు తేలిందన్నారు. తాము ఇదే విషయాలను ఎప్పటి నుంచో చెబుతున్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నలకు దిమ్మదిరిగిన చంద్రబాబు దాక్కుంటే కుదరదని, బయటకు వచ్చిన సమాధానం చెప్పాలన్నారు. నిజాయితీని నిరూపించుకోవడానికి... సీబీఐ చేత విచారణ జరిపించుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై టీడీపీ ఎంపీలు, నేతలు డ్రామా ఆడుతున్నారని దుయ్యబట్టారు. గట్టిగా మాట్లాడితే బీజేపీ నాయకులు ఎక్కడ జైల్లో పెడతారోనన్న భయం చంద్రబాబుకు, మంత్రులకు, టీడీపీ నేతలకు పట్టుకుందన్నారు. ఆఖరి బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండు సున్నా వచ్చినా చంద్రబాబుకు సిగ్గులేదన్నారు. నాలుగేళ్లుగా చంద్రబాబు మోసపు మాటలు వినీవినీ రాష్ట్ర ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రత్యేక హోదా భిక్ష కాదని, ఆంధ్రుల హక్కు అని, ఇదే వైఎస్ జగన్ ఆశయమన్నారు.

లోకజ్ఞానంలేని లోకేష్.....

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తన తనయుడు మంత్రి లోకేష్‌కు కాస్తంత లోకజ్ఞానం నేర్పించాలని జోగి రమేష్ హితవు పలికారు. అమెరికాలో టీడీపీ అధికారంలోకి వస్తుందని లోకేష్ చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. ఢిల్లీలోనే కాకుండా అంతర్జాతీయంగా రాష్ట్ర పరువును తీస్తున్న లోకేష్‌కు ఇప్పటికైనా లోకజ్ఞానం నేర్పించాలని సూచించారు.

పర్మిట్ లేదు.. లైసెన్స్ లేదు!

- గుంతలోకి దూసుకెళ్లిన దివాకర్ ట్రావెల్స్ బస్సు
- అనంతపురం జిల్లాలో 17 మందికి గాయాలు
- గత నవంబర్‌లో ఇదే బస్సు ఢీకొని ఓ అధికారి మృతి



కాలువపల్లి వద్ద ప్రమాదానికి గురైన దివాకర్ బస్సు

బెళుగుప్ప: దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లిన ఘటనలో 17 మంది గాయపడ్డారు. వీరిలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వచ్చిన దివాకర్ ట్రావెల్స్‌కే చెందిన మరో బస్సును ఆపిన ప్రయాణికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాలని కోరినా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన ప్రయాణికులు అదే ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సు రాగానే దానిపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం కాలువపల్లి సమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ఇతర మార్గంలో నడిపేందుకు అనుమతి పొందిన ఈ బస్సును ప్రమాదానికి గురైన దారిలో అక్రమంగా తిప్పుతున్నట్లు గుర్తించారు.

పర్మిట్‌లేని దారిలో ప్రయాణం

ప్రమాదానికి గురైన బస్సు (ఏపీ 05 డబ్ల్యూ 8556) శెట్టూరు నుంచి కళ్యాణదుర్గం మీదుగా అనంతపురానికి తిరుగుతోంది. అయితే ఈ బస్సుకు ఈ దారిలో పర్మిట్ లేదు. కర్నాటకలో ‘కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్’ ద్వారా చిత్రదుర్గ నుంచి గుంతకల్లుకు పర్మిట్ తీసుకున్నట్లు రవాణాశాఖ వర్గాలు తెలిపాయి. అయితే ఈ బస్సును ఆ దారిలో కాకుండా కళ్యాణదుర్గం–అనంతపురం తిప్పుతున్నారు. ఇదే బస్సు గత నవంబర్ 3న ఆత్మకూరు సమీపంలో రాంగ్‌రూట్‌లో వచ్చి బొలేరో వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ‘ఆత్మ’ పీడీ డిప్యూటీ డైరెక్టర్ రమణ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ బస్సు పర్మిట్‌కు లేదనే విషయం రవాణాశాఖ అధికారులకు స్పష్టంగా తెలిసినా అధికార పార్టీకి చెందిన ఎంపీ జేసీదివాకర్‌రెడ్డి కుటుంబానికి చెందిన బస్సు కావటంతో మౌనం వహించారనే ఆరోపణలున్నాయి.



చికిత్స పొందుతున్న ప్రయాణికుడు

డ్రైవింగ్ లైసెన్స్ ఏది?

ప్రమాదం అనంతరం అక్కడకు చేరుకున్న ఆర్టీఏ అధికారి శ్రీధర్ బస్సు పత్రాలు పరిశీలించగా ఆర్సీ, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. వాహనం నడుపుతున్న డ్రైవర్ లెసెన్స్ చూపకపోవటం గమనార్హం. ‘పర్మిట్ చూపాలని అడిగాం. మంగళవారం ఇస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదు. డ్రైవర్‌ను 108లో ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ఇది కౌంటర్ సిగ్నేచర్ సర్టిఫికెట్‌తో కర్నాటకలో పర్మిట్ ఉన్న బస్సు. దీని రికార్డులు మావద్ద ఉండవు. కర్నాటకలో ఉంటాయి’ అని ఆర్టీఏ అధికారి శ్రీధర్ తెలిపారు.

విద్యావంతులైతేనే మహిళల అభివృద్ధి

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

సిద్ధార్థలో ఉత్సాహంగా మహిళా ఫెస్ట్



మహిళా ఫెస్ట్ ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న నన్నపనేని

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ప్రతి మహిళా విద్యావంతురాలై చైతన్యవంతం కావాలని అప్పుడే మహిళాభివృద్ధి సాధించగలమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తెలిపారు. విజయవాడలోని పి.బి.సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం తరుణి తరంగాలు పేరుతో మహిళా ఫెస్ట్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా సీఆర్‌డీఏ పరిధిలోని వివిధ కళాశాలల విద్యార్థినులకు వివిధ అంశాల్లో పోటీలు పెట్టారు. వీటికి నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలపై దాడులు, అత్యాచారాలకు పాల్పడినవారిని బహిరంగంగా శిక్షించాలని కోరారు. సినిమాలు, టీవీల్లో మహిళలను విలన్లుగా చూపించడం సరికాదని అన్నారు. మహిళలపై దాడులను వ్యతిరేకిస్తూ హోర్డింగ్స్, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం మహిళలకు మంచితోపాటు చెడును కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసే పరిస్థితులను కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగానే మహిళా మిత్రను ప్రవేశపెట్టామన్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు మనోరమ, మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తరుణి తరంగాలు అధ్యక్షురాలు రావి శారద, ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత విద్యుత్తు చార్జీల వడ్డన

- ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణలో వక్తల ఆందోళన
- పెంచకపోవడం కాదు తగ్గించాలని డిమాండ్



మాట్లాడుతున్న ఏపీఈఆర్సీ చైర్మన్ భవానీ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్నందున విద్యుత్ చార్జీల పెంపుదలపై ప్రభుత్వం వెనకడుగు వేసిందని, 2019 ఎన్నికల తర్వాత భారీగా వడ్డన తప్పదని పలువురు వినియోగదారులు, వివిధ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్ నేతృత్వంలో సోమవారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా, వ్యాపారం, ఆదాయ ఆవశ్యకత, చార్జీల ప్రతిపాదనలపై వినియోగదారులు, వివిధ వర్గాల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రూ.7,983 కోట్ల రెవిన్యూ లోటు ఉన్నా చార్జీలు పెంచక పోవడం వెనక ప్రభుత్వానికి ప్రజలపై ప్రేమ కాదని, రాజకీయ స్వార్థం ఉందని, రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే పెంపును వాయిదా వేసిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. ఎన్నికలయ్యాక ప్రజలపై భారం మోపడం ఖాయమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం ఇస్తున్న 50 యూనిట్ల రాయితీని 100కు పెంచాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ లోటును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టంగా చెప్పాలని ఈ విషయాన్ని ప్రజాభిప్రాయ సేకరణకు ముందే ప్రభుత్వం నుంచి హామీ తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.తులసీదాస్ కోరారు. ఇంధన చార్జీల పేరిట వినియోగదారులపై దొంగదెబ్బ తీస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ టవర్ లైన్ల ఏర్పాటు వల్ల రైతులు పంట నష్టపోతున్నారని, వారికి భూసేకరణ చట్టం కింద పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని, పీపీపీ విధానంలో ప్రాజెక్టులు కట్టబెట్టవద్దని, విద్యుత్ సంస్కరణలను వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకుడు కుమార్ డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీలు పెరగవు.. ఈఆర్సీ చైర్మన్

2018–19 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు, ప్రభుత్వం, విద్యుత్ చార్జీలు ధరలు పెంచవద్దని కోరాయని విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ముగిసాక ఆయన మాట్లాడారు. ధరలు పెంచకుండా ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం క్లిష్టమే అయినప్పటికీ సరసమైన ధరల్లో విద్యుత్ అందిస్తామన్న నమ్మకం ఉందన్నారు.

మత్స్యకారుల దీక్షలను అడ్డుకోవడం సరికాదు

21న శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తా: పవన్



సాక్షి, అమరావతి : తీర ప్రాంతంలో కాలుష్యంవల్ల మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారని, తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళనకు దిగితే వారిని అడ్డుకోవడం సరికాదని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. మత్స్యకారులు చేపట్టిన దీక్షలనూ అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. కొందరు మత్స్యకారులు సోమవారం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌ను కలిశారు. భేటీ వివరాలను పార్టీ కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ప్రభుత్వం వారికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టి హామీ ఇచ్చినప్పుడు దాని అమలుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉండాలని సూచించారు. కాగా, ఈనెల 21న శ్రీకాకుళంలో పర్యటిస్తానని పవన్ చెప్పారు. ప్రధానిని కలిసే అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తానని ఆయనన్నారు.

మళ్లీ తెరపైకి ఆదరణ!

- రూ.250కోట్లతో బడ్జెట్
- సర్వే ద్వారా లబ్ధిదారుల గుర్తింపు
- బీసీల రుణాలకే దిక్కులేదు.. ఆదరణా!?
- గతంలో కమీషన్ల కక్కుర్తితో పథకం అభాసుపాలు

సాక్షి, అమరావతి : ఆదరణ పథకం పేరుతో మరోసారి బీసీలను ఆకట్టుకునేందుకు తెలుగుదేశం ప్రభుత్వం మళ్లీ ఎత్తులు వేస్తోంది. వివిధ కుల వృత్తుల్లో ఉన్న బీసీలకు ఈ పథకం ద్వారా వారికి అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసి ఇవ్వాలని యోచిస్తోంది. గతంలో బీసీల్లోని కుల వృత్తుల వారికి పనిముట్లు కొనుగోలు చేసి ఇచ్చారు. ఈ తరహాలోనే మళ్లీ రూ.250 కోట్లతో ఆదరణ పథకం కింద వివిధ రకాల పనిముట్లు కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏదేని కారణాలతో నిధులు సరిపోని పక్షంలో వివిధ బీసీ కార్పొరేషన్లు, బీసీ సమాఖ్యల బడ్జెట్ నుంచి కూడా మరింత కేటాయించాలన్న ఆలోచన కూడా ఉన్నట్లు సమాచారం. ఈ మొత్తం ద్వారా వివిధ రకాల యూనిట్లు కొనుగోలు చేసి ఇస్తామని సర్కార్ ప్రచారం చేస్తోంది. కానీ, బీసీలకు ఇచ్చే రుణాల విషయంలో ఇంతవరకు పైసా కూడా ఖర్చు చేయలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమగ్ర సర్వేతోనే లబ్ధిదారుల గుర్తింపు

ఇదిలా ఉంటే.. ఆదరణ పథకం ద్వారా ఏ వస్తువు ఇవ్వాలన్నా దీనిపై సమగ్రమైన సర్వే జరగాలని, ఎవరికి ఏ వస్తువు కావాలో ఈ సర్వే ద్వారా నిర్ణయించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, అప్పుడే పథకం విజయవంతమవుతుందని బీసీ సంక్షేమ శాఖ ఆలోచిస్తోంది. కాగా, ఉపాధి కోసం అన్ని వర్గాల వారూ అన్ని రకాల వృత్తులలోకి ప్రవేశిస్తుండడంతో అసలైన బీసీ లబ్ధిదారులను గుర్తించి.. వారి అవసరాలు తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఓ ప్రముఖ సంస్థ ద్వారా సర్వే చేయించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గతంలో ఎటువంటి సర్వేలు లేకుండా పనిముట్లు ఇచ్చినందునే ఒక్కరికి కూడా ఉపయోగపడలేదని, పైగా కమీషన్‌లకు కక్కుర్తిపడి డబ్బును వ్యాపారులకు దోచిపెట్టారని అధికారులు చెబుతున్నారు. మరోవైపు.. అధికార పార్టీకి అనుకూలురైన వారికి పనిముట్లు కొనుగోలు చేసే బాధ్యతలను అప్పగిస్తున్నట్లు సమాచారం.

సీఎస్‌కు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు


వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన సీఎస్ దినేశ్‌కుమార్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ సోమవారం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు మోకాలు నొప్పిగా ఉండటంతో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్ సూచన మేరకు ఎక్స్‌రే తీశారు. అయితే ప్రస్తుతానికి ఇబ్బంది ఏమీలేదని మందులు వాడితే నొప్పి తగ్గిపోతుందని వైద్యులు తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ జి.చక్రధర్, ఆర్ఎంఓ డాక్టర్.గీతాంజలి వైద్య పరీక్షలను పర్యవేక్షించారు.

వియత్నాంలో రాష్ట్ర వ్యవసాయ బృందం పర్యటన

సాక్షి, అమరావతి: వ్యవసాయ ఆధునిక పద్ధతులను పరిశీలించేందుకు వియత్నాం వెళ్లిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బృందం సోమవారం థాయ్ బిన్ విత్తన సంస్థను సందర్శించింది. ఈ బృందంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వల్లభనేని దామోదర్ నాయుడు, ఇతర శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్వీ నాయుడు, డాక్టర్ పి.ప్రసూన రాణి తదితరులు ఉన్నారు. వీరంతా ఈ విత్తన కేంద్రంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటల సాగులో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించారు. విత్తన శుద్ధి, కోత అనంతరం పంట నష్ట నివారణ చర్యలను వియత్నాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ సమీపంలోని అతి పెద్ద రైస్ మిల్లును కూడా వారు పరిశీలించారు.

అగ్రి వర్సిటీ పాలక మండలిలో మరో ఇద్దరు

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా మరో ఇద్దరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాస్త్రవేత్తల విభాగం నుంచి గుంటూరు జిల్లా పెదరావూరుకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ డీఎస్ కోటేశ్వరరావు, ప్రజా ప్రతినిధుల కోటా నుంచి పార్వతీపురం ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు నియమితులయ్యారు. కాగా, కోటేశ్వరరావు తిరుపతి, బాపట్ల వ్యవసాయ కళాశాలల్లో అగ్రానమీ విభాగంలో పని చేశారు. వ్యవసాయ క్షేత్రాల నిర్వహణలో ఆయనకు మంచి పేరుంది.

వీర్రాజు వార్డు మెంబర్‌గా కూడా గెలవలేరు

- ఆయనకు టీడీపీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది: బుద్దా వెంకన్న
- విజయవాడలో వీర్రాజు ఫ్లెక్సీ దహనం


విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఫ్లెక్సీని చెప్పుతో కొడుతున్న టీడీపీ కార్యకర్త

సాక్షి, విజయవాడ: బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు వార్డు మెంబర్‌గా గెలవలేడని, అయినా ఆయన్ను టీడీపీ ఎమ్మెల్సీ చేసిందని ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. టీడీపీ అవినీతి పార్టీ అని వీర్రాజు విమర్శిస్తున్నారని, అటువంటి అవినీతి పార్టీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిని ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. వీర్రాజుకు చంద్రబాబును విమర్శించే స్థాయిలేదన్నారు. వీర్రాజు వ్యాఖ్యలు చూసి తన రక్తం మరిగిపోతోందన్నారు. బీజేపీ నేతలకు తెలిసే వీర్రాజు మాట్లాడుతున్నారా? లేక సొంత అజెండాతో మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. బీజేపీ పేరు చెప్పి వీర్రాజు ఎక్కడెక్కడ ఎంతెంత వసూలు చేశాడో ఆ పార్టీ నేతలే చెబుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయం ఎదురుగా ఆ పార్టీ నేతలు సోము వీర్రాజు ఫ్లెక్సీని చెప్పులతో మహిళల చేత కొట్టించిన అనంతరం దహనం చేశారు.

వీర్రాజును విమర్శించే స్థాయి బుద్దాకు లేదు

బుద్దా వ్యాఖ్యలపై బీజేపీ విజయవాడ ప్రధాన కార్యదర్శి తోట శివనాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అక్కిరాజు వెంకట రామారావు తీవ్రంగా స్పందించారు. టీడీపీ నేతలు విచక్షణా రహితంగా మాట్లాడుతుంటే సమాధానాలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. జాతీయ నాయకుడు సోము వీర్రాజును విమర్శించే స్థాయి బుద్దా వెంకన్నకు లేదన్నారు.

పాతకక్షల నేపథ్యంలో దాడి

- ఒకరి మృతి.. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- గుంటూరు జిల్లాలో విషాదం


శ్రీనివాసరెడ్డి (ఫైల్)


పుల్లారెడ్డి (ఫైల్)

జంగమహేశ్వరపురం (గురజాల రూరల్): ఇరుకుటుంబాల మధ్య పాతకక్షల నేపథ్యంలో ఒక కుటుంబంపై మరో కుటుంబం దాడి చేయగా ఓ వ్యక్తి మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం ఉంది. అందులో ఒకరు బ్రెయిన్ డెడ్ అని డాక్టర్లు నిర్ధారించారు. గుంటూరు జిల్లా గురజాల మండలం జంగమహేశ్వరపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనతో విషాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జంగమహేశ్వరపురం గ్రామంలో గొంగటి నాగిరెడ్డి, పోలు చెన్నారెడ్డి కుటుంబాలు ఎదురెదురుగా ఉంటున్నాయి. ఇటీవల నాగిరెడ్డి, అతని భార్య పద్మ, కుమారులు శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి ఎదురుగా ఉంటున్న చెన్నారెడ్డి, సరోజిని దంపతులు ఇంట్లో లేని సమయంలో దండెం తాళ్లు, పట్టలు కోశారని గొడవ జరిగింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం తమ గేదెను ఎవరో గాయపరిచారని చెన్నారెడ్డి భార్య సరోజిని తిడుతుండగా... నాగిరెడ్డి, అతని భార్య చెన్నారెడ్డి, సరోజిని దంపతులతో వాదనకు దిగి చంపుతామని బెదిరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో సరోజిని తమ్ముళ్లు యేసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి సరోజిని ఇంటికి వచ్చి జరిగిన విషయం గురించి మాట్లాడుతుండగా పథకం ప్రకారం.. నాగిరెడ్డి, భార్య పద్మ, కుమారులు శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి కర్రలతో ఇంట్లోకి ప్రవేశించి సరోజిని తమ్ముళ్లు శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి, భర్త చెన్నారెడ్డిలను తలలపై విచక్షణారహితంగా కొట్టారు. అలికిడికి చుట్టుపక్కల నివాసముంటున్న చవ్వా చౌరెడ్డి, పోలు రామిరెడ్డి తదితరులు అక్కడికి రావడంతో పారిపోయారు. ముగ్గురి తలలకు తీవ్రగాయాలై రక్తపు మడుగులో పడివుండడాన్ని గమనించిన సరోజిని బంధువుల సహాయంతో ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో యేసిరెడ్డి శ్రీనివాసరెడ్డి(43) మృతిచెందగా, పుల్లారెడ్డి బ్రెయిన్ డెడ్ అయి మృత్యువుతో పోరాడుతున్నారు. చెన్నారెడ్డి తలకు తీవ్రగాయమైంది.

ట్రాన్స్‌కో 'జీఐ' మంత్రం

- రాష్ట్రంలో పెద్ద ఎత్తున జీఐ సబ్‌స్టేషన్ల నిర్మాణ ప్రణాళిక
- రూ.5,500కోట్ల ప్రణాళికకు ఆమోదం
- విశాఖ–చెన్నై కారిడార్‌లో రెండు
- అమరావతిలో పదేళ్లలో 22 సబ్‌స్టేషన్లు

సాక్షి, అమరావతివతి బ్యూరో


రాష్ట్రంలో తొలిసారి విశాఖపట్నంలో ట్రాన్స్‌కో నిర్మించిన జీఐ సబ్‌స్టేషన్

గ్యాస్ ఇన్సులేటెడ్ (జీఐ) సబ్‌స్టేషన్లు... ప్రస్తుతం ట్రాన్స్‌కో జపిస్తున్న మంత్రం ఇది. ఇప్పటివరకు నిర్మిస్తూ వస్తున్న సాధారణ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ముగింపు పలకాలని ట్రాన్స్‌కో భావిస్తోంది. అందుకోసం కొత్తగా నిర్మించనున్న వాటిలో జీఐ సబ్‌స్టేషన్లకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా విశాఖపట్నంలో ఓ జీఐ సబ్‌స్టేషన్‌ను నిర్మించింది. ఇక విశాఖ–చెన్నై కారిడార్, రాజధాని అమరావతిలో జీఐ సబ్‌స్టేషన్లే నిర్మించాలని నిర్ణయించింది. పదేళ్లలో రూ.5,500 కోట్లతో 24 జీఐ సబ్‌స్టేషన్లు నిర్మించే ప్రణాళికకు ఆమోదించింది. త్వరలోనే నాలుగు సబ్‌స్టేషన్లు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ చేపట్టింది. విశాఖపట్నంలో ఈ నెల 24 నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్న 'పెట్టుబడుల సదస్సు'లో కూడా జీఐ సబ్‌స్టేషన్ల ప్రణాళికపై ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది.

రూ.5,500 కోట్లతో ప్రణాళికకు ఆమోదం

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌తోపాటు ఆ పరిసర ప్రాంతాల్లో మొత్తం 15 జీఐ సబ్‌స్టేషన్లను ట్రాన్స్‌కో నిర్మించింది. రాష్ట్ర విభజనతో ఆ సబ్‌స్టేషన్లు అన్నీ తెలంగాణలోనే ఉండిపోయాయి. ఇప్పుడు ప్రయోగాత్మకంగా విశాఖపట్నంలో 133 కేవీ జీఐ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో అతి తక్కువ కాలంలో నిర్మించి ఇటీవలే వాడుకలోకి తెచ్చింది. ఇక నుంచి రాష్ట్రంలో నగరాలు, పట్టణాల్లో జీఐ సబ్‌స్టేషన్ల నిర్మాణానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్రంలో దాదాపు రూ.5,500కోట్లతో జీఐ సబ్‌స్టేషన్లు దశలవారీగా నిర్మాణ ప్రణాళికకు ఆమోదించింది. విశాఖ–చెన్నై కారిడార్, రాజధాని అమరావతిలో వీటిని దశలవారీగా నిర్మిస్తారు. విశాఖ–చెన్నై కారిడార్‌లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏబీడీ) రుణ సహాయం చేస్తోంది. దాంతో విశాఖపట్నం జిల్లా భీమిలి సమీపంలోని కాపులుప్పాడలో 130 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం ఏపీఐఐసీ క్లస్టర్‌లో 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ రెండు సబ్‌స్టేషన్లకు రూ.400 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ చేపట్టారు.

జీఐ సబ్‌స్టేషన్లు అంటే...

ఆధునిక పరిజ్ఞానంతో కూడిన జీఐ సబ్‌స్టేషన్లను రాష్ట్రంలో నిర్మించాలని ట్రాన్స్‌కో కొన్నేళ్ల కిందట నిర్ణయించింది. సాధారణ సబ్‌స్టేషన్ల కంటే జీఐ సబ్‌స్టేషన్లకు తక్కువ విస్తీర్ణం భూమి సరిపోతుంది. మరోవైపు జీఐ సబ్‌స్టేషన్లు తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులను సమర్థంగా తట్టుకోగలవు. తీర ప్రాంతాలకు సమీపంలో జీఐ సబ్‌స్టేషన్లు ఉపయుక్తంగా ఉంటాయి. సాధారణ సబ్‌స్టేషన్లతో పోలిస్తే నిర్వహణ వ్యయం నామమాత్రంగా ఉంటుంది. దీంతో ట్రాన్స్‌కో జీఐ సబ్‌స్టేషన్ల నిర్మాణం వైపు మొగ్గుచూపుతోంది.

రాజధానిలో అన్నీ జీఐ సబ్‌స్టేషన్లే

రాజధాని అమరావతిలో అన్నీ జీఐ సబ్‌స్టేషన్లే నిర్మించాలని నిర్ణయించారు. అమరావతిలో మొత్తం 22 సబ్‌స్టేషన్లను దశలవారీగా నిర్మిస్తారు. రానున్న పదేళ్లలో దశలవారీగా ఈ సబ్‌స్టేషన్లను రూ.5వేల కోట్లతో నిర్మించాలన్నది ట్రాన్స్‌కో ప్రణాళిక. వాటిలో 220కేవీ సబ్‌స్టేషన్లు 15, 440కేవీ సబ్‌స్టేషన్లు ఏడు ఉన్నాయి. ఒక్కో 220 కేవీ సబ్‌స్టేషన్‌ను రూ.200కోట్లతో, ఒక్కో 440 కేవీ సబ్‌స్టేషన్‌ను రూ.300 కోట్లుతో నిర్మిస్తారు. మొదటగా లింగయ్యపాలెంలో జీఐ సబ్‌స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. త్వరలో నేలపాడులో సబ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. రాజధానిలో ప్రతిపాదిత పరిపాలనా నగరం పరిధిలోనే ఈ రెండు సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

ముగిసిన బౌద్ధ వారసత్వ మహోత్సవాలు

సాక్షి, అమరావతి: బౌద్ధ వారసత్వ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. బుద్ధ భగవానుని ప్రపంచ శాంతి సందేశాన్ని విశ్వవ్యాప్తం చేసిన ఘనత వహించే పలు కార్యక్రమాలకు అమరావతి నాంది పలికింది. మూడు రోజుల పాటు విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం నిర్వహించిన బౌద్ధ వారసత్వ మహోత్సవాలు ముగిశాయి. కొరియా, చైనా, తైవాన్, శ్రీలంక, బర్మా, థాయిలాండ్, ఇండియా లాంటి దేశాల నుంచి వచ్చిన దాదాపు రెండు వేల మంది బౌద్ధులతో ప్రపంచ శాంతి కోసం పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రంలో ఆచార్య నాగార్జునుడు బౌద్ధ తత్వానికి చేసిన కృషి ఎనలేనిదని పలువురు ప్రముఖులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న ఘంటశాల, జగ్గయ్యపేట, నాగార్జునకొండ లాంటి 210కి పైగా బౌద్ధ పర్యాటక ప్రదేశాలు ఉన్నా వాటికి పెద్దగా ఆదరణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి ప్రఖ్యాత కళాకారుడు పద్మభూషణ్ పండిట్ హరిప్రసాద్ చౌరాసియా చేసిన వేణుగానం ఆకట్టుకుంది. ఈ బృందంలో పఖాలీజ్ వాయిద్యాన్ని భవానీశంకర్, తబలా వాయిద్యాన్ని శుభాంకర్ బెనర్జీ, వేణుగాన సహకారాన్ని దేభోప్రియ చటర్జీ అందించారు. కార్యక్రమం అనంతరం బృంద సభ్యులను ఘనంగా సత్కరించి మెమెంటోలను అందించారు.

నేటి సమాజానికి బుద్ధిజమే శరణ్యం

- అఖిల భారత భిక్కుసంఘం అధ్యక్షుడు ప్రగ్యదీప్
- నాగార్జున యూనివర్సిటీలో బౌద్ధ భిక్షువుల శాంతి ర్యాలీ
- హాజరైన వివిధ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు


ఏఎన్‌యూలో నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు

ఏఎన్‌యూ: అశాంతి, హింస రోజురోజుకూ పెరిగిపోతున్న ప్రస్తుత సమాజానికి బుద్ధుని సిద్ధాంతాలే శరణ్యమని అఖిల భారత భిక్కు సంఘం అధ్యక్షుడు ప్రగ్యదీప్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్సిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభలో ప్రగ్యదీప్ మాట్లాడుతూ.. బుద్ధుని సిద్ధాంతాలు సమాజానికి తెలియజేసిన మొదటి తత్వవేత్తగా నాగార్జునుడికి ప్రత్యేకత ఉందని, ఆయన పేరుతో ఈ ప్రాంతంలో వర్సిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాగార్జునుడు కాంక్షించిన విలువలతో కూడిన విద్యను అందించి సమాజ హితానికి కృషి చేయాలన్నారు. ఏఎన్‌యూ బుద్ధిజం అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుద్ధుని సిద్ధాంతాలపై విస్తృతంగా పరిశోధనలు జరిపి వాటిని ప్రపంచానికి అందజేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సింగపూర్ ప్రతినిధి ఆనంద్‌కుమార్ సేరి మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య లేకపోవడం వల్ల సమాజంలో నేర ప్రవృత్తి పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా విధానాల్లో సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నలంద యూనివర్సిటీకి చెందిన బౌద్ధభిక్షువు ధమ్మ జ్యోతి మాట్లాడుతూ.. నలంద, తక్షశిల వంటి ప్రపంచ ప్రఖ్యాత వర్సిటీలు ఉన్న దేశం మనదని, వాటి ఔన్నత్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఏఎన్‌యూ వీసీ ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీలో బుద్ధిజం విభాగం ద్వారా బుద్ధునికి సంబంధించి పరిశోధనలు జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బుద్ధిజం విభాగాధిపతి డాక్టర్ స్వరూపరాణి, భిక్కు సొసైటీ ఆఫ్ ఇండియా బెంగళూరు, హైదరాబాద్ సంస్థల అధ్యక్షులు భిక్కు బుద్ధపాల, ధమ్మపాల తదితరులు పాల్గొన్నారు.

తనఖా ఇంటినే రాయించుకున్నాడు

- విశాఖలో మరో కాల్‌మనీ బాగోతం
- పైగా ఖాళీ చేసి పొమ్మంటూ ఒత్తిళ్లు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన మహిళ

సాక్షి, విశాఖపట్నం: కుటుంబ అవసరాల కోసం ఓ మహిళ ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకుంటే సదరు వడ్డీ వ్యాపారి గుట్టుచప్పుడు కాకుండా ఆ ఇంటిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నాడు. పైగా ఆ ఇంటి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవల్సిందిగా ఒత్తిడి తీసుకొస్తుండడంతో ఏం చేయాలో తెలియక ఆ మహిళ జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయించింది. విశాఖపట్నం ఎన్ఏడీ జంక్షన్ సమీపంలోని బుచ్చిరాజుపాలెంలో నివాసం ఉంటున్న సి.సునీత అనే మహిళ సింహాచలం షిప్‌యార్డు కాలనీకి చెందిన బొడ్డు శ్రీనివాసరావు అలియాస్ శ్రీకాంత్ అనే ఫైనాన్షియర్ వద్ద 2015లో తన ఇంటిని తనఖా పెట్టి రూ.6.5 లక్షలు తీసుకుంది. తనఖా రిజిస్ట్రేషన్ కోసం సంతకాలు పెడితే శ్రీకాంత్ మాత్రం జీపీ కమ్ సేల్ డీడ్‌పై సంతకాలు చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న మహిళ సేల్ డీడ్ రద్దు చేసి తనఖా ఒప్పందం రాయించాలని కోరినా పట్టించుకోలేదు. ఇంట్లో ఉండాలనుకుంటే అద్దె కట్టాలంటూ నోటీసులివ్వడం ప్రారంభించాడు. అంతటితో ఆగకుండా ఇటీవల తమ వద్ద ఉన్న ఇంటి డాక్యుమెంట్లు, ఇతర పత్రాలు ఇవ్వాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్నాడని సునీత వాపోయారు. న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, సీపీ యోగానంద్‌కు ఫిర్యాదు చేసింది. కాగా, బొడ్డు శ్రీనివాసరావుపై గతంలో గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో కూడా ఇదే తరహాలో కాల్‌మనీ కేసులు నమోదయ్యాయని తెలిసింది.

ఎస్ఈజెడ్‌లో కేంద్ర బృందం పర్యటన

కాలుష్యంపై ఎంపీ విజయసాయిరెడ్డి ఫిర్యాదుకు స్పందన


బృందం సభ్యులకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత అమర్‌నాథ్

అచ్యుతాపురం (యలమంచిలి): విశాఖ జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ (ప్రత్యేక ఆర్థిక మండలి)లో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. ఇక్కడి కాలుష్యంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి గతనెల 4న ఢిల్లీలో ఇచ్చిన ఫిర్యాదుకు కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పారిశ్రామిక మంత్రిత్వశాఖ కేంద్ర బృందాన్ని పంపింది. ఎన్విరాన్‌మెంట్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఎం.వి.రమణమూర్తి నేతృత్వంలో బృందం ఏపీఐఐసీ కార్యాలయ అధికారులతో సమావేశమైంది. సెజ్‌లో పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడంపై సమాచారాన్ని తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులతో సమావేశమైంది. పరిశ్రమల వల్ల వివిధ రూపాల్లో ఏర్పడుతున్న కాలుష్యాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ వివరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఏపీఐఐసీ సెజ్‌లో రెడ్‌జోన్ కాలుష్య పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారని వ్యర్థాలను శుద్ధిచేసే ప్లాంట్ నిర్మాణం జరపకుండానే పరిశ్రమలు ఉత్పత్తులు చేపట్టాయని తెలిపారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలను ఎక్కడ డంప్ చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, సీపీఎం నాయకులు రొంగలిరాము, గనిశెట్టి సత్యనారాయణ ఫార్మాసిటీ, ఎన్ఏవోబీ, సెజ్ కాలుష్యాలను బృంద సభ్యులకు వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం సభ్యులు పూడిమడక తీరంలో పైపులైన్ నిర్మాణ ప్రదేశాన్ని, వ్యర్థాలు శుద్ధిచేసే ప్లాంట్ నిర్మాణాన్ని పరిశీలించారు. బృందం రెండు రోజులపాటు సెజ్‌లో కాలుష్యంపై అధ్యయనం చేస్తుంది. కార్యక్రమంలో బృంద సభ్యులు ఎస్.కె.వర్మ, శాస్త్రవేత్త కొడాలి రఘుకుమార్, మరో శాస్త్రవేత్త దీనబంధు గొండా, కలాయ్ పెరుమాల్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ హాస్టల్ సీట్లు ఇవ్వాలి

అసెంబ్లీ కమిటీ సమావేశంలో ప్రభుత్వానికి సిఫార్సులు

సాక్షి, అమరావతి: అడిగిన వారందరికీ బీసీ హాస్టళ్లలో సీట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ అసెంబ్లీ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ జి.తిప్పేస్వామి అధ్యక్షతన సోమవారం అసెంబ్లీ కమిటీ సమావేశం అమరావతిలో జరిగింది. ఇందులో సభ్యులు గుంతకల్లు ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, అధికారులు పాల్గొన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఇప్పించే రుణాలపై బ్యాంకులు స్పందించడం లేదని, కార్పొరేషన్ తగిన చొరవ తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. గొర్రెలకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారికే బీమా వర్తిస్తున్నదని, ఇక నుంచి గొర్రెలకు బీమా చేసుకునే యజమానులకు ప్రభుత్వ సాయంకింద బీమాలో 75 శాతం, లబ్ధిదారుడు 25 శాతం భరించేలా చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. బీసీ సంక్షేమ శాఖలోని అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలని, పదోన్నతులు ఇవ్వాలని సిఫార్సు చేశారు.

మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- ఫిషింగ్ హార్బర్‌లో మత్స్య కార్మికుల బంద్
- స్తంభించిన కార్యకలాపాలు


ఫిషింగ్ హార్బర్‌లో నిలిచిపోయిన బోట్లు

పాత పోస్టాఫీసు (విశాఖ దక్షిణ): మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారుల ఎస్టీ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఫిషింగ్ హార్బర్‌లో బంద్ పాటించి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెబుతామని నేతలు హెచ్చరించారు. బంద్‌తో హార్బర్‌లో సేవలు నిలిచిపోయాయి. సుమారు 15 వేల మంది కార్మికులు తమ పనులను ఆపివేశారు. 16 ఐస్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. దీంతో చేపల రేవు బోసిపోయింది. హార్బర్‌లో రోజూ రూ.2 కోట్ల విలువైన చేపలు, రొయ్యల ఎగుమతితోపాటు రూ.40 లక్షల పచ్చి చేపల వ్యాపారం, రూ.15 లక్షల ఎండు చేపల వ్యాపారం జరుగుతుంది. ఐస్ ఉత్పత్తిదారులు రోజూ సుమారు రూ.20 లక్షల ఐస్‌ను హార్బర్‌కు తరలిస్తుంటారు. 5,600 మంది డ్రైవర్లు, కలాసీలు, 500 మంది రిక్షా కార్మికులు, 10 వేల మంది బంద్ నిర్వహించారు.

'రియల్' మోసాలపై ఫిర్యాదు చేయండి

పురపాలక, పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి కరికల్ వలవన్

సాక్షి, అమరావతి: కొనుగోలు ఒప్పందాన్ని అతిక్రమించిన రియల్టర్లపై కొనుగోలుదారులు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కరికల్ వలవన్ తెలిపారు. ఇందుకోసం www.rera.ap.gov.inను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. విజయవాడలో ఉన్న ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథార్టీ (ఏపీ రేరా) ప్రధాన కార్యాలయంలో ఈ వెబ్‌సైట్‌ను వలవన్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలుదారునికి, ప్రమోటర్లకు మధ్య జరిగిన ఒప్పందాన్ని అమలుచేయడంలో కానీ, అధికార సంస్థల నుంచి పొందిన అనుమతుల్లో ఎటువంటి తప్పులు, అతిక్రమణలు గమనించినా ఈ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతేకాకుండా.. ప్రాజెక్టు వివరాలు, ప్రమోటర్లకు సంబంధించిన అన్ని వివరాలు, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, ఆర్థిక లావాదేవీలు వంటి అన్ని వివరాలను ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో నిర్మాణం చేపట్టే ప్రతీ అపార్టమెంటు, షాపింగ్ కాంప్లెక్సులు, గేటెడ్ కమ్యూనిటీల గురించి ముందుగా ఏపీ రెరా వద్ద నమోదు చేయాలని, రిజిస్టర్ నెంబరు పొందిన తర్వాతనే ప్రకటనలు, బ్రోచర్లు, ఇతర మార్కెటింగ్ కార్యకలాపాలను ప్రారంభించాలని ఆయన స్పష్టంచేశారు. నమోదు చేయకుండా అమ్మకాలు చేపట్టడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి నిర్మాణాలను ఆపివేయడం కానీ, లేదా అపరాధ రుసుము విధించే సర్వహక్కులు ఏపీ రెరాకు ఉన్నాయని వలవన్ అన్నారు.

చిన్న ఆలయ ఉద్యోగుల ఆందోళన బాట

- జీతాలు పెంచాలంటూ నేడు విజయవాడలో ధర్నా

సాక్షి, అమరావతి: ఆదాయం తక్కువగా ఉండే ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా 2015 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలంటూ ఆంధ్రప్రదేశ్ హిందూ దేవదాయ ధర్మదాయ సంస్థల వేతన అర్చక, ఉద్యోగ సంయుక్త కార్యాచరణ సమితి ఆందోళనలకు పిలుపునిచ్చింది. 13 జిల్లాల్లోని ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులు మంగళవారం విజయవాడలో ధర్నా నిర్వహించనున్నారు. దేవదాయ శాఖ పరిధిలో రాష్ట్రంలో 23 వేల వరకు ఆలయాలు ఉన్నాయి. వీటిలో కనీస ఆదాయం వచ్చేవి 2,400 ఆలయాలను దేవదాయ శాఖ గుర్తించింది. 2,400 ఆలయాల్లో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ పద్ధతిన మొత్తం 10,200 మంది పనిచేస్తున్నారు. వీరిలో కేవలం 3,800 మందికి పేస్కేల్ రూపంలోనూ, మరో 1,100 మందికి పది వేల రూపాయల చొప్పన వేతనాలను చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందరికీ 2015 ప్రకారం వేతనాలు అందజేయాలంటూ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధులు మొదట 'ఛలో దేవదాయ శాఖ కమిషనరేట్' ఆందోళనకు పిలుపునిచ్చారు. అయితే, కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో మంగళవారం విజయవాడలో ఆందోళన నిర్వహించనున్నారు. దేవదాయ శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యల వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెకు పూనుకుంటామంటూ ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎ.వినోద్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ హెచ్చరించారు. ఈమేరకు ప్రతినిధుల బృందం సోమవారం ఆడిషనల్ కమిషనర్ రఘునాథ్‌ను కలిసి నోటీసు ఇచ్చారు.

సమ్మెలోకి జూనియర్ డాక్టర్లు

- ఈనెల 13లోగా స్టైఫండ్ బకాయిలు చెల్లించాలి
- డీఎంఈకి సమ్మె నోటీసు ఇచ్చిన జూనియర్ డాక్టర్లు

సాక్షి, అమరావతి: 'గడిచిన ఆరు నెలలుగా తమకు రావాల్సిన స్టైఫండ్ ఇవ్వడంలేదు.. పదుల సార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం.. అయినా స్పందించలేదు. విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇస్తున్నాం.. అంటూ రాష్ట్ర జూనియర్ డాక్టర్ల సంఘం (జుడా) సోమవారం వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ ఎస్. సుబ్బారావుకు సమ్మె నోటీసు ఇచ్చింది. ఈనెల 13లోగా బకాయిలు చెల్లించాలని, వివిధ రాష్ట్రాల్లో జూనియర్ డాక్టర్లకు ఇస్తున్నట్లుగా తమకూ వేతనాలు అమలుచేసి సమస్యలు పరిష్కరిస్తే సమ్మె విరమించుకుంటామని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో శక్తికి మించి సేవలందిస్తున్నామని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో సమ్మె నోటీసు ఇస్తున్నామని వారు చెప్పారు. సమ్మెకు మీరు కూడా మద్దతిస్తే బాగుంటుందని వారు డీఎంఈని కోరారు. నోటీసు ఇచ్చిన వారిలో డా.బిల్లా వికాస్, డా.స్వామి, డా.రోహిత్, డా.వెంకటరమణ తదితరులున్నారు. కాగా, గడువు విధించి ఒత్తిడి తేవడం మంచిది కాదని, మరోసారి పునరాలోచించుకోవాలని జూడాలకు డీఎంఈ సూచించారు. ఆర్థిక శాఖలో వేతనాల సవరణ, బకాయిల గురించి కృషి చేస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఆయన చెప్పినప్పటికీ జూనియర్ వైద్యులు సంతృప్తి చెందక సమ్మె నోటీసు ఇచ్చారు.

● తెలంగాణ

విభజన హామీలు అమలయ్యేలా చూడండి

సోనియాగాంధీని కోరిన పొంగులేటి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం పార్లమెంటులో సోనియాగాంధీని కలుసుకొని తెలంగాణకు అమలు కావాల్సిన విభజన హామీలపై వినతిపత్రాన్ని సమర్పించినట్టు ఆయన మీడియాకు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు కావస్తున్నా హైకోర్టు విభజన, బయ్యారం స్టీల్‌ప్లాంట్, పలు కేంద్ర సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయిందని ఆమెకు వివరించామన్నారు.

హైదరాబాద్‌లో వరల్డ్ కేన్సర్ డే

హైదరాబాద్: కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు డీఎస్ రీసెర్చ్ సెంటర్ ఏటా ఫిబ్రవరి 4న 'వరల్డ్ కేన్సర్ డే'ను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఆదివారం నగరంలో పలు కార్యక్రమాలను ఏర్పాటుచేసింది. కేన్సర్‌పై పలువురు డాక్టర్లు అవగాహన కల్పించారు. కేన్సర్ బాధితులను ఒత్తిడి నుంచి దూరం చేసేందుకు సంగీత విభావరి, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ థెరపీ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. 100 మంది కేన్సర్ పేషెంట్లు హాజరయ్యారు. ప్రజలు, విద్యార్థులు, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు హైదరాబాద్, బెంగళూరు, ముంబై, గువాహటి, కోల్‌కతా, వారణాసి వంటి నగరాల్లో ఏటా డీఎస్ఆర్‌సీ పలు క్యాంపెయిన్‌లు నిర్వహిస్తోంది.

పదహారేళ్లకు చిక్కిన షఫీఖ్

దిల్‌సుఖ్‌నగర్ కేసులో కీలక నిందితుడు



షఫీఖ్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్‌లో 2002లో జరిగిన బాంబు పేలుడు కేసులో కీలక నిందితుడు మహ్మద్ షఫీఖ్ ముజావర్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఎన్నో ఏళ్లుగా ఒమన్‌లో మకాం వేసిన ఇతను ఇటీవల ఖతర్ వెళ్లే ప్రయత్నాల్లో ఇంటర్‌పోల్‌కు దొరికాడు. దీంతో షఫీఖ్‌ను భారత్‌కు పంపారు. ఈ ఉగ్రవాదిని సీఐడీ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. లష్కరే తొయిబాలో షఫీఖ్ కీలక పాత్ర పోషించాడు. దిల్‌సుఖ్‌నగర్ కేసులో షఫీఖ్ కీలకంగా వ్యవహరించాడు. 2002, నవంబర్ 21న దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబు పేలుడులో ఇద్దరు చనిపోగా, 15 మంది గాయపడ్డారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులున్నారు. ఈ కేసులో వాంటెడ్‌గా ఉన్న షఫీఖ్‌పై నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీని ఆధారంగా సీఐడీ అధికారులు ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించారు. ఇతడిని అదుపులోకి తీసుకున్న సీఐడీ సోమవారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచింది. కోర్టు షఫీఖ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన మహ్మద్ ఆజం, సయ్యద్ అబ్దుల్ అజీజ్‌లు గతంలో ఎదురు కాల్పుల్లో మరణించారు. ఈ కేసుకు సంబంధించి అబ్దుల్ రజాఖ్‌ను 2005లో అరెస్టు చేశారు. సలావుద్దీన్‌ను కొచ్చిలో 2012లో పట్టుకోగా, ట్రాన్సిట్ వారెంట్‌పై ఇక్కడికి తీసుకువచ్చారు. రజాఖ్ 2011లో ఆత్మహత్య చేసుకోగా... సలావుద్దీన్ 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ప్రొఫెషనల్ కోర్సులు చదివే వారికి.. ముఖ్యంగా బీటెక్ విద్యార్థులకు జాబ్ స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్, ప్రాక్టికల్ ఓరియెంటేషన్, ఇండస్ట్రీ అప్రోచ్ తప్పనిసరిగా ఉండాలని గత కొన్నేళ్లుగా ఇండస్ట్రీ వర్గాలు, విద్యావేత్తలు పేర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ దిశగా ఎట్టకేలకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ముందడుగు వేసింది. బీటెక్ కరిక్యులంలో మార్పులుచేర్పులు చేస్తూ.. వాటిని జాతీయస్థాయిలో అన్ని యూనివర్సిటీలు అమలు చేయాలని నిర్దేశించింది. బీటెక్ విద్యా విధానంలో మార్పుల దిశగా కొద్ది నెలల క్రితం మోడల్ కరిక్యులంను రూపొందించిన ఏఐసీటీఈ.. ఇటీవలే దాన్ని ఖరారు చేసింది. దాంతో వచ్చే విద్యా సంవత్సరం (2018-19) నుంచే కొత్త కరిక్యులం విద్యార్థులను పలకరించనుంది. ఈ నేపథ్యంలో ఏఐసీటీఈ తాజా సిలబస్ మార్పులపై విశ్లేషణ..

ఏఐసీటీఈ.. కొత్తగా ఇంజనీరింగ్



ఇంజనీరింగ్ స్పెషల్

ప్రాధాన్యం కొంత తగ్గించి.. ప్రాక్టికల్ అప్రోచ్‌కు పెద్దపీట వేసింది. బీటెక్‌లో థియరీ పరంగా ఉన్న 192 క్రెడిట్స్‌ను 160కు కుదించాలని పేర్కొంది. తగ్గించిన థియరీ క్రెడిట్స్ స్థానంలో ప్రాక్టికల్స్ ఇచ్చే క్రెడిట్స్‌ను పెంచాలని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ వర్క్, సెమినార్లకు హాజరు, ఇంటర్న్‌షిప్‌లకు 15 క్రెడిట్స్ నిర్దేశించారు. థియరీ క్లాస్‌ల సంఖ్యను వారానికి 30 నుంచి 20కు తగ్గించింది. ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల 2018-19లో బీటెక్‌లో అడుగుపెట్టే విద్యార్థులు.. నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసుకునే నాటికి కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను సొంతం చేసుకునే వీలుంది.

ఇండక్షన్ ప్రోగ్రామ్

బీటెక్‌లో చేరే గ్రామీణ ప్రాంత విద్యార్థులు తొలి సంవత్సరంలో ఇంగ్లిష్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి విషయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఇంటర్మీడియెట్ నుంచి ఒక్కసారిగా ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో అడుగుపెట్టిన విద్యార్థులు భిన్నమైన కొత్త వాతావరణంలో త్వరగా ఇమడలేకపోతున్నారు. దాంతో ఏఐసీటీఈ బీటెక్ మొదటి సంవత్సరంలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్ పేరుతో కొత్త విధానానికి రూపకల్పన చేసింది. మూడు వారాల వ్యవధిలో ఉండే ఈ ప్రోగ్రామ్‌లో ఫిజికల్ యాక్టివిటీస్, క్రియేటివ్ ఆర్ట్స్, యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్, లిటరరీ, ప్రొఫిషియన్సీ మాడ్యూల్స్, నిపుణులతో లెక్చర్స్, కాలేజీ సమీప నివాస ప్రాంతాలకు తీసుకెళ్లడం తదితర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్లు, ప్రొఫెసర్లు మెంటార్లుగా వ్యవహరించాలని పేర్కొంది.

ప్రాక్టికల్ ఓరియెంటేషన్

ఏఐసీటీఈ నూతన కరిక్యులం ప్రకారం థియరీకి

కనీసం రెండు ఇంటర్న్‌షిప్‌లు

విద్యార్థుల్లో క్షేత్ర నైపుణ్యాలు, పరిశ్రమలోని వాస్తవ పరిస్థితులపై అవగాహన పెరిగేలా కొత్త కరిక్యులంలో ఏఐసీటీఈ చర్యలు తీసుకుంది. బీటెక్ విద్యార్థులు నాలుగేళ్ల కోర్సు వ్యవధిలో కనీసం రెండు ఇంటర్న్‌షిప్స్ తప్పనిసరిగా పూర్తిచేయాలని నిర్దేశించింది. విద్యార్థులు ద్వితీయ, తృతీయ సంవత్సరం వేసవి సెలవుల్లో ఇంటర్న్‌షిప్ చేయాలి. ఇందుకోసం ఇన్‌స్టిట్యూట్‌లు కూడా చొరవ చూపాలి. ఇండస్ట్రీ వర్గాలతో సంప్రదించి తమ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఇండస్ట్రీ ఇంటరాక్షన్

బీటెక్ కోర్సును అందిస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు/యూనివర్సిటీలు తప్పనిసరిగా తమ పరిధిలో ఇండస్ట్రీ ఇంటరాక్షన్ విభాగాలను ఏర్పాటుచేయాలని ఏఐసీటీఈ సూచించింది. తద్వారా నిరంతరం ఇండస్ట్రీ వర్గాలను సంప్రదిస్తూ.. తాజా మార్పులు తెలుసుకుంటూ.. అందుకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలు లభించేలా ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్‌వర్క్ వంటివి చేపట్టాలని సూచించింది.

ఏఐ, ఐవోటీ

కేవలం ప్రాక్టికల్ అప్రోచ్ పెంచడమే కాకుండా.. విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించే విధంగానూ ఏఐసీటీఈ కొత్త కరిక్యులంలో మార్పులు చేసింది. ప్రస్తుతం అత్యంత ఆవశ్యకంగా మారుతున్న ఐఓటీ, ఆటోమేషన్ టెక్నాలజీ, బిగ్ డేటా అనాలిసిస్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంశాలను కూడా బీటెక్ కరిక్యులంలో పొందుపర్చింది.

సోషల్ అవేర్‌నెస్

విద్యార్థులకు కేవలం టెక్నికల్ నైపుణ్యాలే కాకుండా.. సామాజిక పరిస్థితులపైనా అవగాహన పెరిగే విధంగా కొత్త కరిక్యులంను రూపొందించింది. పర్యావరణ శాస్త్రం, భారత రాజ్యాంగం, ఎసెన్స్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్ అంశాలను కొత్త కరిక్యులంలో చేర్చింది. వీటికి ఎలాంటి క్రెడిట్స్ ఉండవు. కానీ, అభ్యర్థులు తప్పనిసరిగా వీటిని అధ్యయనం చేయాల్సి ఉంటుంది. బీటెక్ విద్యార్థులకు సామాజిక సమస్యలపై అవగాహన ఉండటం లేదనే అభిప్రాయాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

పరీక్షల విధానం

బీటెక్ విద్యార్థులకు నిర్వహించే పరీక్షల

క్రెడిట్స్ వివరాలు

మొత్తం క్రెడిట్స్‌ను 192 నుంచి 160కు తగ్గించిన నేపథ్యంలో ఒక్కో కేటగిరీకి నిర్దేశించిన క్రెడిట్స్ వివరాలు..

కేటగిరీ	క్రెడిట్స్
1. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (మేనేజ్‌మెంట్ కోర్సెస్ సహా)	12
2. బేసిక్ సైన్స్ కోర్సెస్	25
3. ఇంజనీరింగ్ సైన్స్ కోర్సెస్ (వర్క్‌షాప్, డ్రాయింగ్, ఎలక్ట్రికల్/మెకానికల్/కంప్యూటర్ తదితర విభాగాల్లో బేసిక్స్ సహా)	24
4. ప్రొఫెషనల్ కోర్ కోర్సెస్	48
5. ప్రొఫెషనల్ ఎలక్టివ్ కోర్సెస్	18
6. ఓపెన్ సబ్జెక్ట్స్	18
7. ప్రాజెక్ట్ వర్క్,సెమినార్ అండ్ ఇంటర్న్‌షిప్	15
8. తప్పనిసరి కోర్సులు (పర్యావరణ శాస్త్రం, ఇండక్షన్ ట్రెనింగ్, భారత రాజ్యాంగం, ఎసెన్స్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్)	-
మొత్తం	160

విధానంలోనూ మార్పులు తీసుకొచ్చింది. సెమిస్టర్ పరీక్షల్లో అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ థింకింగ్‌ను పరీక్షించేలా ప్రశ్నపత్రం ఉండాలని నిర్దేశించింది. అలాగే ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఇంటర్ డిసిప్లినరీ, మల్టీ డిసిప్లినరీ అప్రోచ్ పెరిగే విధంగానూ చర్యలు తీసుకుంది. అందుకోసం ఎలక్టివ్ కోర్సెస్ అనే వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఎలక్టివ్స్‌ను ఓపెన్ ఎలక్టివ్స్, ప్రొఫెషనల్ ఎలక్టివ్స్.. అని రెండు రకాలుగా పేర్కొంది. ఓపెన్ ఎలక్టివ్స్ పరంగా విద్యార్థులు సదరు ఇన్‌స్టిట్యూట్ పరిధిలోని ఇతర కోర్సుల్లోని ఏదో ఒక సబ్జెక్ట్‌ను ఓపెన్ ఎలక్టివ్‌గా ఎంపిక చేసుకోవాలి. ప్రొఫెషనల్ ఎలక్టివ్స్ విషయంలో.. ఇతర ఇంజనీరింగ్ కోర్సుల సబ్జెక్టులను అధ్యయనం చేసే వీలుంది.

ఏటా మార్పులు!

ఎన్నో ఏళ్ల తర్వాత కరిక్యులంలో మార్పులు చేసిన ఏఐసీటీఈ.. ఇకపై ఏటా మార్పులు చేసే దిశగా అడుగులు వేయనుంది.

> **జాబ్ మార్కెట్లో సమర్థంగా**
>
> జాబ్‌మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించేలా ఏఐసీటీఈ కొత్త కరిక్యులం, విధివిధానాలను రూపొందించింది. వీటి అమలు దిశగా యూనివర్సిటీల స్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. విద్యార్థులు కూడా ఆయా నైపుణ్యాలను అందిపుచ్చుకునేందుకు కృషిచేయాలి.
>
> – **ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్**, నిట్-వరంగల్.

బులెటిన్ బోర్డ్

ఎన్ఎండీసీలో 36 ఖాళీలు

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) లిమిటెడ్‌లో 36 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.
- **పోస్టు-ఖాళీలు:** మేల్ వార్డ్ అటెండెంట్ గ్రేడ్ (2) ట్రెనీ-3; ఫీమేల్ వార్డ్ అటెండెంట్ గ్రేడ్ (2) ట్రెనీ-2; ఎండబ్ల్యూఏ/ఎఫ్‌డబ్ల్యూఏ కమ్ డ్రెస్సర్ గ్రేడ్ (3) ట్రెనీ-1; అసిస్టెంట్ రేడియోగ్రాఫర్ గ్రేడ్ (3) ట్రెనీ-1; అసిస్టెంట్ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ గ్రేడ్ (3) ట్రెనీ-2; నర్స్ గ్రేడ్ (3) ట్రెనీ-8; మెయింటెనెన్స్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్) ట్రెనీ-13; ఎలక్ట్రీషియన్ గ్రేడ్ (3) ట్రెనీ-5, బ్లాస్టర్ గ్రేడ్ (2) ట్రెనీ-1.
- **స్టైపెండ్:** శిక్షణలో మొదటి 12 నెలలు.. గ్రేడ్ (3) పోస్టుల్లో నర్స్ ట్రెనీకి రూ.13,000, మిగిలిన వాటికి రూ.12,000; గ్రేడ్ (2) పోస్టులకు రూ.11,000. శిక్షణలో తర్వాత ప్రతి నెలకు రూ.500 అదనంగా ఆరు నెలలపాటు ఇస్తారు.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి మిడిల్/ఎనిమిదో తరగతి/పదోతరగతి/ఐటీఐ/డిగ్రీ/ఇంజనీరింగ్ డిప్లొమా. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **వయసు:** 18-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/జాబ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్.
- **దరఖాస్తు రుసుం:** రూ.150; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **చివరి తేదీ:** ఫిబ్రవరి 26, 2018. **వెబ్‌సైట్:** www.nmdc.co.in

ఓఎన్‌జీసీ మంగళూరు పెట్రోకెమికల్స్ లిమిటెడ్‌లో 17 ఖాళీలు

మంగళూరులోని ఓఎన్‌జీసీ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఓఎంపీఎల్).. 17 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటీస్-12 (కెమికల్ ఇంజనీరింగ్-4+ఈఈఈ-4+ఈసీఈ-1+ఈఐఈ-1+ఎంఈ-2); టెక్నీషియన్ అప్రెంటీస్-5 (కెమికల్ ఇంజనీరింగ్-2+ఈఈఈ-2+ఈఐఈ-1).
- **స్టైపెండ్:** గ్రాడ్యుయేట్ అప్రెంటీస్-4,984; టెక్నీషియన్ అప్రెంటీస్-రూ.3,542.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కి ఇంజనీరింగ్ డిగ్రీ, టెక్నీషియన్ అప్రెంటీస్‌కి ఇంజనీరింగ్ డిప్లొమా 2015/2016/2017లో ఉత్తీర్ణులై ఉండాలి. అన్‌రిజర్వుడ్‌కు కనీసం 55 శాతం, ఓబీసీ-కనీసం 45 శాతం, ఎస్సీ/ఎస్టీకి కనీసం 40 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** మార్చి 1, 2018.
- **వెబ్‌సైట్:** www.ompl.co.in

రైట్స్ లిమిటెడ్‌లో 19 ఖాళీలు

రైట్స్ లిమిటెడ్.. 19 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రెండు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది. ఇది రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన మినీరత్న సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్.
- **పోస్టు-ఖాళీలు:** అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్)-10; టెక్నికల్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్)-9.
- **అర్హతలు:** ఏఈ పోస్టులకు ఇంజనీరింగ్ డిగ్రీ (సివిల్), టీఏ (ఎలక్ట్రికల్)కు ఇంజనీరింగ్ డిప్లొమా (ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్) అలాగే సంబంధిత రంగంలో కనీసం రెండేళ్ల అనుభవం.
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి ఏఈకి 30 ఏళ్లు; టీఏకి 32 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఏఈకి రాతపరీక్ష/ఇంటర్వ్యూ; టీఏకి రాతపరీక్ష.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 21, 2018.
- **వెబ్‌సైట్:** ritesltd.com

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌లో 21 ఖాళీలు

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ (ఏఐఈఎల్).. 21 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** కోఆర్డినేటర్ (ఫ్లైట్ ఆపరేషన్స్/డిస్పాచ్)-2; మేనేజర్ (ఫ్లైట్ డిస్పాచ్)-3; సీనియర్ ఆఫీసర్ (ఫ్లైట్ డిస్పాచ్)-2; ఆఫీసర్ (కాక్‌పిట్/కేబిన్ క్ర్యూ షెడ్యూలింగ్)-1; అసిస్టెంట్ టెక్నికల్ లైబ్రరీ-1; రూట్ మేనేజర్-1; ఆఫీసర్ (సేల్స్)-1; ఆఫీసర్ (ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్)-2; సీనియర్ అసిస్టెంట్ (ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్)-6; సీనియర్ ఆఫీసర్ (కేటరింగ్ సర్వీసెస్)-1.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఇంటర్మీడియెట్/గ్రాడ్యుయేషన్/ఎంబీఏ/డిప్లొమా (హోటల్ మేనేజ్‌మెంట్). అలాగే నిబంధనల మేర అనుభవం, కంప్యూటర్ ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ప్రి-మెడికల్ ఎగ్జామినేషన్.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోపు.
- **వెబ్‌సైట్:** www.airindiaexpress.in

డీఆర్‌డీవోలో 4 జేఆర్ఎఫ్‌లు

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)లో 4 జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ డీఆర్‌డీవో రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్ (ఆర్ఏసీ) ప్రకటన విడుదల చేసింది.
- **పోస్టు:** జేఆర్ఎఫ్ **స్టైపెండ్:** రూ.25,000+హెచ్ఆర్ఏ.
- **విభాగాల వారీ ఖాళీలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-2; సైకాలజీ-2.
- **అర్హతలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌కి కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్ ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత. బీఈ/బీటెక్ అయితే సంబంధిత విభాగంలో గేట్ స్కోర్ కార్డు ఉండాలి; సైకాలజీకి పీజీ (సైకాలజీ) ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతతోపాటు నెట్.
- **వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- **వాకిన్ ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వాకిన్ ఇంటర్వ్యూ వేదిక:** ఆర్ఏసీ, డీఆర్‌డీవో, లక్నో రోడ్, తిమర్‌పూర్, ఢిల్లీ-110054.
- **వెబ్‌సైట్:** www.rac.gov.in

‘Aadhaar’ is Oxford’s first Hindi word of the year



International

Lifts ban on refugees from 11 countries
The United States has announced it was lifting its ban on refugees from 11 "high-risk" countries, but said those seeking to enter the US would come under much tougher scrutiny than in the past. Applicants from 11 countries comprise Egypt, Iran, Iraq, Libya, Mali, North Korea, Somalia, South Sudan, Sudan, Syria and Yemen.

National

'Aadhaar' is Oxford's first Hindi word of the year
The Hindi word of the Year for 2017 is 'AADHAAR'. This was announced at the Jaipur Literature Festival on 27th January. According to Oxford University the 'Hindi Word of the Year' is a word or expression that has attracted a great deal of attention and reflects the ethos, mood, or preoccupations of the past year. 'Aadhaar' also becomes the first Oxford Dictionaries Hindi Word of the Year.

Allahabad High Court judge Shukla to be impeached
Supreme Court of India Chief Justice Dipak Misra on 30th January recommended the removal of Justice Shri Narayan Shukla, the eighth senior-most judge of the Allahabad High Court, following an adverse report about him by an in-house panel. The panel had been set up by the CJI. The CJI has set the process in motion with a letter to the Prime Minister for the impeachment of the judge. When the impeachment motion is moved in Parliament, an investigation is conducted. If the findings of guilt are confirmed, the impeachment motion will be put to vote for the removal of the judge by a majority.

Bilateral

India, Cambodia to strengthen bilateral trade & investment ties
India and Cambodia on 27th January inked four pacts, including one to improve cooperation in prevention, investigation of crimes and legal assistance in criminal matters and a Line of Credit to fund Cambodia's Stung Sva Hab water resources development project for 37 million dollar. Both leaders discussed issues of mutual interest related to development partnership, trade and investment, HRD and people-to-people contacts.

Indian, Vietnamese armies hold first military exercise
Armies of India and Vietnam on 29th January began a six day-long military exercise in Jabalpur in Madhya Pradesh, reflecting growing defence ties between the two countries. The exercise, named 'VINBAX' and it is the first military exercise between the two countries.

Economy

Jaitley announces Health Scheme in Budget



Union Finance Minister Arun Jaitley introduced Union Budget on 1st February, 2018. The total budget allocation is Rs 24,42,213 crore. Finance Minister announced world's largest national health protection scheme for 50 crore poor people to provide 5 lakh rupees cover per family per year, the scheme is known as the Ayushman Bharat. Other highlights of the budget are……
- » All Kharif crops to be paid MSP one and half times cost of production; Kisan Credit Card facility extended to fisheries and animal husbandry sectors.
- » Target of free LPG beneficiaries raised to eight crore from five crore; free electricity connections to be provided to four crore poor households.
- » Economy to grow by 7.2-7.5 per cent in second half of current fiscal says the Finance Minister; Fiscal deficit pegged at 3.3 per cent next year.
- » Surcharge of 10% on income above Rs 50 lakh but less than Rs 1 crore, 15% on income above Rs 1 crore to continue.
- » Indian economy size $2.5 trillion; 7th largest in world, India is expected to be 5th largest economy very soon.
- » Revised Fiscal Deficit estimate for 2017-18 is Rs 5.95 lakh crore at 3.5% of GDP, Fiscal Deficit for FY'19 estimated at 3.3% of GDP
- » Govt's market borrowing estimated at Rs 4.07 lakh crore in FY'19 versus Rs 4.79 lakh crore estimated in 2017-18.
- » Rs 2,000 crore fund for developing and upgrading Agri-marketing infra in 22,000 Grameen Agri Markets and 585 APMCs.
- » Allocation for Food Processing Ministry doubled from Rs 715 crore in RE FY'18 to Rs 1,400 crore in BE FY'19).
- » Agriculture credit disbursal target increased to Rs 11 lakh crore from Rs 10 lakh crore in 2017-18.
- » Substantial increase in allocation of National Rural Livelihood Mission to Rs 5,750 crore in FY'19.
- » Facility of fixed-term employment will be extended to all sectors.
- » Outlay of Rs 7,148 crore for textiles sector in 2018-19.
- » Gross budgetary support for Railways hiked to over Rs 3 lakh crore in 2018-19 from Rs 2.73 lakh crore in 2017-18.
- » Allocation on Digital India scheme doubled to Rs 3,073 crore.
- » Rs 10,000 crore for creation and augmentation of telecom infrastructure.
- » DIPAM will come up with more ETF offers including debt ETF.
- » Disinvestment target for FY'19 at Rs 80,000 cr.
- » Bank recapitalisation to pave way for PSBs to lend additional credit of Rs 5 lakh crore.
- » Govt to formulate a 'Gold Policy' to develop gold as an asset class.
- » Emoluments of President revised to Rs 5 lakh/month, Rs 4 lakh for Vice President and Rs 3.5 lakh for the Governors.
- » Govt proposes changes to refix salary, constituency allowance, office expenses and meeting allowance payable to Members of Parliament.
- » Education Cess increased to 4%.
- » Govt makes PAN mandatory for any entity entering into a financial transaction of Rs 2.5 lakh or more.
- » Food subsidy to rise to Rs 1.69 lakh crore in 2018-19 from Rs 1.4 lakh crore in current year.
- » Defence outlay raised to Rs 2.82 lakh crore in 2018-19 from Rs 2.67 lakh crore in current year.

Sports

PM launches Khelo India School Games
Prime Minister Narendra Modi launched Kehlo India Games on 31st January. Khelo India School Games, which are a part of the Khelo India programme, are being held from 31st January to 8th February, 2018 in New Delhi.

Persons in News

Keshav Gokhale: Senior diplomat Vijay Keshav Gokhale on 29th January took charge as the Foreign Secretary. He has two-year tenure. He succeeded S Jaishankar who was given one-year extension in January last year.

Rajendra Sharma
Current Affairs Faculty, Hyderabad



సాక్షి బిజినెస్
మంగళవారం 6-2-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
310 ▼	94 ▼
34,757	10,667

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,226	▽ 15
డోజోన్స్	25,369	▽ 152
ఎఫ్‌టీఎస్ఈ 100	7,353	▽ 90
డాక్స్	12,683	▽ 103
షాంఘై	3,487	△ 25
నికాయ్	22,682	▽ 592

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.95	65.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.07	92.25
€	యూరో	ఎస్‌బీఐ	81.19	81.35
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.32	59.43
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.80	51.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.49	49.58
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.52	18.40
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.89	18.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.20	11.68

ఐఫోన్ ధరలకు మళ్లీ రెక్కలు

రూ.3,210 వరకు పెరుగుదల

- ‘ఐఫోన్ ఎస్ఈ’కి మినహాయింపు



న్యూఢిల్లీ: దిగ్గజ టెక్ కంపెనీ ‘యాపిల్’ తాజాగా ఐఫోన్ ధరలను రూ.3,210 (3.6%) వరకు పెంచింది. కేంద్రం మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీని పెంచడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. యాపిల్ వెబ్‌సైట్‌లోని సమాచారం ప్రకారం కంపెనీ తన యాపిల్ వాచ్ ధరలను కూడా రూ.2,510 వరకు పెంచేసింది.

ధరల పెంపు నిర్ణయంతో టాప్–ఎండ్ మోడల్ ఐఫోన్ ఎక్స్ (256 జీబీ) గరిష్ట విక్రయ ధర (ఎంఆర్‌పీ) రూ.3,210 మేర పెరిగింది. దీంతో దీని ధర రూ.1,08,930కు ఎగసింది. ఇక ఐఫోన్ 6 (32 జీబీ) రూ.1,120 పెరుగుదలతో రూ.31,900కు చేరింది. ధర పెరుగుదల నిర్ణయం ఐఫోన్ ఎస్ఈ మినహా ఇతర అన్ని ఐఫోన్ మోడళ్లకూ వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. కంపెనీ ఐఫోన్ ఎస్ఈని భారత్‌లోనే అసెంబుల్ చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ మోడల్‌లో 32 జీబీ వేరియంట్ ధర రూ.26,000గా, 128 జీబీ వేరియంట్ ధర రూ.35,000గా ఉంది.

రెండు నెలల్లో 2 సార్లు..

కస్టమ్స్ డ్యూటీని గత రెండు నెలల కాలంలో రెండు సార్లు పెంచేశారు. దేశీ తయారీకి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం డిసెంబర్‌లో దిగుమతి చేసుకుంటున్న స్మార్ట్‌ఫోన్లపై సుంకాన్ని 10% నుంచి 15%కి పెంచింది. దీంతో యాపిల్ కంపెనీ ఐఫోన్ల ధరలను 2.5% పెంచింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న 2018–19 బడ్జెట్ ఆవిష్కరణ సందర్భంగా కస్టమ్స్ డ్యూటీని ఫోన్లపై 20%కి.. మొబైల్ ఫోన్లకు సంబంధించిన ప్రత్యేకమైన విడిభాగాలు, యాక్ససరీస్‌పై 15 శాతం వరకు.. స్మార్ట్‌వాచ్‌లు, వేరబుల్స్‌పై 20 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో ఐఫోన్ ధరలు రెండోసారి పెరిగాయి.

భారతి టెలికంలో సింగ్‌టెల్ మరింత పెట్టుబడి

రూ.2,649 కోట్లతో 1.7% వాటా కొనుగోలు

- దీంతో మొత్తం వాటా 48.9 శాతానికి



న్యూఢిల్లీ: సింగపూర్‌కి చెందిన టెలికం సంస్థ సింగ్‌టెల్ తాజాగా భారతి టెలికంలో రూ. 2,649 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో భారతి టెలికంలో సింగ్‌టెల్ వాటా 1.7 శాతం పెరిగి 48.9 శాతానికి చేరుతుంది. ఇందుకోసం షేర్ల ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ ప్రక్రియ ఈ ఏడాది మార్చిలోగా పూర్తి కానుంది. దీనికోసం షేరు ఒక్కింటి ధరను రూ.310గా నిర్ణయించారు. టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్‌కి భారతి టెలికం హోల్డింగ్ సంస్థ. భారతి టెలికం సంస్థకి భారతి ఎయిర్‌టెల్‌లో 50.1 శాతం వాటాలున్నాయి. తాజాగా సమకూరే నిధులను రుణ భారం తగ్గించుకోవటానికి వినియోగించుకోనున్నట్లు భారతి ఎయిర్‌టెల్ వెల్లడించింది. 2017 డిసెంబర్ 31 నాటికి కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సంస్థ నికర రుణం రూ.91,714 కోట్లుగా ఉంది. భారతి టెలికం 2016లో రైట్స్ ఇష్యూ ద్వారా రూ.2,500 కోట్లు సమీకరించగా.. సింగ్‌టెల్ కూడా ఇన్వెస్ట్ చేసింది. రెండేళ్ల వ్యవధిలోనే తాజాగా మరో రూ.2,649 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది.

ఇది తమ సంస్థపై సింగ్‌టెల్‌కి ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని భారతి టెలికం ఎండీ దేవేన్ ఖన్నా పేర్కొన్నారు. మరోవైపు, భారత్‌లో ప్రస్తుతం ప్రతికూల పరిస్థితులు ఉన్నా.. దీర్ఘకాలిక దృష్టితో ఎయిర్‌టెల్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు సింగ్‌టెల్ సీఈవో ఆర్థర్ లాంగ్ తెలిపారు. స్మార్ట్‌ఫోన్స్, మొబైల్ డేటా వినియోగం పెరిగే క్రమంలో ప్రాంతీయంగా మార్కెట్ లీడర్‌గా ఎయిర్‌టెల్ ఆధిపత్యం కొనసాగగలదని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బీఎస్ఈలో ఎయిర్‌టెల్ షేరు 4.2 శాతం లాభపడి రూ. 439.5 వద్ద క్లోజయ్యింది.

టీవీఎస్ 125 సీసీ స్కూటర్.. ఎన్‌టార్క్

- ధర రూ. 58,750
- ప్రధాన ఫీచర్: స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్



చెన్నై: ప్రముఖ ద్వి, త్రి చక్ర వాహన తయారీ కంపెనీ ‘టీవీఎస్ మోటార్’ తాజాగా 125 సీసీ స్కూటర్ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చింది. ‘ఎన్‌టార్క్’ పేరుతో సరికొత్త స్కూటర్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.58,750 (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ). శక్తివంతమైన ఇంజిన్‌తో, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో, అధిక ఫీచర్లతో, స్టెల్త్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇన్‌స్పైర్డ్ డిజైన్‌తో ఈ స్కూటర్‌ను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ఇందులో ‘స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్’ అనే బ్లూటూత్ ఆధారిత కనెక్టెడ్ టెక్నాలజీ వ్యవస్థ, డే టైమ్ రన్నింగ్ లైట్స్‌తో కూడిన ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, ఫుల్ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్, ఎల్ఈడీ టెయిల్‌లైట్, నావిగేషన్ అసిస్ట్, టాప్ స్పీడ్ రికార్డర్, చివరి పార్కింగ్ ప్లేస్, సర్వీస్ రిమైండర్, ట్రిప్ మీటర్, కాలర్ ఐడీ డిస్‌ప్లే, మల్టీ రైడ్ స్టాటిస్టిక్స్ మోడ్స్, యూఎస్‌బీ చార్జర్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని వివరించింది. ఇక స్కూటర్ టాప్ స్పీడ్ గంటకు 95 కిలోమీటర్లు. స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్ అనేది ‘టీవీఎస్ ఎన్‌టార్క్’ అనే మొబైల్ యాప్ ఆధారంగా పనిచేస్తుంది. ఇది గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది.

ఏప్రిల్ 1 తర్వాత అమ్మే షేర్లపైనే!

ఆ లాభాలపైనే దీర్ఘకాల మూలధన పన్ను వర్తింపు...

- కొనుగోలుకు మాత్రం జనవరి 31 గరిష్ట ధర ప్రామాణికం
- ఎల్‌టీసీజీపై కేంద్రం వివరణ...



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో షేర్ల కొనుగోలు లావాదేవీలపై విధించిన మూలధన లాభాల పన్నుపై (ఎల్‌టీసీజీ) ఇన్వెస్టర్లలో ఉన్న గందరగోళాన్ని తొలగించేందుకు కేంద్రం వివరణ ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1న లేదా ఆ తర్వాత తమ వద్దనున్న షేర్లను విక్రయించడం ద్వారా వచ్చిన లాభాలపై మాత్రమే ఎల్‌టీసీజీ అమలవుతుందని స్పష్టం చేసింది. కాగా, లాభాన్ని లెక్కించే విషయంలో షేర్ల కొనుగోలు రేటుకు ప్రామాణికత విషయానికొస్తే... జనవరి 31 నాటి ట్రేడింగ్ గరిష్ట ధర లేదా వాస్తవ కొనుగోలు ధర, ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే దాన్ని లెక్కలోకి తీసుకుంటామని పేర్కొంది. షేర్లను కొనుగోలు చేసిన తర్వాత ఏడాది తర్వాత విక్రయించినా (ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ యూనిట్లు, బిజినెస్ ట్రస్ట్‌ల యూనిట్లు కూడా) ఆ లాభాలపై (రూ.లక్షకు మించితే) 10% ఎల్‌టీసీజీని 2018–19 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం షేర్లను కొని, ఏడాదిలోపు విక్రయిస్తే... తద్వారా వచ్చే లాభాలపై 15% స్వల్పకాలిక మూలధన పన్ను (ఎస్‌టీసీజీ) మాత్రమే అమల్లో ఉంది. దీనికితోడు ప్రతి కొనుగోలు/అమ్మకం లావాదేవీపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) కూడా ఇన్వెస్టర్లు చెల్లించాల్సి వస్తోంది. ఎల్‌టీసీజీ విధింపుతో జంటపన్నులను (డబుల్ ట్యాక్సేషన్) కేంద్రం అమల్లోకి తీసుకొచ్చినట్లు లెక్క. వాస్తవానికి 14 ఏళ్ల క్రితం 20% మేర ఎల్‌టీజీసీ అమల్లో ఉండేది. దీన్ని తొలగించి అప్పుడు ఎస్‌టీటీని ప్రవేశపెట్టారు. ఇప్పుడు మోదీ సర్కారు మాత్రం ఎస్‌టీటీని యథాతథంగా కొనసాగిస్తూనే... మళ్లీ ఎల్‌టీజీసీకూడా తీసుకొచ్చింది. ఈ పన్ను ప్రభావంతో స్టాక్ మార్కెట్లో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడం... సూచీలు కుప్పకూలటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్ల అనుమానాల నివృత్తి కోసం కేంద్రం వివరణను(ఎఫ్ఏక్యూ) విడుదల చేసింది. దీనిలో ముఖ్యాంశాలివీ...

- కొత్తగా విధించనున్న ఎల్‌టీసీజీ ప్రకారం... 2018 ఏప్రిల్ 1న లేదా ఆ తర్వాత షేర్లను అమ్మితేనే (కొన్న తేదీ నుంచి ఏడాది పూర్తయితే) ఆ లాభాలపై 10 శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది. జనవరి 31 వరకూ వచ్చిన లాభాలపై (గ్రాండ్‌ఫాదర్డ్) ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.
- ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 10లోని 30 క్లాజ్ కింద ఈ ఏడాది మార్చి 31 వరకూ షేర్ల విక్రయంపై ఎల్‌టీసీజీ మినహాయింపు పొందవచ్చు.
- ఏడాది తర్వాత షేరు లేదా ఫండ్ యూనిట్ అమ్మకం విలువ నుంచి కొనుగోలు విలువను తీసేస్తే వచ్చిన లాభాన్ని దీర్ఘకాలిక మూలధన లాభం కింద లెక్కిస్తారు.
- 2018, జనవరి 31కి ముందు షేరును కొనుగోలుచేస్తే ఆ ధరను వాస్తవ రేటుగా పరిగణిస్తారు. అయితే, జనవరి 31 నాటి ట్రేడింగ్‌లో సంబంధిత షేరు గరిష్ట ధరనూ దీనికి ప్రామాణికంగా చూస్తారు. ఈ రెండింటిలో ఏది ఎక్కువ ధర అయితే, దాన్ని లాభాల లెక్కింపులో కొనుగోలు ధరగా పరిగణిస్తారు.
- ఇక అన్‌లిస్టెడ్ యూనిట్ (బిజినెస్ ట్రస్టులకు సంబంధించినవి) విషయానికొస్తే.. ఈ ఏడాది జనవరి 31 నాటి నికర అసెట్ విలువ(ఎన్ఏవీ)ను కొనుగోలు ధరగా పరిగణిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 తర్వాత ఈ యూనిట్లను గనుక విక్రయిస్తే... దీనిపై వచ్చిన లాభాలపై(రూ. లక్ష మించితే) 10 శాతం పన్నును కట్టాల్సి ఉంటుంది.
- ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 మధ్య తమ వద్దనున్న షేర్ల విక్రయం వల్ల తలెత్తిన దీర్ఘకాలిక మూలధన నష్టాలను పన్ను చెల్లింపు విషయంలో తగ్గించి చూపడానికి (సెట్‌ఆఫ్) లేదా బదలాయించుకోవడానికి (క్యారీ ఫార్వార్డ్) కుదరదు.
- 2018, ఏప్రిల్ 1 తర్వాత విక్రయించే షేర్లపై వచ్చే దీర్ఘకాలిక మూలధన నష్టాలను మాత్రం సెట్‌ఆఫ్ లేదా క్యారీఫార్వార్డ్ చేసుకోవడానికి వీలుంటుంది.
- కొన్ని కంపెనీలు తమవద్దనున్న మిగులు నిధులను కంపెనీ విస్తరణ కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టకుండా షేర్లు, ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు మొగ్గుచూపుతున్నాయి. దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను లేకపోవడం దీనికి ప్రధాన కారణం. అందుకే పెట్టుబడులను ఉత్పాదకతవైపు మళ్లించడం కోసమే ఎల్‌టీసీజీని విధించాల్సి వచ్చింది.



మినహాయింపులు తొలగించాకే 25 శాతానికి

కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపుపై ఆర్థిక మంత్రి జైట్లీ

న్యూఢిల్లీ: పరిశ్రమకిస్తున్న మినహాయింపులన్నీ ఎత్తివేసిన తర్వాతే కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించడం సాధ్యపడుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. 30% స్థాయిలో ఉన్న కార్పొరేట్ ట్యాక్స్‌ను నాలుగేళ్లలో 25%కి తగ్గిస్తానంటూ 2015లో తాను హామీ ఇచ్చిన సంగతిని ఆయన ప్రస్తావించారు. అయితే, ఇది అమలు చేయాలంటే మినహాయింపులన్నీ ఎత్తివేయాల్సి ఉంటుందంటూ షరతు కూడా పెట్టినట్లు జైట్లీ చెప్పారు. చాలా మటుకు సంస్థలు మినహాయింపులపై ఆధారపడి ఉన్నందున .. మధ్యలో వాటిని ఎత్తివేయడం సరికాదని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన తెలిపారు. ప్రస్తుతం రూ. 250 కోట్ల దాకా టర్నోవరు ఉండే సంస్థలపై ట్యాక్స్ రేటును 25%కి తగ్గించగా, దాదాపు 7,000 పైచిలుకు సంస్థలు 30% పరిధిలోనే ఉన్నాయి. అయితే, పన్ను మినహాయింపులన్నీ పరిగణనలోకి తీసుకుంటే వీటి ట్యాక్స్ రేటు 22%గానే ఉంటోందని జైట్లీ పేర్కొన్నారు. మరోవైపు, పెట్రోల్, డీజిల్‌ను వస్తు, సేవల పన్నుల (జీఎస్‌టీ) విధానంలోకి చేర్చడంపై రాష్ట్రాలు సుముఖంగా లేవని ఆయన చెప్పారు. జీఎస్‌టీ అమలయ్యే కొద్దీ క్రమంగా సహజ వాయువు, మొత్తం రియల్టీని దీని పరిధిలోకి తేవాల్సి ఉంటుందని.. ఏదో ఒక దశలో పెట్రోల్, డీజిల్ని కూడా చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయని జైట్లీ పేర్కొన్నారు. ఇక ద్రవ్య లోటు కట్టడి లక్ష్యం 0.3% తేడాతో తప్పిపోవడం.. కేవలం గణాంకాలపరమైన అంశం మాత్రమేనని ఆయన చెప్పారు.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- ఏటికి ఎదురీదిన ఎయిర్‌టెల్
- ద్రవ్యలోటు సవరణ పెద్దగా ప్రభావం చూపదు: మూడీస్
- నిఫ్టీ బోటమ్ 10,000-10,300
- పుంజుకున్న పీసీ జ్యువెలర్స్
- బిజినెస్ క్విజ్-3

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..
WWW.SAKSHIBUSINESS.COM
SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
GET IT ON Google Play | Available on the App Store

దేశమంతా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సేవలు

సెప్టెంబర్‌కల్లా మొత్తం ఆరంభిస్తాం • పోస్టల్ కార్యదర్శి అనంతనారాయణ్



న్యూఢిల్లీ: తపాలా శాఖకు చెందిన పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు తన సేవల్ని దేశవ్యాప్తంగా విస్తరించనుంది. వచ్చే మే నుంచి పేమెంట్స్ బ్యాంకు శాఖలను దేశవ్యాప్తంగా ప్రారంభించే ఆలోచనతో ఉన్నామని, ఇందుకు రూ.1,450 కోట్లు వెచ్చిస్తామని తపాలా శాఖ సెక్రటరీ అనంత నారాయణ్ నందా తెలిపారు. ‘‘ఏప్రిల్ నాటికి ఏర్పాట్లన్నీ పూర్తవుతాయి. మే నుంచి సెప్టెంబర్ మధ్య దేశవ్యాప్తంగా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు శాఖలను ప్రారంభిస్తాం’’ అని వెల్లడించారు. 1.55 లక్షల పోస్టాఫీసులు సేవల కేంద్రాలుగా పనిచేస్తాయని, వీటికి బ్యాక్ ఎండ్ సేవల్ని 650 పేమెంట్స్ బ్యాంకు శాఖలు అందిస్తాయని చెప్పారు. గతేడాది జనవరిలో తపాలా శాఖ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సేవల్ని ప్రయోగాత్మకంగా రాంచీ, రాయ్‌పూర్‌లో ప్రారంభించింది. మొత్తం 11 సంస్థలు పేమెంట్స్ బ్యాంకు సేవల్ని ప్రారంభించేందుకు ఆర్‌బీఐ 2015లో అనుమతించింది. ఎయిర్‌టెల్, పేటీఎం, పోస్ట్ పేమెంట్స్ బ్యాంకులు మాత్రమే ఇప్పటిదాకా సేవల్ని ఆరంభించాయి.

టాటా స్పీడుకు ‘జేఎల్‌ఆర్’ బ్రేకులు

తగ్గిన జేఎల్‌ఆర్ లాభాలు

- పుంజుకున్న దేశీయ వ్యాపారం
- 11 రెట్లు పెరిగిన కన్సాలిడేటెడ్ లాభం



ముంబై: వాహన దిగ్గజం టాటా మోటార్స్ గ్రూప్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 11 రెట్లు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.112 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.1,215 కోట్లకు ఎగసిందని టాటా మోటార్స్ తెలిపింది. గత క్యూ3లో ‘లో బేస్ ఎఫెక్ట్’ ఉన్న కారణంగా ఈ క్యూ3లో నికర లాభం ఈ స్థాయిలో పెరిగినట్లు కనిపిస్తోంది. మొత్తం ఆదాయం రూ.63,933 కోట్ల నుంచి 16 శాతం వృద్ధితో రూ.74,156 కోట్లకు పెరిగిందని కంపెనీ ఎండీ, సీఈఓ గుంటర్ బుశ్చెక్ చెప్పారు. ఇబిటా 80 శాతం వృద్ధితో రూ.8,671 కోట్లకు, ఇబిటా మార్జిన్ 4.2 శాతం వృద్ధితో 11.7 శాతానికి పెరిగాయని పేర్కొన్నారు. అయితే జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్‌ఆర్) పేలవమైన పనితీరు కారణంగా కన్సాలిడేటెడ్ ఫలితాలు అంచనాలను అందుకోలేకపోయాయన్నది నిపుణుల మాట. వాణిజ్య వాహనాల విక్రయాల జోరు, వ్యయ నియంత్రణ ప్రయత్నాలు కలిసిరావడంతో దేశీయ వ్యాపారం మాత్రం మంచి వృద్ధిని సాధించిందని వారు పేర్కొన్నారు.

స్టాండెలోన్ ఆదాయం 58 శాతం అప్..

స్టాండెలోన్ ప్రాతిపదికన టాటా మోటార్స్ ఆదాయం 58% పెరిగిందని గుంటర్ బుశ్చెక్ చెప్పారు. స్టాండెలోన్ ప్రాతిపదికన రూ.16,102 కోట్ల ఆదాయంపై రూ.184 కోట్ల నికర లాభం సాధించామన్నారు. ‘‘గత క్యూ3లో రూ.1,052 కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక కాలంలో రూ.295 కోట్ల చొప్పున నికర నష్టాలు వచ్చాయి. ఇబిటా 77 రెట్లు పెరిగి రూ.1,383 కోట్లకు, ఇబిటా మార్జిన్ 8.4 శాతం వృద్ధితో 8.6%కి చేరాయని వివరించారు. టర్న్ అరౌండ్ వ్యూహం మంచి ఫలితాలనిస్తోంది. కొత్త మోడళ్లు అందుబాటులోకి తేవడం, వినియోగదారుల అభిరుచులకనుగుణంగా మోడళ్లను అందించడం తదితర కారణాల వల్ల లాభదాయకత మెరుగుపడింది’’ అని చెప్పారు.

నిరాశపరిచిన జేఎల్‌ఆర్..

ఈ కంపెనీ కామధేనువు జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఫలితాలు నిరాశపరిచాయి. గత డిసెంబర్ క్వార్టర్లో 25.5 కోట్ల పౌండ్లుగా ఉన్న స్థూలలాభం ఈ క్యూ3లో 19.2 కోట్ల పౌండ్లకు తగ్గింది. ఆదాయం మాత్రం 4 శాతం వృద్ధితో 630 కోట్ల డాలర్లకు పెరిగింది. నిర్వహణ లాభాల మార్జిన్ 1.6 శాతం వృద్ధితో 10.9 శాతానికి పెరిగింది. చైనా, ఇతర విదేశాల్లో జేఎల్‌ఆర్ అమ్మకాలు బాగా ఉన్నాయని గుంటర్ బుశ్చెక్ చెప్పారు. అయితే డీజిల్ ఇంధనం, బ్రెగ్జిట్ తదితర అంశాలపై అనిశ్చితి కారణంగా ఇంగ్లండ్, అమెరికా, యూరప్ మార్కెట్లలో అమ్మకాలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.

సిద్ధంగా ఉన్నాం...: దేశీయంగా ప్రయాణికుల వాహన విక్రయాలు 18%, వాణిజ్య వాహనాల అమ్మకాలు 34% వృద్ధి చెందాయని, మొత్తం అమ్మకాలు 29% వృద్ధితో 1,32,000కు పెరిగాయని బుశ్చెక్ తెలిపారు. బీఎస్–6 కాలుష్య ప్రమాణాలు, ఎలక్ట్రిక్ వాహనాలు, ప్రత్యామ్నాయ ఇంధనాలు వంటి అంశాలు వాహన పరిశ్రమపై చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపనున్నాయని, ఈ సమస్యలను ఎదుర్కొనడానికి సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. మార్కెట్ ముగిసిన తర్వాత టాటా మోటార్స్ ఫలితాలు వచ్చాయి. సోమవారం స్టాక్ మార్కెట్ నష్టపోయినా, క్యూ3 ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాతో టాటా మోటార్స్ షేర్ 3% లాభంతో రూ.396 వద్ద ముగిసింది.

చైనాకు.. మన మందులు మరిన్ని!!

అమెరికాకు మాత్రం తగ్గిన ఔషధ ఎగుమతులు

- ఆ లోటును భర్తీ చేస్తున్న ఇతర మార్కెట్లు
- 2016–17 ఎగుమతులను మించనున్న 2017–18
- ఏపీఐల తయారీకి ఫార్మెక్సిల్ దన్ను



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇప్పటి వరకు చైనా వస్తువుల దిగుమతి వెల్లువను మనం చూశాం. కానీ ఫార్మా విషయంలో దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంటోంది. 2017–18 ఏప్రిల్–డిసెంబర్ కాలంలో చైనాకు భారత్ నుంచి సుమారు రూ.1,024 కోట్ల ఔషధాలు ఎగుమతి అయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 62.6% అధికం. చైనా ఫార్మా రంగంలో వేతనాలతో పాటు విద్యుత్ చార్జీలూ పెరిగాయి. అలాగే నియంత్రణ సంస్థల నూతన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్లాంట్ల పునరుద్ధరణ జరుగుతోంది. మరికొన్ని ప్లాంట్లు సామర్థ్యాన్ని తగ్గించుకోవడం, మూసివేతలు కూడా భారత్ నుంచి ఎగుమతులు పెరగటానికి కారణమని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) చెబుతోంది.

గతేడాది మించి ఎగుమతులు..

2015–16లో భారత్ నుంచి రూ.1,08,224 కోట్ల విలువైన ఔషధాలు పలు దేశాలకు ఎగుమతి అయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 0.43% తగ్గి రూ.1,07,776 కోట్లుగా ఉంది. 2017–18 ఏప్రిల్ – డిసెంబర్ కాలంలో ఎగుమతులు రూ.81,600 కోట్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 0.60 శాతం అధికం. 2017–18 ఆశాజనకంగా ఉందని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ ‘సాక్షి’ బిజినెస్ బ్యూరోకు తెలిపారు. 2016–17ను మించిన ఫలితాలు ఈ ఏడాది నమోదవుతాయన్నారు. డిసెంబర్‌లో ఆయుష్ ఉత్పత్తులు అత్యధిక వృద్ధిని అందుకున్నాయి. వృద్ధి పరంగా ఆ తర్వాతి స్థానాన్ని హెర్బల్ ప్రొడక్ట్స్ చేజిక్కించుకున్నాయి.

యూఎస్ఏ తిరోగమనంలో ఉన్నా..

ఫార్మా ఎగుమతుల విషయంలో భారత్‌కు అమెరికాయే ప్రధాన మార్కెట్. మూడింట ఒక వంతు ఎగుమతులు జరిగేది ఈ మార్కెట్‌కే. 2017–18 ఏప్రిల్–డిసెంబర్‌లో యూఎస్ఏకు ఎగుమతులు 12% తగ్గి రూ.24,422 కోట్లకు పరిమితమయ్యాయి. అయితే ఇతర మార్కెట్లు కలిసి రావడంతో మొత్తంగా ఏప్రిల్–డిసెంబర్‌లో 0.60% వృద్ధికి ఆస్కారం ఏర్పడింది.

చైనా నుంచే ముడిపదార్థాలు..: భారత్ వినియోగిస్తున్న యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్, ఇంటర్మీడియేట్స్, కీ స్టార్టింగ్ మెటీరియల్స్‌లో దిగుమతులే అత్యధికంగా 75 శాతం ఉన్నాయి. ఇందులో 60 శాతం వాటాతో చైనా ప్రధాన మార్కెట్‌గా నిలుస్తోంది. ‘‘భారత ప్రభుత్వం నిర్దేశించిన అత్యవసర ఔషధాల తయారీకి అవసరమైన ముడిపదార్థాల్లో 70 శాతం దిగుమతయ్యేవే. ధర, ముడిసరుకు సరఫరా విషయంలో భారత్‌ను చైనాయే శాసిస్తోంది. సరఫరా ఆగిపోతే ఎలాగన్నది నిజంగా ఆందోళనకరమైన అంశమే’’ అని రవి ఉదయభాస్కర్ రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్‌కు దిగుమతి అవుతున్న రూ.38,400 కోట్ల విలువైన అన్ని రకాల ఫార్మా సంబంధ ఉత్పత్తుల్లో యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్ల (ఏపీఐ) వాటా రూ.12,800 కోట్లు. గతంలో భారత్‌లో ఏపీఐలు తయారు చేసినప్పటికీ, లాభదాయత ఎక్కువగా ఉన్న ఫినిష్డ్ డోసేజ్ డ్రగ్స్‌పైనే చాలా కంపెనీలు క్రమంగా దృష్టిపెట్టసాగాయి.



ఫార్మెక్సిల్ చొరవ..

భారత్‌లో ఏపీఐల తయారీని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ఫార్మెక్సిల్ నడుం బిగించింది. ఇవి దేశీయంగా తయారైతే దిగుమతులపై ఆధారపడక్కర్లేదు. ఇందుకోసం 75 రకాల ఔషధాలను గుర్తించాం. వీటి తయారీకి కావాల్సిన ఏపీఐలు వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసే ఆస్కారం ఉందో లేదో తెలుసుకోవడానికి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్‌ను (సీఎస్ఐఆర్) కోరాం. ఇది భారీ వ్యయంతో కూడుకున్నది. సీఎస్ఆర్ కింద నిధులు ఖర్చు చేయాల్సిందిగా 4,000 కంపెనీలను అభ్యర్థించాం. ఫార్మెక్సిల్‌లో ఇన్నోవేషన్ డెస్క్ సైతం ఏర్పాటు చేశాం. ప్రభుత్వం నిధులు సమకూరిస్తేనే ఈ యజ్ఞం ఫలిస్తుంది. *–రవి ఉదయ భాస్కర్, డైరెక్టర్ జనరల్, ఫార్మెక్సిల్*

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,550 (కనిష్టం), రూ.4,850 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.7,000 (కనిష్టం), రూ.10,100 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	--, --
ఉల్లి (కర్నూలు)	రూ.1,090 (కనిష్టం), రూ.2,430 (గరిష్టం)
చక్కెర (చెన్నై)	రూ.3,500
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

సొనాలికా ట్రాక్టర్ల అమ్మకాల్లో 45 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: క్రితం సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో దేశీయంగా సొనాలికా ట్రాక్టర్ల అమ్మకాల్లో 45 శాతం వృద్ధి నమోదు చేసినట్టు ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ వెల్లడించింది. 2017 జనవరిలో కంపెనీ 4,172, 2018 జనవరిలో 6,039 యూనిట్లు విక్రయించింది. జనవరిలో 735 ట్రాక్టర్లను ఎగుమతి చేసినట్టు కంపెనీ ఈడీ రమన్ మిట్టల్ తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో వాహన బీమా ప్రీమియం తగ్గింది..

ముంబై: ప్రైవేట్ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 'హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో' తాజాగా తన మోటార్ ఇన్సూరెన్స్ ప్రీమియంలో 15 శాతం వరకు కోత విధించింది. ప్రస్తుత, కొత్త కస్టమర్లు ఇరువురికీ ఈ తగ్గింపు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. 'జీఎస్‌టీ అమలు, కొత్త ఆటోమేటెడ్ విధానాలను అవలంబించడం, పలు వ్యయ నియంత్రణ పద్ధతుల వల్ల ఖర్చులను హేతుబద్ధీకరించుకున్నాం. ఈ ప్రయోజనాన్ని ప్రీమియం తగ్గింపుతో కస్టమర్లకు బదిలీ చేస్తున్నాం' అని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేశ్ కుమార్ తెలిపారు. ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన సెల్ఫ్-ఇన్‌స్పెక్షన్ యాప్ సాయంతో వినియోగదారులు ఎంటువంటి ఫిజికల్ డాక్యుమెంట్లతో అవసరం లేకుండానే వారి మోటార్ ఇన్సూరెన్స్ పాలసీని రెన్యూవల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

బోర్డ్ మీటింగ్స్

హీరో మోటోకార్ప్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, లుపిన్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జేఎస్‌డబ్ల్యు ఎనర్జీ, ఫ్యూచర్ రిటైల్, ఆర్ఈసీ, బ్లూ స్టార్, హెరిటేజ్ ఫుడ్స్, నాట్కో ఫార్మా, స్పైస్‌జెట్, టాటా కెమికల్స్, థెర్మాక్స్, బెర్జర్ పెయింట్స్, డిష్ టీవీ, రామ్‌కో ఇండస్ట్రీస్, రామ్‌కో సిమెంట్, సీమెన్స్, అపోలో టైర్స్, ఏబీజీ షిప్‌యార్డ్.

ఐదో రోజూ నష్టాలే..

- ప్రపంచ మార్కెట్ల పతన ప్రభావం...
- ఇంట్రాడేలో సెన్సెక్స్ 546పాయింట్లు డౌన్
- చివరకు 310 పాయింట్ల పతనంతో 34,757 వద్ద ముగింపు
- 94 పాయింట్ల నష్టంతో 10,667కు నిఫ్టీ

వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ స్టాక్ మార్కెట్లో నష్టాలు కొనసాగాయి. ప్రపంచ మార్కెట్ల పతనం కూడా తోడవడంతో సోమవారం స్టాక్ సూచీలు భారీగా పడిపోయాయి. చమురు ధరల మంట అగ్నికి మరింత ఆజ్యం పోసింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 310 పాయింట్లు నష్టపోయి 34,757 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 94 పాయింట్లు నష్టపోయి 10,667 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 546 పాయింట్లు, నిఫ్టీ 174 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. చివర్లో కొనుగోళ్లు జరగడంతో నష్టాలు కొంత మేర రికవరీ అయ్యాయి.

రూ.5 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి..

ఇటీవల కాలంలో సెన్సెక్స్ భారీ పతనం కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.5 లక్షల కోట్లు ఆవిరైంది. అమ్మకాలు కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5,04,253 కోట్లు ఆవిరై రూ.1,47,95,747 కోట్లకు పడిపోయింది.

ప్రపంచ పరిణామాల వల్లే ఈ పతనం...!: అధియా

స్టాక్ మార్కెట్ భారీ పతనానికి బలహీనమైన ప్రపంచ సెంటిమెంట్ ప్రధాన కారణమని ఆర్థిక శాఖ కార్యదర్శి హస్ముఖ్ అధియా అభివర్ణించారు. అంతేకాని ఈక్విటీ లాభాలపై 10 శాతం దీర్ఘకాల లాభాల పన్ను(ఎల్‌టీసీజీ) విధించడం వల్ల కాదని వివరించారు. 10 శాతం ఎల్‌టీసీజీ సమంజసమైనదేనని ఆయన సమర్థించారు. అన్‌లిస్టెడ్ షేర్ల విక్రయ లాభాలు, స్థిరాస్తి లాభాలపై పన్ను 20 శాతంగా ఉందని పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్లు ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయని, ప్రపంచ మార్కెట్ల పతనం సమయంలోనే ఎల్‌టీసీజీ పన్ను ప్రతిపాదన వెల్లడి కావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అన్ని దేశాల ఎమ్ఎస్‌సీఐ ఇండెక్స్3.4 శాతం పతనమైందని, ఆ ప్రభావం మన మార్కెట్‌పై కూడా ఉంటుందని ఆయన వివరించారు. ఈ ఏడాది జనవరి 31 తర్వాత వచ్చే లాభాలపై మాత్రమే ఈ పన్ను వర్తిస్తుందని, ఇన్వెస్టర్లు ఇప్పుడు అమ్మకాలు జరపాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్ల పతనం వల్లే ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో అమ్మకాలు కొనసాగుతున్నాయని ఆయన విశ్లేషించారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	4,760
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	36,898
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	5,89,595
ఎఫ్ఐఐ	-1,264
డీఐఐ	1,164

ఆస్టర్ హెల్త్‌కేర్ ప్రైస్‌బాండ్ రూ.180-190

ఈ నెల 12న ప్రారంభం రూ.980 కోట్ల సమీకరణ

ముంబై: కోచి కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్ కంపెనీ తన ఐపీఓకు (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ధరల శ్రేణిని రూ.180–190గా నిర్ణయించింది. ఈ నెల 12న ప్రారంభమయ్యే ఈ ఐపీఓ వచ్చే నెల 15న ముగుస్తుంది. ఈ ఐపీఓలో భాగంగా రూ.725 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు 1.34 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో జారీ చేస్తారు. ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.980 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి, విస్తరణకు, ఇతర సాధారణ వ్యాపార కార్యకలాపాల కోసం వినియోగించాలని కంపెనీ యోచిస్తోంది.

హడ్కో లాభం 10 శాతం డౌన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ హడ్కో కంపెనీ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో పది శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.182 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.164 కోట్లకు తగ్గినట్లు హడ్కో (హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.930 కోట్ల నుంచి రూ.1,092 కోట్లకు పెరిగింది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో హడ్కో షేర్ 0.7 శాతం లాభంతో రూ.80 వద్ద ముగిసింది.

సామ్ పిస్టన్ నికరలాభం రూ.5.8 కోట్లు

డిసెంబరు క్వార్టరులో సామ్ పిస్టన్, రింగ్స్ నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.4.6 కోట్ల నుంచి రూ.5.8 కోట్లకు చేరింది. టర్నోవరు రూ.62 కోట్ల నుంచి రూ.87 కోట్లను తాకింది.

ఎస్ఎంఎస్ లైఫ్‌సైన్సెస్‌కు రూ.2.5 కోట్ల లాభం..

డిసెంబరు త్రైమాసికంలో ఎస్ఎంఎస్ లైఫ్‌సైన్సెస్ నికరలాభం రూ.4.3 కోట్ల నుంచి రూ.2.5 కోట్లకు వచ్చి చేరింది. టర్నో)వరు రూ.61 కోట్ల నుంచి రూ.67 కోట్లకు ఎగసింది.

పెరిగిన మోల్డ్‌టెక్ లాభం..

కన్సాలిడేటెడ్ ఫలితాల్లో మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ నికరలాభం రూ.3.7 కోట్ల నుంచి రూ.6.8 కోట్లకు ఎగసింది. టర్నోవరు రూ.77 కోట్ల నుంచి రూ.85 కోట్లకు చేరింది.

ఎన్‌ఏసీఎల్ నిధుల సమీకరణ..

రూ.300 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు ఎన్‌ఏసీఎల్‌ఇండస్ట్రీస్ వాటాదారులు సమ్మతించారు. డిసెంబరు క్వార్టరులో కంపెనీ రూ.192 కోట్ల టర్నోవరుపై రూ.1.37 కోట్ల నికరలాభం ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.182 కోట్ల టర్నోవరుపై రూ.25 లక్షల నికర నష్టం పొందింది.

వృద్ధి రేటు పెరిగి... పడిపోతుంది: మెరిల్‌లించ్

2018–19 మొదటి భాగంలో 7.5 శాతానికి.... తర్వాత ఆరు నెలల కాలంలో 7 శాతానికి

ముంబై: రానున్న ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో జీడీపీ 7.5 శాతం స్థాయిలో వృద్ధి చెందుతుందని, దీనికి తక్కువ బేస్ కారణమని, ఆ తర్వాతి ఆరు నెలల్లో 7 శాతానికి తగ్గిపోతుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్‌లించ్ పేర్కొంది. వృద్ధి రేటు పుంజుకున్నా గానీ, వాస్తవ సామర్థ్యం కంటే ఒక శాతం తక్కువగానే ఉంటుందని అంచనా వేసింది. ''2017–18లో నోట్ల రద్దు, జీఎస్టీ ప్రభావాలతో వృద్ధి కనిష్టానికి (తక్కువ బేస్) చేరినందున 2018–19 ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో జీడీపీ 7.5 శాతానికి పుంజుకుంటుంది. అయితే, రెండో అర్ధభాగంలో 7 శాతానికి తగ్గుతుంది. అయినప్పటికీ పాత జీడీపీ సిరీస్ ఆధారంగా మా అంచనాల కంటే ఒక శాతం తక్కువే'' అని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్‌లించ్ పేర్కొంది.

రేపు ఆర్‌బీఐ పాలసీ నిర్ణయం

ధరల పెరుగుదల రిస్క్ నేపథ్యంలో ఆర్‌బీఐ రేట్ల కోత నిర్ణయం తీసుకుంటుందన్న అంచనాలు లేవు. ఈ నెల 7న జరిగే సమావేశంలో యథాతథ స్థితినే కొనసాగిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం 5.2 శాతానికి చేరగా, జనవరిలో ఇది 5 శాతానికి చల్లబడుతుందని భావిస్తున్నారు. మధ్యకాలానికి ద్రవ్యోల్బణాన్ని 4 శాతం స్థాయిలో కొనసాగించాలన్నది ఆర్‌బీఐ, కేంద్రలక్ష్యం.

సేవల రంగం స్పీడ్ జనవరిలో 3 నెలల గరిష్టం: పీఎంఐ

దేశంలో సేవల రంగం జనవరి నెలలో మంచి పనితీరును కనబరిచింది. నికాయ్ సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ప్రకారం, జనవరిలో సూచీ 51.7గా నమోదయ్యింది. గడచిన మూడు నెలల్లో సూచీ ఈ స్థాయిలో నమోదు కావటం ఇదే తొలిసారి. కొత్త ఆర్డర్లు పెరగడం దీనికి కారణమని సర్వే పేర్కొంది. డిసెంబర్‌లో సూచీ 50.9గా ఉంది. నవంబర్‌లో క్షీణతతో 48.5 వద్ద సూచీ ఉంది. నికాయ్ సూచీ 50 పైన ఉంటే వృద్ధిగా ఆ దిగువన క్షీణతగా భావించడం జరుగుతుంది.

ఐటీ చట్టాలు దుర్వినియోగం చేయొద్దు

కార్పొరేట్లకు సీబీడీటీ చైర్మన్ సుశీల్ చంద్ర సూచన

న్యూఢిల్లీ: పన్నులు కట్టే విషయంలో వేతన జీవుల కన్నా కార్పొరేట్లు మరింత బాధ్యతాయుతంగా ఉండాలని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ సుశీల్ చంద్ర సూచించారు. వివిధ మినహాయింపులు పోనూ భారత్‌లో బడా కంపెనీలపై విధిస్తున్న పన్ను భారం చాలా తక్కువే ఉంటోందన్నారు. ఈ నేపథ్యంలో పన్నులు ఎగవేసే ఉద్దేశంతో.. ఐటీ చట్టాలను దుర్వినియోగం చేయొద్దని సూచించారు. పరిశ్రమల సమాఖ్య సీఐఐ నిర్వహించిన బడ్జెట్ అనంతర చర్చా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చంద్ర ఈ విషయాలు తెలిపారు. 'చట్టాలు చాలా మటుకు సరళం చేశాం. సాధారణంగా మీరు అడిగేట్లుగానే రేటు కూడా సముచిత స్థాయిలోనే ఉండేలా చూస్తున్నాం. ఇక, పరిశ్రమవర్గాలు నిఖార్సుగా పన్నులు కడుతున్న పక్షంలో పన్ను రేటు ఆటోమేటిక్‌గా తగ్గుతుంది. వేతన జీవులకన్నా కంపెనీలు ఈ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది' అని ఆయన చెప్పారు.

ఎల్‌ఎన్‌జీ దిగుమతిపై ఐజీఎస్ దృష్టి

న్యూఢిల్లీ: వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్‌కి చెందిన బ్రిటిష్ పెట్రోలియం భాగస్వాములుగా ఏర్పాటయిన 'ఇండియా గ్యాస్ సొల్యూషన్స్' ద్రవీకృత సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) దిగుమతులపై దృష్టి సారిస్తోంది. దేశీయంగా ఇంధన అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో త్వరలో ఎల్‌ఎన్‌జీ దిగుమతిపై నిర్ణయం వెల్లడించనున్నట్లు సంస్థ సీఈవో వినోద్ తహిల్యాని తెలిపారు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,455
బంగారం (99.5, 10గ్రా)	30,305
వెండి (కిలో)	38,730
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	28,960
వెండి (కిలో)	– –
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,410
బంగారం (22 క్యారెట్లు)	28,960
వెండి (కిలో)	41,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	30,880
బంగారం (22 క్యారెట్లు)	28,610
వెండి (కిలో)	39,900
విశాఖపట్నం	
బంగారం(24 క్యారెట్లు)	31,520
బంగారం (22 క్యారెట్లు)	28,900
వెండి (కిలో)	42,000
విజయవాడ (శుక్రవారం ధరలు)	
బంగారం (24 క్యారెట్లు)	31,400
బంగారం (22 క్యారెట్లు)	28,900
వెండి(కిలో)	40,800
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,330
బంగారం (22 క్యారెట్లు)	28,960
వెండి (కిలో)	39,700

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.00కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	64.91	$65.45
బ్రెంట్	68.16	$68.58

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 06-2-2018

విశాఖ	355–00
చిత్తూరు	373–00
వరంగల్	362–00
ముంబై	405–00
చెన్నై	380–00
విజయవాడ	350–00
గోదావరి	350–00
నమక్కల్	365–00
05–2–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	360–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.40
బెంగళూరు	370–00
ఢిల్లీ	370–00
కోల్‌కతా	388–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	408.2	417.95
AMBUJA C	259.1	259.55
ASIAN PA	1134.1	1137.9
AXIS BAN	566.25	564.9
BAJAJ AU	3185.55	3241.3
BAJAJ FI	1604.95	1628.9
BHARTI A	440.2	422.35
BOSCH LI	19951.55	19474.4
BHARAT P	475.95	477.15
CIPLA LT	580.1	581.15
COAL IND	294.8	290.35
EICHER M	27537.95	27811.75
GAIL (IN	462.35	466.45
HCL TECH	993.15	990.9
HDFC LTD	1823.35	1903.85
HDFC BAN	1913.85	1948
HERO MOT	3636.4	3623.45
HINDALCO	246.6	249.85
HIND.petrol	383.85	374.5
HIND.unilever	1355.75	1372.2
INDIABUL	1292.45	1319.6
ICICI BA	329.7	335.1
INDUSIND	1713	1761.3
BHARTI I	349	344.85
INFOSYS	1138.2	1143.25
INDIAN O	409	408.65
ITC LTD	279.25	275.35
KOTAK MA	1062.25	1085.95
LARSEN &	1363.65	1415.45
LUPIN LI	849.1	847
MAHINDRA	760.5	770.25
MARUTI S	9080.6	8990.6
NTPC LTD	166.25	165.2
OIL AND	188.75	192.7
POWER GR	196.5	192.9
RELIANCE	902.15	904.35
STATE BA	298.05	297.35
SUN PHAR	557.45	551.2
TATA MOT	395.8	383.75
TATA STE	664.05	670.45
TATA CON	3103.2	3153.65
TECH MAH	629.05	619.45
ULTRATEC	4146.4	4179.45
UPL LIMI	722.5	733.05
VEDANTA	328.85	334.3
WIPRO LT	298.75	300.6
YES BANK	343.6	349.05
ZEE ENTE	582.7	586.1

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDI	1627.85	1678.55
ACC LIMI	1641.15	1679.8
ASHOK LE	129.35	122.3
BAJAJ FI	4918	4935.75
BANK OF	157.5	153.2
BHARAT E	150	151.85
BHEL	94.85	93.5
BRITANNI	4616.7	4726.45
CADILA H	408.15	410.85
COLGATE	1122.65	1117.65
CONTAINE	1341.3	1337.7
CUMMINS	807	829.2
DABUR IN	339.1	344.45
DLF LIMI	228.3	223.4
AVENUE S	1117.3	1135.1
EMAMI LI	1092.4	1104.85
GLAXOSMI	2479	2467.85
GLENMARK	591.55	589.55
GODREJ C	1039	1051.6
GLAXOSMI	6521.95	6607.95
HAVELLS	499.05	509.6
HIND.zinc	292.95	294.35
ICICI PR	423.9	422.8
IDEA CEL	87.55	88.3
INTERGLO	1200.2	1177.8
JSW STEE	291.25	299
LIC HOUS	516.4	511.9
MARICO L	295.4	304.5
UNITED S	3189.7	3182.3
MOTHERSO	354.6	352.05
MRF LTD	68615.1	69259.4
NHPC LTD	28.05	27.85
NMDC LTD	132.85	132.8
ORACLE F	4233.9	4192.8
OIL INDI	336.6	345.65
PIRAMAL	2617	2648.65
PETRONET	247.65	243.3
POWER FI	112.35	110.95
P&G HYGI	9252.2	9226.75
PIDILITE	875.2	862.8
PUNJAB N	163.7	161.85
RURAL EL	147.7	145.4
STEEL AU	84.8	83.6
SHREE CE	16635.65	17038.4
SIEMENS	1269	1292.85
SHRIRAM	1345.8	1321.9
SUN TV N	953.6	953.15
TATA POW	85	84.8
TITAN CO	802.3	822.2
TORRENT	1342.35	1358.35

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.31	8.34
Alphageo	867	865.15
Alu Flouride	111.1	113.4
Amar Raja Bat	779.4	768.75
And Bank	48.9	49.2
And Cemen	11.92	12.54
And Paper	318	304.25
And Petro	67.05	64.05
Anjani Portl	205	210.65
Aries Agro Ltd	205.25	216.05
Aurobindo Ph	613.65	605.1
Avantel Soft	490.25	510.65

A B C D

3M INDIA	18943.1	18317.5
5PAISA C	287.7	289.5
63 MOONS	94.7	97
8K MILES	643.85	656.6
AARTI DR	591.65	589.95
AARTI IN	1105.3	1090.45
AARVI EN	93	92
ABAN OFF	191.1	193.2
ABBOTT I	[illegible]	[illegible]
BAYER CR	4198.35	4136.4
BEARDSEL	59.65	59.65
BEML LIM	1263.2	1283.05
BERGER P	242.35	246.85
BETA DRU	159.5	157.05
BF INVES	282.05	285.6
BF UTILI	430.55	431.4
BGR ENER	122.55	123.45
BHAGERIA	299.9	299.85
BHANSALI	167.9	168.15
BHARAT B	1325.9	1286.9
BHARAT F	714.05	690.8
DISH TV	75	72.4
DISHMAN	354.6	358.75
DIXON TE	3697.35	3687.75
DOLLAR I	438.1	427.1
DOLPHIN	101	104.75
DR. LAL	890.6	906
DYNAMATI	1732.25	1772.65

E F G H

ECE INDU	350.25	344.75
GUJARAT	189.45	192.95
GUJARAT	235.75	236.05
GUJARAT	739.65	708.55
GUJARAT	799.7	796.35
GUJARAT	837.4	849.45
GULF OIL	895.75	875.95
GULSHAN	80	81.45
HARITA S	903	924.4
HATSUN A	772.8	778.75
HCL INFO	54.7	53.85
HDFC STA	441.7	442.4
HEALTHCA	335.5	328.35

I J K L

JINDAL D	168.3	177.7
JINDAL P	343.25	342.85
JINDAL S	101.3	102.2
JINDAL S	136.9	131
JINDAL S	187.15	179.4
JINDAL S	259.55	250.55
JINDAL W	605.4	627.85
JK CEMEN	1070.4	1092.9
JK LAKSH	409.35	405.2
JK PAPER	138.2	133.35
JK TYRE	174.6	173.9
JKUMAR I	288.55	293.65

M N O P

MANGALAM	162.35	165.35
MANGALAM	359.1	375.05
MANPASAN	381.95	376.35
MARATHON	508.05	517.25
MAS FINA	625	618.05
MASTEK L	452.05	431.45
MATRIMON	907.15	904
MAWANA S	63.8	61.45
MAX FINA	530.55	544.65
MAX INDI	113.9	114.9
MAX VENT	78.2	77.5
MAYUR UN	479	477.3
PHILIPS	1000.4	1045.4
PI INDUS	855.6	886.6
PIONEER	183.85	185.7
PLASTIBL	197.9	190.4
PNB HOUS	1293.15	1291.95
PNC INFR	167.85	175.3
PODDAR H	1104.75	1147.65
PODDAR P	297.5	288.8
POKARNA	205.55	211.45
POLY MED	255.95	252.7
POLYPLEX	489.1	497
PONNIE S	172.15	162.85

R S T U

SHARDA M	2326.95	2278.95
SHEELA F	1607.25	1603
SHEMAROO	551.75	520.15
SHILPA M	518.95	526.2
SHIPPING	72	74.65
SHIRPUR	148.5	148.3
SHIVA TE	568.4	578.05
SHIVAM A	76.35	77.25
SHOPPERS	524	519.1
SHRADHA	58	60
SHRE PUS	253.35	267.65
SHREE TI	54	55.7
THE NEW	686.45	653.05
THE P K	486.45	512.05
THE PHOE	605.1	634.5
THE RAMC	719.55	736.4
THE RUBY	341.55	342.95
THE TINP	232.4	235.15
THEMIS M	570.45	555.75
THERMAX	1195.1	1220.9
THIRUMAL	1870.1	1911.95
THOMAS C	232.05	224.45
THYROCAR	676.2	670.25
TI FINAN	675.45	677.55

V W X Z

మత్స్యకారుల 'కన్నీటి' వెతలు

దేశంలో గుజరాత్ తర్వాత అత్యధిక సముద్ర తీర ప్రాంతం గల రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. తూర్పున శ్రీకాకుళం జిల్లా నుంచి దక్షిణాన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరకు మొత్తం తొమ్మిది జిల్లాల్లో 974 కి.మీ మేర సముద్ర తీర ప్రాంతం ఉంది. ఇక్కడ నివసించే మత్స్యకారులు నడి సంద్రంలోకి నావలో పయనమై.. నడినెత్తిన సూరీడు చంద్ర నిప్పులు కక్కుతున్నా బతుకు పోరు సాగిస్తూ.. సుడులు తిరిగే రాకాసి అలలను తట్టుకుంటూ.. ప్రాణాలతో చెలగాటమని తెలిసినా వేటే జీవనంగా బతుకుతున్నారు. ఎండలో వేటసాగిస్తుండటం వల్ల సూర్యకిరణాలు సముద్రపు అలలపై పడి పరావర్తనం చెంది నేరుగా మత్స్యకారుల కళ్లల్లో పడుతున్నాయి. ఫలితంగా వీరు 45-50 ఏళ్ల వయసుకే కంటిచూపు కోల్పోతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లో మత్స్యకారులు అంధత్వం బారినపడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం

రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో మొత్తం 60 లక్షల మంది మత్స్యకారులు సముద్రాన్నే నమ్ముకుని బతుకుతున్నారు. ఒక్క ఉత్తరాంధ్రలోనే సుమారు 8 వేల సంప్రదాయ బోట్లు, 1200 మెకనైజ్డ్ బోట్ల ద్వారా చేపల వేట సాగిస్తున్నారు. వేట కోసం సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులు సముద్రంలో దాదాపు రోజంతా ఎండలో ఉంటూ చేపలు తిరుగాడే ప్రాంతాలను గుర్తిస్తుంటారు. ఈ క్రమంలో వారు తదేకంగా సముద్రాన్ని చూస్తుంటారు. ఈ క్రమంలో సముద్రంపైకి ప్రసరించే సూర్యకిరణాలు నేరుగా మత్స్యకారుల కళ్లలోకి పరావర్తనం చెందుతాయి. తీవ్రమైన ఆ సూర్యకాంతి ప్రభావానికి కంట్లోని రెటీనా దెబ్బతింటోంది. సూర్య కాంతిలోని అతి నీలలోహిత కిరణాల కారణంగా రెటీనా పాడవుతోంది. మొదట్లో ఇది మసకకు దారితీస్తుంది. క్రమంగా కంటి చూపు పూర్తిగా దెబ్బతిని అంధత్వంగా ప్రబలుతోంది.

వైద్యమూ కరువు

జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలోమీటర్ల సాగర తీరం ఉంది. తీరాన్ని ఆనుకుని ఉన్న 19 గ్రామాల్లో దాదాపు 21 వేల మంది మత్స్యకారులున్నారు. వీరిలో వేటనే వృత్తిగా జీవిస్తున్న మత్స్యకారులు 6 వేల మంది కాగా వారిలో 2 వేల మంది ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి జీవిస్తుండగా 2 వేల మంది స్థానికంగా వేటాడుతున్నారు. 2 వేల మంది విశాఖలో ఫిషింగ్ బోట్లలో జీతానికి పనిచేస్తున్నారు. జిల్లాలో ఉన్నవారిలో సుమారు 1500 మంది వరకు ఇప్పటికే కంటి చూపు కోల్పోయినట్లు వైద్యాధికారుల సర్వేలో తేలింది. తీర ప్రాంతంలో ఏ గ్రామంలో చూసినా వందలాది మంది దృష్టిలోపంతో బాధపడుతూ ఊతకర్ర పట్టుకుని తిరుగాడే వాళ్లు కనిపిస్తుంటారు. చేనేత కార్మికులకు తప్ప మరే ఇతర వృత్తులవారికీ ఎదురవని దుర్భర పరిస్థితులను మత్స్యకారులు ఎదుర్కొంటున్నారు. మసగ్గా ఉన్నప్పుడే పరిస్థితిని గుర్తించి చికిత్స తీసుకుంటే ఫలితం ఉంటుందని, పూర్తిగా చూపు పోయాక చికిత్స చేసినా ఫలితం ఉండదని వైద్యులు అంటున్నారు.



సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి వస్తున్న మత్స్యకారులు

మాటిచ్చి నెరవేర్చని ప్రభుత్వం

జిల్లాలోని మత్స్యకారులు ఏ రోజుకారోజు చేపలు పట్టి వాటిని విక్రయించి వచ్చిన ఆదాయంతోనే బతుకుతుంటారు. వీరి కుటుంబంలో చేపల వేటకు వెళ్లే వ్యక్తికి అంధత్వం ప్రాప్తిస్తే ఆ కుటుంబం మొత్తం ఆదాయం లేక అవస్థలపాలవుతోంది. పూట గడవడమే కష్టంగా మారుతోంది. ప్రభుత్వం మత్స్యకారులను కార్మికులుగా గుర్తించి 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ మంజూరు చేస్తామని చేసిన ప్రకటన నీటి మీద రాతగా మిగిలింది. కంటి చూపు కోల్పోతున్న మత్స్యకారులకు కనీస అవసరంగా కంటికి వైద్యం చేయడానికి ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంపై కూడా ప్రభుత్వం దృష్టిసారించడం లేదు.

కెరోటపతి వల్ల చూపు మందగిస్తుంది



సముద్రంలో వేటకు వెళ్లేవారిలో కొంతమందికి కెరోటపతి వస్తోంది. సూర్యకిరణాలు కళ్లపై నేరుగా పడడం వల్ల చూపు మందగించి ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఎండ నుంచి రక్షణకు చలువ కళ్లద్దాలు వంటివి వినియోగిస్తే సమస్య నుంచి కొంతవరకు బయటపడొచ్చు. తరచుగా వైద్యం చేయించుకోవడం కూడా ముఖ్యం.

–కె.నరసింహమూర్తి, కంటి వైద్యులు, జిల్లా కేంద్రాస్పత్రి, విజయనగరం

చూపు కోల్పోయాను



సముద్రంలో నిత్యం వేటాడడం వల్లే కంటి చూపు కోల్పోయాను. కొన్నేళ్లుగా దృష్టి లోపంతో బాధపడుతున్నా గ్రామంలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం లేదు. మా గ్రామంలో చాలామంది నాలాగే కంటి చూపు కోల్పోయినవారున్నారు.

– సూరాడ రాములు, బాధిత మత్స్యకారుడు, పతివాడబర్రిపేట, విజయనగరం జిల్లా


కోడిపుంజుకు వెండి లోలాకులు..



తెల్లని ఈకలు, చెవులకు లోలాకులతో ఠీవిగా కనిపిస్తున్న ఈ కోడిపుంజు భలే ఉంది కదూ. దీనిని విజయనగరం జిల్లా శృంగవరపుకోట పట్టణానికి చెందిన తాళాబత్తుల వరహాలు అనే విశ్వబ్రాహ్మణుడు పెంచుకుంటున్నాడు. తన కోడిపుంజు అంటే ఎంతో ఇష్టమని అందుకే దానికి లోలాకులు కుట్టించినట్టు తెలిపాడు.

– శృంగవరపుకోట

నేటి నుంచి శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం: శ్రీశైలంలో మంగళవారం నుంచి ఈనెల 16 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో భరత్‌గుప్తా సోమవారం విలేకరులకు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ వాహన సేవలుంటాయన్నారు. 13న మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవకాల మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పాగాలంకరణ, స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు. రథోత్సవానికి 14న అశేష భక్త జనవాహిని తరలివచ్చే అవకాశం ఉందన్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు యాగశాల ప్రవేశం, గణపతి పూజతో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. అదే రోజున అగ్నిప్రతిష్ఠాపన, సకల దేవతాహ్వాన పూర్వక ధ్వజారోహణం, ధ్వజ పటావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున 9న, రాష్ట్ర ప్రభుత్వం తరపున 10న స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివార్లకు గర్భాలయంలో జరిగే ప్రత్యేక అభిషేకాలతో పాటు సామూహిక అభిషేకాది ఆర్జితసేవలు, హోమాలు, శాశ్వత, టికెట్ కల్యాణోత్సవాలను తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు.

'ఆశించిన మేరకు కేటాయింపులు లేవు'

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశించిన మేరకు నిధులు కేటాయింపులు జరగలేదని మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. బడ్జెట్‌లో రాష్ట్ర రెవెన్యూ లోటు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు అంశాల ప్రస్తావన లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరూ అసహనానికి గురయ్యారని చెప్పారు. సోమవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు కేంద్రంపై ఒత్తిళ్లు, నిరసనలు కొనసాగుతాయని చెప్పారు.

నిందితులను అరెస్ట్ చెయ్యకపోతే 'చలో చిత్రాడ'

వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్

సాక్షి, అమరావతి: తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడలో దళితులపై అకారణంగా దాడులు జరిగాయని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనలో నిందితులను ప్రభుత్వం కాపాడుతోందని, వారిని అరెస్ట్ చెయ్యకపోతే దళితులు, ముస్లిం మైనార్టీలతో 'చలో చిత్రాడ' కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కొంతమంది నేతల ఒత్తిళ్ల వల్ల పోలీసులు ఈ కేసును నీరుగారుస్తున్నారని ధ్వజమెత్తారు.

'ఐఈడీఎస్ఎస్ టీచర్లకు పదోన్నతి కల్పించాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల (ఐఈడీఎస్ఎస్) కోసం కేటాయించిన 860 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హత కలిగిన సెంకండ్ గ్రేడ్ టీచర్లకు పదోన్నతి కల్పించాలని పీఆర్టీయూ కోరింది. ఈ మేరకు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మత్తి కమలాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

వేడుకగా మహారాజా సంగీత నృత్య కళాశాల శతాబ్ది ఉత్సవాలు

విజయనగరం టౌన్: భారతదేశంలో ఎందరో పేరెన్నికగన్న విద్వాంసులను అందించిన విజయనగరం మహారాజా సంగీత, నృత్య కళాశాల శతాబ్ది ఉత్సవాలను సోమవారం కళాశాల ఆవరణలో అంగరంగవైభవంగా నిర్వహించారు. భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ బురిడి అనూరాధా పరశురామ్ నేతృత్వంలో జరిగిన ఉత్సవాల్లో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు అయిన విజయనగరంలో ఈ ఉత్సవంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కళాశాల అభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలందిస్తానని చెప్పారు. ఇప్పటివరకూ కళాశాలలో సేవలందించి కీర్తిశేషులైన వారి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, ప్రముఖ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, కె.వి.బ్రహ్మానందం (విజయవాడ), శేషయ్య శాస్త్రి (హైదరాబాద్), చాగంటి కొండబాబు, ద్వారం వి.జె.లక్ష్మి (తిరుపతి), మండా మాణిక్యం, బి.ఎ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో భగ్గుమన్న గిరిజనులు



శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించిన గిరిజనులు

- బోయ, వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ల తీర్మానంపై ఆగ్రహం
- సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు

సాక్షి ప్రతినిధి,శ్రీకాకుళం/సాక్షి, అమరావతి: బోయలు, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడంపై గిరిజనులు భగ్గుమన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని గిరిజన ప్రాంతాల నుంచి దాదాపు ఐదు వేల మంది సోమవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ మైదానం నుంచి ర్యాలీగా బయల్దేరి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో 32 తెగలకు చెందిన 28 లక్షల మంది గిరిజనులు ఉన్నారని, కేవలం ఆరు శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సవర రాంబాబు అన్నారు. ఈ నేపథ్యంలో బోయలు, వాల్మీకిలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పిస్తే తమకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో గత 60 రోజులుగా సీతంపేట ఐటీడీఏ వద్ద, గిరిజన గ్రామాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని చెప్పారు.

మత్స్యకారుల శిబిరంపై దాడి: మత్స్యకారులను ఎస్టీల్లో చేర్పిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలనే మత్స్యకారులు శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఖాళీ చేయించే ప్రయత్నంలో పోలీసులుండగా.. గుర్తుతెలియని యువకులు మత్స్యకారుల శిబిరంపై దాడి చేశారు. కుర్చీలు విరగొట్టేశారు. వల, టెంట్లకు నిప్పు పెట్టారు. సోంపేట మండలం ఇసుకలపాలెంకు చెందిన లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయి.

మత్స్యకారులపై దాడుల వెనుక సీఎం హస్తం

శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న మత్స్యకారులపై దాడుల వెనుక సీఎం చంద్రబాబు హస్తం ఉందని వైఎస్సార్‌సీపీ నేత మోపిదేవి వెంకటరమణ ఆరోపించారు. రాష్ట్రంలో కులాల కుంపట్లకు కారణం చంద్రబాబేనని సోమవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో బాబు అలవికాని హామీలిచ్చారని మండిపడ్డారు. దీన్ని ప్రతిపక్ష నేత దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సంస్కృతం నేర్చుకోవడానికి అత్యున్నతమైన స్థలం విద్యాపీఠం

- నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వివేక్ దేబ్రాయ్
- సంస్కృత విద్యాపీఠం స్నాతకోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ వివేక్ దేబ్రాయ్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం సంస్కృతాన్ని నేర్చుకోవడానికి అత్యుత్తమమైన స్థలమని ప్రధాన మంత్రి ఆర్థిక సలహామండలి అధ్యక్షుడు, నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వివేక్ దేబ్రాయ్ పేర్కొన్నారు. తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం 21వ స్నాతకోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన దేబ్రాయ్ మాట్లాడుతూ కాన్వొకేషన్ అనే లాటిన్ పదాన్ని వాడడం కన్నా దీక్షాంత సమారోహం లేక సమావర్తనం అనడం సముచితంగా ఉంటుందన్నారు. భర్తృహరి సుభాషితాలను, శాకుంతల కావ్య శ్లోకాలను ఉదహరిస్తూ అనేక విషయాలను తెలియజేశారు. సంస్కృత విద్యాపీఠాన్ని పూర్తిస్థాయి కేంద్రీయ విశ్వవిద్యాలయంగా చేయడానికి సర్వశక్తులా కృషి చేస్తున్నామని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం కులపతి, భారత ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్ ఎస్.గోపాలస్వామి తెలిపారు. విద్యాపీఠంలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులకు అవార్డులు, పట్టాలు ప్రదానం చేశారు. 635 మంది విద్యార్థులు వివిధ పట్టాలను అందుకోగా వారిలో 46 మంది పీహెచ్‌డీ పట్టాలను అందుకున్నారు. వేదభాష్యం, వ్యాకరణం, సాహిత్యం, జ్యోతిష్యం, న్యాయ శాస్త్రాలలో ప్రతిభ కనబరచి ప్రథమ స్థానాల్లో నిలిచిన 19 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు. సంస్కృతంలో విశేష కృషి చేసిన పండితులు బ్రహ్మర్షి బల్లపదవు మాధవ ఉపాధ్యాయ, భాష్యం విజయసారథ, శలాక రఘునాథశర్మలను మహామహోపాధ్యాయ గౌరవ డాక్టరేట్లతో సత్కరించారు. వేదాంత శాస్త్రంలో విశేష కృషి చేసి, సంస్కృతంలో పీహెచ్‌డీ చేసి యూట్యూబ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక ఉపన్యాసాలను చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డీజీపీ డాక్టర్ కె.అరవిందరావు, వేదాలలో విశేష కృషి చేసి 24 సంపుటాలలో వేదాలను తెలుగు అనువాదంలో ప్రచురించినందుకు డాక్టర్ మర్రి కృష్ణారెడ్డిలకు వాచస్పతి (డి.లిట్) ప్రదానం చేశారు.

కార్మికులతో బూట్లు తుడిపించారు

- బొబ్బిలి హీరా కంపెనీలో దాష్టీకం
- మహిళలను వేధించినందుకు నిలదీయడంపై కంపెనీ యాజమాన్యం శిక్ష



కంపెనీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

బొబ్బిలి: మహిళా కార్మికులను వేధించడం, వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంపై నిలదీసిన సహచర కార్మికులపై హీరా ఎలక్ట్రోస్మెల్టర్స్ కంపెనీ యాజమాన్యం దాష్టీకం ప్రదర్శించింది. బ్రిటిష్ కాలం నాటి బూట్ల సంస్కృతితో కార్మికులకు శిక్ష విధించిన సంఘటన విజయనగరం జిల్లా బొబ్బిలిలో సోమవారం చోటు చేసుకుంది. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో హీరా ఎలక్ట్రోస్మెల్టర్స్ కంపెనీలో జిల్లాలోని మెట్టవలస గ్రామానికి చెందిన కార్మికులు పని చేస్తున్నారు. ఇటీవల యాజమాన్య ప్రతినిధులు మహిళా కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు చీటికీ మాటికీ దూషిస్తున్నారు. దీనిపై సహచర కార్మికులు వారిని నిలదీశారు. దీంతో కార్మికులు దాడి చేశారంటూ కంపెనీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సర్ది చెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. పోలీస్‌స్టేషన్ నుంచి విధుల కోసం కంపెనీకి వచ్చిన కార్మికులు వాంద్రాసి ఉపేంద్ర, అప్పారావు, సత్యనారాయణను హెచ్‌ఆర్ సిబ్బంది మోహన్‌శర్మ, జగదీష్, రమణ అడ్డుకున్నారు. తప్పుచేశారు కనుక మా బూట్లు తుడిచి, కాళ్లకు నమస్కరించి వెళ్లాలని ఆదేశించారు. నమస్కరిస్తున్న సమయంలో సెల్‌లో ఫొటోలు తీసి యాజమాన్యానికి హెచ్‌ఆర్ సిబ్బంది పంపారని కార్మికులు చెబుతున్నారు. సీఐటీయూ నేతలు కంపెనీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ విషయంపై కంపెనీ యాజమాన్యం మంత్రి సుజయ కృష్ణ రంగారావు వద్ద ఫిర్యాదు చేయగా.. ఆయన ఇరువురికీ సర్దిచెప్పి పంపినట్లు తెలిసింది.

పంచాయతీ మెంబరన్నా వినిపించుకోలేదు



యాజమాన్య ప్రతినిధులు వారి కాళ్లను పట్టుకోమన్నారు. ఎందుకు వదిలేయండి సార్ అన్నాం. రాయ్‌పూర్ నుంచి కొత్తగా వచ్చిన యాజమాన్య ప్రతినిధులు వినడం లేదు. తప్పనిసరిగా కాళ్లు పట్టుకోవాల్సిందేనన్నారు. పంచాయతీ మెంబర్లమని చెప్పినా వినిపించుకోలేదు. చివరకు తప్పనిసరై కాళ్లు పట్టుకున్నాం.

– వాంద్రాసి సత్యనారాయణ, కార్మికుడు

రైళ్లలో బంగారం అక్రమ రవాణా

- నెల్లూరు, ఒడిశాల్లో పట్టుకున్న అధికారులు
- 7.152 కిలోల బంగారం స్వాధీనం



స్టౌలో అమర్చిన బంగారం

నెల్లూరు (మినీ బైపాస్)/విజయవాడ/భువనేశ్వర్: నెల్లూరు, ఒడిశాలోని ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్లలో అక్రమంగా తరలిస్తున్న మయన్మార్‌కు చెందిన బంగారాన్ని అధికారులు పట్టుకున్నారు. ఎలక్ట్రిక్, బొగ్గు స్టౌల్లో భారీగా బంగారం అమర్చి గుట్టుచప్పుడు కాకుండా రైల్లో తరలిస్తుండగా నెల్లూరులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) శాఖ అధికారులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం డీఆర్ఐ అధికారులు మీడియాకు వివరాలు తెలియజేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను చెల్లించకుండా అక్రమంగా రైల్లో బంగారాన్ని రవాణా చేస్తున్నారని డీఆర్ఐ అధికారులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో ఆ శాఖ అధికారులు రైళ్లలో తనిఖీలు చేశారు. ఆదివారం సాయంత్రం గౌహతి నుంచి తాంబరంకు గౌహతి ఎమ్మెస్ ఎక్స్‌ప్రెస్ నెల్లూరు రైల్వేస్టేషన్ చేరుకుంది. తనిఖీల్లో భాగంగా ఓ ప్రయాణికుడి వద్ద ఊదా రంగు బ్యాగ్‌లో అల్యూమినియంతో తయారు చేసిన ఎలక్ట్రిక్, బొగ్గు స్టౌలను కనుగొన్నారు. వాటిని పరిశీలించి, వాటిపై ఉన్న ప్లేట్లను తొలగించారు. వాటి కింద ఉన్న మైనపు తొడుగును తొలగించడంతో అందులో దాచిన బంగారం బయటపడింది. రూ.1.43 కోట్లు విలువైన 4.658 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారం మయన్మార్‌కు చెందినదిగా అధికారులు తెలిపారు. ఈ వివరాలను కేంద్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం డైరెక్టర్ (విజయవాడ) కిశోర్ కూడా ఓ ప్రకటనలో వివరించారు. అయితే బంగారం ఎవరిది, దీని వెనుక ఎవరున్నారన్నది అధికారులు విచారిస్తున్నారు. కాగా, ఒడిశాలోని ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో రైలులో అక్రమంగా తరలిస్తున్న బంగారు బిస్కట్లను డీఆర్ఐ అధికారులు జప్తు చేశారు. వీటి బరువు 2.494 కిలోలు కాగా, రూ.76,59,557 విలువ చేస్తాయని డీఆర్ఐ వర్గాలు తెలిపాయి.

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ




ఏఈ ఆకుల ప్రకాశ్

చోడవరం (విశాఖ జిల్లా): రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. ఆకుల ప్రకాశ్ విశాఖ జిల్లా నీటి పారుదల శాఖ వడ్డాది మాడుగుల సెక్షన్ ఏఈగా పనిచేస్తున్నాడు. మాడుగుల మండలం కేజేపురం గ్రామ పరిధిలో ఉన్న శ్రీరాంసాగరం, సీతారామచెరువు, రంగనాయకుని చెరువులకు ఇటీవల సుమారు రూ.32 లక్షలతో పూడికతీత పనులు జరిగాయి. ఈ పనులకు సంబంధించి రూ.16 లక్షల బిల్లును ఇప్పటికే సంబంధిత నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆళ్ల సంతోష్‌కు చెల్లించారు. తాజాగా రెండు చెరువులకు సంబం ధించి రూ.4.5 లక్షలు, రూ. 4 లక్షలు చొప్పున బిల్లులు మంజూరయ్యాయి. ఈ బిల్లులు ఇవ్వాలంటే రూ.50 వేలు లంచమివ్వాలని ఇరిగేషన్ ఏఈ ప్రకాశ్ డిమాండ్ చేశారు. దీంతో సంతోష్ విశాఖ ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌ను గత శుక్రవారం ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల పథకంలో భాగంగా ఏఈకి ఫోన్ చేసిన సంతోష్.. లంచం డబ్బులు ఇచ్చేందుకు వచ్చాడు. పథకం ప్రకారం లంచం తీసుకుంటుండగా పట్టుకు న్నారు.

ఆత్మహత్య చేసుకుంటా.. అనుమతివ్వండి

ఒడిశా ప్రభుత్వానికి దివ్యాంగుడి విజ్ఞప్తి



కొరాపుట్: తాను ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతివ్వాలని ఓ దివ్యాంగుడు ఒడిశా ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. ఒడిశాలోని కొరాపుట్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కె.సుదర్శన చక్రవర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు జయపురానికి చెందిన దివ్యాంగుడు జయంత కుమార్ పతి హాజరై చనిపోవడానికి అనుమతివ్వాలని వినతిపత్రాన్ని సమర్పించాడు. 2011, మేలో లారీ ఢీకొట్టడంతో అవిటివాడినయ్యానని అందులో పేర్కొన్నాడు. ఈ ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని అవయవాలు చచ్చుబడిపోయాయని దీంతో ఏ పని చేసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. వృద్ధులైన తన తల్లిదండ్రులు తనకు సేవలు చేయాల్సి వస్తోందని వివరించాడు. దీనికి స్పందించిన కలెక్టర్ కె.సుదర్శన్ చక్రవర్తి.. జయంత్ కుమార్‌తో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన మందులు ఉచితంగా సరఫరా చేయాలని జిల్లా ముఖ్య వైద్యాధికారిని ఆదేశించారు. దాంతోపాటు సీఎం సహాయ నిధి నుంచి రూ.20 వేలు, రెడ్‌క్రాస్ నిధుల నుంచి రూ.10 వేలు దివ్యాంగుడికి అందజేశారు.

బాలుడితో మూత్రం తాగించిన పీఈటీ అరెస్టు

ప్రకాశం జిల్లా చీరాలలో ఘటన

చీరాల రూరల్: బాలుడితో మూత్రం తాగించిన కేసులో నిందితుడైన వ్యాయామ ఉపాధ్యాయుణ్ణి సోమవారం అరెస్టు చేసినట్లు ప్రకాశం జిల్లా చీరాల వన్‌టౌన్ సీఐ వి. సూర్యనారాయణ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 2న ఎన్‌పీఆర్ విద్యా కాన్సెప్ట్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్న ఓ బాలుడు అదే తరగతికి చెందిన ఓ బాలిక జ్యూస్ బాటిల్లో మూత్రం పోశాడు. ఆ బాలిక జ్యూస్ తాగబోతుండగా.. బాటిల్లో మూత్రం పోశానని తాగవద్దని ఆ బాలుడే చెప్పాడు. విషయం తెలుసుకున్న వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) విస్తర్ల శాంసన్ విజయ్‌కుమార్ బాలుడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బాటిల్లో మూత్రం పోసింది నీవే కనుక నీవే తాగాలంటూ బాలుడితో బలవంతంగా మూత్రం తాగించారు. దీంతో ఆ బాలుడు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పీఈటీని సోమవారం అతని ఇంటివద్ద అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

జగన్ సీఎం కావాలని పాదయాత్ర

- శ్రీశైలం వెళ్లిన 100 మంది
- గుంటూరు జిల్లా శిరిగిరిపాడు నుంచి ప్రారంభించిన ఎమ్మెల్యే పీఆర్కే



విలేకరులతో మాట్లాడుతున్న ఏమ్మెల్యే పీఆర్కే

వెల్దుర్తి/రెంటచింతల (మాచర్ల): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే వెనుకబడిన పల్నాడు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు వరికపుడిసెల ఎత్తిపోతల పథకాన్ని సాధించి తీరుతామని వైఎస్సార్‌సీపీ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. జగన్ సీఎం కావాలని, ప్రజాసంకల్పయాత్ర విజయవంతం కావాలని గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు చెందిన 100 మంది వైఎస్సార్‌సీపీ యువత సోమవారం శ్రీశైలానికి చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యే పీఆర్కే జెండా ఊపి ప్రారంభించారు. జగన్ పాదయాత్రకు మద్దతుగా శిరిగిరిపాడు ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవాలయం వరకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అలుగుమల్లి సంజీవరెడ్డి, రామాంజనేయరెడ్డి, లచ్చిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, అంజిబాబు, అయ్యన్న నేతృత్వంలో వందమంది యువకులు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామంలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పీఆర్కే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెంకటేశ్వరరెడ్డి, సాయిమార్కొండా రెడ్డి, నాగరాజు, పరమేశ్వరరావు, శ్రీనివాసశర్మ, శ్రీనివాసరావు, కోటయ్యయాదవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రెంటచింతలలో ఎమ్మెల్యే పిన్నెల్లి విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతమైన పదవిలో ఉన్న సీఎం చంద్రబాబు ఇప్పటికైనా కుటటిల రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ఓ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం చంద్రబాబును ఎంపీ రాయపాటితో కలసి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే ముస్తఫా కలిస్తే టీడీపీ రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకత్వం ఎన్ని ప్రలోభాలు పెట్టినా వైఎస్సార్‌సీపీని వీడేవారు ఎవరూలేరని, ఇప్పటికే తాలు సరుకంతా కొట్టుకుపోయిందన్నారు.

సాక్షి **స్పోర్ట్స్**

మంగళవారం 6-2-2018



రన్నరప్ మానవ్ ఠక్కర్

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) వరల్డ్ జూనియర్ సర్క్యూట్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో భారత యువతార మానవ్ ఠక్కర్ రన్నరప్‌గా నిలిచాడు. లక్సెంబర్గ్‌లో ముగిసిన ఈ టోర్నీ ఫైనల్లో జూనియర్ ప్రపంచ నంబర్‌వన్ మానవ్ 11-9, 3-11, 11-9, 6-11, 3-11, 11-9, 6-11తో టాప్ సీడ్ కనక్ ఝా (అమెరికా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. సెమీఫైనల్స్‌లో మానవ్ 11-8, 11-8, 11-5, 11-8తో అబ్దుల్ అజీజ్ (ఈజిప్ట్)పై, కనక్ ఝా 11-3, 12-10, 11-9, 11-6తో ఇవోనిన్ డెనిస్ (రష్యా)పై గెలుపొందారు.

జూనియర్లు కావాలిక సీనియర్లు

కుర్రాళ్లు ఈ విజయంతో ఆగిపోవద్దు • కోచ్ రాహుల్ ద్రవిడ్ ఆకాంక్ష



ముంబై: ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ విజేతలుగా నిలిచే అర్హత తమ కుర్రాళ్లకే ఉందని భారత జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ అన్నారు. టోర్నీ మధ్యలో ఐపీఎల్ వేలం కాస్త ఇబ్బందికరమైనా... కుర్రాళ్లు ఆ ఛాయలు కనిపించకుండా తొందరగానే బయటపడ్డారని చెప్పారు. క్వార్టర్స్, సెమీస్ మ్యాచ్‌లతో పోల్చుకుంటే ఫైనల్లో నంబర్‌వన్ ఆట ఆడలేదన్నారు. అయితే గత ఏడాదిన్నర నుంచి జట్టు సన్నద్ధమైన తీరు అద్భుతమని కితాబిచ్చారు. ప్రణాళికతో సిద్ధమైన యువ జట్టు ఆటలో పక్కా ప్రణాళికతోనే ఒక్కో మ్యాచ్‌ను గెలిచిందని, చివరకు కప్ కూడా సాధించడం గర్వంగా ఉందని అన్నారు. 'టీమ్ వర్క్‌తోనే విజయవంతమయ్యాం. ఎన్‌సీఏలో శిబిరాలు, బీసీసీఐ ఏర్పాటు చేసిన మ్యాచ్‌లు, సిరీస్‌లు అన్నీ టైటిల్ గెలిచేందుకు దోహదపడ్డాయి. కుర్రాళ్లు ఈ విజయంతో ఆగిపోవద్దు. ఇక అండర్-23, సీనియర్ టీమిండియా లక్ష్యంగా వారందరూ కష్టపడాలి' అని ద్రవిడ్ చెప్పారు.

వారి కృషి ఫలితమే...

యువ సేనను చాంపియన్లుగా చేసేందుకు కోచ్ ద్రవిడ్ అండ్ కో ఎంతో చెమటోడ్చిందని భారత అండర్-19 సారథి పృథ్వీ షా అన్నాడు. ప్రపంచకప్‌లో తాను ధరించిన జెర్సీ నంబర్ 100పై ఎలాంటి మూఢవిశ్వాసం లేదన్నాడు. నాలుగో ప్రపంచకప్ సాధించిన యువ భారత జట్టు సోమవారం స్వదేశానికి చేరుకుంది. ఇక్కడి ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో కుర్రాళ్లకు అభిమానులు ఘనస్వాగతం పలికారు. ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) ఉన్నతాధికారులు స్వాగత ఏర్పాట్లు చేశారు. అనంతరం కెప్టెన్ పృథ్వీ షా మీడియాతో మాట్లాడుతూ 'వరల్డ్‌కప్‌లో మాకు ఎన్నో మధురానుభూతులున్నాయి. వాటిని మాటల్లో చెప్పలేం. ముఖ్యంగా నేనైతే ప్రపంచకప్‌లో విజయవంతమైన సారథిగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉన్నాను' అని అన్నాడు. గత రెండు, మూడేళ్లుగా తానెంతో కష్టపడ్డానని షా చెప్పాడు. రంజీ, దులీప్ ట్రోఫీ అరంగేట్రం మ్యాచ్‌ల్లోనే సెంచరీలు బాదిన పృథ్వీ షా ఇదంతా అనుభవంతోనే సాధ్యపడిందన్నాడు. 'ఏడెనిమిదేళ్ల వయసులో స్కూల్ క్రికెట్‌ను ఆరంభిస్తాం. పాఠశాల కోచ్‌ల నుంచి ప్రస్తుత కోచ్ ద్రవిడ్ వరకు అందరితోనూ ఎంతో నేర్చుకున్నాను. వాళ్ల అనుభవం, మార్గదర్శనంతోనే నా ఆట మెరుగైంది. ఎన్ని జట్లకు ఆడినా... భారత్‌కు ఆడిన అనుభూతే వేరు. అదెంతో అనిర్వచనీయమైంది' అని పృథ్వీ షా చెప్పుకొచ్చాడు. తానీ స్థాయికి ఎదగడానికి తన తండ్రి ప్రోత్సాహం ఉందన్నాడు. ఆట నేర్చుకోవడం నుంచి మ్యాచ్‌లు ఆడటం వరకు నన్ను ఎంత దూరమైనా తీసుకెళ్లేవాడని చెప్పాడు.

కట్టుతో 'శత'క్కొట్టి...

ఉన్ముక్త్ చంద్ సాహసోపేత ఇన్నింగ్స్



బిలాస్‌పూర్: పదహారేళ్ల క్రితం వెస్టిండీస్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో భారత దిగ్గజం అనిల్ కుంబ్లే గాయపడినా కూడా తలకు కట్టుతో బరిలోకి దిగడం గుర్తుందా! ఇప్పుడు దాదాపు అదే తరహాలో ఢిల్లీ యువ బ్యాట్స్‌మన్ ఉన్ముక్త్ చంద్ మైదానంలోకి దిగి బ్యాటింగ్‌లో సత్తా చాటాడు. సోమవారం ఉత్తరప్రదేశ్‌తో జరిగిన విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగి జట్టును గెలిపించాడు. ఈ మ్యాచ్‌కు ముందు నెట్ ప్రాక్టీస్‌లో ఉన్ముక్త్ దవడకు బలమైన దెబ్బ తగిలింది. ఇక మ్యాచ్‌కు దూరం కావడం ఖాయమే అనిపించింది. అయితే టీమ్ మేనేజ్‌మెంట్ వద్దంటున్నా వినకుండా చంద్ ఆడేందుకు సన్నద్ధమయ్యాడు. 125 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్సర్లతో 116 పరుగులు చేసి ఢిల్లీ 307 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం ఉత్తరప్రదేశ్ 252 పరుగులకే ఆలౌటై 55 పరుగులతో ఓటమిపాలైంది. ఉన్ముక్త్ పట్టుదలపై భారత క్రికెట్ వర్గాల్లో భారీ ఎత్తున ప్రశంసలు కురిశాయి.

గెలిపించిన అక్షత్, సిరాజ్

- సర్వీసెస్‌పై హైదరాబాద్ ఘన విజయం
- విజయ్ హజారే వన్డే టోర్నీ



అక్షత్ రెడ్డి (127)



సిరాజ్ (5/45)

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ 'డి'లో హైదరాబాద్ శుభారంభం చేసింది. సోమవారం సొంతగడ్డపై జరిగిన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ 128 పరుగుల భారీ తేడాతో సర్వీసెస్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. కెప్టెన్ అక్షత్ రెడ్డి (116 బంతుల్లో 127; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడి సెంచరీ సాధించగా, కొల్లా సుమంత్ (26 బంతుల్లో 56 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. వీరికి ఆకాశ్ భండారి (37 బంతుల్లో 47; 4 ఫోర్లు, ఒక సిక్స్), రోహిత్ రాయుడు (37; 2 ఫోర్లు), బావనక సందీప్ (36; 3 ఫోర్లు) అండగా నిలిచారు. అనంతరం సర్వీసెస్ 40.4 ఓవర్లలో 201 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ రాహుల్ సింగ్ (92 బంతుల్లో 64; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, హార్దిక్ సేథి (38), సూరజ్ యాదవ్ (34) ఫర్వాలేదనిపించారు. మొహమ్మద్ సిరాజ్ 45 పరుగులకే 5 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. రోహిత్, భండారిలకు చెరో 2 వికెట్లు దక్కాయి. ఈ మ్యాచ్‌తో ముగ్గురు హైదరాబాద్ తరఫున, ఐదుగురు సర్వీసెస్ తరఫున లిస్ట్-ఎ క్రికెట్‌లో అరంగేట్రం చేయడం విశేషం. ఇతర మ్యాచ్‌ల్లో సౌరాష్ట్ర 32 పరుగుల తేడాతో ఛత్తీస్‌గఢ్‌పై... విదర్భ ఏడు పరుగులతో జార్ఖండ్‌పై గెలుపొందాయి.

రాణించిన సుమంత్: ఆంధ్ర విజయం



చెన్నై: ఆంధ్ర జట్టు మొదటి మ్యాచ్‌లో చెలరేగి టోర్నీని విజయవంతంగా ప్రారంభించింది. గ్రూప్ 'సి'లో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆంధ్ర 6 వికెట్లతో రాజస్తాన్‌ను చిత్తు చేసింది. ముందుగా రాజస్తాన్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. చేతన్ (82 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, అయ్యప్పకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఆంధ్ర 45 ఓవర్లలో 4 వికెట్లకు 235 పరుగులు చేసి గెలిచింది. బోడపాటి సుమంత్ (52 బంతుల్లో 71 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడి అర్ధ సెంచరీ చేయగా, విహారి (49; 4 ఫోర్లు), భరత్ (38; 3 ఫోర్లు), అశ్విన్ హెబర్ (27 బంతుల్లో 33; 8 ఫోర్లు) రాణించారు.

శ్రీశాంత్‌పై మీ వైఖరేంటి?

బీసీసీఐని కోరిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ: జీవితకాల నిషేధానికి గురైన వివాదాస్పద పేసర్ శ్రీశాంత్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి వైఖరేంటో తెలపాలని సుప్రీం కోర్టు కోరింది. తనపై బోర్డు విధించిన నిషేధాన్ని శ్రీశాంత్ సర్వోన్నత న్యాయస్థానంలో సవాలు చేయగా... చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఖాన్విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్ సోమవారం విచారించింది. అనంతరం నాలుగు వారాల్లో స్పందన తెలపాలని బోర్డుతో పాటు, సుప్రీం నియమించిన పరిపాలక కమిటీని త్రిసభ్య బెంచ్ ఆదేశించింది. క్రికెటర్ తరఫున సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ వాదనలు వినిపించారు. శ్రీశాంత్ ఆడేందుకు మధ్యంతర తీర్పు ఇవ్వాలని కోరారు. అయితే సుప్రీం బెంచ్ మాత్రం అలాంటి ఆదేశాలివ్వలేమని ఆ వినతిని తిరస్కరించింది.



కొత్త జంట కుదిరింది

స్థిరంగా రాణిస్తున్న చహల్, కుల్దీప్

ఆరు నెలల క్రితం వరకు...

టీమిండియా మూడు ఫార్మాట్లలోనూ స్పిన్ బౌలర్లెవరంటే మరో మాట లేకుండా రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా పేర్లే చెప్పేవారు. ఇంకొకరికి అవకాశం వచ్చినా అది వీరు తప్పుకొంటేనో, గాయపడితేనో మాత్రమే.

మరిప్పుడు...

నాలుగంటే నాలుగే సిరీస్‌లు... ఆరు నెలల వ్యవధి... అంతా మారిపోయింది... వన్డేలు, టి20ల్లో అశ్విన్, జడేజా ఊసే లేదు. టెస్టుల్లో నంబర్‌వన్ బౌలర్లైనా, పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకు ఎందుకు ఎంపిక చేయడం లేదన్న ప్రశ్నే తలెత్తడం లేదు. ఇదంతా మరో ఇద్దరి మణికట్టు మాయాజాలం. వారే యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్.

సాక్షి క్రీడా విభాగం

బహుశా సగటు క్రికెట్ అభిమాని కూడా ఇంత తక్కువ కాలంలో ఇంతటి మార్పును ఊహించి ఉండకపోవచ్చు. అందుకేనేమో, ఎటుపోయి ఎటు వస్తుందోనని సెలెక్టర్లు కూడా అశ్విన్, జడేజాలను శ్రీలంక పర్యటనకు మొదట 'విశ్రాంతి' పేరిట మాత్రమే పక్కన పెట్టారు. వీరి స్థానాల్లో తీసుకున్న చహల్, కుల్దీప్ ప్రతిభావంతులే అయినా అంత తేలిగ్గా సీనియర్లను తప్పిస్తే విమర్శలు వస్తాయని భావించారు. ఒకవేళ కొత్తవారు విఫలమైతే తర్వాత ఆలోచించవచ్చని అనుకున్నారేమో. కానీ, ఆ అవకాశం లేకుండా చేశారీ మణికట్టు మాంత్రికులు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక, తాజాగా సఫారీ పర్యటనలో రెండు వన్డేల్లోనూ విజయాలనందించి జట్టుకు అదనపు బలంగా మారారు.

తక్కువ వేగమే ఆయుధం...

15... చివరి అయిదు వన్డేల్లో చహల్ తీసిన వికెట్లు...

10... కుల్దీప్ గత అయిదు వన్డేల్లో పడగొట్టిన వికెట్లు. అటు పరుగుల కట్టడితో పాటు ప్రత్యర్థిని చుట్టేస్తుండటంతో వీరి సత్తాపై క్రమక్రమంగా నమ్మకం పెరుగుతోంది. ప్రమాదకర బ్యాట్స్‌మెన్‌ను కూడా వీరు తేలిగ్గా పెవిలియన్‌కు పంపుతున్నారు. 'పరుగులు పోతే పోనీ... వికెట్ మాత్రం పడగొట్టు' అన్నది కెప్టెన్ కోహ్లి అభిప్రాయం కావడంతో చహల్ తనకు ఇష్టమైన ఫ్లయిటెడ్ డెలివరీలను సంధిస్తున్నాడు. గంటకు 80 కి.మీ. నుంచి 90 కి.మీ. బౌలింగ్ వేగం మించనప్పటికీ వీరిని ఎదుర్కొనలేకపోవడం ప్రొటీస్ కోచ్‌లనే ఆశ్చర్యపరుస్తోంది.

పిచ్‌లకు తగ్గట్లు మారిపోయి...

దక్షిణాఫ్రికా పిచ్‌లంటేనే పేస్. అలాంటిచోట కూడా చహల్, కుల్దీప్ చెలరేగుతున్నారు. దీనంతటికీ కారణం పిచ్‌లను అర్థం చేసుకోవడం.. తగినట్లు సన్నద్ధం కావడమే. 2013-14 పర్యటనలో అశ్విన్, జడేజా సరిగ్గా ఈ పనే చేయలేకపోయారు. డికాక్ వరుసగా మూడు శతకాలతో చెలరేగిన ఈ టూర్‌లో వీరు చెరో వికెట్ మాత్రమే పడగొట్ట గలిగారు. కానీ చహల్, కుల్దీప్ మాత్రం వికెట్‌పై ఉండే బౌన్స్‌ను తమ బౌలింగ్‌కు సమన్వయం చేసుకుంటున్నారు. బ్యాట్స్‌మెన్ బ్యాక్‌ఫుట్‌పై ఆడేలా బంతులేస్తూ వికెట్లు తీస్తున్నారు. ఇక్కడి బౌన్సీ వికెట్లపై ఎక్కువ వేగంతో బంతులేస్తే స్పిన్ తిరగవు. బ్యాట్స్‌మెన్ తేలిగ్గా ఆడేస్తారు. ఈ కిటుకును మన స్పిన్నర్లు కనిపెట్టి వేగంలో కొంత రాజీ పడ్డారు. సఫారీ ప్రధాన స్పిన్నర్ తాహిర్, చైనామన్ షమ్సీ మాత్రం సహజ శైలిని నమ్ముకుని తేలిపోతున్నారు. భారత్‌లో కంటే ఇక్కడ బౌలింగ్ చేయడాన్నే తాను ఆస్వాదిస్తున్నానని కుల్దీప్ అంటున్నాడంటనే అతడెంతటి ఆత్మవిశ్వాసంతో ఉన్నాడో తెలుస్తోంది. మరోవైపు భారత్ 'ఎ' జట్టు తరఫున దక్షిణాఫ్రికాలో ఆడిన అనుభవం చహల్‌కు బాగా పనికొస్తోంది. ఆ సమయంలోనే పిచ్‌లను బాగా అర్థం చేసుకున్న అతడు మరింతగా రాణిస్తున్నాడు. మంచి బౌన్స్‌తో బంతి వేగంగా వెళ్తుండటంతో అతడికి ఎక్కువగా ఆలోచించే అవసరమే లేకుండా పోతోంది.


ప్రతిఘటించే వారేరి..?

ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టులో భారత స్పిన్నర్లను సమర్థంగా ఆడే వారు కనిపించడం లేదు. డుమిని, మిల్లర్ తడబడుతున్నారు. మిగతా వారికి అంతగా అనుభవం లేదు. సొంత గడ్డపై కొంత మెరుగ్గా ఉన్నా నాణ్యమైన స్పిన్‌ను ఆడటంలో దక్షిణాఫ్రికాది తొలి నుంచీ పేలవ రికార్డే. ఈసారి ఇక్కడా రాణించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సిరీస్‌లో మన మణికట్టు మాంత్రికులను ప్రతిఘటించే బ్యాట్స్‌మెన్ లేనట్లే. వీరి జోరు కొనసాగితే సఫారీ గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ భారత్ సొంతం కావడం ఖాయం.

> పరిస్థితులను బాగా అర్థం చేసుకొని దాని ప్రకారం బౌలింగ్ చేయడమే దక్షిణాఫ్రికాతో వన్డేల్లో భారత లెగ్‌స్పిన్నర్ల విజయ రహస్యం. నా దృష్టిలో చహల్, కుల్దీప్ బౌలింగ్‌లో ఉన్న కొత్తదనం కూడా ఫలితాన్ని ఇస్తోంది. ఇది మణికట్టు స్పిన్ గురించో, ఆఫ్ స్పిన్ గురించో కాదు. పరిస్థితులకు తగినట్లుగా తమను తాము మార్చుకోవడమే ఇక్కడ ముఖ్యం. టి20లు వచ్చిన కొత్తలో స్పిన్నర్లు పనికి రారని తేల్చేశారు. ఆపై పదేళ్ల పాటు ఆఫ్ స్పిన్నర్లు రాజ్యమేలారు. ఇప్పుడు లెగ్ స్పిన్నర్లు బాగా వేస్తున్నారు. వన్డే జట్టులో స్థానం కోల్పోవడం గురించి నేనేమీ నిద్ర మానేసి ఆలోచించడం లేదు. నాలో ఆత్మవిశ్వాసం చాలా ఎక్కువ. ఇప్పుడు కూడా ఏ జట్టులోనైనా స్థానం పొందగలననే నమ్మకం నాకుంది.
>
> – దక్షిణాఫ్రికాలో భారత స్పిన్నర్ల ప్రదర్శనపై అశ్విన్ వ్యాఖ్య

మొన్న ఏబీ...
నిన్న డు ప్లెసిస్...
నేడు డికాక్

గాయంతో మరో సఫారీ ఆటగాడు ఔట్



కేప్‌టౌన్: సొంతగడ్డపై దక్షిణాఫ్రికా ప్రత్యర్థి టీమిండియా చేతిలో ఓటములతో పాటు గాయాలతోనూ విలవిల్లాడుతోంది. వన్డేల్లో కోహ్లి సేన చేతిలో వరుస పరాజయాలు... గాయాలతో కీలక ఆటగాళ్లు దూరమవడంతో సఫారీ జట్టు కుదేలవుతోంది. ఇప్పటికే ఏబీ డివిలియర్స్ తొలి మూడు వన్డేల్లో ఆడట్లేదు. డు ప్లెసిస్ ఏకంగా భారత్‌తో సిరీస్‌కే దూరమయ్యాడు. వీళ్లిద్దరు చేతి వేలి గాయాలతో సతమతమవుతున్నారు. ఇప్పుడు వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ ఈ జాబితాలో చేరాడు. రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తుండగా అతని ఎడమ మణికట్టుకు గాయమైంది. దీంతో అతను మిగతా నాలుగు వన్డేలతో పాటు టి20 సిరీస్‌కు దూరమయ్యాడు. డికాక్ పూర్తిగా కోలుకునేందుకు రెండు నుంచి నాలుగు వారాలు పడుతుందని జట్టు వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటికే దక్షిణాఫ్రికా జట్టులో ఉన్న వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ అంతర్జాతీయ అరంగేట్రానికి సిద్ధమయ్యాడు. బుధవారం కేప్‌టౌన్‌లో జరిగే మూడో వన్డేతో అతని కెరీర్ మొదలవనుంది. ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది.

స్మృతి, జులన్ మెరుపులు

- తొలి వన్డేలో భారత్ ఘనవిజయం
- 88 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు



స్మృతి మంధన



జులన్ గోస్వామి

కింబర్లీ: ఒకవైపు భారత పురుషుల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపైనే ఓ ఆటాడిస్తుండగా... అదే దేశంలో మరో చోట మన మహిళల టీమ్ కూడా సఫారీల పని పట్టింది. భారీ విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసింది. సోమవారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో భారత మహిళల జట్టు 88 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధన (98 బంతుల్లో 84; 8 ఫోర్లు, 1 సిక్స్) దూకుడైన ఇన్నింగ్స్‌తో జట్టు స్కోరులో కీలక పాత్ర పోషించింది. స్మృతి, కెప్టెన్ మిథాలీ రాజ్ (70 బంతుల్లో 45; 2 ఫోర్లు) కలిసి రెండో వికెట్‌కు 99 పరుగులు జోడించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కాప్, ఖాకా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం దక్షిణాఫ్రికా 43.2 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ వ్యాన్ నీకెర్క్ (88 బంతుల్లో 41; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత సీనియర్ పేసర్ జులన్ గోస్వామి (4/24) అద్భుత ప్రదర్శనతో సఫారీల వెన్ను విరిచింది. శిఖాపాండేకు 3 వికెట్లు.. పూనమ్ యాదవ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఐసీసీ ఉమెన్ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతోన్న ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ విజయంతో భారత్ ఖాతాలో 2 పాయింట్లు చేరాయి. రెండో వన్డే బుధవారం జరుగుతుంది.

1 వన్డేల్లో 100 వికెట్లు పడగొట్టడంతో పాటు 1000 పరుగులు పూర్తి చేసిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా జులన్ గోస్వామి అరుదైన ఘనత సాధించింది. ఓవరాల్‌గా ఈ 'డబుల్' చేసిన ఎనిమిదో ప్లేయర్ జులన్.

సింధు, రుత్వికలపైనే ఆశలు

సైనా, ప్రణయ్ దూరం • నేటి నుంచి ఆసియా టీమ్ చాంపియన్‌షిప్



అలోర్ సెటార్ (మలేసియా): స్టార్ ప్లేయర్లు సైనా నెహ్వాల్, హెచ్‌ఎస్ ప్రణయ్ గైర్హాజరీ నేపథ్యంలో... ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల, పురుషుల జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. మంగళవారం మొదలయ్యే ఈ మెగా ఈవెంట్‌లో సెమీఫైనల్ చేరుకున్న జట్లు మేలో జరిగే థామస్ కప్, ఉబెర్ కప్ ఫైనల్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తాయి. ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ సన్నాహాల కోసం ఆసియా పోటీల నుంచి సైనా వైదొలగగా... గాయం కారణంగా ప్రణయ్ జట్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. తొలి రోజు ఫిలిప్పీన్స్‌తో భారత పురుషుల జట్టు... హాంకాంగ్‌తో భారత మహిళల జట్టు తలపడతాయి. భారత పురుషుల జట్టుకు సులువైన 'డ్రా' పడింది. గ్రూప్ 'డి'లో భారత్‌తోపాటు ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, మాల్దీవులు ఉన్నాయి. మూడు సింగిల్స్ మ్యాచ్‌ల్లో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, సమీర్ వర్మ పోటీపడతారు. రెండు డబుల్స్ మ్యాచ్‌ల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి; సుమీత్ రెడ్డి-మనూ అత్రి జోడీలు బరిలోకి దిగుతాయి. భారత మహిళల జట్టు ముందంజ వేయాలంటే తొలి మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రూప్ 'డబ్ల్యూ'లో భారత్‌తోపాటు జపాన్, హాంకాంగ్ జట్లున్నాయి. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుతాయి. సైనా గైర్హాజరీ నేపథ్యంలో... సింగిల్స్ విభాగంలో పీవీ సింధు, రుత్విక శివాని, శ్రీకృష్ణప్రియ ఆడనున్నారు. డబుల్స్‌లో సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప; ప్రజక్తా సావంత్-సంయోగిత జోడీలు పోటీపడనున్నాయి.

కొరడాతో కొట్టినా మిత్రధర్మమంటారా..?

- సీఎం చంద్రబాబుకు మాజీ ఎంపీ ఉండవల్లి సూటి ప్రశ్న
- విభజన హామీలు సాధించండి.. లేదంటే చరిత్రహీనులవుతారు
- కేసులకు ఎందుకు భయపడుతున్నారు..?
- నిధులు కేటాయించకుండా మోదీ కేర్ ఎలా సాధ్యం?



సాక్షి, రాజమహేంద్రవరం: గత నాలుగు కేంద్ర బడ్జెట్లలాగే ప్రస్తుత బడ్జెట్ కూడా ఉందని, నాలుగేళ్లు మాట్లాడని టీడీపీ నేతలు ఇప్పుడు గగ్గోలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ విమర్శించారు. చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి కేటాయింపులు, విభజన హామీల ప్రస్తావన లేకపోయినా పేపర్ ప్రకటనలు చేస్తున్నారని సీఎం చంద్రబాబుపై మండిపడ్డారు. కొరడాతో కొట్టినా మిత్రధర్మం అంటారా? అని సూటిగా ప్రశ్నించారు. ఆయన సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసినా మిత్రధర్మమంటూ మాట్లాడితే ప్రజలు కూడా కొరడాతో కొడతారని హెచ్చరించారు. ఏమైనా మాట్లాడితే కేసులు పెడతారన్న ఆలోచన అవసరం లేదని, చంద్రబాబు జైలుకు వెళితే రాష్ట్రంలో 175 సీట్లు టీడీపీకే వస్తాయని చెప్పారు. అయినా దేశంలో న్యాయవ్యవస్థపై చంద్రబాబుకున్న అవగాహన మరెవరికీ లేదని, అలాంటప్పుడు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. చివరి ఏడాదిలోనైనా విభజన హామీల కోసం గట్టిగా పోరాటం చేయకపోతే ప్రజల దృష్టిలో చరిత్రహీనులుగా మిగిలిపోతారని చెప్పారు.

పాత రేట్లంటే ఏవీ..?

పోలవరం ప్రాజెక్టు పనులు పాత రేట్లకే నవయుగ కంపెనీకి ఇచ్చామని చెబుతున్నారని... పాత రేట్లంటే కేంద్రం చెప్పినట్లు 2014లోని రేట్లా? లేక ముఖ్యమంత్రి జారీ చేసిన జీవో నంబర్ 22 ప్రకారం ఇచ్చారా? అని ఉండవల్లి ప్రశ్నించారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం విశాఖలో పెట్టాల్సిన పెట్రోల్ రిఫైనరీ యూనిట్ ముంబైలో పెడుతున్నా చంద్రబాబు ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీతో కలవకపోతే... కనీసం సీపీఐ, సీపీఎం, తృణముల్, డీఎంకే పార్టీలతో కలసి కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు. కేంద్రం చెబుతున్న జీడీపీ వృద్ధి రేటు అంతా మాయని ఆరోపించారు. మోదీ కేర్‌కు నిధులు కేటాయించకుండా ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఏడాదికి 50 లక్షల మంది ఈ పథకం ఉపయోగించుకున్నా రూ.2.5 లక్షల కోట్లు కావాల్సి ఉంటుందని, ఈ నిధులు ఎలా సమకూరుస్తారని నిలదీశారు.

రాజధాని పనులు చేసే సత్తా

కొత్త సంస్థకు ఉందా?

- విదేశీ కంపెనీలకు అప్పగించడానికి రైతుల నుంచి సారవంతమైన భూములను లాక్కున్నారా?
- సీఎస్‌కు ఈఏఎస్ శర్మ లేఖ



సాక్షి, అమరావతి: రాజధాని నిర్మాణం పేరుతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న ప్రభుత్వం తాను జారీ చేసిన ఉత్తర్వులను తానే ఉల్లంఘిస్తుండటంలో ఆంతర్యమేమిటో చెప్పాలంటూ కేంద్ర ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 1,690 ఎకరాల్లో చేపట్టిన రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును ప్రతిపాదన చేసిన (ఓపీపీ)తో కాకుండా కొత్తగా ఏర్పాటైన అమరావతి ఇన్వెస్ట్‌మెంట్స్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగిస్తూ ఒప్పందం చేసుకోవడంలో లొసుగులను ఎత్తిచూపుతూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్‌కు ఆయన లేఖ రాశారు. ఇది మే 8, 2017న ప్రభుత్వం జారీ చేసిన 179 జీవోకు విరుద్ధం కాదా? అని నిలదీశారు. 'కొత్త సంస్థకు రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును పూర్తి చేసే సత్తా ఉందా? ఒకవేళ ఆ ప్రాజెక్టును పూర్తి చేయకపోతే ఉత్పన్నమయ్యే సమస్యలపై ఆర్థిక శాఖ అధ్యయనం చేసిందా?' అని ప్రశ్నించారు. రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును ఆ సంస్థ పూర్తి చేయలేకపోతే రైతుల నుంచి సారవంతమైన భూములు లాక్కుని వ్యవసాయాన్ని నాశనం చేయడానికి బాధ్యులెవరవుతారని ఆయన నిలదీశారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను విశ్లేషిస్తే రాజధాని పేరుతో కొన్ని విదేశీ కంపెనీలకు సారవంతమైన భూములను అప్పగించి లబ్ధి పొందడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి భూములను లాక్కున్నట్లు స్పష్టమవుతోందని ఈఏఎస్ శర్మ పేర్కొన్నారు.

నరిశెట్టికి ఎన్ఆర్ చందూర్-జగతి అవార్డు

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వెల్లడి

సాక్షి ప్రతినిధి, చెన్నై: ప్రముఖ సాహితీవేత్త ఎన్ఆర్ చందూర్-జగతి అవార్డు 2018ని గిజ్‌మోడో మీడియా గ్రూప్ సీఈవో రాజు నరిశెట్టి (అమెరికా)కి ఈనెల 21న ప్రదానం చేయనున్నట్లు మాజీ ఎంపీ, కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. సోమవారం చెన్నైలో ఆయన మీడియాతో మాట్లాడారు. న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి జస్టిస్ లావు నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తుండగా, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. సమావేశంలో స్మారక సమితి కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ముష్టి వేశారు

- విశ్వవిద్యాలయాల్లో 1,385 పోస్టుల భర్తీకి చర్యలు
- పీహెచ్‌డీ ప్రవేశానికి ప్రత్యేక సెట్ ఏర్పాటు
- రాష్ట్ర ఉన్నత విద్యా శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు



కుప్పం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి భిక్షమేసినట్లు కేటాయింపులు చేశారని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో మహిళల బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహాయ సహకారాల్లో మొండిచేయి చూపించిందన్నారు. రూ.4,500 కోట్లు సహాయం కోరితే రూ.218 కోట్లు మొక్కుబడిగా ముష్టివేసినట్లు అందించారని తెలిపారు. ఐసెట్ తరహాలో పీహెచ్‌డీకి సెట్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డి అడ్మిషన్లు చేయనున్నట్లు చెప్పారు. 1,385 అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీనిపై కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు కోర్టును ఆశ్రయించడంతో అంతరాయం జరుగుతోందని, త్వరలో దీనిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. 17 వేలకోట్ల బడ్జెట్‌లో 15 శాతం విద్యా వ్యవస్థకు కేటాయించినట్లు చెప్పారు. రాబోయే విద్యా సంవత్సరంలో డీఎస్సీ ద్వారా 12 వేల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

మంచినీటి ప్లాంట్ల నిర్మాణానికి రూ.5,300 కోట్ల రుణం

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం – ప్రకాశం జిల్లాల మధ్య ఉన్న ఎనిమిది జిల్లాల్లో మంచినీటి ప్లాంట్ల నిర్మాణానికి రూ.5,300 కోట్లను వివిధ వాణిజ్య బ్యాంకుల నుంచి రుణంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాంకు రుణం పొందే బాధ్యతను తాగునీటి కార్పొరేషన్‌కు అప్పగిస్తూ పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీగా ఉంటుంది. రుణానికి గరిష్టంగా 7.9 శాతానికి లోపే వడ్డీ రేటు ఉండేలా ఒప్పందాలు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు గోదావరి జలాలు


- రూ.4,617 కోట్లతో అంచనాలు సిద్ధం
- తక్షణమే పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- 12 నుంచి రెండో దశ జలసంరక్షణ ఉద్యమం

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో గోదావరి జలాలను తరలించి నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు నీళ్లందిస్తామని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలోని తన కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలపై సీఎంకు అధికారులు వివరించారు.

67 కి.మీ.ల పొడవున కాలువ తవ్వకం

పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా ఇప్పటికే 8,500 క్యూసెక్కుల నీటిని పోలవరం కుడి కాలువ మీదుగా ప్రకాశం బ్యారేజీకి తరలిస్తున్నామని అధికారులు చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పంప్ హౌస్‌ల పనులు జూన్ నాటికి పూర్తవుతాయని, వాటి ద్వారా మరో 6,870 క్యూసెక్కులను పోలవరం కుడి కాలువలోకి ఎత్తిపోసి ప్రకాశం బ్యారేజీకి మొత్తం 15,370 క్యూసెక్కులను తరలించవచ్చన్నారు. సరఫరా నష్టాలు 1,370 క్యూసెక్కులు పోయినా మిగిలిన 14 వేల క్యూసెక్కుల్లో ఏడు వేల క్యూసెక్కులు కృష్ణా డెల్టాకు విడుదల చేయవచ్చని తెలిపారు. మిగతా ఏడు వేల క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీ జల విస్తరణ ప్రాంతంలో కొత్తగా చేపట్టనున్న ఎత్తిపోతల ద్వారా నాగార్జున సాగర్ కుడి కాలువకు తరలించవచ్చునన్నారు. ఇందుకు ప్రకాశం బ్యారేజీ ఎగువన నిర్మించే ఎత్తిపోతల పథకం నుంచి సాగర్ కుడి కాలువ వరకూ 67 కి.మీ.ల పొడవున కాలువ తవ్వాల్సి ఉంటుందని వివరించారు. కాలువ తవ్వడానికి 1,778 ఎకరాల భూమిని సేకరించాలన్నారు. ఈ పథకానికి రూ.4,617 కోట్లకుపైగా అవసరం అవుతాయని వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ తక్షణమే ఈ పనులను చేపట్టాలని ఆదేశించారు.

గోదావరి–పెన్నా అనుసంధానానికి రూ.83,565 కోట్లు..



గోదావరి–పెన్నా నదుల అనుసంధానం పనులను ఐదు దశల్లో చేపట్టేందుకు రూ.83,565 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించారు. ఈనెల 12 నుంచి జూన్ 7 వరకు 116 రోజుల పాటు 'జల సంరక్షణ ఉద్యమ స్ఫూర్తి రెండో దశ' పేరుతో పనులు చేపట్టాలని సీఎం సూచించారు.

పోలవరంపై 50వ వర్చువల్ రివ్యూ

పోలవరం ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు సోమవారం 50వ సారి వర్చువల్ రివ్యూ నిర్వహించారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు 53 శాతం పూర్తయ్యిందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. కుడి ప్రధాన కాలువ 91 శాతం, ఎడమ ప్రధాన కాలువ 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. హెడ్ వర్క్స్ 39 శాతం పూర్తి చేశామని డయాఫ్రమ్ వాల్ పనులు 66 శాతం, 71 శాతం వరకు స్పిల్‌వే, స్పిల్ చానల్ తవ్వకం పనులు, 14 శాతం కాంక్రీట్ పనులు చేశామన్నారు. పోలవరం పనులకు రూ.12,915.38 కోట్లు ఖర్చు చేయగా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత రూ.రూ.7,779.52 కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.4,329.06 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసిందని చెప్పారు. నవయుగ సంస్థకు కాంక్రీట్ పనులను తక్షణమే అప్పగించి వేగంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. కాగా, బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు దిష్టిబొమ్మలు తగలబెట్టవద్దని సీఎం చంద్రబాబు టీడీపీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ ఆదేశించారు. తనపై సోము వీర్రాజు చేసిన ఆరోపణలను ఆయన విజ్ఞతకే వదిలేయాలని సూచించారు.

పెండింగ్‌లో 2.35 లక్షల వినతులు

జన్మభూమి కార్యక్రమం సందర్భంగా వ్యక్తమైన సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జిల్లా స్థాయిల్లో 2.35 లక్షల వినతిపత్రాలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. సీఎం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాఖల వారీగా 3.7 లక్షల సమస్యలు పరిశీలనలో ఉన్నాయన్నారు. వీటిని వర్గీకరించి ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సంతృప్తి సాధనలో గృహనిర్మాణ శాఖ, పరిశ్రమలు అగ్రస్థాయిలో ఉన్నాయన్నారు. అలాగే స్వచ్ఛ భారత్ అధికారులతో కూడా సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జలవనరుల శాఖ ఈఎన్‌సీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: జలవనరుల శాఖలో పరిపాలన విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా (ఈఎన్‌సీ) కె.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పరిపాలన విభాగం ఈఎన్‌సీగా గిరిధర్‌రెడ్డి పదవీ విరమణ చేయడంతో ప్రభుత్వం ఆ విభాగం బాధ్యతలను ఈఎన్‌సీ వెంకటేశ్వరరావుకు అప్పగించింది. అయితే ఇటీవల చేసిన బదిలీల్లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈ కె.శ్రీనివాస్‌కు పరిపాలన విభాగం ఈఎన్‌సీగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.